04-04Pg1exHMNWJQE.qxd:04-04Pg1exHMNWJQE.qxd 01/01/01 9:59 AM Page 1


వాయిస్ - గత వారం రోజుల్లో విశేషాలు

ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు

సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు

ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక

వార్త

గుంటూరు

: fb.com/vaartha Digital

Published from Guntur, Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

4-4-2025 శుక్రవారం సంపుటి: 31 సంచిక: 62 పేజీలు: 12 వెల: 6.50



బెంగాల్‌లో 25వేల టీచర్ల నియామకాలు రద్దు

కర్ణాటకలో ఓలా, ఉబర్, ర్యాపిడోలపై నిషేధం

9లో


# ఇక జలహారతి కార్పొరేషన్



గురువారం సిఎం చంద్రబాబు అధ్యక్షతన జరిగిన మంత్రి మండలి సమావేశం

## పోలవరం-బనకచర్ల అనుసంధాన ప్రాజెక్టు రూపకల్పన

## స్వతంత్ర సంస్థగా డ్రోన్ కార్పొరేషన్

## సాగర్ లెఫ్ట్ బ్రాంచి కెనాల్‌కు రిటైనింగ్ వాల్

## మంత్రిమండలి కీలక నిర్ణయాలు

**విజయవాడ, ఏప్రిల్3, ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రాభివృద్ధిలో నూతన సాంకేతికతను పూర్తి స్థాయిలో వినియోగించుకుందామనే ఆలోచన తమ ప్రభుత్వానిదని సిఎం చంద్రబాబునాయుడు స్పష్టం చేసారు.సిఎం చంద్రబాబు అధ్యక్షతన సచివాలయంలో మంత్రివర్గ సమావేశం జరిగింది.. ఈ సమావేశంలో పలు కీలకఅంశాలకు ఆమోదం తెలిపారు. ఆయా అంశాలను ఆమోదించడానికి ముందు ఏఉద్దేశంతో ఈ నిర్ణయాలు తీసుకుంటుందని సిఎం చంద్రబాబు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ డ్రోన్ కార్పొరేషన్‌ను (ఎపిడిసి), ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఫైబర్‌నెట్ లిమిటెడ్ (ఏపీఎస్ఎఫ్ఎల్) నుంచి విడదీసి స్వతంత్ర సంస్థగా ఏర్పాటు చేసేందుకు కేబినెట్ ఆమోదంతెలిపింది. డ్రోన్ సంబంధిత అంశాలన్నింటికీ నోడల్ ఏజెన్సీగా ఎపిడిసి వ్యవహరించనుంది. అనకాపల్లి జిల్లాలోని డీఎల్‌పురం వద్ద క్యాపిటివ్ పోర్టు ఏర్పాటుకు ఆమోదం, త్రీ స్టార్, ఆ పైబడిన హోటళ్లకు బార్ లైసెన్స్ ఫీజుల కుదింపునకు ఆమోదం, బార్‌లైసెన్స్‌ల ఫీజును రూ.25 లక్షలకు కుదిస్తూ ఆమోదం, >>2

# 8 నగరాల్లో స్మార్ట్ స్ట్రీట్ వెండింగ్ మార్కెట్లు

**విజయవాడ,ఏప్రిల్3,ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్‌లోని ఎనిమిది నగరాల్లో స్మార్ట్ స్ట్రీట్ వెండింగ్ మార్కెట్ల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటోంది. ఒకేచోట 200 మంది వ్యాపారాలు చేసుకునేలా సదుపాయాలు కల్పిస్తోంది. ఈ విధానంతో వీధి వ్యాపారుల జీవనోపాధి మెరుగవుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఒక్కో మార్కెట్ ఏర్పాటుకు సర్కార్ రూ.7 కోట్ల చొప్పున ఖర్చు చేయనుంది. ఇందులో మౌలిక సదుపాయాల కల్పనకు నగరపాలక సంస్థలు రూ.3 కోట్లు, వ్యాపారులకు శిక్షణ, ఇతర సేవలు అందించేందుకు సెర్ప్ రూ.1.25 కోట్లు ఖర్చు చేయనున్నాయి. బ్యాంకుల నుంచి వ్యాపారులకు పెట్టుబడి నిధి కింద రూ.3 కోట్ల మేర రుణాలు అందించనున్నారు. మార్కెట్ల నిర్వహణను నగరపాలక సంస్థలకు అప్పగిస్తారు. షాపుల నుంచి అద్దెలు, ప్రకటనల ఆదాయంతో ఆయా మార్కెట్లను నిర్వహిస్తారు.

స్మార్ట్ స్ట్రీట్ వెండింగ్ మార్కెట్‌ను నెల్లూరులో ప్రయోగాత్మకంగా జూన్‌లో ప్రారంభించనున్నారు. ఇందుకు సంబంధించిన పనులు వివిధ దశల్లో ఉన్నాయి. ఇక్కడ ప్రత్యేకంగా కంటైనర్లను ఏర్పాటు చేస్తున్నారు. వీటిలో 200 షాపులు నిర్వహించొచ్చు. ప్లగ్‌అండ్‌ప్లే విధానంలో వాటిని వ్యాపారులకు కేటాయించిన వెంటనే షాపులు ప్రారంభించుకోవచ్చు. కంటైనర్‌పైన సోలార్ పలకలు అమర్చి, వాటి ద్వారా ఉత్పత్తి అయ్యే విద్యుత్‌ను షాపు అవసరాలకు వినియోగించుకునేలా ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ మార్కెట్‌లో నిత్యావసరాల నుంచి పండ్లు, కూరగాయల వరకు అన్నీ అందుబాటులో ఉంటాయి. రెండో దశలో విశాఖపట్నం, మంగళగిరి, పిఠాపురం, శ్రీకాకుళం, విజయవాడ, ఒంగోలులోనూ వీటిని ఏర్పాటు చేయాలని సర్కార్ నిర్ణయం తీసుకుంది. రాయలసీమలో కర్నూలు, కడప, అనంతపురంలో ఏదో ఒక నగరాన్ని త్వరలో ఎంపిక చేయనున్నారు. ఇవి అక్టోబర్‌లో >>2

## మాజీ మంత్రి కాకాణికి హైకోర్టులో ఎదురుదెబ్బ

**విజయవాడ ఏప్రిల్ 3 ప్రభాతవార్త ప్రతినిధి:** వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత, మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డికి హైకోర్టులో మరోసారి ఎదురుదెబ్బ తగిలింది. కాకాణిపై తొందరపాటు చర్యలు తీసుకోకుండా మధ్యంతర ఉత్తర్వులు జారీ చేయలేమని పేర్కొంది హైకోర్టు. కాకాణి ముందస్తు బెయిల్ క్వాష్ పిటిషన్లు విచారించిన ఎపి హైకోర్టు తెల్లారాయి అక్రమ రవాణాకి సహకరించటంతో పాటు ఎస్సీ,ఎస్టీ కేసును కాకాణిపై నమోదు చేశారు. పొదలకూరు పోలీసులు >>2

## సిఐడి కార్యాలయానికి పోసాని కృష్ణ మురళి

**విజయవాడ,ఏప్రిల్3,ప్రభాతవార్తప్రతినిధి:** చంద్రబాబు, పవన్ కల్యాణ్‌ను దూషించిన కేసులో షరతులతో కూడిన బెయిల్‌పై ఉన్న నటుడు పోసాని కృష్ణమురళీ సిఐడి కార్యాలయానికి హాజరయ్యారు.ప్రతి సోమ,గురువారం పోసాని సిఐడి ప్రాంతీయ కార్యాలయానికి ఆయన హాజరయ్యారు. వివిధ స్టేషన్లలో నమోదైన కేసుల నేపథ్యంలో ఆయన హైకోర్టు బెయిల్ మంజూరు చేసింది.బెయిల్ షరతులను అనుసరించి ఆయన సిఐడి కార్యాలయానికి నెల రోజుల్లో ప్రతి సోమ,గురువారాల్లో సిఐడి ప్రాంతీయ కార్యాలయానికి హాజరు కావాల్సి ఉంది.

## మిథున్‌రెడ్డి ముందస్తు బెయిలు పిటిషన్ డిస్మిస్

**విజయవాడ, ఏప్రిల్ 3, ప్రభాతవార్తప్రతినిధి:** మద్యం కుంభకోణం కేసులో వైకాంగ్రెస్ పార్టీ ఎంపీ మిథున్ రెడ్డికి ఆంధ్రప్రదేశ్ హైకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. మిథున్ రెడ్డి దాఖలు చేసిన ముందస్తు బెయిల్ పిటిషన్‌ను ధర్మాసనం డిస్మిస్ చేసింది. వైకాంగ్రెస్‌పార్టీ హయాంలో భారీ మద్యం కుంభకోణం జరిగిన సంగతి తెలిసిందే. దీనిపై గతేదాడి సెప్టెంబరు 23న సిఐడి పోలీసులు కేసు నమోదు చేశారు. దీంతో కేసులో తన పేరు చేర్చి ఎక్కడ అరెస్టు చేస్తారేమో అనే భయంతో హైకోర్టును ఎంపి మిథున్ రెడ్డి ఆశ్రయించారు.

తనకు ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ మిథున్‌రెడ్డి పిటి >>2



గురువారం మంగళగిరిలో మీడియాతో మాట్లాడుతున్న మంత్రి నారా లోకేష్

# చట్టాలు ఉల్లంఘిస్తేనే 'రెడ్ బుక్'

## పాస్టర్ ప్రవీణ్ మృతిపై పారదర్శకంగా దర్యాప్తు

## దుష్ప్రచారం చేసేవారిపై తగిన చర్యలు: మంత్రి లోకేష్

**మంగళగిరి, ఏప్రిల్ 3,ప్రభాతవార్త:** రెడ్ బుక్ పేరు చెప్పగానే వైఎస్సార్సీ నాయకులు బెంబేలెత్తుతున్నారు, ఇప్పటికే ఒకరికి గుండెపోటు వచ్చింది, మరొకరు బాత్రూమ్‌లో పడి చేయి విరిగింది. చట్టాలు ఉల్లంఘించిన వారికే రెడ్ బుక్ వర్తిస్తుందని రాష్ట్ర విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ స్పష్టంచేశారు. మంగళగిరి నియోజకవర్గం ఉండవల్లిలో నిరుపేద కుటుంబానికి శాశ్వత పట్టా అందించిన అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ... గత ప్రభుత్వం రాజారెడ్డి రాజ్యాంగాన్ని అమలుచేసింది. మేము అంబేద్కర్ రాజ్యాంగాన్ని అమలు చేస్తున్నామన్నారు. డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్ కంటే ఎక్కువగా జగన్‌కు జడ్ ప్లస్ సెక్యూరిటీ ఇచ్చాం. ఆయన స్వేచ్ఛగా ప్రజల్లోకి వెళ్లే అవకాశం కల్పిస్తున్నామని చెప్పారు. కనిగిరి అసెంబ్లీ నియోజకవర్గంలో 35వేలమంది ప్రజలు దేశవ్యాప్తంగా వివిధ ప్రాంతాలకు పొట్టచేతబట్టుకొని వలసలు వెళ్లారన్నారు.

యువగళం పాదయాత్ర సమయంలో అక్కడ వలసలను నివారిస్తానని హామీ ఇచ్చా. ఆ మాటమేరకు కనిగిరిలో తొలి రిలయన్స్ సిబిజి ప్లాంటు ఏర్పాటు చేశామన్నారు. ఎమ్మెల్యే ముక్కు ఉగ్రనరసింహారెడ్డి 50వేల ఎకరాల భూములు ఇచ్చేందుకు తమ రైతులు సిద్ధంగా ఉన్నారని చెప్పారన్నారు . రిలయన్స్ డైరక్టర్ స్పందించి 50ప్లాంట్లు అక్కడే ఏర్పాటుచేస్తామని అన్నారు. కరువు ప్రాంతంలో పెద్దఎత్తున యువతకు ఉపాధి కల్పించేందుకు ఇటువంటి ప్రాజెక్టులు తెస్తుంటే వైఎస్సార్సీ వారికి కడుపుమంట దేనికి? బొబ్బలు వస్తాయంటూ దానిపై తప్పుడు ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. దుష్ప్రచారానికి ఫుల్ స్టాప్ పెట్టేందుకే అటువంటి వారిని రెడ్ బుక్‌లోకి ఎక్కిస్తానని చెప్పా అని అన్నారు. జగన్‌కు సొంతవాళ్లను కలిసేందుకే తీరికలేదు. సొంత చెల్లి, తల్లికి న్యాయం చేయలేని వారు మాకు చెబుతారా? ప్రజనరీ ఆలోచనలన్నీ జైలువైపే ఉంటాయి. తప్పుచేశారు కనుక ఆయన ధైర్యంగా ప్రజల్లో తిరగలేకపోతున్నాడనీ ఎద్దేవా చేశారు. అధికారంలో ఉన్నప్పుడు ఆయన ఎవరినీ కలవలేదు, ప్రతిపక్షంలోకి వెళ్లిన తరువాత కూడా కనీసం కార్యకర్తలను కలిసే సమయం జగన్‌కు లేదు. ప్రజలను కలిసే ఓపిక ఆయనకు ఎక్కుదుందనీ విమర్శించారు.

పేదలకు అండగా నిలిచే ప్రజాప్రభుత్వం మాది. మాతో అభివృద్ధి, సంక్షేమంలో పోటీపడలేక కులం, మతం, ప్రాంతంపేరుతో విద్వేషాలు సృష్టించేందుకు ప్రయత్నిస్తున్నారనీ విమర్శించారు.పాస్టర్ ప్రవీణ్ మరణం విషయంలో తప్పుడు ప్రచారం చేస్తున్నారు. ఈ విషయంలో మా ప్రభుత్వం పారదర్శకంగా దర్యాప్తు చేస్తోంది. తప్పుచేసిన వారు ఎవరైనా వదిలే ప్రసక్తిలేదనీ స్పష్టం చేశారు.విజనరీ -ప్రిజనరీకి ఎంతో తేడాఉంది! ప్రపంచంలో వస్తున్న సాంకేతిక మార్పులకు >>2


## గూడూరు కాలేజీలో ఎంటెక్ విద్యార్థి అనుమానాస్పద మృతి

**గూడూరు, ఏప్రిల్ 3, ప్రభాతవార్త :** గూడూరు సమీపంలోని కాలేజ్ వివాదాలకు కేంద్ర బిందువుగా మారుతోంది. గురువారం ఎంటెక్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న నెల్లూరు జిల్లా మనుబోలుకి చెందిన జస్వంత్ అనే యువకుడు కాలేజీలో అనుమానాస్పదంగా మృతిచెందడంసంచలనంగామారింది. మృతుడు బిల్డింగ్ పైనుండి దూకేసాడని కాలేజీ యాజమాన్యం చెబుతుండగా తమ బిడ్డను అన్యాయంగా చంపేశారని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇంజనీరింగ్ కాలేజీలో విద్యార్థులు గ్రూపులు గ్యాంగ్‌వార్లకు నిలయంగా మారుస్తూ, మత్తు పదార్థాలు కూడా పెద్ద ఎత్తున వినియోగిస్తున్నారని ఆరోపణలు ఉన్నాయి. ఇటీవల కాలేజీ ముందరే కొన్ని గ్రూపులు కత్తులు చేతబట్టి గొడవలకు దిగడంతో అనేక మంది విద్యార్థులు భయభ్రాంతులకు గురయ్యారు.

# వెంకన్నకు కోటి ఇస్తే భారీ ప్రయోజనాలు!

## యేడాదిలో 3 రోజులు సుప్రభాత సేవ, విఐపి బ్రేక్ దర్శనాలు

**తిరుమల,ఏప్రిల్ 3ప్రభాతవార్తప్రతినిధి:** కోట్లాది మంది హిందూ భక్తులు విశ్వాసంతో నమ్మికొలిచే ఏడుకొండల వేంకటేశ్వరస్వామిని ఎన్నిసార్లు దర్శనం చేసుకున్నా మళ్లీమళ్లీ ఆ దివ్యమంగళ రూపాన్ని చూడాలనే తాపత్రయం కలుగుతుంది. సామాన్యభక్తులు ఆ దేవుని క్షణకాల దర్శనం కోసం పరితపిస్తుంటే ధనవంతులైన, కోటీశ్వరులైన భక్తులకు, దాతలకు తిరుమల తిరుపతి దేవస్థానం తాజాగా బహుళప్రయోజనాలు చేకూర్చే దిశగా కార్యాచరణ రూపొందించింది. గతంలో గత పాలకమండళ్లు పద్మావతి చిన్నపిల్లల సూపర్‌స్పెషాలిటీ ఆస్పత్రి నిర్మాణానికి కోటి రూపాయలు,1.50కోట్ల రూపాయలు దాతలు విరాళమిస్తే వారికి ఏడాదిలో ఆరుమందికి ఉదయాస్తమాన సేవదర్శనం టిక్కెట్ (తెల్లవారూజామున సుప్రభాతం నుండి సాయంత్రం సహస్రదీపాలంకారసేవ వరకు) ఆలయంలోపల కులశేఖరపడివద్ద నుండి వేంకటేశ్వరస్వామి కొలువైన ముందుకు వెళ్లి తనివితీరా దర్శనం చేసుకునే వెసలుబాటు కల్పించింది. అంతేగాక ఆభక్తులకు సుప్రభాతం, తోమాల, అర్చన సేవలు



కొందరు గృహస్థభక్తులు, విఐపి బ్రేక్‌కు మరికొందరు గృహస్థభక్తులను దాత తీసుకెళ్లే ప్రయోజనం ఉండేది. ఇప్పుడు తాజాగా రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశాలతో టిటిడి ఛైర్మన్ బిఆర్‌నాయుడు, టిటిడి ఇఒ శ్యామలరావు, అదనపు ఇఒ చిరుమామిళ్ల వెంకయ్యచౌదరి వినూత్నంగా కొత్త ఆలోచన చేశారు. ఇప్పుడు కోటి రూపాయలు విరాళమిస్తే ఆ దాతలైన భక్తులు ఐదుగురికి ఏడాదిలో మరిన్ని ప్రయోజనాలు, దేవుని దర్శనం, >>2

# ఐఎఎస్‌ల పల్లెనిద్ర

## పాస్టర్ ప్రవీణ్ విషయంలో వైఎస్సార్సీ దుష్ప్రచారాన్ని తిప్పకొట్టండి

## కేబినెట్ సమావేశం తర్వాత మంత్రులతో సిఎం చంద్రబాబు

**విజయవాడ,ఏప్రిల్3,ప్రభాతవార్తప్రతినిధి:** స్వర్ణ గ్రామం పేరుతో ఐఎఎస్‌లు పల్లె నిద్ర చేయాలని సిఎం చంద్రబాబు ఆదేశించారు. ఉన్నతాధికారులు మూడు రోజులు, రెండు రాత్రులు పల్లెనిద్ర చేయాలని నిర్ణయించారు. మంత్రివర్గ సమావేశం అనంతరం మంత్రులతో సిఎం పలు అంశాలపై మాట్లాడారు. ప్రజలకు ఎంతో చేసి సరైన ప్రచారం చేసుకోలేక పోతున్నామని వ్యాఖ్యానించారు. కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న కర్మయోగి ట్రైనింగ్ ప్రోగ్రామ్‌పై చర్చించారు. శాఖలకు స్వయం ప్రతిపత్తి కల్పించే దిశగా ఆప్కోస్‌ను ఎలా వినియోగించాలనే అంశంపై మంత్రులతో మాట్లాడారు. ఆప్కోస్‌పై ఓ మంత్రివర్గ ఉప సంఘం ఏర్పాటు చేసే యోచనపై ఉన్నామని సిఎం తెలిపారు. ప్రభుత్వం చేసిన మంచిని ప్రజలకు చెప్పుకోవాలని స్పష్టం చేశారు. రాష్ట్రంలో అమలు చేస్తున్న సంక్షేమ పథకాల్లో పొరుగు రాష్ట్రాల్లో నాలుగోవంతు కూడా అమలు చేయడం లేదని సిఎం వ్యాఖ్యానించారు.

రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల గురించి విస్తృతంగా ప్రజల్లోకి తీసుకువెళ్లాలని ఆదేశించారు. ప్రతి శాఖ కేంద్ర పథకాలను అధ్యయనం చేసి రాష్ట్రానికి నిధులు వచ్చేలా ప్రయత్నం చేయాలని మంత్రులకు సీఎం సూచించారు. రుషి కొండ ప్యాలస్‌పైనా మంత్రులతో సిఎం చర్చించారు. రుషికొండపై జగన్ నిర్మించిన భవనాలను ఏం చేయాలన్న దానిపైనా మరోమారు చర్చించారు. మొదట మంత్రులంతా రుషికొండ ప్యాలస్‌ను సందర్శించాలని సిఎం చంద్రబాబు సూచించారు. ఆ తర్వాత ఏం చేద్దామన్న అంశంపై మంత్రులు అభిప్రాయాలు చెప్పాలని సిఎం చంద్రబాబు తెలిపారు. పాస్టర్ ప్రవీణ్ మరణం విషయంలో ప్రభుత్వానికి చెడ్డపేరు తేవాలని వైకాంగ్రెస్‌పార్టీ చూస్తోందని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. కేబినెట్ సమావేశం అనంతరం మంత్రులతో సిఎం మాట్లాడుతూ.. సిసి కెమెరాల్లో ఒక్కో అంశం బయటకు వస్తోందన్నారు. ప్రవీణ్ డెత్ మిస్టరీ ఛేదనలో సిసి కెమెరాలది కీలక పాత్ర అని చెప్పుకొచ్చారు. మనం అప్రమత్తంగా లేకుంటే.. బాబాయ్ గొడ్డలి, కోడికత్తి, గులకరాయి తరహాలో అన్నీ మనపైనే వేస్తారని విమర్శించారు. చేసిన మంచి చెప్పుకోవడానికి ఇబ్బందులు పడుతుంటే లేని నిందలు మనపై వేసే కుట్రలు చేస్తున్నారని మండిపడ్డారు.

సోషల్ మీడియాలో మంచి ఉద్దేశంతో పోస్టులు పెడుతుంటే వాటిని వక్రీకరించి చెడు సందేశాలను వ్యాప్తి చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అన్నింటిపై అప్రమత్తంగా ఉంటూ కుట్రలను తిప్పికొడదామని మంత్రులకు సీఎం సూచించారు. గత వైఎస్సార్సీ ప్రభుత్వం ఔట్‌సోర్సింగ్ ఉద్యోగాలను ఆప్కోస్ ద్వారా దుర్వి >>2

# పలు చోట్ల వర్షాలతో తగ్గిన ఉష్ణోగ్రతలు

**విజయవాడ, ఏప్రిల్3, ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలో గురువారం ఎండవేడిమి నుంచి కొంత ఉపశమనం దక్కింది. పలు చోట్ల చల్లగాలులు వీచాయి. జల్లు వానలు పడ్డాయి. దీంతో ప్రజల గత కొద్దిరోజులుగా ఎండవేడిమి, వడగాలులు, తీవ్ర ఉక్కపోత పరిస్థితుల నుంచి బయటపడ్డారు. గత కొంత కాలం నుంచి రాష్ట్రంలో ఎండలు మండుతున్నాయి, వడగాల్పులు వణికిస్తున్నాయి. బయటికొస్తే ఎండ, లోపలుంటే ఉక్కపోతతో ప్రజలు అల్లాడిపోతున్నారు. ఈ దశలో వాన కురవటం జనానికి ఊరటనిచ్చింది. పలుచోట్ల వర్షం పడటంతో వాతావరణం చల్లబడింది. దీంతో ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

రాష్ట్రంలోని పలు జిల్లాల్లో కురుస్తున్న వర్షాలతో విపత్తుల నిర్వహణ సంస్థ ప్రజలను అప్రమత్తం చేసింది.పలు జిల్లాల్లో ఉద్ధృతంగా పిడుగులు పడే అవకాశం ఉన్నట్టు తెలిపింది. దీంతో నంద్యాల, కర్నూలు, అన్నమయ్య, తిరు >>2

# రామానాయుడు స్టూడియో భూములు వెనక్కి

## 34.4 ఎకరాలలో 15.7 ఎకరాలు రద్దు

## భూమి వినియోగ నిబంధనల ఉల్లంఘనకు వ్యతిరేకంగా కఠిన చర్యలు

**విజయవాడ,ఏప్రిల్3,ప్రభాతవార్తప్రతినిధి:** విశాఖలో సురేష్ ప్రొడక్షన్స్ ప్రైవేట్ లిమిటెడ్‌కు కేటాయించిన 34.44 ఎకరాల భూమిలో 15.17 ఎకరాల భూభాగాన్ని రద్దు చేస్తూ ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్‌పి సిసోడియా ఉత్తర్వులు జారీ చేశారు. విశాఖపట్నం రూరల్ మండలం మధురవాడ గ్రామం,సురేష్ ప్రొడక్షన్స్ ప్రైవేట్ లిమిటెడ్‌కు కేటాయించిన భూమి వినియోగంపై సమీక్ష నిర్వహించారు. ప్రభుత్వం 34.44 ఎకరాల భూమిని ఫిల్మ్ స్టూడియో, అనుబంధ పరిశ్రమల అభివృద్ధి కోసం కేటాయించగా, సంస్థ తాజాగా 15.17 ఎకరాల భూమిని నివాస యాజమాన్యంగా మార్చేందుకు అనుమతి కోరింది.ఈ భూమి 13 సెప్టెంబర్ 2003న విడుదలైన జి.ఒ.ఎంఎస్. 963 ద్వారా కేటాయించబడింది. భూమిని కేవలం ఫిల్మ్ స్టూడియో అభివృద్ధి, అనుబంధ పరిశ్రమల స్థాపన కోసం ఉపయోగించాలనే నిబంధనలు విధించబడ్డాయి. అనంతరం, 5 జనవరి 2010న డాక్యుమెంట్ నం.16/2010 ప్రకారం రిజిస్ట్రేషన్ డీడ్ కూడా జారీ చేయబడింది. అయినప్పటికీ, సురేష్ ప్రొడక్షన్స్ ప్రైవేట్ లిమిటెడ్ 15.17 ఎకరాల భూమిని నివాస యాజమాన్యంగా మార్చేందుకు 2 మార్చి 2023న జివిఎంసీకి దరఖాస్తు సమర్పించింది.

ఈ వ్యవహారంపె సుప్రీంకోర్టు స్పెషల్ లీవ్ పిటిషన్ నం.1890/2024లో 9 ఫిబ్రవరి 2024న తీర్పు ఇచ్చింది. కోర్టు తాత్కాలిక ఉత్తర్వుల్లో భూమిని అసలు కేటాయించిన ప్రయోజనానికి విరుద్ధంగా వినియోగించరాదని స్పష్టం చేసింది. దీంతో, ప్రభుత్వం ఈ భూమి వినియోగ నిబంధనల ఉల్లంఘనపై సమీక్షించి, సంస్థ భూవినియోగ పరిమితులను తక్కువ చేసేందుకు >>2



గురువారం బ్యాంకాక్‌లో ప్రధాని మోడీకి స్వాగతం పలుకుతున్న ప్రవాస భారతీయులు

# ప్రధానిమోడీకి థాయ్‌ప్రధాని విశిష్ట కానుక

**బ్యాంకాక్, ఏప్రిల్ 3:** థాయిలాండ్ పర్యటనలో ఉన్న భారత ప్రధాని నరేంద్రమోడీకి ఆదేశ ప్రధాని పెటోంగ్టార్న్ షినవత్రా విశిష్ట కానుకలు అందచేసారు. బ్యాంకాక్‌లో జరిగిన ద్వైపాక్షిక చర్చల సందర్భంగా ది వరల్డ్ తిపిటక సజ్ఞాయ ఫొనెటిక్ ఎడిషన్‌పేరుగల బౌద్ధగ్రంథాన్ని మోడీకి బహూకరించారు. ఈ చర్య భారత్‌థాయిలాండ్‌మధ్య బలమైన సాంస్కృతిక, భాషాపరమైన మతపరమైన సంబంధాలకు నిదర్శనంగా నిలుస్తున్నదనిమోడీ కీర్తించారు. తిపిటక అంటే పాలీభాషలో మూడు బుట్టలు. ఇది బౌద్ధ ధర్మగ్రంథాలలోప్రధానం. బౌద్ధసన్యాసుల నియమాలు సూత్రాలు బోధనలు సంగ్రహించబడి ఉంటాయి. ఈగ్రంథం మొత్తం 108 సంపుటాలుగా ఉంది. థాయ్‌ప్రభుత్వం రాజు భూమిబల్ అతుల్యతేజ్(రామ-9), రాణి సిరికిట్ 70వ వార్షికోత్సవం సందర్భంగా 2016లో వరల్డ్ తిపిటక ప్రాజెక్ట్‌లోభాగంగా ఈప్రత్యేక ఎడిషన్‌ను ప్రచురించింది. పాలి, థాయ్ ఇలపులతో రూపొందించిన ఈ గ్రంథం తొమ్మిది మిలియన్లకుపైగా పదాలతో ఉంది. కచ్చితమైన ఉచ్ఛారణతో పఠిచేందుకు వీలుగా రూపొందించారు.

మోడీ స్పందిస్తూ ప్రధాని షినవత్రా నాకు తిపిటకను బహుమతిగా ఇచ్చారని, లార్డ్ బుద్ధుని పుణ్యభూమి అయిన భారత దేశం తరపున నేను దానిని వినయంగా స్వీకరించానన్నారు. గత ఏడాది భారత్ లార్డ్‌బుద్ధుని పవిత్ర అవశేషాలను, ఇద్దరు ప్రధానమతగురువులను థాయిలాండ్‌కు పంపించిందని గుర్తుచేసారు. సుమారు నాలుగు మిలియన్లప్రజలు ఈ అవశేషాలకు నివాళులర్పించారని తెలుసుకోవడం చాలా సంతోషంగా ఉందన్నారు. థాయ్ అధికారులు తెలిపిన వివరాలప్రకారం థాయ్ రాజులు బౌద్ధమత సంరక్షకులుగా నిలవడంతోపాటు తిపిటకను ఇతరదేశాలకు వ్యాప్తిచేయడంలో చురుకైన పాత్ర పోషిస్తున్నారు.

# స్మార్ట్ స్ట్రీట్ వెండింగ్ మార్కెట్లు

>> అందుబాటులోకి రానున్నాయి.

**2,000 మంది ఉపాధికి భరోసా**

నగరాల్లోని ప్రధాన కూడళ్లలో రోడ్లకు ఇరువైపులా తోపుడుబళ్లపై వ్యాపారాలు చేస్తున్న వారు అనేక ఇబ్బందులు పడుతున్నారు. పోలీసులు, నగరపాలక సంస్థల అధికారులు, రాజకీయ నాయకులు ఎవరికి కోపం వచ్చినా వారు తమ బళ్లను అక్కడి నుంచి తీసేయాల్సిందే. దీనివల్ల ఉపాధి కోల్పోతున్నారు. ఇలాంటి వారందర్నీ గుర్తించి స్మార్ట్ స్ట్రీట్ వెండింగ్ మార్కెట్లలో చోటు కల్పించనున్నారు. ఈ ఎనిమిది మార్కెట్ల ద్వారా 1600 మంది చిరు వ్యాపారుల ఉపాధికి భరోసా లభించనుంది. మరో 400 మందికి మార్కెట్ శుభ్రం చేయడం, కాపలాదార్లుగా, ఇతరత్రా పనుల్లో ఉపాధి కల్పించనున్నారు. ఇంటికి అవసరమైన వస్తువులన్నీ ఒకేచోట లభిస్తే చాలా సౌలభ్యంగా ఉంటుంది. వినియోగదారులకు నాలుగైదు చోట్లకు తిరిగే పని తప్పుతుంది. అన్ని వస్తువులూ ఒకేచోట కొని తీసుకెళ్లొచ్చుననే దిశలో ఎపి ప్రభుత్వం అటువంటి ప్రయత్నం చేస్తోందన్నారు.

# ధరల నియంత్రణ కోసం ప్రత్యేక కమిటీ

## పౌరసంబంధాలశాఖా మంత్రి నాదెండ్ల మనోహర్

**విజయవాడ,ఏప్రిల్ 3,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రవ్యాప్తంగా ధరల నియంత్రణ కోసం సీఎం చంద్రబాబు నాయుడు ప్రత్యేక కమిటీ వేశారని ఏపీ పౌరసంబంధాలశాఖా మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. ఆయన గురువారం మీడియాతో మాట్లాడుతే ప్రతివారం వీటిపై సమీక్షిస్తున్నారు. వినియోగ దారులకు మెరుగైన సరుకులు అందించాలనే ఉద్దేశంతో మేము ఇతర శాఖల మంత్రులతో సమావేశాలు నిర్వహిస్తూనే ఉన్నాం. ఈ రైతు బజారును గతంలోనూ తనిఖీ చేశాను. ఇప్పుడు ఇక్కడ ధరలు అందుబాటులోకి వచ్చాయని వినియోగదారులు సంతృప్తి వ్యక్తం చేశారు. రేషన్ బియ్యం స్మగ్లింగ్ చేసే వారిని కఠినంగా శిక్షించేందుకు వారిపై పీడీ యాక్ట్‌లు పెడుతున్నాం. భవిష్యత్‌లో సిఎం, డిప్యూటీ సీఎంతో చర్చించి సరుకులు పక్కదారి పట్టకుండా చర్యలు తీసుకుంటాం. అదేవిధంగా రాష్ట్రవ్యాప్తంగా ధరల నిరోధానికి మంత్రులతో సిఎం చంద్రబాబు కమిటీ వేశారని నాదెండ్ల మనోహర్ గుర్తుచేశారు. ఎప్పటికప్పుడు తాము ఇతర శాఖల మంత్రులతో కలిసి రేట్ల నియంత్రణ చేస్తున్నామని తెలిపారు. ఇందుకోసం తరచూ సమావేశాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. ఈ రైతు బజారును గతంలోనూ తనిఖీ చేశానన్నారు. ఇప్పుడు ఇక్కడ ధరలు అందుబాటులోకి వచ్చాయని వినియోగదారులు సంతృప్తి వ్యక్తం చేశారని నాదెండ్ల వెల్లడించారు. చౌక బియ్యం నిల్వ ఉంచే బఫర్ గోదాముల్లో ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్‌తో కూడిన కెమెరాలు బిగించబోతున్నామని ఏపీ పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ స్పష్టం చేశారు. పిడిఎస్ బియ్యం అక్రమ రవాణా నిరోధించేలా కాకినాడ యాంకరేజ్ పోర్టు వద్ద చెక్ పోస్టులు ఏర్పాటు చేశామని ఎన్‌ఓసీ ఇచ్చిన తర్వాతే సదరు లారీలు నౌకలో లోడ్ చేసేలా కార్యాచరణ చేపట్టామన్నారు.

# ఈడెన్ గార్డెన్స్‌లో ఆరెంజ్ ఆర్మీ హ్యాట్రిక్ ఓటమి!

## 80 బంతుల తేడాతో కోల్‌కత్తా నైట్ రైడర్స్ జయభేరి



**కోల్‌కత్తా, ఏప్రిల్ 3:** ఐపిఎల్ 2025 సీజన్‌లో 15 వమ్యాచ్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టు హ్యాట్రిక్ ఓటమిని మూటగట్టుకుంది. ఈడెన్‌గార్డెన్స్‌లోజరిగిన ఈమ్యాచ్‌లో కోల్‌కత్తా నైట్‌రైడర్స్ ఆరువికెట్ల నష్టానికి 200 పరుగులుచేయగా తదనంతరం లక్ష్యఛేదనకు దిగిన సన్‌రైజర్స్ హైదరాబాద్ కేవలం 120 పరుగులుమాత్రమే చేయగలిగింది. దీనితో కెకెఆర్‌జట్టు 80 పరుగుల తేడాతో విజయం నమోదుచేసింది. కెకెఆర్ బౌలర్లు ముందునుంచీ కూడా ఆరెంజ్ ఆర్మీకి చుక్కలుచూపించారు. 16.4ఓవర్లలో 120 పరుగులకే ఆలౌట్ అయ్యేలా కెకెఆర్ బౌలర్లు వ్యూహం అమలుచేసారు. హెన్రిచ్ క్లాసెన్ మినహా ఇతర బ్యాటర్లెవ్వరూ పెద్దగా రాణించలేకపోయారు. క్లాసెన్ 22 బంతుల్లో 33 పరుగులుచేసాడు. ఇందులో రెండుఫోర్లు రెండు సిక్సులుకూడా ఉన్నాయి. నితీష్‌కుమార్‌రెడ్డి 19, మెండిస్ 27 మినహా ఎవ్వరూ తమ బ్యాట్‌లతో ప్రతాపంచూపించలేకపోయారు. కోల్‌కత్తా బౌలర్లలో వరుణ్‌చక్రవర్తి, వైభవ్ అరోరాలు అద్భుతంగా బౌలింగ్‌చేసారు. చెరో మూడు వికెట్లు తీసి ఆరెంజ్ ఆర్మీ బ్యాటర్లకు ముచ్చెమటలు పట్టించారు. ఆండ్రూ రస్సెల్2, హర్షిత్‌రాణా, సునీల్ నరైన్ చెరొక వికెట్‌తీసారు. తొలుత బ్యాటింగ్‌చేసిన కెకెఆర్ నిర్ణీత 20 ఓవర్లలో ఆరువికెట్ల నష్టానికి 200 భారీ స్కోరుచేసింది. టాస్‌గెలిచిన ఆరెంజ్ ఆర్మీ బ్యాటింగ్ కెకెఆర్‌కు అప్పగించింది. ప్రారంభ ఓవర్లలోనే కెకెఆర్ ఓపెనర్లను పెవిలియన్‌కు పంపించింది. మంచి ఫామ్‌లో ఉన్న క్వింటన్‌డీకాక్‌ను, ప్యాట్ కమ్మిన్స్ ఔట్‌చేసాడు. మరో ఓపెనర్ సునీల్ నరైన్‌ను మహ్మద్‌షమీ పెవిలియన్‌కు పంపించాడు. ఆ తర్వాత వచ్చిన రహానె రఘువంశీతోకలిసి స్కోరుబోర్డు చక్కదిద్దారు. కెకెఆర్‌కు మంచి భాగస్వామ్యం ఇచ్చారు. చివరిలో వెంకటేశ్ అయ్యర్; రింకూసింగ్ బౌండరీలమోతతో టీమ్‌స్కోరును పరుగులు పెట్టించారు. వెంకటేశ్ అయ్యర్ కేవలం 29 బంతుల్లో 60 పరుగులుచేసి టాప్ స్కోరర్‌గా నిలిచాడు. ఇందులో ఏడు ఫోర్లు 3 భారీ సిక్స్‌లు రాబట్టడం విశేషం. మరోవైపు రింకూసింగ్ 17 బంతుల్ల 32పరుగులుచేససాడు. వెంకీ, రింకూకలిసి చివరి ఐదు ఓవర్లలో 78 పరుగులు రాబట్టారు. వీరివల్లనే స్కోరు 200కి చేరింది. ఇక ఆరెంజ్ ఆర్మీ బౌలర్లలో పాట్‌కమిన్స్, షమీ, హర్షల్‌పటేల్; మెండీస్, జీషాన్ అన్సారి చెరోవికెట్ తీసారు.

# జలహారతి కార్పొరేషన్

>> యువజన, పర్యాటక శాఖ జీవోల ర్యాటిఫికేషన్‌కు ఆమోదం, రూ.710కోట్ల హడ్కో రుణానికి ప్రభుత్వం గ్యారంటీ ఇచ్చేందుకు ఆమోదం, ఎపి మీడియా అక్రిడేషన్ నిబంధనలు 2025కి ఆమోదం లభించింది.

నూతన సమగ్ర ఎపి స్టేట్ మీడియా అక్రిడేషన్ రూల్స్ 2025 నిబంధనలకు కేబినెట్ విస్తృత చర్చ తరువాత అంగీకారం తెలిపింది.. రాష్ట్రంలో త్రీస్టార్ సహా ఇతర ప్రీమియం హోటళ్ల అభివృద్ధికి బార్ లైసెన్స్ ఫీజును తగ్గించే ప్రతిపాదనకు ఆమోదం తెలిపారు.. బార్ లైసెన్స్‌ల ఫీజును రూ.25లక్షలకు కుదించారు. అనకాపల్లి జిల్లాలో క్యాపిటివ్ పోర్టు ఏర్పాటుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. యువజన సర్వీసులు, పర్యాటక, సాంస్కృతిక శాఖలో వివిధ జీవోల రేటిఫికేషన్‌కు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. నాగార్జున సాగర్ లెఫ్ట్ బ్రాంచ్ కెనాల్‌కు రిటైనింగ్ వాల్ నిర్మాణానికి ఇచ్చిన ప్రతిపాదనల్ని ఆమోదించారు. నాగార్జునసాగర్ లెఫ్ట్ బ్రాంచ్ కెనాల్ రిటైనింగ్ వాల్ నిర్మాణ ప్రతిపాదనకు ఆమోదం, జలహారతి కార్పొరేషన్ ఏర్పాటు చేసేందుకు ఆమోదం. జలహారతి కార్పొరేషన్ ద్వారా పోలవరంబనకచర్ల అనుసంధాన ప్రాజెక్టు రూపకల్పన. ప్రధాని నరేంద్ర మోడీ అమరావతిలో పర్యటించనున్నారు.. ఆయన చేతుల మీదగా రాజధాని అమరావతి పనులను తిరిగి ప్రారంభించనున్నారు. అమరావతిలో అభివృద్ధి పనులకు సంబంధించిన శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేయనున్నారు. ప్రధాని మోడీ పర్యటనకు సంబంధించిన అంశాలపై సిఎం చంద్రబాబు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్‌ను ఆరా తీసారు. ప్రధాని పర్యటన ఖరారు కాగానే పూర్తిస్థాయి ఏర్పాట్లపై దృష్టి పెట్టాలని అధికారులను ఆదేశించారు. ఇటీవల పి4 కార్యక్రమం ప్రారంభించిన ప్రాంతంలో 50 ఎకరాలకు పైగా చదును చేయాలని చెప్పారు.. పార్కింగ్ ఏర్పాట్లకు ఇప్పటి నుంచే కసరత్తు చేయాలని సూచనలు చేశారు. గతంలో ప్రధాని పర్యటనల్లో పనిచేసిన అధికారుల జాబితా సిద్ధం చేసి.. వారి సేవలను వినియోగించుకోవాలన్నారు. ఈ మేరకు ప్రధాని మోడీ పర్యటనకు సంబంధించి.. డిజిపి, సిఆర్‌డిఏ అధికారులు, గుంటూరు జిల్లా కలెక్టర్, ఎస్పీ, వైద్య ఆరోగ్యశాఖ కమిషనర్ ఆ ప్రాంతాన్ని సందర్శించాలని ఆదేశించారు. సమగ్ర నివేదిక అందజేయాలని సూచించారు. గతంలో అమరావతి శంకుస్థాపన కార్యక్రమం నిర్వహించిన సమయంలో కూడా వివిధ పనుల నిర్వహణను, మంత్రులు, అధికారులతో కమిటీలను నియమించిన విషయాన్ని సాధారణ పరిపాలనశాఖ ముఖ్యకార్యదర్శి ముకేశ్‌కుమార్ మీనా గుర్తుచేశారు. ఇప్పుడు కూడా కమిటీలను వేయాలని సూచన చేశారు.

ఇక అన్ని రంగాల్లో డ్రోనులను వినియోగిస్తున్నందున కచ్చితంగా ఇందుకు ప్రత్యేక మానిటరింగ్ వ్యవస్థ కావాలనే సిఎం చంద్రబాబు అభిప్రాయంతో మంత్రి మండలి ఆమోదించింది. సుదీర్ఘ చర్చ, విశ్లేషణ తరువాత ఎపి ఫైబర్‌నెట్ నుంచి ఎపి డ్రోన్ కార్పొరేషన్‌ను డీమెర్జ్ చేస్తూ నిర్ణయం తీసుకున్నారు. అంటే ఎపిడిసి (ఆంధ్రప్రదేశ్ డ్రోన్ కార్పొరేషన్)ను ఎపిఎస్ఎఫ్ఎల్ (ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఫైబర్‌నెట్ లిమిటెడ్) నుంచి సపరేట్ చేసి.. స్వతంత్ర సంస్థగా ఏర్పాటు చేస్తారు. రాష్ట్రంలో డ్రోన్ సంబంధిత అంశాలన్నింటికీ నోడల్ ఏజెన్సీగా ఎపిడిసి వ్యవహరించనుంది. మంత్రివర్గ సమావేశానికి ముందు ఆనవాయితీగా వస్తోన్న లోకేష్ బ్రేక్‌ఫాస్ట్ కార్యక్రమం జరిగింది.. ఎపి రాజధాని అమరావతిలో సింగపూర్ బృందం పర్యటించింది. సిఎస్ విజయానంద్‌తో సమావేశమైన సింగపూర్ ప్రతినిధులు, ఇవాళ సిఎం చంద్రబాబు, లోకేష్‌ను కలవనున్నారు. సీడ్ కేపిటల్ నిర్మాణంలో ఏపీ ప్రభుత్వం, సింగపూర్ సహకారం ప్రభుత్వం కోరింది. ఈ అంశంపై మంత్రి మండలిలో కీలకంగా చర్చించారు. మంత్రి మండలిలో తీసుకుంటున్న నిర్ణయం ప్రజలకు చేరే విధంగా మంత్రులు, వారి ద్వారా ఎంఎల్‌ఏలు, అధికారులు కృషి చేయాలన్నారు..మానవ వనరుల శాఖా మంత్రి నారా లోకేష్ ప్రభుత్వ విద్యారంగంలో తీసుకుని వస్తున్న మార్పులు గురించి ప్రస్తావించారు. రాష్ట్రంలో శాంతి భద్రతల నియంత్రణ, ఈగిల్ టీమ్‌తో మత్తుపదార్థాల రవాణాదారుల అణచివేత, క్రైమ్ ఎగినెస్ట్ కేసుల నియంత్రణ తదితరంశాలపై హోంమంత్రి అనిత మాట్లాడారు. పురపాలక రంగంలో తీసుకుని వస్తున్న సంస్కరణలపై మంత్రి నారాయణ ప్రస్తావించారు. నాగార్జునసాగర్ ఎడమ కాలువపై చింతలపూడి ఎత్తిపోతల పథకంలో భాగంగా వెంపాడులో రిటైనింగ్ వాల్ నిర్మాణానికి సుమారు రూ.45 కోట్ల నిధుల మంజూరుకు ఆమోదం తెలిపింది. పోలవరం బనకచర్ల అనుసంధాన ప్రాజెక్టును జలహారతి కార్పొరేషన్ పేరిట ప్రత్యేక వాహక ప్రాజెక్టుగా పరిగణిస్తూ ఎపి కేబినెట్ ఆమోదంతెలిపింది. ఈ సమావేశంలోవ్యవసాయ మంత్రి అచ్చెన్ననాయుడు, ఆర్థికమంత్రి పయ్యావుల కేశవ్, వివిధశాఖల మంత్రులు, పాల్గొన్నారు.

# చట్టాలు ఉల్లంఘిస్తేనే 'రెడ్ బుక్'

>> అనుగుణంగా మనబిడ్డలను సిద్ధం చేసేందుకు చంద్రబాబు ప్రయత్నిస్తున్నారు. 1994లో చంద్రబాబు తొలిసారి సిఎం అయినప్పుడు కొందరు ప్రత్యర్థులు కంప్యూటర్లు అన్నం పెడతాయా అంటూ అవహేళన చేశారు. ఇప్పుడు హైదరాబాద్ లో ఐటి ఎన్నిలక్షలమంది యువత ఉద్యోగాలు చేస్తున్నారో కళ్లముందు కన్పిస్తోంది. చంద్రబాబు నాయుడు ఎంతో ముందుచూపుతో ఆలోచించి ఐటి టవర్, ఐఎస్ బి, జీనోమ్ వ్యాలీ, అవుటర్ రింగ్ రోడ్డు, శంషాబాద్ ఎయిర్పోర్ట్ వంటివాటిని అభివృద్ధి చేశారు. ఫలితంగా ఈరోజు హైదరాబాద్ అంతర్జాతీయస్థాయి నగరంగా తయారైంది. విభజిత ఆంధ్రప్రదేశ్‌ను అదేస్థాయిలో అభివృద్ధి చేసేందుకు చంద్రబాబు అవిశ్రాంతంగా కృషిచేస్తున్నారన్నారు. నిరుపేదలను పేదరికం నుంచి శాశ్వతంగా బయటకు తేవాలన్న లక్ష్యంతో పి4 విధానానికి రూపకల్పన చేసి, ఇటీవల ప్రారంభించారు. రైతులకు న్యాయం చేసే బాధ్యత మాది రాష్ట్రంలో రైతులకు గిట్టుబాటు ధరల విషయంలో మా ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోంది. వరికి సంబంధించి గత ప్రభుత్వ బకాయిలను చెల్లించడమేగాక కొత్త ప్రభుత్వం ఏర్పడిన తరువాత కొన్న ధాన్యానికి ఎప్పటికప్పుడే డబ్బు రైతుల ఖాతాల్లో జమచేస్తున్నాం. తక్కువ ధర పలికే కొన్నిరకాల మిర్చి కనీస మద్ధతుధర రూ.11,500 అందజేస్తున్నాం. పసుపు ధరలకు సంబంధించి నేను దృష్టిసారించా. గిట్టుబాటు ధరలపై అచ్చంనాయుడు, నాదెండ్ల మనోహర్ లతో కూడిన కమిటీ ఎప్పటికప్పుడు సమీక్షిస్తోంది. రైతు నష్టపోకుండా చూసుకునే బాధ్యత మా ప్రభుత్వానిదన్నారు. కొన్నిరకాల పంటల ఎక్కువగా వచ్చినపుడు మార్కెట్ ఇంటర్వెన్షన్‌తో ధరలను స్థిరీకరించేందుకు చర్యలు తీసుకుంటున్నామని మంత్రి లోకేష్ చెప్పారు

# ఎదురుదెబ్బ

>> అయితే కాకాణి పిటిషన్‌కు విచారణ అర్హత లేదని వాదించారు అడ్వొకేట్ జనరల్ ఎస్సీ ఎస్టీ కేసులో మొదట స్పెషల్ కోర్టుకి వెళ్లాలన్న ఎజి కాకాణి నేరుగా హైకోర్టులో పిటిషన్ వేశారని ఆ పిటిషన్‌కు విచారణ అర్హత లేదని వాదించారు. మొదట స్పెషల్ కోర్టు రిజెక్ట్ లేదా రిటర్న్ చేస్తే మాత్రమే హైకోర్టులో పిటిషన్ వేయాలి అంటుంది ప్రభుత్వం. గతంలో పలు కోర్టులు ఇచ్చిన జడ్జిమెంట్‌లు ఈ సందర్భంగా ఎజి ఉదాహరించారు.

# పిటిషన్ డిస్మిస్

>> షన్ దాఖలు చేశారు. అలాగే మధ్యంతర ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ అనుబంధ పిటిషన్ సైతం వేశారు. అయితే దీనిపై మార్చి 24న హైకోర్టులో వాదనలు జరిగాయి. ఇరువర్గాల వాదనలు విన్న ధర్మాసనం తీర్పును ఇవాళ్టి (ఏప్రిల్ 3)కి వాయిదా వేసింది. ఈ మేరకు మిథున్ రెడ్డి వేసిన పిటిషన్‌ను కొట్టివేసింది.

# ఐఎఎస్‌ల పల్లెనిద్ర

>> యోగం చేసిందని విమర్శించారు. విచ్చలవిడి నియామకాలతో వ్యవస్థలను నాశనం చేశారన్నారు. ఒక టిటిడిలోనే 4వేల మంది ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులున్నారని తెలిపారు. ఔట్‌సోర్సింగ్ ఉద్యోగాలకు సరైన విధివిధానాలు అవసరమన్నారు. కేబినెట్ సబ్ కమిటీ ఏర్పాటు చేసి ఔట్ సోర్సింగ్ నియామకాలను సక్రమ పద్ధతికి తీసుకొద్దామని తెలిపారు.

స్వర్ణ గ్రామం పేరుతో ఉన్నతాధికారులు పల్లె నిద్ర చేయాలి అని సీఎం ఆదేశించారు. ఉన్నతాధికారులు 3 రోజులు, 2 రాత్రులు పల్లెనిద్ర చేయాలని నిర్ణయించారు. ఋషికొండ ప్యాలెస్‌ను వినియోగంలోకి ఎలా తీసుకు రావాలి అనే అంశంపై చర్చించాలని తెలిపారు. మంత్రులు, ప్రజా ప్రతినిధులు ఋషికొండ ప్యాలెస్‌ను సందర్శించి అభిప్రాయలు చెప్పాలని మంత్రులతో ముఖ్యమంత్రి అన్నారు.

## వారం - వర్జ్యం

తేది : 04-04-2025, శుక్రవారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
చైత్రమాసం, ఉత్తరాయణం,
వసంత ఋతువు, శుక్లపక్షం,
శుక్ల సప్తమి రా.8.18
ఆరుద్ర తె.5.21
వర్జ్యం సా.5.26 – రా.7.03
దు.ఉ.8.29 – 9.18, 2) మ.12.36-1.25
శుభసమయం : ఉ.6.10-6.50
రాహుకాలం – ఉ.10.30-12.00

## వార్తాఫలం

**మేషం:** ఉద్యోగాలలో స్థాన మార్పులు వుంటాయి. బంధువులతో ఏర్పడిన వివాదాలు పరిష్కరించుకుంటారు.

**వృషభం :**అనుకోని సమస్యలు ఎదురైన అధికమించి ముందుకు సాగుతారు. ఖర్చులు పెరుగుతాయి.

**మిథునం:**ఋణాలు తీరుతాయి. ఆర్థిక లావాదేవీలు లాభసాటిగా సాగుతాయి. ఆరోగ్యంపట్ల జాగ్రత్త అవసరం.

**కర్కాటకం :** గృహ నిర్మాణ ఆలోచనలు కార్యరూపం నిదానంగా దాలుస్తాయి. శ్రమకు తగ్గిన ఫలితం కష్టమే.

**సింహం:**మిత్రులతో ఏర్పడిన వివాదాలు పరిష్కారించుకుంటారు. పట్టుదలతో ముందుకు సాగుతారు.

**కన్య:** సంతానంనకు నూతన విద్యా, ఉద్యోగావకాశాలు పొందుతారు. ప్రయాణాలు లాభిస్తాయి.

**తుల :** ఆర్థిక లావాదేవీలు లాభిస్తాయి. విందు, వినోదాలు, శుభకార్యాలలో చురుకుగా పాల్గుంటారు.

**వృశ్చికం:** ఇంటర్వ్యూలు, పోటీ పరీక్షలలో చురుకుగా పాల్గొంటారు. దైవదర్శనాలు వస్తు కొనుగోలు.

**ధనుస్సు:** ముఖ్యమైన పనులలో ఆటంకాలు ఎదురై చికాకులు పెడతాయి. ఋణబాధలు తప్పవు.

**మకరం:** కుటుంబ సమస్యలు తీరి ఊరట చెందుతారు. ప్రయాణాలలో నూతన పరిచయాలు పెరుగుతాయి.

**కుంభం:** నూతన మిత్రులు పరిచయమై కొత్త కార్యక్రమాలకు శ్రీకారం చుడతారు. శుభవార్తలు.

**మీనం:**ఋణాలు తీరి ఊరట చెందుతారు. జీవితభాగస్వామి నుండి ధనలాభం పొందుతారు.

– శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్



గురువారం న్యూఢిల్లీలో ఎవరెస్ట్ శిఖరం పర్వతారోహణకు జెండా ఊపుతున్న రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్

# కోటి ఇస్తే భారీ ప్రయోజనాలు!

>> వసతి,ప్రసాదాలు అందించే దిశగా నూతన పథకం తీసుకువచ్చారు.

**రూ.కోటి విరాళమిస్తే బహుళ ప్రయోజనాలు:**

ప్రసిద్ధ పుణ్యక్షేత్రం, ధార్మికసంస్థ తిరుమల తిరుపతి దేవస్థానంలో అనేక విధాలుగా ట్రస్ట్‌లు, పథకాలు అమలవుతున్నాయి. వీటిని పటిష్ఠంగా నిర్వహించి, పేదలకు మెరుగైన వైద్యసేవలు, విద్యాబోధన చేస్తోంది. కొత్తగా రూపొందించిన కార్యాచరణ మేరకు కోటిరూపాయలు విరాళమిచ్చిన దాతలకు టిటిడి ప్రత్యేక సౌకర్యాలు కల్పిస్తుంది. తిరుమలలో ప్రత్యేక ఉత్సవాలు జరిగే రోజుల్లో మినహాయించి మిగిలిన రోజుల్లో కోటి విరాళమిచ్చిన భక్తులు తమకు కల్పించిన ప్రత్యేక సౌకర్యాలను సద్వినియోగం చేసుకునేలా కార్యాచరణ రూపొందించారు. కోటి విరాళమిచ్చిన దాతలకు జీవితకాలంలో దాతతోబాటు నలుగురికి ప్రతి ఏడాదిలో మూడురోజులు సుప్రభాతసేవ దర్శనాలు, 3రోజులు విఐపి బ్రేక్ దర్శనాలు, నాలుగురోజులపాటు సుపథం ప్రవేశ దర్శనం ద్వారా ఆలయంలోనికి చేరుకుని ఇష్టదైవం దర్శనం చేసుకోవచ్చు. వీటితోబాటు 10 పెద్ద లడ్డూలు, 20 చిన్నలడ్డూలు, ఒక దుప్పట, రవికె, 10 మహాప్రసాదం ప్యాకెట్లు బహూకరిస్తారు. ఏడాదిలో ఒకసారి దాతలైన భక్తులకు వేద ఆశీర్వచనం వంటి సౌకర్యం పొందవచ్చు. అంతేగాక తిరుమలకొండపై 3వేల రూపాయలు అద్దెతో కూడిన వసతి గదుల సదుపాయం మూడురోజులు కల్పిస్తారు. జీవిత కాలంలో దాతకు ఒకసారి ఐదు గ్రాముల బంగారు డాలర్, 50గ్రాముల వెండిడాలర్‌ను తగిన ఆధారాలను కార్యాలయంలో చూపి పొందవచ్చు.

**విరాళాలివ్వాల్సిన పథకాలు:**

దాతలు కోటిరూపాయలు విరాళాలివ్వాల్సిన టిటిడి ట్రస్టులలో కాటేజీ డొనేషన్ స్కీం, ఎస్వీప్రాణదానట్రస్ట్, ఎస్వీ విద్యాదనట్రస్ట్, బర్డ్ ట్రస్ట్, ఎస్వీ అన్నదానట్రస్ట్, ఎస్వీ గోసంరక్షణ ట్రస్ట్, ఎస్వీ సర్వశ్రేయాస్‌ట్రస్ట్, ఎస్వీ వేదపరిరక్షణ ట్రస్ట్, శ్రీవాణి ట్రస్ట్, ఎస్వీబిసిట్రస్ట్, బాలాజీఆరోగ్యవరప్రసాదిని స్కీమ్‌లకుదాతలు విరాళాలు చెల్లించి సౌకర్యాలను పొందవచ్చని టిటిడి తెలిపింది. దాతలు టిటిడి వెబ్‌సైట్"డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.టిటిదేవస్థానమ్స్.ఎపి.జివొవి,ఇన్"లో ఆన్‌లైన్ ద్వారా విరాళాలు చెల్లించవచ్చు. ఆఫ్‌లైన్‌లో దాతలు విరాళాలను ఇఒ టిటిడి పేరున డిడి,చెక్‌లను తిరుమలలోని దాతల విభాగంలో (డోనార్‌సెల్)అందజేయాలి.

# విద్యుత్ ఛార్జీల తగ్గింపునకు చర్యలు

## ప్రతి ఇంటికి సోలార్‌ను అనుసంధానించేందుకు కృషి

**విజయవాడ,ఏప్రిల్3,ప్రభాతవార్తప్రతినిధి:** ప్రజలపై విద్యుత్ ఛార్జీల భారాన్ని గణనీయంగా తగ్గించేందుకు ఎపి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. కేంద్ర ప్రాయోజిత పథకమైన పిఎం సూర్యఘర్ యోజన కింద ప్రతి ఇంటినీ సోలార్ ద్వారా విద్యుత్ వినియోగానికి అనుసంధానించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. రాష్ట్రవ్యాప్తంగా కోటి మందికిపైగా డ్వాక్రా మహిళలున్న నేపథ్యంలో వారి ద్వారా అంచెలంచెలుగా విస్తృత పరచాలని నిర్ణయించింది. తొలి విడతగా లక్ష మంది డ్వాక్రా మహిళల ఇళ్లపై సోలార్ రూఫ్‌టాప్‌ను అమర్చాలని లక్ష్యంగా పెట్టుకుంది. వీటి ఏర్పాటు వల్ల కలిగే లబ్ధిపై గ్రామీణ పేదరిక నిర్మూలన సొసైటీ అధికారులు డ్వాక్రా మహిళలకు అవగాహన కల్పిస్తున్నారు. సమ్మతి తెలిపిన వారికి రిజిస్ట్రేషన్ చేయిస్తున్నారు. ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా 80,000ల మంది సమ్మతి తెలిపారు. ఎన్టీఆర్ జిల్లాలో 700 ఇళ్లపై సోలార్ ప్యానళ్లు అమర్చగా వాటిలో 400 గృహాలు డ్వాక్రా మహిళలవే ఉన్నాయి. ఇతర జిల్లాల్లోనూ ప్యానళ్ల ఇన్‌స్టాలేషన్ ప్రారంభమైంది.

పిఎం సూర్య ఘర్ యోజన గృహ వినియోగదారులకు మాత్రమే వర్తిస్తుంది. దీని కింద 3 రకాల సామర్థ్యంతో సోలార్ రూఫ్‌టాప్ ఏర్పాటుకు ప్రభుత్వం రాయితీ ఇస్తుంది. మూడు కిలోవాట్ల సామర్థ్యం ఉన్న రూఫ్‌టాప్ ఏర్పాటు వ్యయం రూ.1.95 లక్షలు కాగా రాయితీ రూ.78,000లు వస్తుంది. రెండు కిలోవాట్లయితే రూ.1.40 లక్షలు కాగా రాయితీ రూ.60,000లు వర్తిస్తుంది. ఒక కిలోవాట్ వ్యయం రూ.70,000లు కాగా రూ.30,000ల రాయితీ లభిస్తుంది. లబ్ధిదారులు వారి ఇంటి విద్యుత్ వినియోగాన్ని బట్టి రూఫ్‌టాప్ సామర్థ్యాన్ని ఎంపిక చేసుకోవచ్చు. లబ్ధిదారు వాటా 10 శాతం పోనూ, మిగతా మొత్తాన్ని 7 శాతం వడ్డీపై బ్యాంకుల ద్వారా రుణం ఇప్పించే బాధ్యతను సెర్ప్ అధికారులు తీసుకుంటున్నారు. ఒకవేళ లబ్ధిదారు 10 శాతం వాటా కూడా చెల్లించలేని స్థితిలో ఉంటే ఆ మొత్తాన్ని బ్యాంకు, స్త్రీనిధి, పొదుపు మొత్తం నుంచి అందించనున్నారు.

# స్టూడియో భూములు వెనక్కి

>> ప్రయత్నించిందని తేల్చింది. బిఎస్ఓ 24 ప్రకారం, భూమి వినియోగ పరిమితిని మార్చే హక్కు కేవలం రాష్ట్ర ప్రభుత్వానికే ఉంది. జిల్లా స్థాయి అధికారులకు భూమి వినియోగ విధానాలను మార్చే అధికారం లేదని స్పష్టంగా పేర్కొంది. భూమి ప్రజా ప్రయోజనానికి అనుగుణంగా చిత్ర పరిశ్రమ అభివృద్ధికి మాత్రమే వినియోగించాలనే ప్రభుత్వ ఉద్దేశానికి విరుద్ధంగా, సురేష్ ప్రొడక్షన్స్ సంస్థ నివాస యాజమాన్యానికి అనుమతి కోరడం స్పష్టమైన నిబంధనల ఉల్లంఘనగా గుర్తించబడింది. ఈ అంశాన్ని పరిశీలించిన ప్రభుత్వం, సురేష్ ప్రొడక్షన్స్ ప్రైవేట్ లిమిటెడ్‌కు కేటాయించిన 34.44 ఎకరాల భూమిలో 15.17 ఎకరాల భూభాగాన్ని రద్దు చేయాలని నిర్ణయించింది. మిగిలిన భూమిపై నిబంధనలను పాటించేలా చర్యలు తీసుకోవాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. సుప్రీంకోర్టు గత తీర్పుల ప్రకారం, భూమి కేటాయింపులో నిబంధనలు ఉల్లంఘిస్తే, దానిని రద్దు చేసి ప్రభుత్వం తిరిగి స్వాధీనం చేసుకోవచ్చని వెల్లడించబడింది. ప్రభుత్వ నిర్ణయం ప్రకారం, వైసిడిఎ , జివిఎంసీ వంటి సంస్థలు భూమి వినియోగ మార్పు దరఖాస్తులను ఆమోదించకూడదని స్పష్టమైన ఆదేశాలు ఇవ్వబడ్డాయి. విశాఖపట్నం జిల్లా కలెక్టర్, సురేష్ ప్రొడక్షన్స్ ప్రైవేట్ లిమిటెడ్‌కి 15.17 ఎకరాల భూమిపై షోకాజ్ నోటీసు జారీ చేయాలని, భూమి రద్దుపై తుది నిర్ణయం తీసుకునే ముందు సంస్థకు సముచిత సమయం ఇచ్చి, వారి వాదన వినిపించే అవకాశం కల్పించాలనే సూచనలు ఇచ్చింది. ప్రభుత్వ నిర్ణయం మేరకు, విశాఖపట్నం జిల్లా కలెక్టర్ తుది చర్యలు తీసుకుని, వాటి నివేదికను ప్రభుత్వానికి సమర్పించాల్సి ఉంది. ప్రభుత్వం తీసుకున్న తాజా నిర్ణయం ప్రకారం, భూమి వినియోగ నిబంధనల ఉల్లంఘనకు వ్యతిరేకంగా కఠిన చర్యలు తీసుకోవడం ద్వారా భూ కేటాయింపులపై సరైన నియంత్రణ తీసుకురావాలని స్పష్టమైంది.

# వర్షాలతో తగ్గిన ఉష్ణోగ్రతలు

>> పతి, ఎన్టీఆర్, అల్లూరి జిల్లాల్లో పిడుగులు పడతాయని వెల్లడించింది. ఉరుములతో వర్షం కురిసేటప్పుడు అప్రమత్తంగా ఉండాలని సూచించింది. రైతులు, వ్యవసాయ కూలీలు, పశువుల కాపరులు చెట్ల కింద ఉండరాదని తెలిపింది.

కృష్ణా.ఎన్టీఆర్ జిల్లాలో వానలు పడ్డాయి. గన్నవరం పరిసరాల్లో వర్షం కురిసింది. దాదాపు అరగంట సేపు మోస్తరు జల్లులు పడ్డాయి. గత కొన్నిరోజులుగా ఉక్కపోతకు గురైన ప్రజలు వాతావరణం ఒక్కసారిగా చల్లబడటంతో ఊపిరి పీల్చుకున్నారు. ఎన్టీఆర్ జిల్లా నందిగామ ప్రాంతంలో సాయంత్రం వాతావరణం ఒక్కసారిగా చల్లబడింది. అనంతరం ఆకాశం మేఘావృతమై వర్షం పడింది. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఎండ విపరీతంగా ఉండటంతో ప్రజల తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు. మధ్యాహ్నం తర్వాత వాతావరణం ఒక్కసారిగా చల్లబడింది. ఉపరితల ద్రోణి ప్రభావంతో వర్షం కురిసింది.

కడప నగరంలో గత పది రోజుల నుంచి ఎండ వేడితో ప్రజలు అల్లాడిపోతున్నారు. 38, 39 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. నేటి మధ్యాహ్నం నుంచి భిన్న వాతావరణం నెలకొంది. భారీ ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురవడంతో ప్రజలు కాస్త ఊపిరి పీల్చుకున్నారు. ఏకధాటిగా 45 నిమిషాల పాటు భారీ వర్షం కురవడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. భారీ వర్షంతో నగరంలోని రోడ్లపై వర్షం నీరు వచ్చి చేరింది. మురికి కాలువలు పొంగి ప్రవహించాయి. ఎండ తీవ్రత అత్యధికంగా ఉన్న ప్రస్తుత రోజుల్లో ఈ స్థాయిలో వర్షం కురవడంతో ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. వర్షం కురవడంతో ఉష్ణోగ్రతలు తగ్గుతాయని ప్రజలు భావిస్తున్నారు. గుంటూరు.బాపట్ల.ఉమ్మడి గోదావరి జిల్లాల్లో వానలు పడ్డాయి.

# ఇచ్చిన మాట ప్రకారమే పేదలకు పట్టాభిషేకం!

## దశాబ్దాల సమస్యను 10నెలల్లో పరిష్కరించా

## త్వరలో 100 పడకల ఆసుపత్రికి శంకుస్థాపన: మంత్రి లోకేష్

**మంగళగిరి(గుంటూరుజిల్లా),ఏప్రిల్ 3,ప్రభాతవార్త** : గతంలో మంగళగిరిలో జెసిబి పాలన చూశాం, ఎన్ డిఎ అధికారంలోకి వచ్చాక దశాబ్దాలుగా ప్రభుత్వ భూముల్లో నివసిస్తున్న వారికి ఉచితంగా శాశ్వత పట్టాలు అందించాలని నిర్ణయించాం, ఇచ్చిన మాట ప్రకారం రాష్ట్రంలోని ఈరోజు ఉండవల్లిలో తొలిపట్టాను అందజేశానని రాష్ట్ర విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. మంగళగిరి నియోజకవర్గం ఉండవల్లిలో గత పదిహేనేళ్లుగా కొండవాలు ప్రాంతంలో నివసిస్తున్న రాజమండ్రి గోవిందు కుటుంబానికి మంత్రి లోకేష్ ఇంటికెళ్లి బట్టలు పెట్టి శాశ్వత పట్టాను అందజేశారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ...మంగళగిరిలో పాదయాత్ర నిర్వహించిన సమయంలో ఇక్కడ ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం కీలకమైన హామీ నెరవేర్చాన న్నారు.తొలివిడతగా 3వేలమంది శాశ్వత పట్టాలు అందజేస్తున్నట్టు ప్రకటించారు.ఘనవిజయంతో నా బాధ్యత పెరిగింది!2019 ఎన్నికల్లో మంగళగిరి నుంచి తొలిసారి పోటీచేసి 5,300 ఓట్లతేడాతో ఓడిపోయాను. మొదటి రోజు బాధపడ్డా, రెండో రోజునుంచి మంగళగిరి ప్రజల మనసు గెలిచేందుకు ప్రయత్నించా. గత అయిదేళ్లుగా సొంత నిధులతో నియోజకవర్గంలో 26 సంక్షేమ కార్యక్రమాలు అమలుచేశామని వివరించారు. ఎన్నికల ప్రచారంలో 50వేల మెజారిటీతో గెలిపించాలని ప్రజలను కోరా. నన్ను గెలిపిస్తే చంద్రబాబు, పవనన్నతో పోరాడి నిధులు తెస్తానని చెప్పా. మంగళగిరి చరిత్రలో ఎన్నడూ లేనివిధంగా రాష్ట్రంలో 3వ అతి పెద్ద మెజారిటీ 91వేలతో నన్ను గెలిపించారు. ఈ ఘన విజయంతో నాలో కసి, బాధ్యత పెరిగింది. మంగళగిరిలో 50 అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారంరాష్ట్రంలోనే ప్రతిష్టాత్మకంగా స్వచ్ఛ మంగళగిరి కార్యక్రమం నిర్వహిస్తున్నాన్నారు. పార్కులు, ప్లేగ్రౌండ్లు, రైతు బజార్లు అభివృద్ధి చేస్తున్నాం, అండర్ గ్రౌండ్ డ్రైనేజి, పైప్ లైన్ ద్వారా గ్యాస్ వంటి ప్రాజెక్టులు సిద్ధమవ ుతున్నాయని చెప్పారు. మంగళగిరిలో మోడరన్ రైతుబజానిర్మాణం, లక్ష్మీ ృనరసింహస్వామి ఆలయ ఆధునీకరణ, మంగళగిరి ప్రజల కల అయిన వంద పడకల హాస్పటల్ ను దేశంలోనే ప్రతిష్టాత్మకంగా నిర్మించడానికి ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. త్వరలో వందపడకల ఆసుపత్రి నిర్మాణానికి శంకుస్థాపన చేస్తాం. స్థానిక సంస్థల నిధులు, సిఎస్ ఆర్ ఫండ్స్ తో గత పదినెలల్లో మంగళగిరి నియోజకవర్గంలో 50 అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని వివరించారు. మంగళగిరిని టిడిపి కంచుకోటగా మారుస్తా చేనేతలకు అధునాతన సాంకేతికతపై శిక్షణ, డిజైనింగ్ కోసం కేంద్రప్రభుత్వ సహకారంతో కామన్ ఫెసిలిటీ సెంటర్ ను ఏర్పాటు చేయబోతున్నాం. స్వర్ణకారుల కోసం 75ఎకరాల్లో జెమ్స్ అండ్ జ్యుయలరీ పార్కు ఏర్పాటుచేసేందుకు ప్రణాళిక సిద్ధమవుతోంది. దీనివల్ల స్థానిక యువతకు పెద్దఎత్తున ఉపాధి అవకాశాలు లభిస్తాయి. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల అమలుకోసం చిత్తశుద్ధితో బాధ్యతగా పనిచేస్తున్నాం. ఏపిలోనే మంగళగిరిని నెం.1గా నిలపాలన్నది మా లక్ష్యం.



## ఎసిబి అధికారులకు చిక్కిన జిల్లా వైద్యాధికారి!

**శ్రీకాకుళం, ఏప్రిల్ 3 ప్రభాతవార్త** జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖాధికారి బాల మురళీకృష్ణ గురువారం ఏసీబీ అధికారుల చేతికి చిక్కారు. వివరాల్లోకి వెళ్లగా డిఎంఅండ్‌హెచ్ఓ కార్యాలయంలో పని చేస్తోన్న ఆదివరపు కాంతమ్మ దీర్ఘకాలపు సెలవుపై వెళ్లారు. ఆ సెలవును పూర్తి చేసుకుని తిరిగి విధుల్లో జాయిన్ అవ్వడానికి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి పర్మిషన్ ఇచ్చేందుకు లంచంగా రూ.20వేలు తీసుకుంటుండగా ఏసీబీ అధికారులకు ఆయన దొరికిపోయేలా చేశారు. బాధితురాలు కాంతమ్మ ఈ విషయం గురించి ఏసీబీని ఆశ్రయించగా, అధికారులు ప్రణాళికాబద్ధంగా అడ్డుకున్నారు. డిఎంఅండ్‌హెచ్ఓ కార్యాలయంలోనే లంచం తీసుకుంటుండగా అధికారులు అతడిని రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఈ ఘటన స్థానికంగా కలకలం రేపింది. ఈ వ్యవహారం నడిపిన సీసీ సురేష్‌కుమార్‌పైన కూడా కేసు నమోదైంది. ఈ దాడిలో డిఎస్పీ రమణమూర్తి, సీఐ రమణ, భాస్కర్ తదితరులు పాల్గొని విశాఖ ఏసీబీ కోర్టులో హాజరుపరచనున్నారు.

# తిరుమల సమాచారం

## మాట వినని వారిని ఉపేక్షించొద్దు

### - భక్తులతో సంయమనంగా వ్యవహరించండి

### - అలిపిరి తనిఖీ కేంద్రంలో ఇన్‌ఛార్జి సివిఎస్ఓ హర్షవర్ధన్‌రాజు

**తిరుమల,ఏప్రిల్ 3ప్రభాతవార్తప్రతినిధి:** తిరుమల పవిత్రతను కాపాడటంలో పోలీసులు,విజిలెన్స్,టిటిడి సెక్యూరిటీతో భక్తులు పూర్తిస్థాయిలో సహకరించాలని తిరుపతి జిల్లా ఎస్పీ ,టిటిడి ఇన్‌ఛార్జి సివిఎస్ఓ వి.హర్షవర్ధన్‌రాజు కోరారు. నిబంధనలు పాటించని యాత్రికులను, వారి వాహనాలను కొండకు అనుమతించొద్దని, మాట వినని వారిని ఉపేక్షించొద్దని సూచించారు. అలిపిరి



తనిఖీ కేంద్రంలో విధులు నిర్వహించే ప్రతి ఒక్కరూ భక్తులతో సంయమనంతో వ్యవహరించాలని అన్నారు. తిరుమలకు మద్యం సేవించిన వ్యక్తులు యధేచ్ఛగా వాహనాల్లో అలిపిరి తనిఖీ కేంద్రం దాటుకుని చేరుకోవడం, అలిపిరిలో తనిఖీలు పై గురువారం మధ్యాహ్నం తిరుపతి జిల్లా ఎస్పీ ,టిటిడి ఇన్‌ఛార్జి సివిఎస్ఓ వి.హర్షవర్ధన్‌రాజు ఆకస్మిక తనిఖీలు చేశారు. తిరుపతి అదనపు ఎస్పీ రవిమనోహరాచారి,తిరుపతి డిఎస్పీ శ్రీలత,అలిపిరి ఏవిఎస్ఓ ప్రభుతో కలసి ఆయన తిరుపతి నుండి వచ్చే ప్రైవేటు వాహనాలు, యాత్రికుల వాహనాలు, ద్విచక్రవాహనాలువెళ్ళే ప్రవేశ ద్వారాలను, విఐపి వాహనాలు వెళ్ళే ప్రవేశ ద్వారాన్ని పరిశీలించారు. ఇక్కడ వాహనాలను,యాత్రికుల లగేజీలను భద్రత సిబ్బంది తనిఖీ చేస్తున్న తీరును ఆయన గమనించారు. అలిపిరి తనిఖీ కేంద్రంలోసిసి కెమెరాలను తనిఖీ చేసి సూచనలిచ్చారు. ఇక్కడ భద్రత సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, యాత్రికుల లగేజీలు, బ్యాగ్‌ల స్కానింగ్ మరింత నిశితంగా తనిఖీ చేయాలని విజిలెన్స్ సిబ్బందికి సూచించారు. తిరుమలకు వెళ్ళే ప్రతి వాహనాన్ని, ప్రతి ఒక్కరినీ మరింత క్షుణ్ణంగా తనిఖీ చేసిన తరువాతే అనుమతించాలని ఏవిఎస్ఓ ప్రభుకు స్పష్టంగా ఆదేశాలిచ్చారు.

## గదిలో వదిలేసిన బంగారు గొలుసు అప్పగింత

**తిరుమల,ఏప్రిల్ 3ప్రభాతవార్తప్రతినిధి:** దైవదర్శనం కోసం వచ్చి హడావిడిలో గదిలో భక్తులు వదలివెళ్ళిన బంగారు గొలుసును టిటిడి సిబ్బంది నిజాయితీగా తిరిగి భక్తులకు అప్పగించారు. గురువారం మధ్యాహ్నం తిరుమలలో సన్నిధానం విశ్రాంతి భవనంలో గది 37లో నెల్లూరుకు చెందిన సురేష్ కుటుంబం బసచేసింది. గురువారం



ఉదయం స్వామివారి దర్శనానంతరం గదిని ఖాళీచేసి వెళ్ళిపోయారు. గదిని శుభ్రం చేయడానికి వెళ్ళిన సిబ్బంది గమనించి 40గ్రాముల బంగారు గొలుసును పద్మావతి విశ్రాంతి భవనం విచారణ కార్యాలయం సూపరింటెండెంట్ భాస్కర్‌నాయుడు, మేనేజర్ కామేశ్వరరావు, ఆఫీస్ సబార్డినేట్ చంద్రశేఖర్‌కు అందజేశారు. దీన్ని వెంటనే భక్తుల చరవాణికి సమాచారం అందించి బంగారుగొలుసును తిరిగి అప్పగించారు. టిటిడి సిబ్బంది నిజాయితీని భక్తులు అభినందించారు.

## మద్యం మత్తులో భార్యపై భర్త దాడి

### - తల్లిని రక్షించబోయి తండ్రిని చంపిన కుమారుడు

**శ్రీరంగరాజపురం, ఏప్రిల్ 3 ప్రభాతవార్త:** ఓ వ్యక్తి మద్యం మత్తులో భార్యపై దాడి చేశాడు. ఇది సహించని కుమారుడు తల్లిని రక్షించే ప్రయత్నంలో ప్రక్కనే పడివున్న ఇటుక రాయితో తండ్రిని కొట్టడంతో తండ్రి మృతి చెందిన సంఘటన గురువారం చిత్తూరు జిల్లా శ్రీరంగరాజపురం మండలం పాపిరెడ్డిపల్లి గ్రామంలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా వున్నాయి. ఎస్ఆర్ పురం మండలం పాపిరెడ్డిపల్లి గ్రామంకు చెందిన శ్రీనివాసమండడి(60) మద్యంకు బానిసగా మారి ప్రతి రోజు మద్యం సేవించి భార్య జ్యోతితో గొడవపడేవాడు. ఈ క్రమంలో బుధవారం సైతం శ్రీనివాసులు మండడి అతని భార్య జ్యోతిల మధ్య గొడవ తీవ్రం అయ్యింది. భర్త శ్రీనివాసులు మండడి తనకు చేతికి అందిన వస్తువులతో భార్య జ్యోతిపై దాడికి పాల్పడటం ప్రారంభించడంతో శ్రీనివాసులు మండడి కుమారుడు నాగరాజులు మండడి తండ్రి దాడిని అడ్డుకోవడానికి ప్రయత్నించి ఆవేశంతో ప్రక్కనే వున్న ఇటుక రాయితో తండ్రిపై దాడి చేశాడు. ఈ దాడిలో శ్రీనివాసులు మండడి తలకు తీవ్రంగా గాయాలు కావడంతో ఆయన మృతి చెందాడు. ఈ విషయంను నాగరాజు మండడి సమీప బంధువు సుబ్రమణ్యం మండడి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కార్వేటినగరం సర్కిల్ ఇన్స్‌పెక్టర్ హనుమంతప్ప, ఎస్ఆర్ పురం ఎస్ఐ సుమన్‌లు సంఘటనా స్థలం చేరుకుని విచారించారు. మృతి చెందిన శ్రీనివాసులు మండడి మృతదేహంను పోస్టుమార్టం నిమిత్తం చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

## పారిశ్రామిక అభివృద్ధి ద్వారా ఉపాధి అవకాశాలు

### - మంత్రి కొలను పార్థసారధి



**విజయవాడ, ఏప్రిల్ 3, ప్రభాతవార్త:** రాష్ట్రంలో పర్యాటక రంగం అభివృద్ధికి అపారమైన అవకాశాలు ఉన్నాయని సమాచార పౌరసంబంధాలశాఖా మంత్రి కొలుసు పార్థసారధి తెలిపారు.ఏపీ సమాచారశాఖ ప్రచార ప్రాంగణంలో ఆయన గురువారం సాయంత్రం మీడియాతో మాట్లావారు. ఈ రంగాన్ని అభివృద్ధి పర్చడం ద్వారా రాష్ట్ర ఆదాయాన్ని వృద్ధి చేయడమే కాకుండా ఉపాధి అవకాశాలను పెద్ద ఎత్తున మెరుగు పర్చవచ్చని రాష్ట్ర ముఖ్యమంత్రి ఈ రంగం అభివృద్ధిపై దృష్టి సారించారు. టెంపుల్ టూరిజంకు కూడా పెద్ద ఎత్తున అవకాశాలు ఉన్నాయి. పర్యాటకులకు సరిపడా రూములు అందుబాటులో ఉండాలనే ఉద్దేశంతో ఈ ఐదేళ్లలో దాదాపు 50,000 రూములను నిర్మించాలనే ఆలోచనలో పర్యాటక శాఖ ఉంది. ఫలితంగా రాష్ట్రంలోని 3 స్టార్ అంతకంటే ఎక్కువ కేటగిరీ హోటళ్లకు బార్ లైసెన్స్ ఫీజును రూ.66 లక్షల నుండి రూ. 25 లక్షలకు తగ్గించడానికి ఆమోదం కోసం యువజన సర్వీసులు, పర్యాటక సాంస్కృతిక శాఖ చేసిన ప్రతిపాదనకు రాష్ట్ర మంత్రి మండలి ఆమోదం తెల్పినట్లు వివరించారు. ఈ నిర్ణయం ద్వారా రాష్ట్రంలోని ఆతిథ్య రంగాభివృద్ధికి తగిన అనుకూల వాతావరణాన్ని కల్పించడమవుతుంది. ఆతిథ్య. పర్యాటక రంగం ఇతర రాష్ట్రాలకు దీటుగా అభివృద్ధి చెందడానికి ఊతం ఇస్తూ తద్వారా ఆర్థికాభివృద్ధిని సాధించడంతో పాటు మరిన్ని ఉద్యోగ అవకాశాలు కల్పించబడతాయి..యువజన సర్వీసులు, పర్యాటక, సాంస్కృతిక శాఖ.. చాలా సంవత్సరాల తదుపరి ఉగాది పురస్కారాల కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున రాష్ట్రంలో నిర్వహించడం జరిగిందన్నారు.. రాష్ట్రంలోని అన్ని రకాల కళలను ప్రోత్సహించాలనే దృక్పథంతో ప్రభుత్వం ఉందన్నారు. ఫలితంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన ఉగాది పురస్కారాలకు సంబందించి జారీ చేయబడి అమలు చేయబడినట్లు వివరించారు..మౌలికవసతులు పెట్టుబడుల శాఖ.పరంగా . మెస్సర్స్ ఆర్సెలర్ మిట్టల్ నిప్పాన్ స్టీల్ ఇండియా లిమిటెడ్ దాదాపు ఒక లక్షా 35 వేల కోట్ల పెట్టు బడితో రెండు దశల్లో 17.8 మిలియన్ టన్నుల స్టీల్ ఉత్పత్తి చేసే స్టీల్ ప్లాంట్ ఏర్పాటుకు చేసిన ప్రతిపాదనకు ముందుకు వచ్చిందన్నారు. ఇందు కోసం వారు కోరిన విధంగా అనకాపల్లి జిల్లాలోని డిఎల్ పురం వద్ద 2.9 కి.మీ.ల వాటర్ ఫ్రంట్ తో ఒక క్యాప్టివ్ పోర్టు ఏర్పాటుకై ఆమోదం తెల్పడం జరిగింది. ఈ క్యాప్టివ్ పోర్టు అనుమతికై కాకినాడ గేట్వే పోర్టు లిమిటెడ్ (కెజిపిఎల్) కు సంబందించిన పోర్టు రాయితీ ఒప్పందంలోని క్లాజు నెం.30.1.1 (ఇండియన్ పోర్టు యాక్టు1908) ను సవరించడం జరిగింది. ఈ నిర్ణయం ద్వారా మొదటి దశలో ఏడాదికి 7.3 మిలియన్ మెట్రిక్ టన్నుల ఉత్పత్తి సామర్థం గల స్టీల్ ప్లాంట్ ను రూ.55,964 కోట్ల పెట్టుబడితో ఏర్పాటు చేయబడుతుంది. జనవరి 2029 నాటికి తొలి దశ ఉత్పత్తి ప్రారంభించాలనే టార్గెట్‌ను నిర్ధేశించడం జరిగింది. మొదటి దశలో దాదాపు 20 వేల మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించబడతాయి.

## కాలువలో ఈతకు వెళ్లి తిరిగి రాని లోకానికి.. ఇద్దరు యువకులు మృతి

**పత్తిపాడు ఏప్రిల్ 3 (ప్రభాతవార్త):** కాకినాడ జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గంలోని ఏలేశ్వరం మండలం పెద్దనాపల్లి, ఏలేరు కాలువ పొర్లు వద్ద స్నానానికి దిగి ఇద్దరు యువకులు మృతి. జగ్గంపేట నుండి ఎనిమిది మంది యువకులు స్నానానికి వెళ్లారు.వీరిలో ఇద్దరు యువకులు దేవర జీవన్ (17) మొల్లి తరుణ్(19) లు మృతి చెందారు.ఈ సంఘటన తెలిసిన వెంటనే జగ్గంపేటలో విషాద ఛాయలు అలుము కున్నాయి. స్థానిక పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి వివరాలు సేకరించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## డాక్టర్ చీటీ లేకుండా.. మత్తు మాత్రలు అమ్మొద్దు : ఈగల్ ఐజి ఆకే రవికృష్ణ

**విజయవాడ,ఏప్రిల్3,ప్రభాతవార్తప్రతినిధి:**డ్రగ్స్ రహిత రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ ని తీర్చిదిద్దాలన్న ముఖ్యమంత్రి చంద్రబాబు ఆశయాలకు అనుగుణంగా, రాష్ట్ర డీజీపీ హరీష్ కుమార్ గుప్తా మార్గనిర్దేశకత్వంలో ఈగల్ పనిచేస్తుందని ఐజీ ఆకే రవికృష్ణ అన్నారు. డ్రగ్స్ కంట్రోల్ అసోసియేషన్ ఆధర్యంలో రాష్ట్ర సీమాంధ్ర డ్రగ్స్ డీలర్స్ అసోసియేషన్‌తో మంగళగిరి పోలీస్ ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన డ్రగ్స్ నియంత్రణపై జరిగిన సమీక్షా సమావేశంలో పాల్గొన్నారు.రాష్ట్రంలో నిబంధనలు అతిక్రమించిన 58 మందుల షాపులను గుర్తించామన్నారు: ఈగల్, డ్రగ్స్ కంట్రోల్ శాఖ, విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్మెంట్, పోలీసు శాఖలు సంయుక్తంగా ఆపరేషన్ గరుడను రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించినట్లు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా జరిగిన ఈ దాడుల్లో 158 మందుల షాపులు నిబంధనలు అతిక్రమించారని, వారిపై చట్టపరంగా చర్యలు తీసుకొని, కేసులు నమోదు చేయడం జరిగిందన్నారు. ఎన్.ఆర్.ఎక్స్, ఎక్స్ఆర్.ఎక్స్ డ్రగ్స్ ఎటువంటి ప్రిస్కిప్సన్స్ లేకుండా మెడికల్ షాపుల్లో విక్రయిస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని తెలిపారు. మందుల అమ్మకం, కొనుగోలుకు సంబంధించిన బిల్ బుక్ సంబంధిత వ్యక్తులపై కేసులను నమోదు చేస్తాం: కాలం చెల్లిన మందులను నిరక్షరాస్యులు, పిల్లలు, వృద్ధులకు డిస్కౌంట్స్ పేరుతో అమ్ముతున్నట్లు "ఈగల్" బృందం గుర్తించిందన్నారు. అటువంటి మందుల షాపులపై ఎన్డీపీఎస్ అండ్ డ్రగ్ కాస్మోటిక్ యాక్ట్ ప్రకారం సీజ్, వార్నింగ్ మెమో, లైసెన్సులను రద్దు చేయడంతో పాటు సంబంధిత వ్యక్తులపై కేసులను నమోదు చేస్తామని ఐజీ ఆకే రవికృష్ణ హెచ్చరించారు. ఎన్ఆర్ఎక్స్ డ్రగ్స్(మత్తు మాత్రలు) విచ్చలవిడిగా విక్రయిస్తున్నారని, రాష్ట్రంలో మత్తు మహమ్మారిని తరిమేసే యజ్ఞంలో భాగంగా పోలీసులతో కలిసి గంజాయిని బాగా కట్టడి చేశామని చెప్పారు. మత్తుకు అలవాటు పడ్డ యువత మెడికల్ షాపుల్లో ఎన్ఆర్ఎక్స్ మందులు కొని విచ్చలవిడిగా వినియోగిస్తుండటం వల్ల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం పడుతోందన్నారు. అందుకని ఆ రకమైన మందులు డాక్టర్ సిఫారసు చీటీ లేకుండా ఎవ్వరూ విక్రయించవద్దని ఆదేశించారు. ఇటీవల ఆపరేషన్ గరుడ్ల పేరుతో ఈగల్, డ్రగ్ కంట్రోల్, విజిలెన్స్ విభాగాలు ఉమ్మడిగా నిర్వహించిన సోదాల్లో 158 మెడికల్ షాపుల్లో పలు అక్రమాలు గుర్తించి కేసులు నమోదు చేసినట్లు



చెప్పారు. ఎవరైనా నిషేధిత మందులు విక్రయిస్తే ప్రజల్ని టోల్ ఫ్రీ నెంబర్ 1972కు సమాచారం ఇవ్వాలని పేర్కొన్నారు. అయితే, ఈగల్ ఐజీ చర్యల వల్ల రాష్ట్రంలో ఎన్ఆర్ఎక్స్ మందులు తప్పనిసరిగా వాడాల్సిన రోగులు ఇబ్బంది పడుతున్నారని వాటి విక్రయదారులు చెబుతున్నారు. గంజాయి, డ్రగ్స్ విక్రేతల్ని అరెస్టు చేసి మత్తును అదుపు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం ఈగల్ విభాగాన్ని ఏర్పాటు చేస్తే, మెడికల్ స్టోర్లపై పడటం విచిత్రంగా ఉందంటున్నారు. ఎన్ఆర్ఎక్స్ డ్రగ్స్ విక్రయాలను తాము పూర్తిగా ఆపేశామని, అయితే, యువత ఆన్‌లైన్‌లో వాటిని బెంగళూరు, హైదరాబాద్ నుంచి తెప్పించుకొంటున్నారని చెబుతున్నారు.

డాక్టర్ చీటీ లేకుండా అటువంటి మందులు ఇవ్వొద్దని డ్రగ్ డీలర్లకు ఈగల్ ఐజీ ఆకే రవికృష్ణ సూచించారు. మీ దృష్టికి వస్తే 1972 టోల్ ఫ్రీ నంబర్ కు కాల్ చేయండి: ఎవరైనా నిషేధిత మందులను విక్రయిస్తున్నట్లు దృష్టికి వస్తే 1972 టోల్ ఫ్రీ నంబర్ కు కాల్ చేయాల్సిందిగా విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఈగల్ ఎస్పీ నగేష్ బాబు, డీజీ డ్రగ్స్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ ప్రసాద్, సీమాంధ్ర డ్రగ్ డీలర్స్ అసోసియేషన్ రాష్ట్ర, జిల్లా స్థాయి కార్యవర్గ సభ్యులు, ఈగల్ కు చెందిన ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## రెండోరోజు ఎసిబి విచారణకు హాజరైన ఐ అండ్ పిఆర్ మాజీ కమిషనర్ విజయ్ కుమార్ రెడ్డి

**విజయవాడ,ఏప్రిల్3,ప్రభాతవార్తప్రతినిధి:** ఏపీ ఐ అండ్ పీఆర్ మాజీ కమిషనర్ విజయ్ కుమార్ రెడ్డి రెండో రోజు ఏసీబీ విచారణకు హాజరయ్యారు. ఏసీబీ ఇచ్చిన నోటీసుల మేరకు నిన్న బుధవారంఏసీబీ రిజనల్ కార్యాలయానికి విచారణకు వచ్చారు విజయ్ కుమార్. దాదాపు ఎనిమిది గంటల పాటు ఏసీబీ విచారణ కొనసాగింది. అయితే నిన్నటి విచారణకు విజయ్‌కు మార్ రెడ్డి సహకరించలేదని అధికారులు చెబుతున్నారు. ఈరోజు మరోసారి విచారణకు పిలిచారు. దీంతో ఇవాళ ఉదయం 10:30 గంటల తర్వాత రెండో రోజు విచారణకు విజయ్ కుమార్ హాజరయ్యారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో సమాచార శాఖ కమిషనర్‌గా పనిచేసి విజయ్ కుమార్ రెడ్డి మొత్తం రూ.859 కోట్ల రూపాయలను ప్రభుత్వ ప్రకటన రూపంలో ఖర్చు చేయగా.. వాటిలో 50 శాతం వరకు కేవలం ఒక పత్రిక, మీడియాకు మాత్రమే కేటాయించారు. అంతే కాకుండా మిగిలిన 50 శాతం కూడా అత్యధిక శాతం వైకాంగ్రెస్ పార్టీ అనుకూలంగా పనిచేసే మీడియా సంస్థలకే కట్టబెట్టారు. ఈ కేసులోనే విజయ్‌కుమార్‌ను ఏసీబీ విచారిస్తోంది. 2019 - 24 మధ్యకాలంలో రూ.859 కోట్ల ప్రభుత్వ ధనం దుర్వినియోగం చేసినట్టు విజిలెన్స్ నివేదిక ఇచ్చింది. విజిలెన్స్ నివేదిక ఆధారంగా కేసు నమోదు చేసిన ఏసీబీ అధికారులు.. అప్పటి ఐ అండ్ పీఆర్ సమాచార కమిషనర్ విజయ్ కుమార్ నోటీసులు ఇచ్చారు. ఎవరి ప్రోద్భలంతో చేశారు.. ఎందుకు చేశారు అనే దాన్ని ఏసీబీ కూపీ లాగుతోంది. ఈ వ్యవహారానికి సంబంధించి విజయ్ కుమార్‌రెడ్డిని నిన్న కొన్ని ప్రశ్నలు అడుగగా.. ఆయన మౌనం దాల్చినట్లు తెలుస్తోంది. ఎలాంటి సమాధానం చెప్పకుండా ఉండటంతో గత ప్రభుత్వంలో మీడియాకు, వైసీపీ అనుకూల మీడియాకు ఇచ్చిన ప్రభుత్వ ప్రకటనల రికార్డులను కూడా ఆయన ముందు ఉంచి ప్రశ్నించారు. అయినప్పటికీ విజయ్ కుమార్ ఎలాంటి సమాధానాలు ఇవ్వనట్లు తెలుస్తోంది. దీంతో ఈరోజు మరోసారి విచారణకు రావాల్సిందిగా విజయ్ కుమార్‌రెడ్డికి ఏసీబీ అధికారులు చెప్పారు. ఈ నేపథ్యంలోనే ఉదయం విచారణ నిమిత్తం ఏసీబీ ఆఫీసుకు వచ్చారు విజయ కుమార్‌రెడ్డికి వైకాంగ్రెస్‌పార్టీ అనుకూలంగా ఉన్న మీడియా సంస్థలకు ఎందుకు దోచిపెట్టారు.. ఎవరి ప్రోద్భలంతో, ఎవరు ఆదేశాల మేరకు ప్రభుత్వ ధనాన్ని దాదాదత్తం చేశారని విజయ్ కుమాంరెడ్డిని ప్రశ్నించి.. ఆయన నుంచి సమాధానాలు రాబట్టే ప్రయత్నం చేయనున్నారు.

## సీమ మీదుగా ముంబై-కన్యాకుమారి మధ్య వేసవి ప్రత్యేక రైళ్లు


**గుంతకల్లు రైల్వే,ఏప్రిల్ 3,ప్రభాతవార్త** రాయలసీమ జిల్లాల మీదుగా ముంబై-కన్యాకుమారి-ముంబై మధ్య వేసవి ప్రత్యేక రైలు సర్వీసులను నడుపుతున్నట్లు రైల్వే వర్గాలు తెలిపాయి. ముంబై వీటీ నుంచి కన్యాకుమారి వెళ్లే నెంబ 01005ప్రత్యేక వీక్లీ ఎక్స్‌ప్రెస్ రైలు ఏప్రిల్ 9,16,23,30వ తేదీల్లో ప్రతి బుధవారం అర్థరాత్రి 12.30గంటలకు ముంబై వీటీ నుంచి బయలుదేరి తరువాతిరోజు మధ్యాహ్నం 1.15గంటలకు కన్యాకుమారి చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో కన్యాకుమారి నుంచి ముంబై వీటీ వెళ్లే నెంబర్ 01006ప్రత్యేక వీక్లీ ఎక్స్‌ప్రెస్ రైలు ఏప్రిల్ 10,17,24,మే 1వ తేదీల్లో ప్రతి గురువారం మధ్యాహ్నం 3.30గంటలకు కన్యాకుమారి నుంచి బయలుదేరి తరువాతి రోజు తెల్లవారుజామున 4-15గంటలకు ముంబై వీటీ చేరుకుంటుంది. ఈ రైళ్లు మార్గమధ్యలో దాదార్,థానే,కళ్యాణ్, లోనవాలా,పూణే,దోన్డు,ఖుర్దువాడి,షోలాపూర్, కలబురిగి(గుల్బర్గ), వాడి,క్రిష్ణా,రాయచూరు, మంత్రాలయం,గుంతకల్లు,అనంతపురం, ధర్మవరం,యలహంక, క్రిష్ణరాజాపురం, బంగారుపేట్,తిరుపుత్తూర్,సేలం,నమక్కల్,కరూర్,డిండిగుల్,కొడైకెనాల్,మధురై,విరుదనగర్, సత్తూర్,కోవిల్ పట్టి,తిరుణ్ వేళి,వల్లియూర్, నాగర్ కోయిల్ స్టేషన్లలో నిలుస్తాయి.

## రికార్డు స్థాయిలో విద్యుత్ రైలింజన్ ఉత్పత్తి

**గుంతకల్లు రైల్వే,ఏప్రిల్ 3,ప్రభాతవార్త** రాబోయే విద్యుత్ అవసరాలకు అనుగుణంగా రైల్వే శాఖ విద్యుత్ రైలు ఇంజన్(లోకోమోటివ్)లను ఉత్పత్తి చేయడంలో విద్యుత్ రైళ్ల కంటే వేగంగా పురోగమిస్తోంది. 2024-25ఆర్థిక సంవత్సరంలో 1,681విద్యుత్ రైలు ఇంజన్లను ఉత్పత్తి చేసి అమెరికా సంయుక్త రాష్ట్రాలతో పాటు యూరప్,ఆఫ్రికా,ఆస్ట్రేలియా దేశాలను సైతం వెనక్కు నెట్టి భారత్ ముందుకు దూసుకు పోతుంది. చిత్తరంజన్‌లో కోమోటీవ్ వర్క్స్(సిఎల్‌డబ్ల్యూ)700విద్యుత్ లోకోమోటివ్‌లను ఉత్పత్తి చేయగా, వారణాసిలోని బనారస్ లోకోమోటివ్ వర్క్స్(బిఎల్‌డబ్ల్యూ)-477, పాటియాలా లోకోమోటివ్ వర్క్స్-304, మాధాపూరా, మరాహోప్రహ్-100 చొప్పున మొత్తం 1,681 విద్యుత్ రైలు ఇంజన్‌లను ఉత్పత్తి చేశాయి.

## 5న విజయవాడలో ఆర్ట్‌గ్యాలరీ


**విజయవాడ, ఏప్రిల్ 3, ప్రభాతవార్త** :ఈనెల 5న విజయవాడ ఐటిఐ కాలేజ్, స్కూల్ఆఫ్ ప్లానింగ్ అండ్ ఆర్కిటెక్చర్ ఆవరణలో ఇండియా ఆర్ట్ వన్‌డే వర్క్‌షాపును నిర్వహిస్తామని డ్రీం వర్క్ ఆర్ట్‌గ్యాలరీ డైరెక్టర్ పి రమేష్ గురువారం విజయవాడలో మీడియాకు తెలిపారు. తమ సంస్థ, విజయవాడ స్కూల్ఆఫ్ ఆర్కిటెక్చర్ , ఏపి ఫారెస్ట్ డిపార్ట్‌మెంట్ సంయుక్తంగా ఈ ప్రదర్శన వర్క్‌షాప్ నిర్వహిస్తున్నామన్నారు. రాష్ట్రం నలుమూలల నుండి 150 మంది ప్రముఖ చిత్రకారులు పాల్గొనే ఈ వర్క్‌షాప్‌లో పాల్గొనే యువ చిత్రకారులు, ఆర్ట్ టీచర్లు, చిత్రకారులు, కార్టూనిస్టులకు షీట్, రంగులు అందిస్తామన్నారు. బ్రష్‌లు వారే తెచ్చుకోవాలన్నారు. కళాశాల విద్యార్థుల చిత్రలేఖనం పోటీల్లో విజేతలకు అదేరోజు శనివారం బహుమతులందిస్తామన్నారు. వివరాలకు 9393949596 నెంబర్‌ను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో కుమార్, గోళ్ళ నారాయణరావు, సుబ్బారావు, రామ్ తదితరులు పాల్గొన్నారు.




:మీడియాతో మాట్లాడుతున్న రమేష్

## వక్ఫ్ సవరణ బిల్లుకు జనసేనమద్దతు : డీ సిఎం పవన్ కల్యాణ్

**విజయవాడ,ఏప్రిల్3,ప్రభాతవార్తప్రతినిధి:** కేంద్ర ప్రభుత్వం లోక్‌సభలో ప్రవేశపెట్టిన వక్ఫ్ సవరణ బిల్లుకు జనసేన పార్టీ పూర్తి మద్దతు ప్రకటించింది. వక్ఫ్ చట్టాన్ని ఆధునీకరించడం లక్ష్యంగా పెట్టుకున్న బిల్లుకు అనుకూలంగా ఓటు వేయాలని పార్టీ అధినేత, ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పార్టీ ఎంపీలను ఆదేశించారు. ఇదే విషయాన్ని పవన్ కల్యాణ్"ఎక్స్" వేదిక స్పష్టం చేసారు. ఈ చట్ట సవరణ ముస్లిం సమాజానికి మేలు చేస్తుందని జనసేన విశ్వసిస్తోంది. ఈ మేరకు లోక్ సభలోని జనసేన ఎంపీలకు పార్టీ అధ్యక్షులు పవన్ కళ్యాణ్ దిశానిర్దేశం చేశారు. ఈ బిల్లుకు అనుకూలంగా ఓటింగ్ లో పాల్గొనాలని జనసేన పార్లమెంట్ సభ్యులకు తెలిపారు. వక్ఫ్ చట్టంలో సవరణలకు సంబంధించిన బిల్లును 31 మంది సభ్యులతో జైంట్ పార్లమెంటరీ కమిటీని ఏర్పాటు చేసి సమీక్షించారు. సంబంధిత వర్గాలతో విద్యావంతులతో, పాలన రంగ నిపుణులతో చర్చించి ఈ బిల్లును రూపొందించారు. బ్రిటిష్ కాలంనాటి వక్ఫ్ చట్టాన్ని నేటి కాలానికి తగిన విధంగా క్రమబద్ధీకరించడం ద్వారా విస్తృత ఫలితాలు దక్కుతాయి. ఈ వక్ఫ్ సవరణ బిల్లుకు ఇవ్వాలి అని పవన్ కళ్యాణ్ మద్దతు తెలిపారు. వక్ఫ్ బిల్లు ముస్లిముల ప్రయోజనాలను కచ్చితంగా కాపాడుతుందన్నారు.తమ పార్టీ వక్ఫ్ బిల్లు అంశాన్ని క్షుణంగా అధ్యయనం చేసిన తరువాతనే మద్దతు ప్రకటించింది.సామాజికంగా ఎప్పటికప్పుడు పరిస్థితులకు అనుగుణంగా మార్పులు అవసరమన్నారు.



## రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్‌ను కలిసిన రాష్ట్ర మంత్రి టిజి భరత్

### - పలు రైల్వేప్రాజెక్టులపై కేంద్రమంత్రితో చర్చించిన టిజి భరత్

**కర్నూలు హాస్పిటల్, ఏప్రిల్ 3, ప్రభాతవార్త:** కేంద్ర రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్‌ను రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్‌ప్రాసెసింగ్ శాఖ మంత్రి టీజీ భరత్ బుధవారం రాత్రి ఢిల్లీలో కలిశారు. ఈసందర్భంగా కర్నూలు నుండి ముంబాయికి మరియు కర్నూలు నుండి విజయవాడకు కొత్త రైల్వే సర్వీసులను ప్రవేశపెట్టాలని కేంద్ర మంత్రిని కోరినట్లు టీజీ భరత్ తెలిపారు. ఆంధ్రరాష్ట్రం ఏర్పడినప్పుడు కర్నూలు రాజధానిగా ఉన్న విషయాన్ని గుర్తుచేస్తు ఈప్రాంతాన్ని రైల్వేపరంగా అభివృద్ధి చేసేందుకు కృషిచేయాలని విన్నవించారు.

## రూ.12లక్షల వరకు ఆదాయంపై పన్ను మినహాయింపు

**గుంతకల్లు రైల్వే,ఏప్రిల్ 3,ప్రభాతవార్త** నూతన ఆర్థిక సంవత్సరం 2025-26 ఈ నెల (ఏప్రిల్) 1 నుంచి ప్రారంభమైంది. మంగళవారం నుంచే కొత్త ఆదాయపు పన్ను విధానం (న్యూ ట్యాక్స్ రిజీమ్), పాత ఆదాయపు పన్ను విధానం (ఓల్డ్ ట్యాక్స్ రిజీమ్)లో బడ్జెట్ 2025లో చేసిన మార్పులు అమలులోకి వచ్చాయి. కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ ఫిబ్రవరి 1న ప్రవేశపెట్టిన పాధారణ బడ్జెట్‌లో పన్ను విధానంలో రూ.12లక్షల వరకు ఆదాయం ఉన్న వారికి పన్నును రద్దుచేసిన విషయం తెలిసిందే. అదే సమయంలో పాత పన్ను విధానంలో ఎలాంటి మార్పులు చేయలేదు. దీంతో ఇప్పుడు పాత పన్ను విధానం లాభదాయకమా..?లేక కొత్త పన్ను విధానం శ్రేయస్కరమా..? అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. కొత్త పన్ను విధానంలో ఏ విధంగా పన్ను ఆదా చేయవచ్చు, పన్ను చెల్లింపుదారులకు ఎంత మొత్తం ప్రయోజనం చేకూరనుంది అనే విషయాలను పరిశీలిస్తే కొత్త పన్ను విధానం మేరకు రూ.4లక్షల వరకు ఆదాయం ఉన్న వారికి ఎలాంటి పన్ను లేదు.

వార్త

విద్య లేకపోయినప్పటికీ గర్వించేవాడు, దరిద్రుడైనప్పటికీ పెద్ద ఎత్తులు వేసేవాడు, పనులు చేయనప్పటికీ ధనాన్ని ఆశించేవాడు మూర్ఖుడు.

-లావోసు

# తెలుగింట సన్న బువ్వ!


అఖిలాంధ్ర ప్రజానీకానికి ఇప్పుడు సన్నరకం బియ్యం చేరువయ్యాయి. తెలంగాణలో సన్నబియ్యం పేరు మారుమోగిపోతోంది. ప్రత్యేకించి తెలంగాణ రాష్ట్రంలో నిరు పేదలు ఈ ఉగాదిని సన్నబియ్యం పండగగా జరుపుకున్నాయి. దారిద్ర్యరేఖ దిగువనున్న వారందరికీ సన్నరకం బియ్యం అందించడమే ధ్యేయంగా తెలంగాణ ప్రభుత్వం ఒక ప్రతిష్ఠాత్మక పథకాన్ని సిద్ధంచేసింది. జాతీయ ఉత్పత్తి పంపిణీ పథకం కింద రాష్ట్రంలోని రేషన్‌కార్డులు ఉన్నవారందరికీ సన్న బియ్యం అందుతుంది. దీనికోసం కేంద్ర ప్రభుత్వం కొంత సమకూర్చినా, బియ్యం ధరలో వ్యత్యాసం వల్ల రాష్ట్రప్రభుత్వ ఖజానాపై రూ.2858 కోట్లు భారం పడుతుంది.రేషన్ కార్డులపై ఒక్క కుటుంబ సభ్యునికి నెలకు ఆరుకిలోలు చొప్పున సన్నరకం నాణ్యమైన బియ్యం ఉచితంగా ఇస్తారు. 1980వ దశకంలో అప్పటి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా నందమూరి తారక రామారావు పేదలకు మూడు పూటలా భోజనం పెట్టాలన్న సంకల్పంతో కిలో రెండు రూపాయల బియ్యాన్ని ప్రవేశపెట్టారు. అప్పటి నుంచి పేద ప్రజలు తమకు మంచి బువ్వ దొరకుతోందని ఆనంద పడేవారు. కాలక్రమేణా దాని రూపురేఖలు మారిపోయి దొడ్డు బియ్యం చేతికొచ్చాయి. కొంతకాలం దొడ్డు రకం బియ్యం అందినా తినలేని పరిస్థితి ఉండేది. దిగువ మధ్య తరగతి ప్రజలు రేషన్ కార్డును ఉనికిలో ఉంచుకోవడంకోసం తమబియ్యాన్ని రేషన్‌షాపుల్లో వదిలేస్తే తిరిగి మిల్లులకుచేరి రీసైక్లింగ్ బియ్యంగా మార్కెట్‌కు చేరేవి. ఇప్పుడు ఆపరిస్థితి లేదు. పక్కా సన్నరకం బియ్యం నేరుగా ప్రతి పేదవాడి ఇంటికి చేరుతున్నాయి. మళ్లీ ఇన్నాళ్లకు అలనాటి ఆనందాన్ని కలిగించే విధంగా సన్నబియ్యంతో వండిన అన్నాన్ని విస్తరిలో చూసుకొని 'అన్నం పరబ్రహ్మ స్వరూపం'గా కళ్ళకద్దుకుని బహుదానందపడుతున్నారు. వారి కళ్ళల్లో ఆనంద బాష్పాలు చూడగలుగుతున్నారు. గతకాలపు దొడ్డు బియ్యాన్ని కనీసం పశువులు తినేందుకు కూడా పనికిరాదని ప్రజలు తిరస్కరించిన సందర్భాలు ఎన్నో ఉన్నాయి.ఇప్పుడైతే అలాంటి పరిస్థితి లేదు. సన్నబియ్యం తన చేతికందగానే పాయస పరమాన్నాలు వండుకున్న సందర్భాన్ని ఆయా కుటుంబాలు ఎంతో ఆనందంగా స్వీకరిస్తున్నాయి. ఈసారైనా తాము సన్న బియ్యం తినగలుగుతున్నామని ఆనందాన్ని వ్యక్తం చేస్తున్నారు. ఇలాంటి పరిస్థితులు ఇకముందు కూడా ఇదే విధంగా సాగాలని వారు కోరుకుంటున్నారు. ఈ పథకం కింద రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 85శాతం కుటుంబాలకు సన్న బియ్యం అందుతాయి. అంటే 3.10కోట్ల మంది లబ్ధిదారులకు చేరుతాయి. గతంలో రూ.10,665కోట్లు వెచ్చించినా దొడ్డు బియ్యమే గతి. చివరకు కోళ్ల ఫారాలకు, బీరు కంపెనీలకు దారి మరళ్లాయని అపప్రథ ఉండేది. నిజానికి ఆ దొడ్డు బియ్యంలో ఎటువంటి పోషకాలు లేవు. తాజాగా తెలంగాణ ప్రభుత్వం రాష్ట్రంలోని 1723 రేషన్ దుకాణంలో 2.91 లక్షల మంది కుటుంబాలకు సన్న బియ్యం పంపిణీ చేస్తుంది. సన్న బియ్యం పథక రచనకు ముందుగానే సన్నబియ్యం పండించే రైతులను సన్నబియ్యం వరి రకాన్ని పండించేందుకు ప్రోత్సాహకాలు అందచేసింది. క్వింటాకు 500రూపాయలు అదనంగా బోనస్ ఇస్తామని ప్రకటించారు. మద్దతు ధరతో బాటు బోనస్ కూడా రావడంతో రైతులందరూ సన్న బియ్యం సాగుకు ముందుకు వచ్చారు. ఆ మేరకే వారి పథకం ప్రకారం నేడు సన్నబియ్యం పథకం సజావుగా సాగేందుకు వీలుగా తెలంగాణలోనే సన్న బియ్యం పండించడం సాధ్యమైంది. సన్న బియ్యం పంపిణీ ఆచరణలో అవరోధాలు దాటుకుంటూ ఒక యజ్ఞంగా చేపడితేనే తప్ప ఈ పథకం పేదలకు నిర్విరామంగా చేరే అవకాశం. ఈ విషయంలో ప్రభుత్వం ఎక్కువ జాగ్రత్తలుతీసుకోవాల్సి ఉంది. ఇదేపరిస్థితి కొనసాగి రైతులందరికీ సన్న బియ్యం అందించగలిగితే దేశవ్యాప్తంగా ఈ పథకాన్ని ఇతర రాష్ట్రాలు కూడా ప్రారంభించేందుకు మొగ్గుచూపుతాయి. ఈవిధంగా దేశవ్యాప్తంగా సన్న బియ్యం పేదలకు అందించేందుకు ఒక మార్గదర్శకంగా తెలంగాణ వైపు దేశం అంతా చూసే అవకాశం ఉంది. ప్రాథమిక విద్యనభ్యసించే పసిపిల్లలకు, గర్భిణులు, బాలింతలకు వెరసి మొత్తం 10.8లక్షలు లబ్ధిదారులకు ఏటా24 వేల మె.టన్నులు సన్నబియ్యం సరఫరా చేస్తోంది. ఈ విధంగా సన్నబియ్యం ప్రతి ఒక్కరికి అందుబాటులో ఉంచింది. ఇది మాత్రం కొత్త ప్రయోగమే. పేదలకు పంచ భక్ష్యపరమాన్నాలు అందించలేకపోయినా సుష్టుగా తినగలిగే సన్న బియ్యం ఇవ్వడం మేలైన ఆలోచన. దానితో పాటు ఉప్పు, పప్పు చింతపండు నిత్యావసర వస్తువుల కిట్ కూడా అందుతుంది. గతంలో దొడ్డు బియ్యం సానబట్టి సాధారణ మార్కెట్‌కి చేరిపోయేవి. ఎవరూ దొడ్డు బియ్యానికి ఆశపడే వారు కాదు. ఈ సారి అలాంటి పరిస్థితి లేకుండా పర్యవేక్షణ లోపం లేకుండా అమలు జరిగితే తెలంగాణలో నిరుపేదలంతా సౌఖ్యంగా భోజనం తినగలుగుతారు. అలాంటి పరిస్థితి దేశవ్యాప్త పౌరులందరికీ లభించేందుకు తెలంగాణ ఒక మార్గదర్శకం కావాలి. ఆంధ్రప్రదేశ్‌లో మధ్యాహ్న భోజన పథకం వరకే సన్నబియ్యాన్ని అందించే ఏర్పాట్లు చేస్తుంటే తెలంగాణ మాత్రం అతి పెద్ద ఆర్థిక భారాన్ని తలకెత్తుకుంది. ఆర్థిక పరిస్థితి సరిగా లేని తరుణంలో బియ్యం పంపిణీ హర్షదాయకం. అంతేకాదు ఫిలిప్పీన్స్ వంటి దేశాలకు లక్ష టన్నుల బియ్యం ఎగుమతి చేసే స్థాయికి చేరింది. త్వరలో తెలంగాణ ప్రపంచ దేశాల్లో 'రైసు హబ్' గా మారే అవకాశాన్ని ఆహ్వానిద్దాం!

> మీరు తప్ప మీకు శాంతిని ఎవరూ ప్రసాదించలేరు. సిద్ధాంతాలు పాలనలో విజయాన్ని సాధించినప్పుడే మీకు మానసిక శాంతి లభిస్తుంది.




-ఎమర్సన్

> మన శక్తియుక్తుల్ని మానవ కళ్యాణానికి వినియోగించాలి. కానీ వినాశనానికి కాదు.



-షేక్స్పియర్

# ప్రజావాక్కు



## అదనపు సిబ్బందిని నియమించాలి

రానురాను పెరుగుతున్న జనాభాగృహాలు గృహాల సముదాయాలుఆకాశహర్మ్యాలు,పరిశ్రమలువ్యాపార వాణిజ్య కేంద్రాలు,ప్రభుత్వ కార్యాలయాలు విస్తృతస్థాయిలో ఏర్పడి సమయానుకూలమైన యాజమాన్య పద్ధతులు పర్యవేక్షణ అవలంబించకపోవడం వలన ప్రస్తుతం గత కీర్తి ప్రతిష్టలకు నోచుకోవడం లేదు. నగరాన్ని ఉదయంలో శుభ్రపరచడానికి సఫాయి ఉద్యోగులు తమ శక్తి వంచన లేకుండా ఏకాలమైనా విధులనునిర్వహిస్తుంటారు. వీధులను ఉడ్చుటకు సంవత్సరానికి ఒకసారి చీపురు కట్టలను,రక్షణకు కావలసిన చేతిగ్లౌజులు, మాస్కులు, చేతులు శుభ్రం చేసుకోవడానికి హ్యాండ్ వాష్‌తో కూడిన కిట్స్‌ను అందజేసేవారని ఈఉద్యోగులు తెలుపుతున్నారు. ప్రస్తుతం ఈ కిట్స్‌ను అందజేయడం లేదని వాపోతున్నారు.

-దండంరాజు రాంచందర్ రావు, పాత బోయినపల్లి

## పామాయిల్ సాగును పెంచాలి

పామాయిల్ సాగును ప్రభుత్వం పెద్ద ఎత్తున వ్యవసాయ శాఖ ద్వారా ఉపాధి హామీ ద్వారా చేపడుతోంది. దీనివల్ల రైతులకు లాభంతో పాటు విభిన్న పంటలు సాగులోకి వచ్చేఅవకాశంఉంది. ఖమ్మంజిల్లాలో రెండుచోట్లా పామాయిల్ పరిశ్రమలు ఫామ్ చేయడం ఇందులో భాగం. దీనివల్ల స్థానికంగా ఉపాధిఅవకాశాలు పెరగడంతో పాటు రవాణా వ్యయం రవాణా సమయం తగ్గేఅవకాశం ఉంది. దీనివల్ల స్థానికంగానే నూనె ఉత్పత్తి కేంద్రాలు కూడా ప్రభుత్వ ఆధీనంలోని స్వయం సహాయక బృందాలు ద్వారా క్రయవిక్రయాలు జరిపించి వాటిని బలోపేతం చేయడానికి అవకాశం ఉంది.

-భారత అవినాష్, జనగామ

## భారీ జరిమానాలు విధించాలి

రాష్ట్రంలో అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యం పట్టుబడుతున్న వార్తలు నిత్యంపత్రికల్లో వస్తున్నాయి. కేసులు నమోదు చేస్తున్నారు. అయితే అందువలన అక్రమ తరలింపు ఆగే పరిస్థితిలేదు. అలాగే పట్టుబడిన బియ్యం కాలం గడిచే కొద్దీ పురుగు పట్టి ఎందుకూ పనికి రాని ప్రమాదంఉంది.అధికారులు చట్టపరమైన చర్యలు వేగవంతం చేసి,పట్టుబడిన బియ్యాన్ని వేలం వేయాలి. అక్రమాలకు పాల్పడిన వారికి భారీ జరిమానాలు విధించాలి.

- జి.రామకృష్ణ, ఏలూరు జిల్లా

## శాస్త్రం ఎన్నటికి తప్పకాదు

మార్చి 30వ తారీఖు ఉగాది పండుగ జరుపుకున్నాము. శ్రీ క్రోధికి వీడ్కోలు చెప్పి శ్రీ విశ్వావసుకు స్వాగతం పలికాము. రాజకీయ పార్టీలు అయిన కాంగ్రెసు, బి.ఆర్.ఎస్., బి.జె.పి. తెలుగుదేశం, వై.యస్.ఆర్.సి.పి. వారు ఉద్దండ పండితులను తమ పార్టీల కార్యాలయాలకు ఆహ్వానించారు. వారు విశ్లేషించి వినిపించిన పంచాంగ శ్రవణం పార్టీలకు శ్రవణానందకరంగా ఉంటే టి.వి.ల ముందు కూర్చుని వింటున్న వారికి కంపరం పుట్టించింది.ఎందుకంటే ఆ జ్యోతిష శాస్త్రవేత్తలు తమను పిలిచిన పార్టీలవారిని అతీతంగా పొగుడుతూ ఆకాశానికి ఎత్తేశారు పదవిలో నున్న పార్టీలు అమోఘంగా పాలిస్తున్నాయని, పదవి కోల్పోయిన పార్టీలు త్వరలోనే పాలనను చేపడతారని గట్టిగా శ్లాఘిస్తూ ఉద్ఘాటించారు. జ్యోతిష్య శాస్త్రం తర్కానికిచక్కని పరమాద్భుతమైన పురాతన సైంటిఫిక్ విద్య. రాబోయే చంద్ర సూర్యగ్రహణాలను గణించి రచించిరాసిన పంచాంగం ప్రకారం శ్రవణం చేస్తున్నప్పుడు, ఈ పండితులు చెప్పేవి ఒక రీతిగా లేవు. శాస్త్రంఎన్నటికి తప్పుచెప్పదు. చెప్పేవారిలో దోషాలుంటే విని ఆచరించే వారు అనుభవించాలి.

-ఎన్. రామలక్ష్మి, సికింద్రాబాద్

## ప్రజలతో చర్చించండి

తెలంగాణ రాష్ట్రప్రభుత్వం రాష్ట్రంలోఉన్న12.769 గ్రామాలలో అధికారి ప్రజలతో చర్చకార్యక్రమం నిర్వహించాలి.ప్రతి అధికారి గ్రామాలలోని ప్రజల వద్దకు వెళ్లి వారి సమస్యలను దరఖాస్తు రూపంలో స్వీకరించి అక్కడికక్కడే పరిష్కరించాలి. కొన్ని రకాల దరఖాస్తులను ఉన్నతాధికారులకు సిఫారసు చేయాలి. ప్రతి అధికారి ప్రతిగ్రామంలో పర్యటించే విధంగా ప్రజల సమస్యలను తెలుసుకుని పరిష్కరించేవిధంగా కృషిచేయాలి.ప్రజల సమస్యలను ప్రభుత్వకార్యాలయాల చుట్టూ తిరిగితిరిగి విసిగివేసారిపోకుండా ప్రభుత్వ అధికారులే ప్రజలవద్దకు వెళ్లి సమస్యలను పరిష్కరించేవిధంగాకార్యక్రమాలను రూపొందించాలి.

-ఈదునూరి వెంకటేశ్వర్లు, వరంగల్ జిల్లా

## నానాటికీ తీసికట్టుగా మానవ సంబంధాలు

మానవ సంబంధాలు నానాటికీ తీసికట్టుగా మారుతున్నాయి. సంసార బంధాలు కూడాధర్మం తప్పుతున్నాయి.భార్యా భర్తలు వివాహేతర కారణాలవల్ల ఒకరినోకరిని హతమార్చడం, అలాగే ఆస్తితగాదాలతో హత్యలకుపాల్పడడం, ఈఅర్థాంతర మరణాలు, అనైతిక సంబంధాలను అరికట్టే చర్యలు తీసుకోవాలి.

- ఎన్.గోపికృష్ణ, హైదరాబాద్

మనవి: ఎడిట్ పేజీకి.. ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# విశ్వవిద్యాలయాలను కాపాడుకోవాలి

**విశ్వవిద్యాలయాలు విద్యా కేంద్రాలుగా మాత్రమే కాదు అవి ప్రకృతి వనరులు, పర్యావరణ పరిరక్షణ కేంద్రాలుగా ప్రభుత్వాలు గుర్తించాలి. 400 ఎకరాల భూమికి సంబంధించిన వివాదాన్ని సృష్టించింది విశ్వవిద్యాలయం కాదు, విద్యార్థులు కాదు అలాగే పర్యావరణాన్ని రక్షించేవిధంగా అభివృద్ధి జరగాలని రాహుల్ గాంధీ ఆలోచన కాబట్టి అందరికీ ఆమోదయోగ్యమైన పరిష్కారాన్ని సూచించవలసిన బాధ్యత కూడా రాష్ట్ర ప్రభుత్వానిదే. ప్రైవేటు విద్యాసంస్థలకు దీటుగా ప్రభుత్వ విశ్వవిద్యాలయాలను తీర్చిదిద్ది బడ్జెట్ నిధులను కేటాయించి క్రమం తప్పకుండా బోధనా సిబ్బందిని నియమించి మౌలిక వసతులను కల్పించి విద్యా ప్రమాణాలను పెంచి విశ్వవిద్యాలయాలను కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వాల పైనే ఉన్నది. ఆ విధంగా ప్రభుత్వాలు ఆలోచన చేసి ప్రభుత్వ విశ్వవిద్యాలయాలను కాపాడుతాయని ఆశిద్దాం.**



డాక్టర్ తిరుణహరి శేషు

విద్యా వ్యవస్థలో విశ్వవిద్యాలయాలకు ఒక ప్రత్యేక గౌరవం ఉంది. విజ్ఞాన కర్మాగారాలుగా బోధనలో పరిశోధనలో నూతన ఆవిష్కరణలకి విశ్వవిద్యాలయాలు వేదికలుగా నిలబడ్డాయి. ఇటీవల కొత్త నలంద విశ్వవిద్యాలయ క్యాంపస్‌ని ప్రారంభిస్తున్న సందర్భంగా భారత ప్రధానమంత్రి నరేంద్ర మోడీ మాట్లాడుతూ విశ్వవిద్యాలయంఅంటే ఒక గౌరవం, విలువ, అద్భుతమని చెప్పారంటే విద్యా వ్యవస్థలో విశ్వవిద్యాలయాలకి ఎంత ప్రాధాన్యత ఉందో అర్థమవుతుంది. విజ్ఞానాన్ని విశ్వవ్యాప్తం చేసే విశ్వవిద్యాలయాలను కాపాడుకోవటం ఒక సామాజిక బాధ్యతగానే చూడాలి. ఒకనాడు అద్భుతాలు సృష్టించిన విశ్వవిద్యాలయాలు ప్రభుత్వాల అలసత్వం వలన నేడు తమ పూర్వ వైభవాన్ని కోల్పోతున్నాయి. 2024 నేషనల్ ఇన్స్టిట్యూషనల్ ర్యాంకింగ్ ఫ్రేమ్ వర్క్ (ఎన్ఐఆర్ఎఫ్) జాబితాలో మొదటి పది స్థానాలలో దేశంలో ఏ ఒక్క విశ్వవిద్యాలయం స్థానం దక్కించుకోలేకపోయిందంటే విశ్వవిద్యాలయాల ప్రమాణాలు ఏస్థాయిలో పడిపోతున్నాయో అర్థం చేసుకోవచ్చు. ఎన్ఐ ఆర్ఎఫ్ ర్యాంకింగ్‌లో మొదటి వంద ర్యాంకులలో తెలంగాణ రాష్ట్రం నుండి హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ (హెచ్ సియు) 28వ ర్యాంక్ ఉస్మానియా విశ్వవిద్యాలయం 43వ ర్యాంకును దక్కించుకున్నాయి. గత కొంతకాలంగా తెలంగాణ రాష్ట్రంలో ప్రభుత్వం నుండి విశ్వవిద్యాలయాలకు సహకారం దక్కకపోవటం వలన విశ్వవిద్యాలయాలు తమ పూర్వ వైభవాన్ని కోల్పోతున్నాయనే చెప్పాలి. తెలంగాణ రాష్ట్రంలోని వివిధ విశ్వవిద్యాలయాలకు ప్రభుత్వం కేటాయించిన భూములు అన్యాక్రాంతం అవుతున్నాయనే ఆరోపణలు, విశ్వవిద్యాలయాలకు చెందిన భూములను ప్రభుత్వాలు ఇతరత్రా అవసరాలకు వినియోగించటంపై అభ్యంతరాలు వ్యక్తమవుతున్నా ప్రభుత్వాలు నిమ్మకు నీరుఎత్తినట్టుగా వ్యవహరిస్తున్నాయనే ఆరోపణలు వస్తున్నాయి. కంచ గచ్చిబౌలిలోని 400 ఎకరాల భూమి హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీదా! తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వాన్నిదా! అనే వివాదం నెలకొన్న నేపథ్యంలో ఆ భూమిని తెలంగాణ స్టేట్ ఇండస్ట్రియల్ ఇన్ఫ్రాస్ట్రక్చరల్ కార్పొరేషన్ (టిజిఐఐసి) ద్వారా అభివృద్ధి చేసి పారిశ్రామిక అవసరాల కోసం వినియోగించాలనే ప్రభుత్వ నిర్ణయం పట్ల హెచ్‌సియు విద్యార్థుల నుండి తీవ్ర వ్యతిరేకత వ్యక్తంమవుతుంది. విశ్వవిద్యాలయానికి చెందిన 400 ఎకరాల భూమిని కేంద్రప్రభుత్వ సహకారంతో నాటి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 2004లో ఐ ఎం జి భారత్ అకాడమీ ప్రైవేట్ సంస్థకి అప్పగించడం జరిగింది. బదులుగా రాష్ట్ర ప్రభుత్వం గోపనపల్లి వద్ద 397 ఎకరాల భూమిని హెచ్ సియుకి అప్పగించారు. ఎన్నికలకి ముందు



నాటి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం విలువైన విశ్వవిద్యాలయ భూమిని హడావుడిగా ప్రైవేట్ సంస్థకి కట్టబెట్టటానికి తీసుకున్న నిర్ణయాన్ని 2006లో రాజశేఖర్ రెడ్డి ప్రభుత్వం రద్దు చేయడంతో ప్రభుత్వ నిర్ణయాన్ని సవాల్ చేస్తూఐఎంజి సంస్థ కోర్టులను ఆశ్రయించటం 2024లో హైకోర్టు సుప్రీం కోర్టులు ఐఎంజి సంస్థకి కేటాయించిన భూమిని ప్రభుత్వానికి చెందిన భూమిగానే తీర్పుఇవ్వటంతో కంచ గచ్చిబౌలి లోని 400 ఎకరాల భూమిని ప్రభుత్వం స్వాధీనం చేసుకున్నది. ప్రభుత్వం స్వాధీనం చేసుకున్న 400ఎకరాల భూమిపై యాజమాన్య హక్కు ఎవరిది? అనేది ఒక వివాదం అయితే స్వాధీనం చేసుకున్న భూమిపై ఉన్న జీవ వైవిధ్యాన్ని దెబ్బతీస్తూ పర్యావరణానికి నష్టం చేసే విధంగా ప్రభుత్వం ఆ భూమిని వినియోగంలోకి తేబోతుంది? అనేది మరొక అభ్యంతరం. జై తెలంగాణ, జై ఆంధ్ర ఉద్యమాల నేపథ్యంలో 6 పాయింట్ ఫార్ములాలో భాగంగానే 1973 లో హెచ్ సియు ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం 2300 ఎకరాల భూమిని కేటాయించింది ఆ కేటాయించిన భూమిలో నుండే 2004లో రాష్ట్రప్రభుత్వం 400 ఎకరాల భూమిని తీసుకొని ఐఎంజి సంస్థకి కేటాయించింది కాబట్టి సాంకేతికంగా కోర్టు తీర్పులు ప్రభుత్వ భూమిగా పరిగణించినా ఆ భూమి విశ్వవిద్యాలయానికి చెందినదే అని విద్యార్థులు విశ్వవిద్యాలయ అధికారుల వాదన.400ఎకరాల భూమి విషయంలో విశ్వవిద్యాలయ విద్యార్థుల నుండి పర్యావరణ వేత్తల నుండి అభ్యంతరాలు వ్యక్తమవుతున్న నేపథ్యంలో ఇలాంటి సున్నితమైన విషయంలో ప్రభుత్వం పట్టుదలకు పోకుండా పునరాలోచన చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. నాటి ప్రభుత్వం విశ్వవిద్యాలయాల నుండి సేకరించిన భూమి తిరిగి విశ్వవిద్యాలయానికి కేటాయించటం సమంజసం. ఈ విషయంలో ప్రభుత్వం వెనుకకు తగ్గటం అంటే ప్రభుత్వం ఓడిపోయినట్టు కాదు ప్రజా ప్రభుత్వం ప్రజాభిప్రాయానికి విలువ ఇచ్చి తననిర్ణయాన్ని పునఃసమీక్ష చేసుకున్నట్లుగానే భావించాలి. గతప్రభుత్వం డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల నిర్మాణానికి ఉస్మానియా విశ్వవిద్యాలయ భూములను వాడుకోవాలని భావించినప్పుడు విద్యార్థుల నుండి వచ్చిన వ్యతిరేకతతో ప్రభుత్వం తన ఆలోచనను విరమించుకున్న విషయాన్ని గమనించాలి. కాకతీయ విశ్వవిద్యాలయంతో పాటు రాష్ట్రంలోని అనేక విశ్వవిద్యాలయాల భూములు అన్యాక్రాంతమవుతున్నాయి కాబట్టి విశ్వవిద్యాలయాల భూములను కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వాలదే. విశ్వవిద్యాలయాలు విద్యా కేంద్రాలుగా మాత్రమే కాదు అవి ప్రకృతి వనరులు, పర్యావరణ పరిరక్షణ కేంద్రాలుగా ప్రభుత్వాలు గుర్తించాలి. 400 ఎకరాల భూమికి సంబంధించిన వివాదాన్ని సృష్టించింది విశ్వవిద్యాలయం కాదు,విద్యార్థులు కాదు అలాగే పర్యావరణాన్ని రక్షించేవిధంగా అభివృద్ధి జరగాలని రాహుల్ గాంధీ ఆలోచన కాబట్టి అందరికీ ఆమోదయోగ్యమైన పరిష్కారాన్ని సూచించవలసిన బాధ్యత కూడా రాష్ట్ర ప్రభుత్వానిదే.ప్రైవేటు విద్యాసంస్థలకు దీటుగాప్రభుత్వ విశ్వవిద్యాలయాలను తీర్చిదిద్ది బడ్జెట్ నిధులను కేటాయించి క్రమం తప్పకుండా బోధనా సిబ్బందిని నియమించి మౌలిక వసతులను కల్పించి విద్యా ప్రమాణాలను పెంచి విశ్వవిద్యాలయాలను కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వాల పైనే ఉన్నది. ఆ విధంగా ప్రభుత్వాలు ఆలోచన చేసి ప్రభుత్వ విశ్వవిద్యాలయాలను కాపాడుతాయని ఆశిద్దాం.

# జలకాలుష్యంతో మానవాళికి ముప్పు

డాక్టర్. పి.ఎస్. చారి

నదులు పర్యావరణ వ్యవస్థకు కీలకమైనవని. అవి వరద నియంత్రణ, వాతావరణ మార్పు, జీవ వైవిధ్యానికి కూడా సహాయపడతాయి. కానీ ప్రపంచ వ్యాప్తంగా నదులు ప్రమాదంలో ఉన్నాయి. వాతావరణమార్పు, బాధ్యతారహిత అభివృద్ధి ప్రాజెక్టుల వల్ల అవి మరింతగా విచ్ఛిన్నం, కలుషితమవుతూ బలహీనపడుతున్నాయి. నదులు ప్రమాదంలో ఉన్నప్పుడు, మన సమిష్టి భవిష్యత్తు కూడా అంతే ప్రమాదంలో ఉంది. ఆరోగ్యకరమైన నదులు, పరిశుభ్రమైన నీటిని పొందడం మనందరినీ కలిపే ప్రాథమిక మానవ హక్కులు. మంచినీటి జాతులు 1970నుండి 83 శాతం క్షీణతను చూశాయి. ఇది భూసంబంధమైన లేదా సముద్ర వాతావరణాలలో అనుభవించిన క్షీణత రేటు కంటే రెండింతలు. ప్రపంచవ్యాప్తంగా నదుల క్షీణత, కాలుష్యం ఒక ముఖ్యమైన పర్యావరణ సమస్య. ఇది ప్రధానంగా పారిశ్రామికవ్యర్థాలు, శుద్ధిచేయని మురుగునీరు, వ్యవసాయ ప్రవాహం,ప్లాస్టిక్ వ్యర్థాలు, పట్టణీకరణ, అటవీ నిర్మూలన, తగ్గిన నీటివడపోత పెరిగినకోత, వాతావరణ మార్పు మొదలైన కారణాల వల్ల సంభవిస్తుంది. గంగా, యమునా సిటారమ్, యాంగ్జీ మతం జారియాచులో నది వంటి ప్రధాన నదులు ప్రపంచవ్యాప్తంగా అత్యంత కలుషితమైనవిగా పరిగణించబడుతున్నాయి. ఇవి తరచుగా కలుషితమైన నీటి వనరుల కారణంగా జీవవైవిధ్యం కోల్పోవడం, నీటి ద్వారా సంక్రమించే వ్యాధులు, పర్యావరణ అంతరాయం, జలజీవులు మానవ ఆరోగ్యంపై ప్రభావం చూపుతాయి. వాతావరణ మార్పు, భూ వినియోగం వల్లప్రపంచవ్యాప్తంగా 402 బేసిన్లలో నదీ ప్రవాహం తగ్గింది. ఇది2000 సంవత్సరం నుండి ఐదురెట్లు పెరుగుదల.పరిశోధకులు 89 దేశాలలో 75,000 కంటే ఎక్కువ నీటివనరులను సర్వేచేశారు. 40శాతానికిపైగా తీవ్రంగా కలుషితమైందని కనుగొన్నారు. ఒక నివేదిక ప్రకారం 90దేశాలు,ముఖ్యంగా ఆఫ్రికా,మధ్య, ఆగ్నేయాసియాలో నదీ క్షీణతను ఎదుర్కొంటున్నాయి. 2030నాటికి మానవాళిలో సగానికిపైగా కరువు, వరదలు, మురుగు నీటికాలుష్యం, తగినంత నీటినాణ్యత లేని దేశాలలో నివసిస్తారు. 47 దేశాలు అంతర్జల వనరుల నిర్వహణనిపూర్తిగా చేరుకున్నాయి. 63దేశాలు అంతర్జల వనరుల నిర్వహణ అమలును వేగవంతం చేయాలి. అయితే 73 దేశాలు అంతర్జల వనరుల నిర్వహణ కోసం పరిమిత సామర్థ్యాన్ని మాత్రమే కలిగి ఉన్నాయి. ప్రస్తుత పురోగతి రేటు ప్రకారం, ప్రపంచం 2049 నాటికి స్థిరమైన నీటి నిర్వహణను సాధిస్తుంది. దీనిఅర్థం 2030 నాటికి 100 కంటే ఎక్కువ దేశాలలో కనీసం 3.3 బిలియన్ల మంది ప్రజలు నీటి డిమాండ్లను సమతుల్యం చేయడానికి అసమర్థమైన పాలనను కలిగిఉండే అవకాశం ఉంది.భారతదేశంలో నదీకాలుష్యం నిర్వహణ భారతదేశంలో కూడా నదీ క్షీణత కాలుష్యం ఒకముఖ్యమైన పర్యావరణ సమస్య. ప్రధానంగా శుద్ధిచేయని మురుగునీరు, పారిశ్రామిక వ్యర్థాలు, వ్యవసాయ వ్యర్థాలు సరికాని వ్యర్థాలను పారవేయడం వల్ల ఇది సంభవిస్తుంది. దీనివలన కలుషితమైన నీరు మానవ వినియోగానికి పనికిరాకుండాపోతుంది. గంగా యమునా వంటి ప్రధాన నదులలో జలచరాలకు హాని కలిగిస్తుంది. 60శాతం కంటే ఎక్కువ మురుగునీరు నేరుగా నదులలోకి విడుదలవుతుంది. ఇదిదేశవ్యాప్తంగా తీవ్రమైన కాలుష్య సమస్యలకు దోహదం చేస్తుంది. భారతదేశంలోని ప్రధాన నగరాలురోజుకు 38,354 మిలియన్లీటర్ల మురుగు నీటిని ఉత్పత్తి చేస్తాయి. కానీ పట్టణ మురుగు నీటిశుద్ధి సామర్థ్యం 11,786మాత్రమే. భారతదేశంలో సగటు వార్షిక వర్షపాతం దాదాపు 4000 బిలియన్ క్యూబిక్ మీటర్లు అయినప్పటికీ, మౌలిక సదుపాయాలు లేకపోవడం వల్ల దాదాపు 1122 బిలియన్ క్యూబిక్ మీటర్ల నీటివనరులు మాత్రమే వినియోగానికి అందుబాటులో ఉన్నాయి.కాలుష్యం నీటి నాణ్యతను క్షీణింపజేస్తుంది. కాబట్టి ఈనీటిలో ఎక్కువభాగం సురక్షితం కాదు. నీటికాలుష్యం భారతీయ వినియోగదారులకు, దాని పరిశ్రమకు వ్యవసాయానికి అందుబాటులోఉన్న నీటి మొత్తాన్ని తీవ్రంగా పరిమితం చేస్తుంది. భారతదేశంలో నదీ నిర్వహణను ప్రధానంగా జలశక్తి మంత్రిత్వశాఖ పర్యవేక్షిస్తుంది.ప్రధానంగా భారతదేశంలో అత్యంత కలుషితమైన నదులలో ఒకటైన గంగాను శుభ్రపరచడం, పునరుజ్జీవింప జేయడం లక్ష్యంగా పెట్టుకుంది. ఐక్యరాజసమితి జనరల్ అసెంబ్లీ 2021-2030ని పర్యావరణ వ్యవస్థ పునరుద్ధరణ దశాబ్దంగా ప్రకటించింది.

# భారీ దిగుమతులతో నష్టాల్లో కోకో రైతులు

కె. శ్రీనివాస్

ఆంధ్రప్రదేశ్‌లో 75 వేల ఎకరాలలో కోకో తోటల సాగు ఉంది. ఏలూరుజిల్లాతో పాటు తూర్పుగోదావరి,పశ్చిమ గోదావరి, కోనసీమ, కాకినాడ, అనకాపల్లి, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల్లో కొబ్బరి, ఆయిల్ పామ్ తోటల్లో కోకో అంతర పంటగా ఉంది. ప్రపంచ కోకో ఉత్పత్తిలో మన దేశం ప్రపంచంలో 20దేశాల్లో 20వ స్థానంలోఉంది. మన దేశ అవసరాలకు తగిన విధంగా ఇక్కడ ఉత్పత్తి లేదు. 80 శాతం కోకోను ఇతర దేశాల నుండి మన దేశం దిగుమతి చేసుకుంటున్నది. ప్రపంచ కోకోఉత్పత్తిలో 70శాతం ఘనా, ఐవరీ కోస్ట్, నైజీరియా, కామెరూన్ వంటి పశ్చిమ ఆఫ్రికా దేశాలదే. ఘనా, ఇండోనేషియా దేశాల నుండి మనం అత్యధికంగా కోకోను దిగుమతి చేసుకుంటున్నాం. కోకోను చాక్లెట్లు, కేకులు, వివిధ ఆహార పదార్థాల తయారీలో ఉపయోగిస్తున్నారు. మనం ఉత్పత్తి చేసిన కోకో గింజలను కంపెనీలు కొనుగోలు చేస్తున్నాయి. మన రాష్ట్రంలో మోండలీజ్ (క్యాడ్బరీ) ప్రధాన కొనుగోలు కంపెనీగాఉంది. అంతర్జాతీయ మార్కెట్ ప్రకారం ధర ఇస్తున్నామని కంపెనీలు చెబుతున్నాయి. గత సంవత్సరం కంపెనీలు పోటీపడి అంతర్జాతీయ మార్కెట్ ధరకు అనుగుణంగా కిలో గింజలను రూ.1040/ వరకు కొనుగోలు చేశారు. గత సంవత్సరం రైతుకు కిలో కోకో గింజలకు సరాసరి ధర రూ.749లు వచ్చింది. రాష్ట్రంలో 1992 నుండి కోకోతోటల సాగు ఉన్నా ఈవిధంగా ధర వచ్చిన సందర్భాలు లేవు. ఎన్నో కష్టనష్టాలకు గురై రైతులు కోకో గింజలు ఉత్పత్తి చేస్తున్నారు. ఈ సంవత్సరం కంపెనీలు సిండికేట్‌గా మారి అంతర్జాతీయ ధర ఇవ్వడం లేదు. పైగా అన్ సీజన్ (వర్షాకాలపు) గింజలు కొనుగోలు చేయడం లేదు. సీజన్ కోకో గింజలు ధర రోజురోజుకీ తగ్గించి వేస్తున్నారు. కంపెనీలు ఆడించే ఆట పాడించే పాటగా ఉంది. మార్చి 6న ఏలూరు కలెక్టరేట్ ముందు వందలాది మంది కోకో రైతులు మహాధర్నా నిర్వహించారు. గుంటూరులోని ఉద్యానశాఖ కమీషనర్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించి వినతి పత్రాలు అందజేశారు. అంతర్జాతీయ మార్కెట్ ప్రకారం ధర ఇచ్చి కోకో గింజలు కొనుగోలు చేయాలని, పాత గింజలు వెంటనే కొనాలని, కంపెనీలు రైతులను పెడుతున్న ఇబ్బందులను తదితర సమస్యలను తక్షణం పరిష్కరించాలని కోకో రైతులు కోరినా కంపెనీలు కనీసంగా పట్టించుకోలేదు.కోకో రైతులు సంఘటితంగా లేకపోవడం వలన కంపెనీలు సిండికేట్‌గా మారిఇబ్బంది పెడుతున్నాయి. కంపెనీలు రైతులను ఇబ్బందులు పెట్టే ధోరణితోనే ఉన్నాయి. పాత గింజల కొనుగోలుపై కంపెనీలు స్పష్టత ఇవ్వడం లేదు. కంపెనీలు మాత్రం అన్ సీజన్ గింజలు కొనలేమని,నాణ్యత లేదని బుకాయిస్తూ రోజురోజుకీ ధర తగ్గించి వేస్తున్నాయి. అధికారులు, ప్రభుత్వం కూడా కంపెనీలు కొనాలని గట్టిగా చెప్పే పరిస్థితి కనిపించడం లేదు. ఒకవేళ చెప్పినా కంపెనీలు మాత్రం తమ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నాయి. ఇంతకుముందు లేని గ్రేడింగ్ విధానాన్ని ముందుకు తీసుకువచ్చారు. నాణ్యతాప్రమాణాలు గురించి మాట్లాడుతున్నారు. కంపెనీలు కొత్త గింజలు కొంటామని పాత గింజలు కొనలేమని చెప్పడం అన్యాయం. కొత్త గింజలు రూ.650 నుండి రూ.600 లకు ఇప్పుడు రూ. 550 లకు, రూ.500లకు ధర తగ్గించారు. ఈ ధర మరింత తగ్గిస్తామని కంపెనీలు రైతులను బెదిరిస్తున్నాయి. అన్ సీజన్ గింజలను రూ.200 నుండి రూ.240 లకు కొనుగోలు చేస్తున్నారు. అయితే ఈ



కొనుగోలు కూడా నామ మాత్రమే. కోకో పంటను అత్యధికంగా సాగుచేస్తున్న ఏలూరు జిల్లాలోని ఒక్క పెదవేగి మండలంలోనే 500 టన్నుల వరకు అన్ సీజన్ (పాత గింజలు) రైతుల వద్ద నిల్వ ఉన్నాయి. మొత్తంగా 2 వేల టన్నుల వరకు పాత కోకోగింజలు రైతులు వద్దనే ఉండిపోయాయి. అన్ సీజన్, సీజన్ గింజలకు కొద్ది తేడా ఉన్నా ఇప్పటివరకు కంపెనీలు అవేమీ పట్టించుకోకుండా కొద్ది తేడాతో కొనుగోలు చేశాయి. ప్రస్తుతం పాత గింజలు కొనుగోలు చేయడం లేదు. అక్కడక్కడ కొనుగోలు చేసినా చాలా తక్కువ ధర ఇస్తున్నాయి. రైతులు గత్యంతరం లేక అమ్ముకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. రైతుల వద్దనున్న గింజలు కొనుగోలు చేయకుండా వివిధ కంపెనీల ప్రతినిధులు, గింజల కొనుగోలుదారులు ఫోన్లు కూడా ఎత్తడం లేదు. ఇంటింటికి వచ్చి రైతులను బ్రతిమలాడి కోకో గింజలు కొనుగోలు చేసిన ట్రేడర్లు, కంపెనీల ప్రతినిధులు మొఖం చాటేస్తున్నారు.పైగా నిల్వ ఉంచిన గింజలను 'పచ్చళ్లు పట్టుకోండి' అంటూ రైతులను ఎగతాళి చేస్తూ అవమానిస్తున్నారు. సాగు ఖర్చులు విపరీతంగా పెరిగిపోయాయి. ఇటీవల ఎరువులు, పురుగు మందులు ధరలు, కూలీ ఖర్చులు పెరిగాయి.కోకో గింజలు ధర పెరిగిన తర్వాత కౌలురేట్లు పెరిగాయి. ప్రస్తుతంఎకరా కోకో తోటలకు రూ.లక్ష నుండిరూ.లక్ష 50వేల వరకు కౌలు ఉంది.ఎకరాకు ఎరువులు,పురుగు మందులు, కూలీఖర్చులు రూ.60వేల వరకు ఖర్చు అవుతున్నాయి. ప్రస్తుతం కౌలు రైతులు దిక్కుతోచని స్థితిలో అల్లాడుతున్నా రు. అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారు.కంపెనీలు సిండి కేట్‌గా మారి రైతులను అన్ని రకాలుగా ఇబ్బందులకు గురి చేస్తున్నాయి. ప్రభుత్వం తగినంతగా జోక్యం చేసుకోకపోతే కోకో రైతులు తీవ్రసంక్షోభంలో కూరుకుపోతారు. కోకో గింజలకు అంతర్జాతీయ మార్కెట్ ప్రకారం కంపెనీలు రైతుకు తగిన ధర ఇవ్వడంలేదు. కాబట్టి వ్యత్యాసపు ధరప్రభుత్వం చెల్లించే విధంగా రైతును ఆదుకునే విధంగాచర్యలు చేపట్టాలి. మన దేశ అవసరాలకు లక్షా20వేల టన్నుల అవసరం కాగాఇక్కడ దేశీయంగా ఉత్పత్తి జరుగుతున్నది 35 వేల టన్నులు మాత్రమే. మిగిలిన కోకోను దిగుమతి చేసుకుంటున్నాము. కోకో గింజల కంటే కోకో పొడి, బట్టర్ రూపంలో అత్యధికంగా దిగుమతులు జరుగుతున్నాయి.కంపెనీలు తమకు కావలసిన కోకోను ఇతర దేశాల నుండి దిగుమతి చేసుకుని ఇక్కడ కోకో రైతులను ఇబ్బందులు గురిచేస్తున్నాయి. ఎగుమతులు దిగుమతులు విధానంవలన కోకో రైతులు నష్టపోతున్నారు. కేంద్ర ప్రభుత్వం వైపు నుండి తగిన జోక్యం లేదు. విదేశీ కోకో గింజల దిగుమతులు నిలుపుదలకు ఎటువంటి చర్యలు చేపట్టడంలేదు. ఫలితంగా దేశీయంగా రైతు నష్టపోవాల్సివస్తోంది. బహుళజాతి కంపెనీల కబంధహస్తాల్లో కోకో రైతు నలిగిపోతున్నాడు. ధర గురించి అడిగితే అధికారులు సప్లై డిమాండ్ సూత్రం చెబుతున్నారు.80శాతం కోకోనుదిగుమతి చేసుకుంటున్న మనదేశంలో సప్లైఉన్నట్లా లేనట్లా?డిమాండ్ ఉన్నది గానీ సప్లైలేదు. మరి ఈ పరిస్థితుల్లో కోకో రైతుకు మెరుగైన ధర రావాల్సిన అవసరంఉంది. ఎందుకు రావడం లేదో సమాధానం లేదు. గత సంవత్సరం ఘనాలో పంట దెబ్బతిని దిగుబడులు లేవు కాబట్టి అంతర్జాతీయంగాకోకోకు డిమాండ్ పెరిగింది. ఈ సంవత్సరం ఆఫ్రికన్ దేశాల్లో దిగుబడులు పెరిగాయి కాబట్టి ధరతగ్గిందని చెప్తున్నారు.అయినా ప్రస్తుతం కిలో కోకో గింజలకు అంతర్జాతీయ మార్కెట్ ధర రూ.700వరకు ఉంది. ఈధర రైతుకు రావడం లేదు.పైగా కంపెనీలు రైతులనుండి గింజలు కొనుగోలు చేయడం లేదు. ఇక్కడ రైతులు సంఘటితంగా లేకపోవడం వలన కంపెనీలు రైతులను నిలువుగా దోచుకుంటున్నాయి.కోకో గింజలకు కేంద్రప్రభుత్వం కనీసం మద్దతుధర ప్రకటించడం లేదు.

## ఇసుక సక్రమంగా సరఫరా అయ్యేలా చర్యలు తీసుకోవాలి

### -అధికారులను ఆదేశించిన జిల్లా కలెక్టర్ ఎస్ నాగలక్ష్మి

**గుంటూరు,ఏప్రిల్ 3,ప్రభాతవార్త :** జిల్లాలో రీచ్‌లలో ఇసుక తవ్వకాలకు సంబంధించి అవసరమైన అనుమతులు,ఇతర ప్రక్రియలు నిర్ణీత సమయంలోపూర్తి చేసి ప్రజావసరాలకు ఇసుక సక్రమంగా సరఫరా అయ్యేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని డీఆర్‌సి సమావేశ మందిరంలో జరిగిన సమావేశంలో కలెక్టర్ నాగలక్ష్మి,జేసి ఏ.భార్గవ్ తేజతో కలిసి పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆమె ఎజెండా అంశాలకు సంబంధించి మాట్లాడుతూ ఇసుక తవ్వకాలకు బోట్స్‌మెన్ సొసైటి కి కేటాయించే రాయపూడి డి-సిల్టేషన్ పాయింట్ పర్యవేక్షణ ఏ శాఖ పరిధిలోకి వస్తుందో రాష్ట్ర మైనింగ్ శాఖ అధికారులను సంప్రదించి తెలుసుకోవాలని అధికారులను సూచించారు.బొమ్మువారిపాలెం, గుండెమెడ శాండ్ రీచ్ నిర్వహించిన పెద్యాల్ ప్రకారం బిడ్‌లు ఆహ్వానించి ఏప్రిల్ 16నాటికి అంతే గత బిడ్డర్లకు కేటాయించేలా చర్యలు తీసుకోవాలన్నారు.ప్రకాశం బ్యారేజ్ వద్ద నదులు ఇసుక నిల్వల కోసం హైడ్రో గ్రాఫిక్ సర్వే కోసం ఈఈ,కెసి కెనాల్ డివిజన్‌కు జిల్లా వాటా కింద రూ.24లక్షలు మంజూరు కు చర్యలు తీసుకోవాలన్నారు.ఇసుక సరఫరా చేసే కేంద్రాల వద్ద పర్యవేక్షణ కోసం సంబంధిత తహశీల్దార్ల ద్వారా రెవెన్యూ ఉద్యోగులను మైనింగ్ అధికారులు నియమించుకోవాలన్నారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి ఖాజావలి,జిల్లా మైన్స్ జియాలజీ అధికారి (ఇన్‌చార్జి) నాగిని,గుంటూరు ఆర్‌టిఓ జీ.ఎస్.ప్రసాద్,జిల్లా భూగర్భ జలవనరుల శాఖ డిడి వందనం,జిల్లా పంచాయతీ అధికారి సాయికుమార్, ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్‌ఈ కళ్యాణ చక్రవర్తి, ఈఈ కెసి డివిజన్ కన్జర్వేటివ్ రవికిరణ్,ఏపి పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఈఈ ఏండీ నజీమా బేగమ్,తహశీల్దార్లు సిద్ధార్థ డి.సీతారామయ్య, సునీత,ఇంజినీరింగ్ అధికారులు పాల్గొన్నారు.



## జిల్లాలో 15 శాతం వృద్ధి రేటు లక్ష్యంగా యాక్షన్ ప్లాన్ : పల్నాడుజిల్లా కలెక్టర్

**నరసరావుపేట, ఏప్రిల్ 3 ప్రభాతవార్త :** పల్నాడు జిల్లాలో 15 శాతం వృద్ధి రేటు లక్ష్యంగా యాక్షన్ ప్లాన్ అమలు చేయనున్నట్లు జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు తెలిపారు. గురువారం విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉద్యాన పంటలు, పశుపోషణ, పర్యాటక రంగాలలో అభివృద్ధి అవకాశాలను అందిపుచ్చు



కుంటామన్నారు. పండ్లు, కూరగాయలు, పూల తోటల విస్తీర్ణం పెరిగితే రైతు కుటుంబాలకు అదనపు ఆదాయం లభిస్తుందన్నారు. పశువుల పెంపకం, పాల ఉత్పత్తి, మాంసం ఉత్పత్తి, చేపల పెంపకాన్ని ప్రోత్సహిస్తామన్నారు. పాడి రంగంలో ఉన్న స్వయం సహాయక సంఘాలకు సహకరిస్తామన్నారు. అదే విధంగా పారిశ్రామిక రంగానికి చేయూతనివ్వడం జరుగుతుందన్నారు. పర్యాటక రంగ అభివృద్ధిలో భాగంగా ప్రతి నియోజకవర్గంలో ఒక కొత్త హోటల్ ఏర్పాటు జరుగుతుందన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు జిల్లా అభివృద్ధికి పూర్తి స్థాయిలో సహకారం అందించేందుకు సానుకూలంగా ఉన్నారని తెలిపారు. సూపర్ స్పెషాలిటీ హాస్పటల్ నిర్మాణానికి త్వరలోనే టెండర్లు పిలుస్తామన్నారు. బర్డ్ ఫ్లూ విషయంలో ఆందోళన చెందవద్దన్నారు. ఉపాధిహామీ పథకంలో పంచ ప్రాధాన్యత కార్యక్రమాలు అమలు చేస్తామన్నారు. పశువులకు నీటి తొట్లు, కాలువలకు పూడికతీత పనులు, ఉపాధికూలీల కనీస వేతనం రూ.300 లు అందేలా చర్యలు ఉంటాయన్నారు. వేసవిలో తగు జాగ్రత్తలు తీసుకోవాలని, త్రాగునీటి సమస్యకు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ పి.అరుణ్‌బాబు తెలిపారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ సూరజ్‌గనోరే, డిఆర్‌ఓ మురళీ, డ్వామా పి.డి. సిద్ధా లింగమూర్తి పాల్గొన్నారు.

## సింగిల్ యూజ్డ్ ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన : విఎంసి కమిషనర్ ధ్యానచంద్ర

**విజయవాడ కార్పొరేషన్,ఏప్రిల్ 3,ప్రభాతవార్త:** సింగిల్ యూజ్డ్ ప్లాస్టిక్ నిషేధంపై విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నామని మున్సిపల్ కమీషనర్ ధ్యానచంద్ర పేర్కొన్నారు. అందులో భాగంగా తుమ్మలపల్లి కళాక్షేత్రంలో నగరం లోని పాఠశాలలకు చెందిన బాలలకు పోటీలను నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రజల్లో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వల్ల కలిగే అనర్థాలను విస్తృతంగా తెలియపర్చేందుకు ఇదివరకే నగరం లోని పాఠశాలలన్నింటిలోను సింగిల్ యూజ్ ప్లాస్టిక్ బాన్ అనే అంశంపై వ్యాసరచన,వక్తృత్వ,చిత్రలేఖనం,ఫాన్సీ డ్రెస్ పోటీలను నిర్వహించారని, అందులో పోటీదారులకు శుక్రవారం మధ్యాహ్నం రెండు గంటల నుండి తుమ్మలపల్లి కళాక్షేత్రంలో ఫైనల్స్ నిర్వహిస్తున్నారని, ఇలా పోటీలు నిర్వహించడం వల్ల పిల్లలకు సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వల్ల కలిగే అనర్థాలు తెలియపరుస్తున్నారని, పర్యావరణ హితమైన వస్తువులు ఏమేమున్నాయి,వాటిని ఎలా వాడవచ్చు,ఎందుకు వాడాలి వంటి విషయాలు చిన్నతనంలోనే వాళ్ళకి తెలుస్తుందని,ఇటువంటి పోటీలు నిర్వహిస్తున్నామని ఆయన తెలిపారు.

# అమరావతి వార్త

## దశాబ్దాల సమస్యను 10నెలల్లో పరిష్కరించా : మంత్రి నారా లోకేష్

**మంగళగిరి,ఏప్రిల్ 3,ప్రభాతవార్త :** గతంలో మంగళగిరిలో జెసిబి పాలన చూశాం, ఎన్ డిఎ అధికారంలోకి వచ్చాక దశాబ్ధాలుగా ప్రభుత్వ భూముల్లో నివసిస్తున్న వారికి ఉచితంగా శాశ్వత పట్టాలు అందించాలని నిర్ణయించాం, ఇచ్చిన మాట ప్రకారం రాష్ట్రంలోని ఈరోజు ఉండవల్లిలో తొలిపట్టాను అందజేశానని రాష్ట్ర విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. మంగళగిరి నియోజకవర్గం ఉండవల్లిలో గత పదిహేనేళ్లుగా కొండవాలు ప్రాంతంలో నివసిస్తున్న రాజమండ్రి గోవిందు కుటుంబానికి మంత్రి లోకేష్ ఇంటికెళ్లి బట్టలు పెట్టి శాశ్వత పట్టాను అందజేశారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ... మంగళగిరిలో పాదయాత్ర నిర్వహించిన సమయంలో ఇక్కడ ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం కీలకమైన హామీ నెరవేర్చాన న్నారు.తొలివిడతగా 3వేలమంది శాశ్వత పట్టాలు అందజేస్తున్నట్టు ప్రకటించారు.





**ఘనవిజయంతో నా బాధ్యత పెరిగింది!**

2019 ఎన్నికల్లో మంగళగిరి నుంచి తొలిసారి పోటీచేసి 5,300 ఓట్లతేడాతో ఓడిపోయాను. మొదటి రోజు బాధపడ్డా, రెండో రోజునుంచి మంగళగిరి ప్రజల మనసు గెలిచేందుకు ప్రయత్నించా. గత అయిదేళ్లుగా సొంత నిధులతో నియోజకవర్గంలో 26 సంక్షేమ కార్యక్రమాలు అమలుచేశామని వివరించారు.ఎన్నికల ప్రచారంలో 50వేల మెజారిటీతో గెలిపించాలని ప్రజలను కోరా. నన్ను గెలిపిస్తే చంద్రబాబు, పవనన్నతో పోరాడి నిధులు తెస్తానని చెప్పా. మంగళగిరి చరిత్రలో ఎన్నడూ లేనివిధంగా రాష్ట్రంలో 3వ అతి పెద్ద మెజారిటీ 91వేలతో నన్ను గెలిపించారు. ఈ ఘనవిజయంతో నాలో కసి, బాధ్యత పెరిగింది.

**3విడతల్లో అందరికీ శాశ్వత ఇళ్ల పట్టాలు :** ఈరోజు ఉండవల్లిలో రాజమండ్రి గోవిందు కుటుంబానికి ఇచ్చిన పట్టా రిజిస్ట్రేషన్ విలువ రూ.9లక్షలు. మార్కెట్ విలువ చాలా ఎక్కువగా ఉంటుంది. గతంలో మాదిరి బుల్డోజర్లతో ఇళ్లు కూల్చడం లేదు. పేదల దశాబ్ధాల కల నెరవేరుస్తున్నాం. అటవీ భూముల్లో నివసించే వారికి ఆయాశాఖలతో మాట్లాడి జాగ్రత్తగా సమస్య పరిష్కరించాల్సి ఉంది. ఇందుకు కొంత సమయం పడుతుంది. మంగళగిరి నియోజకవర్గంలో ప్రభుత్వ భూముల్లో నివసించే ప్రజలకు మూడువిడతలుగా శాశ్వత పట్టాలు ఇవ్వాలని నిర్ణయించాం. ప్రస్తుతం 150 గజాల్లోపు ఉంటున్న 3వేలమందికి పట్టాలు ఇస్తున్నాం. 2వవిడతలో ఎండోమెంట్స్, రైల్వే భూముల్లో నివసించేవారికి ఇస్తాం, 3వవిడత మిగిలిన వారందరికీ పట్టాల అందజేతకు చర్యలు తీసుకుంటాం. కాల్వగట్లపై నివసించే వారికి ప్రత్యామ్నాయం కోసం ఆమోదయోగ్యమైన పరిష్కారాన్ని ఆన్వేషిస్తున్నాం. మంగళగిరితాడేపల్లి కార్పొరేషన్, సిఆర్ డిఎ పరిధిల్లో ఉన్న గ్రామాల్లో మౌలిక సదుపాయాల కోసం వేర్వేరు మోడల్స్ సిద్ధం చేస్తున్నాం. మంగళగిరిలో నాపై ప్రత్యర్థుల విమర్శలను పట్టించుకోవాల్సిన పనిలేదు. 2024 ఎన్నికల్లో నాకు వచ్చిన మెజారిటీ కంటే వారికి వచ్చిన ఓట్లు తక్కువ. కష్టపడి పనిచేసి మంగళగిరి ప్రజల మనసు గెలిచానని మంత్రి లోకేష్ చెప్పారు.

## ఆర్టీసీని ఆధునీకరించి ప్రజలకు చేరువ చేస్తున్న కూటమి ప్రభుత్వం

### -ఏపీ ప్రభుత్వ చీఫ్‌విప్,ఎమ్మెల్యే జీవీ, మాజీ ఎమ్మెల్యే మక్కెన

**వినుకొండ,ఏప్రిల్3,ప్రభాతవార్త:** ఐదేళ్ళ వైకాపా అరాచక పాలనలో పూర్తిగా నిర్వీర్యమైన ఆర్టీసిని తిరిగి బలోపేతం చేసి



ప్రజలకు చేరువ చేయాలనే లక్ష్యంగా సీఎం చంద్రబాబునాయుడు పని చేస్తున్నారని ఏపీ ప్రభుత్వ చీఫ్‌విప్, ఎమ్మెల్యే జీ.వీ ఆంజనేయులు అన్నారు. వినుకొండ ప్రజల సౌకర్యార్థం వినుకొండ డిపో నుంచి విజయవాడకు కొత్త బస్సు సర్వీసులను ఎమ్మెల్యే జీ.వీ ఆంజనేయులు, మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావుతో కలసి గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జీ.వీ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఆర్టిసిలో మంచి సంస్కరణలచేపడుతున్నామన్నారు. స్వల్ప వ్యవధిలోనే వినుకొండ డిపో నుంచి దాదాపు 20 కొత్త బస్సు సర్వీసులు ప్రారంభించామని చెప్పారు. మహిళలకు త్వరలోనే ఉచిత బస్సు ప్రయాణం పథకం ప్రభుత్వం ప్రారంభించనుందన్నారు. వైకాపా పాలనలో డొక్కు బస్సుల్లో ప్రజలు ప్రయాణాలు చేయలేక నరకం చూశారన్నారు. సీఎం చంద్రబాబునాయుడు చేపడుతున్న పాలనా సంస్కరణ ద్వారా ఆర్టిసి మరింత బలోపేతమై అధునాతన బస్సు సర్వీసులు ప్రజలకు చేరువకానున్నాయని ఎమ్మెల్యే జీ.వీ తెలిపారు. నూతన బస్సు సర్వీసులు వినుకొండ ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అలాగే నూతన బస్టాండ్ నిర్మాణానికి రూ. 17 కోట్ల నిధులతో ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని ముఖ్యమంత్రి సహకారంతో త్వరలోనే పనులు చేపడతామని జీ.వీ పేర్కొన్నారు. కార్యక్రమంలో తెదేపా నాయకులు మాజీ ఎమ్మెల్యే మక్కెన, ఆర్ఎం మధు, డిఎం నాగేశ్వరరావు, కూటమి నాయకులు, ఆర్టిసి ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

## నరసరావుపేటకు కేంద్ర వైద్య బృందం రాక

**నరసరావుపేట, ఏప్రిల్ 3 ప్రభాతవార్త :** జిల్లా కేంద్రమైన నరసరావుపేటలో శుక్రవారం కేంద్ర వైద్య బృందం పర్యటించనుంది. దేశ వ్యాప్తంగా సంచలనంగా మారిన బర్డ్ ఫ్లూతో బాలిక మృతిపై ఈ బృందం వివరాలను సేకరించనుంది. ఢిల్లీలోని నేషనల్ సెంటర్ ఫర్ డీసీజ్ కంట్రోల్ నుండి, మంగళవారి ఎయిమ్స్ నుండి వైద్య నిపుణులు నరసరావుపేట పట్టణానికి రానున్నారు. బాలికకు సన్నిహితంగా ఉన్న వారితో పాటు చికెన్ దుకాణదారుల వద్ద నుండి రక్త నామూనాలను వారు సేకరించే అవకాశం ఉంది. అయితే వారిలో ఎవరికి బర్డ్ ఫ్లూ వచ్చింది లేనిది స్థానిక అధికారుల నుండి నివేదిక తీసుకోనున్నారు. కాగా ఇప్పటికే ఇది వ్యాప్తిచెందే వ్యాధి కాదని, ప్రజలు ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబు, వైద్యాధికారులు స్పష్టం చేశారు. చిన్నారికి బర్డ్ ఫ్లూతో పాటు ఇతర అనారోగ్య సమస్యలు ఉన్నట్లు ఉన్నట్లు సమాచారం. బాలిక ఇంటి పరిసర ప్రాంతాల్లో ఎలుకలు ఎక్కువగా ఉండటం వలన వ్యాధి శోకి ఉండవచ్చనే కోణంలోనూ వైద్య బృందం సభ్యులు వివరాలను తీసుకోనున్నారు.

## నగరంలో ఎక్కడైనా డంపింగ్ కుప్పలు ఉంటే అధికారులపై చర్యలు

### -కమిషనర్ పులి శ్రీనివాసులు

**గుంటూరు కార్పొరేషన్,ఏప్రిల్3,ప్రభాతవార్త :** గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో మెరుగైన పారిశుధ్యం కోసం ప్రత్యేకంగా అందుబాటులో ఉంచిన అదనపు కార్మికులు, వాహనాలను సద్వినియోగం చేసుకోవాలని, సోమవారం నుండి నగరంలో ఎక్కడైనా డంపింగ్ కుప్పలు లేదా డెబ్రిస్ ఉంటే సంబందిత శానిటేషన్ కార్యదర్శి, ఇన్స్పెక్టర్లే భాద్యత వహించాల్సి ఉంటుందని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఐఏఎస్ స్పష్టం చేశారు. గురువారం కమిషనర్ జిఎంసి మెయిన్ ఆఫీస్ లో అదనపు కార్మికుల హాజరు, రాజాగారి తోట, కొత్తపేట, కాకుమానువారితోట తదితర ప్రాంతాల్లో పర్యటించి, అభివృద్ధి, పారిశుధ్య పనులను పరిశీలించి సంబందిత అధికారులకు తగు ఆదేశాలు జారీ చేశారు.ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరంలో సమస్యాత్మక ప్రాంతాల్లో స్పెషల్ శానిటేషన్ డ్రైవ్ ని అదనపు కార్మికులు,



వాహనాలని వినియోగించుకొని చేపట్టాలన్నారు. బిన్లు, పుష్ కాట్స్ ఇప్పటికే డివిజన్ల అవసరాల మేర అందించామని, ఇంకా ఎక్కడైనా కావాల్సి ఉంటే వెహికిల్ షెడ్ నుండి తెచ్చుకోవాలని తెలిపారు. సోమవారం నుండి నగరంలో ఎక్కడా డంపింగ్ కుప్పలు ఉండడానికి వీలు లేదన్నారు. ప్రజారోగ్య కార్మికులు కొందరు ఇంకా పలు డివిజన్లలో సూపర్వైజర్ల పేరుతో పారిశుధ్య పనులు చేయకుండా ఉంటున్నారని, అటువంటి వారికి తక్షణం పారిశుధ్య విధులు కేటాయించాలని, లేకుంటే తమ పర్యటనల్లో గుర్తిస్తే ఇన్స్పెక్టర్లపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం కొత్తపేట, కాకుమానువారి తోటల్లో పలు ప్రాంతాల్లో పర్యటించి, స్థానికులతో మాట్లాడుతూ ప్రజలు కూడా తమ ఇళ్లల్లో వ్యర్ధాలను తడిపొడిగా వేరు చేసి ఇవ్వాలన్నారు. వ్యర్ధాలను రోడ్ల మీద, కాల్వల్లో వేసే కమర్షియల్ సంస్థలపై భారీ అపరాధ రుసుం విధించాలని ఇన్స్పెక్టర్లను ఆదేశించారు. రాత్రి సమయంలో టిఫిన్ బండ్లు, ఇతర చిరు వ్యాపారులు రోడ్ల మీద వ్యర్ధాలు వేసి వెళ్తున్నారని, అటువంటి వారిని గుర్తించి, వారిపై చర్యలు తీసుకోవాలన్నారు.పర్యటనలో బయాలజిస్ట్ రామారావు, శానిటరీ ఇన్స్పెక్టర్లు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

## కన్నతల్లినే హత్య చేసిన కొడుకు

**బొల్లాపల్లి,ఏప్రిల్3,ప్రభాతవార్త:** కన్న కొడుకే తల్లిని హత్య చేసిన దారుణ ఘటన మండలంలోని వెల్లటూరు గ్రామంలో గురువారం వెలుగు చూసింది. వినుకొండ రూరల్ సీఐ బి. ప్రభాకర్ తెలిపిన వివరాల మేరకు వెల్లటూరు గ్రామానికి చెందిన చిన్న నరసయ్య, సోమమ్మ (65) దంపతులకు ఐదుగురు సంతానం. కాగా వీరిలో చిన్న కుమారుడు బాదరయ్యకి ఇంకా వివాహం కాలేదు, తల్లిదండ్రులు వద్దే ఉంటున్నాడు. అయితే తల్లి సోమమ్మకు మతిస్థిమితం సరిగా లేకపోవడం వల్లే తనకు వివాహం కుదరడం లేదని భావించిన కొడుకు బాదరయ్య విసుగు చెంది తల్లితో గొడవ పెట్టుకొని తీవ్రంగా కొట్టడం వల్ల ప్రాణాలు కోల్పోవడం జరిగిందని తెలిపారు. నిందితుడు పరారిలో ఉన్నట్లు పేర్కొన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.

## సిఎం పర్యటన భద్రత ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టరు,సిపి

**విజయవాడ క్రైం,ఏప్రిల్ 3,ప్రభాతవార్త:** ఈ నెల 5వ తేదీన చందర్లపాడు మండలం ముప్పాళ్ళ గ్రామంలో బాబు జగజ్జీవన్‌రావు జయంతి వేడుకలలో పాల్గొనడానికి సి ఎం, మంత్రులు, వివిఐపి లు, విఐపి లు, ప్రజాలు పాల్గొననున్న నేపథ్యంలో ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమీషనర్ రాజశేఖరబాబు, జిల్లా కలెక్టర్ లక్ష్మీషాలు ఇతర శాఖల అధికారులతో కలిసి చందర్లపాడు ముప్పాళ్ళ గ్రామం లోని సభా వేదిక,హెలిపాడ్ ప్రదేశం,పరిసర ప్రాంతాలను పరిశీలించి,బందోబస్తు ఏర్పాట్లపై సిబ్బందికి తగు సూచనలందించారు. ఈ సందర్భంగా సిపి రాజశేఖరబాబు మాట్లాడుతూ ముప్పాళ్ళ గ్రామ పరిసర ప్రాంతాలోల సంబంధిత శాఖల అధికారులతో సమన్వయం చేసుకొని కట్టుదిట్టమైన భద్రత,పటిష్టమైన బందోబస్తు ఏర్పాట్లను చేయాలని ఆదేశించారు. పార్కింగ్ ప్రదేశాలు,గ్రామ పరిసర ప్రాంతాల్లో ట్రాఫిక్ అంతరాయం కల్గకుండా ఏర్పాట్లు



చేయాలని ఆదేశించారు. అనంతరం నందిగామ సబ్ డివిజన్ కార్యాలయంలో పోలీసు అధికారులతో కలిసి సమావేశం నిర్వహించారు. సిఎం పర్యటన సందర్భంగా హెలిపాట్,సభాస్థలం పరిసర ప్రాంతాలలో భద్రతాపరంగా ఎటువంటి చిన్న లోపాలు లేకుండా కట్టుదిట్లమైన భద్రతా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరుగకుండా అన్ని శాఖల అధికారుల సమన్వయంతో అప్రత్తంగా ఉండాలని, ఇతర ప్రయాణీకులకు వారి ప్రయాణంలో ఎటువంటి ఇబ్బందులు లేకుండా అవసరమైన ఇతర మార్గాలను నిర్ధేశించే విధంగా వాహనాల రద్దీ ఏర్పడకుండా పటిష్ట బందోబస్థు ఏర్పాట్ల గురించి అధికారులకు పలు సలహాల నిచ్చారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ లక్ష్మీషా,డిసిపిలు కె.ఎం మహేశ్వరరాజు, కృష్ణమూర్తి నాయుడు, ఎస్‌విడి ప్రసాద్,ట్రైనీ ఐపిఎస్ మనీషా, ఏడిసిపిలు గున్నం రామకృష్ణ,ఏవిఎల్ ప్రసన్నకుమార్, నందిగామ ఏసిపి ఎబిజి తిలక్,ఇతర ఏసిపిలు,ఇతర శాఖల అధికారులు,సిబ్బంది పాల్గొన్నారు.

## 5న తిరువూరు నుండి భద్రాచలానికి ప్రత్యేక బస్సులు

**ఎ కొండూరు, ఏప్రిల్ 3, ప్రభాతవార్త :** శ్రీ సీతారాముల కళ్యాణం శ్రీరామనవమి పండుగ సందర్భంగా ఈ నెల 5 నుండి ఎన్‌టిఆర్ జిల్లా తిరువూరు ఎపిఎస్‌ఆర్‌టిసి డిపో నుండి టిఎస్ స్టేట్‌లోని భద్రాచలం దేవస్థానానికి 10 ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు డిపో మేనేజర్ ఎ సుబ్రహ్మణ్యం గురువారం మీడియాకు తెలిపారు. ప్రయాణీకుల రద్దీని బట్టి అధనంగా బస్సులు నడుపుతామని ప్రతి అరగంటకు తిరువూరు బస్టాండ్ నండి భద్రాచలానికి నడుపుతామని ఆయన తెలిపారు. సీతారాముల కళ్యాణం అనంతరం 6న ఆదివారం తిరువూరు ప్రయాణంలో భద్రాచలంలోని జూనియర్ కళాశాల గ్రౌండ్ నుండి బస్సులు బయలుదేరి తిరువూరు మీదుగా విజయవాడకు చేరుకుంటారని ఇదే కాకుండా విజయవాడ నుండి తిరువూరు మీదుగా భద్రాచలంకు ప్రతే ్యక బస్సులు నడుపుతున్నట్లు డిఎం తెలిపారు. సాధారణ చార్జీలతోనే బస్సులు నడుపుతామని మరింత సమాచారం కొరకు 73824 87969 నెంబర్‌ను సంప్రదించాలని డిఎం సుబ్రహ్మణ్యం తెలిపారు.

## లబ్దిదారులకు అవగాహన కల్పించిన అధికారులు

**పెదకూరపాడు, ఏప్రిల్ 3 ప్రభాతవార్త :** మండలంలోని లింగంగుంట్ల గ్రామంలో జిల్లా హౌసింగ్ అధికారి వేణుగోపాల్ మండలంలో పర్యటించారు. లింగంగుంట్ల గ్రామంలో వివిధ దశల్లో ఉన్న నిర్మాణాలను పరిశీలించారు. ప్రత్యేకంగా హౌసింగ్ లబ్ది దారులతో మాట్లాడారు. ఇళ్ళ నిర్మాణానికి సంబంధించి ప్రభుత్వం ఇచ్చే ప్రోత్సాహకాలను తెలియజేశారు. లబ్దిదారులం దరూ ప్రభుత్వ ప్రోత్సాహకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంల ో అధికారులు వి.శ్రీనివాసరెడ్డి, చంద్రశేఖర్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## ఘనంగా శ్రీమద్విరాట్ పోతులూరి వీర బ్రహ్మంగారి తిరునాళ్ళ

**కర్లపాలెం,ఏప్రిల్03,ప్రభాతవార్త:** కర్లపాలెం మండలం యాత్రావారిపాలెం గ్రామంలో గురువారం శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి తిరునాళ్ళ ఎంతో ఘనంగా జరిగింది. పరిసర ప్రాంతాల నుంచి అనేకమంది భక్తులు ఈ తిరుణాలలో స్వామివారికి మొక్కులు తీర్చుకున్నారు. స్థానిక శాసనసభ్యులు నరేంద్ర వర్మ రాజు, మాజీ శాసనసభ్యులు టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు చీరాల గోవర్ధన్ రెడ్డి ఈ తిరునాళ్లకు హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎస్సై రవీంద్ర ఆధ్వర్యంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. భక్తులు ఈ తిరునాళ్ళలో పాల్గొని స్వామివారికి ప్రత్యేకమైన మొక్కలు చెల్లించుకున్నారు. పరిసర గ్రామాలైన కొత్త నందాయపాలెం, పాత నందాయపాలెం, కర్లపాలెం నల్లమోతు వారి పాలెం, బుద్దాం,తదితర గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తిరునాళ్లలో పాల్గొన్నారు.గ్రామ సర్పంచ్ చీరాల శ్రీనివాసరెడ్డి మాజీ సర్పంచ్ చీరాల సత్యనారాయణ రెడ్డి, గ్రామస్తులు తిరునాళ్లకు అన్ని ఏర్పాట్లు చేశారు.



## చలివేంద్రాలను ప్రారంభించిన ఎమ్మెల్యే కన్నా

**సత్తెనపల్లి, ఏప్రిల్ 3 ప్రభాతవార్త :** పట్టణంలోని తాలూకా సెంటర్‌లో చలివేంద్రాన్ని ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ గురువారం ప్రారంభించారు. పురపాలక సంఘం, కోర్టు ఆవరణ, ట్యాక్సీ స్టాండ్ ప్రాంతాలలో కన్నా రంగయ్య ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలు జరిగాయి. వివిధ హోదాలలో ఉన్న రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ, పట్టణ నాయకులు పాల్గొన్నారు. ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ వేసవికాలంలో చలివేంద్రాల ఏర్పాటు సంతోషమన్నారు. పట్టణానికి వందలాది మంది వివిధ పనుల నిమిత్తం ప్రతి రోజూ వస్తుంటారని, వారికి త్రాగునీటిని ఏర్పాటు చేయడం మంచి సేవా కార్యక్రమం అని తెలిపారు. వేసవి కాలంలో ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని తెలియజేశారు.



## అందరికీ నష్టపరిహారం అందిస్తాం

### -గుంటూరు తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే మొహమ్మద్ నసీర్ అహ్మద్

- -పారదర్శకంగా శారదా కాలనీ రోడ్డు విస్తరణ పనులు.
- -33 అడుగుల నుంచి 66 అడుగుల మేర విస్తరణకు చర్యలు
- -విస్తరణ అనంతరం వెంటనే టిడిఆర్ బాండ్లు ఇస్తాం.
- -ఇళ్లు, దుకాణాలు కోల్పోతున్న వారితో ఎమ్మెల్యే నసీర్.

**గుంటూరుతూర్పు,ఏప్రిల్3,ప్రభాతవార్త:** బొంగారాల బీడు నుండి వసంతరాయపురం మీదుగా శారదా కాలనీ వరకు మాస్టర్ ప్లాన్ ప్రకారం రోడ్డును 60 అడుగులుగా విస్తరించాల్సిన అవరం ఎంతైనా ఉందని, దానికి స్థానిక ప్రజలు సహకరించాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఐ.ఎ.యస్ కోరారు. గురువారం



గుంటూరు తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే మొహమ్మద్ నసీర్ అహ్మద్ తో కలిసి కౌన్సిల్ సమావేశ మందిరం నందు బొంగారాలబీడు రహదారి విస్తరణకు సంబంధించి గృహాలు, స్తలాలు కోల్పోతున్న స్థానిక ప్రజలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, నూతన ప్రభుత్వం ఏర్పడిన అనంతరం గుంటూరు నగరంలో పెండింగ్ లో ఉండి నిర్వహించాల్సిన అభివృద్ధి పనులు స్థానిక ప్రజాప్రతినిధుల సహకారంతో వేగవంతంగా జరుగుతున్నాయన్నారు. త్వరలో శంకర్ విలాస్ ఆర్.ఓ.బి పనులు ప్రారంభం కానున్నాయన్నారు. బొంగరాలబీడు నుండి వసంతరయపురం మీదుగా శారదా కాలనీ వరకు మాస్టర్ ప్లాన్ ప్రకారం 60 అడుగుల రోడ్డుగా విస్తరించాల్సిన అవసరం ఉందన్నారు. రోడ్డు విస్తరణ వలన ఈ ప్రాంతంలో 201 ఆస్తులు ఎఫెక్ట్ అవుతున్నాయని, వాటిలో 158 ప్రైవేట్ ఆస్తులు, 2 జియంసి ఆస్తులు, 4 ఖాళీ స్తలాలు, 2 స్వాధీన అగ్రిమెంట్లు, 7 మతపరమైనవి, 3 బి ఫార్మ్స్, 25 ఎ.ఈ.యల్.సి ఆస్తులు ఉన్నాయన్నారు. వీటికి సంబంధించిన డాక్యుమెంట్స్ నగర పాలక సంస్థ అధికారులకు అందజేసినట్లైతే, స్ట్రక్చరల్ నష్టపరిహారం క్యాలిక్యులేషణ్ చేస్తామన్నారు. అంతేకాక నష్టపరిహారాన్ని వెంటనే అందజేయుట జరుగుతుందని, టి.డి.ఆర్ బండ్లను కూడా వీలైనంత త్వరగా అందేలా చర్యలు తీసుకుంటామన్నారు. రోడ్డు విస్తరణకు స్థానిక ప్రజలు సహాయ సహకారాలు అందించాలని, విస్తరణకు సంబంధించి స్థానిక ప్రజలకు ఏమైనా సందేహాలుంటే టౌన్ ప్లానింగ్ అధికారుల దృష్టికి తీసుకు రావాలన్నారు.ఈ సందర్భంగా గుంటూరు తూర్పు ఎమ్మెల్యే మొహమ్మద్ నసీర్ అహ్మద్ మాట్లాడుతూ, గుంటూరు నగరంలో నిర్వహించాల్సిన కొన్ని అభివృద్ధి పనులు గత కొన్ని సంవత్సరాలుగా పెండింగ్ లో ఉన్నాయని, ప్రస్తుతం తమ ప్రభుత్వం వచ్చాక అభివృద్ధి పనులు వేగవంతంగా నిర్వహిస్తుందన్నారు. ముఖ్యంగా కేంద్ర మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ చొరవతో శంకర్ విలాస్ ఆర్.ఓ.బి, ఇన్నర్ రింగ్ రోడ్డు ఆర్.ఓ.బి, శ్యామల నగర్ ఆర్.ఓ.బి, పేరేచర్ల ఓవర్ బ్రిడ్జ్, నందివెలుగు రోడ్డులో అసంపూర్తిగా నిర్మించిన ఓవర్ బ్రిడ్జ్ పనులు పూర్తి చేయుటకు కేంద్ర ప్రభుత్వం నుండి అనుమతులు, నిధులు మంజూరు చేయించారన్నారు. డొంక రోడ్డు నుండి బొంగరాలబీడు, వసంతరాయపురం ప్రధాన రహదారిని శారద కాలనీ వరకు మాస్టర్ ప్లాన్ ప్రకారం 60 అడుగులుగా విస్తరించాల్సిన అవసరం ఉందన్నారు. శంకర్ విలాస్ ఆర్.ఓ.బి పనులు ప్రారంభమైతే నగరంలో గుంటూరు ఈస్ట్ నుండి వెస్ట్ కు రాకపోకలు కస్తామోతాయని, దాని ప్రభావం ప్రజల పై పడకుండా మిగిలిన రోడ్ల విస్తరించినట్లైతే ట్రాఫిక్ రద్దీ తగ్గే అవకాశం ఉందన్నారు. భవిష్యత్ లో గుంటూరు నగరంలో ఎన్నో ప్రాజెక్ట్ లు రానున్నాయని, ప్రజల సౌకర్యార్థం గుంటూరు నగరంలో ఎలక్ట్రిక్ బస్సులు తిరుగుతాయని, అందుకు తగ్గట్టుగా రోడ్లను అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం సదరు రోడ్డు విస్తరణ కు సంబంధించి ఆయా ప్రాంతాలకు చెందిన ప్రజల సలహాలు, సూచనలు, అభ్యంతరాలను కమిషనర్‌కి ఎమ్మెల్యే దృష్టికి తీసుకురావాలన్నారు.సదరు సమావేశంలో సిటీ ప్లానర్ రాంబాబు, యస్.ఈ నాగ మల్లేశ్వర రావు, సి.యం.ఓ.హెచ్ డాక్టర్ అమృతం, డి.సి.పి సూరజ్, ఎ.సి.పిలు, టి.పి.యస్ లు, ఆయా ప్రాంతాల ప్రజలు పాల్గొన్నారు.

# ప్రతి ఒక్కరూ ఇళ్లకు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి : బాపట్లజిల్లా ఎస్పీ

**-వేసవి సెలవులలో దొంగలు తాళం వేసిన ఇళ్లను లక్ష్యంగా చేసుకొని దొంగతనాలు**

**-పోలీసులకు సమాచారం ఇస్తే ఆ ఇంటిపై నిరంతర నిఘా**


**బాపట్ల,ఏప్రిల్03,ప్రభాతవార్త:** తాత్కాలికంగా ఇంటికి తాళాలు వేసి విహార యాత్రలు, తీర్థయాత్రలకు ఇతర ప్రాంతాలకు వెళ్లేవారు స్థానిక పోలీస్ స్టేషన్‌లలో సమాచారం ఇచ్చి వెళ్లాలని ఎస్పీ తుషార్ డూడి అన్నారు.



గురువారం స్థానిక జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వేసవి సెలవులను ఆసరాగా చేసుకొని తాళం వేసిన ఇళ్లలో జరిగే దొంగతనాలను అరికట్టేందుకు ప్రజలు పోలీస్ శాఖకు సహకరించాలన్నారు. వేసవి సెలవుల్లో ఇంటికి తాళాలు వేసి విహార యాత్రలు, తీర్థయాత్రలకు వెళ్లేవారు స్థానిక పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఆయన సూచించారు. సమాచారం ఇవ్వడం వల్ల ఆ ఇంటిపై నిరంతర పోలీస్ నిఘాను ఉంచడానికి అవకాశం ఉంటుందన్నారు. ఆ ప్రాంతాల్లో పెట్రోలింగ్‌ను సమర్థవంతంగా నిర్వహిస్తూ నిఘాను పటిష్టం చేస్తామన్నారు. దొంగలు తాళం వేసి ఉన్న ఇళ్లను ఎంచుకుని ఎక్కువగా దొంగతనాలకు పాల్పడే అవకాశం ఉందన్నారు. విహారయాత్రలకు వెళ్లేవారు ఇంటికి తాళం వేసి వెళ్ళేటప్పుడు ఇంటిలో ఉన్న విలువైన వస్తువులను బ్యాంకు లాకర్లలో లేదా ఇతర సురక్షితమైన ప్రదేశంలో భద్రపరుచుకోవాలని సూచించారు. ఇంటిని గమనిస్తూ ఉండాలని పొరుగువారికి తెలపాలన్నారు. ఎప్పటికప్పుడు వారికి ఫోన్ చేసి వివరాలు తెలుసుకుంటూ ఉండాలన్నారు. వీలైనంత వరకు ఇంటి చుట్టూ సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. సీసీ కెమెరాల ఫుటేజ్ ను సెల్ ఫోన్ లలో చూసుకునే విధంగా అనుసంధానం చేసుకోవాలన్నారు. ఎవరైనా అనుమానాస్ప దంగా ఇంటి పరిసరాలలో సంచరిస్తుంటే స్థానిక పోలీసులకు సమాచారం అందిస్తే వారిని అదుపులోకి తీసుకొని విచారించే అవకాశం ఉంటుందన్నారు. ఇంటిలోపల, బయట లైట్లు వేసి ఉంచాలన్నారు దాని ద్వారా దొంగలు ఇంటిలో వారు ఉన్నారు అనే భావనతో దొంగతనాలకు పాల్పడకపోవచ్చునని తెలిపారు. వేసవి కారణంగా రాత్రి సమయాలలో వేడిని తట్టుకోలేక చాలామంది ప్రజలు ఆరుబయట నిద్రించడం, ఇంటి తలుపులు తెరచి ఆదమరచి నిద్రించడం జరుగుతోందన్నారు. ఇదే అవకాశంగా తీసుకొని నేరస్తులు ఇండ్లలోకి చొరబడి చోరీలకు పాల్పడే అవకాశం ఉందన్నారు. ఈ విషయాన్ని ప్రజలు గమనించి రాత్రి సమయాలలో ఇంటి తలుపులు తెరచి నిద్రించరాదని హెచ్చరించారు. ఆరుబయట నిద్రించే వారి ఇంటికి తాళం వేసుకొని దానిని భద్రపరుచుకోవాలన్నారు. ముఖ్యంగా ఇండ్లలోని విలువైన వస్తువులు, నగదును బీరువాల్లోనే దాచుకునే అవకాశం ఉన్న కారణంగా బీరువా తాళాలు వేసుకోవాలని సూచించారు. ఈ విధంగా చేయడం వలన ఆ ఇండ్లలో చోరీలను అరికట్టడానికి పోలీసులకు వీలవుతుందన్నారు. వేసవి కాలంలో చోరీలు జరగకుండా ప్రజలు పోలీసులకు సహకరించాల్సిందిగా జిల్లా ఎస్పీ విజ్ఞప్తి చేశారు. ప్రతిరోజు పోలీస్ స్టేషన్‌ల పరిధిలో ఉన్న తాళం వేసి ఉన్న గృహాల యొక్క సమాచారాన్ని సేకరించుకొని, రాత్రి గస్తీ తిరిగే సిబ్బందికి సదరు సమాచారం అందజేయాలని ఎస్పీ పోలీస్ అధికారులకు తెలిపారు. గస్తీ సిబ్బంది ఆ గృహాలను తరచూ సందర్శించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. రాత్రిపూట గస్తీ తిరిగే సిబ్బంది పోలీస్ సైరన్ వేసుకుంటూ తిరగాలన్నారు. అనుమానాస్పదంగా ఉన్న ప్రతి ఒక్కరినీ క్షుణ్ణంగా తనిఖీ చేసి విచారించాలన్నారు. మొబైల్ సెక్యూరిటీ చెక్ డివైస్ ద్వారా వారి వేలిముద్రలు స్కాన్ చేయాలన్నారు. అనుమానితులు ఎక్కడైనా నేరం చేసినట్లు దానిలో వస్తే వారిని అదుపులోకి తీసుకొని విచారించాలన్నారు. తద్వారా నేరస్తులను సులువుగా గుర్తించవచ్చునని, అప్పుడే దొంగతనాలను నివారించ గలుగుతామని ఎస్పీ పోలీస్ అధికారులకు తెలిపారు.

# రైతులలో ఉత్సాహాన్ని నింపేవి ఎడ్ల బలప్రదర్శన పోటీలే : ఎమ్మెల్యే ప్రత్తిపాటి

**చిలకలూరిపేట,ఏప్రిల్3,ప్రభాతవార్త:** రైతాంగానికి ఎంతో ఇష్టమైనది ఎడ్ల బలప్రదర్శన అని మాజీమంత్రి,స్థానిక ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు అన్నారు. గురువారం తెనాలిలో జరుగుతున్న ఆలపాటి శివరామకృష్ణయ్య, మెమోరియల్ ఒంగోలు జాతి ఎడ్ల బలప్రదర్శన, పశుపాల ప్రదర్శన పోటీలకు ప్రత్తిపాటి ముఖ్య అతిథిగా పాల్గొని



మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంతరించిపోతున్న ఒంగోలు జాతి ఎద్దులను పరిరక్షించుకోవాలసిన భాధ్యత మనందరిపై ఉందని ప్రత్తిపాటి తెలిపారు. 2014కి ముందు ఎడ్ల బలప్రదర్శనను కొంత కోర్టులకు వెళ్లి అడ్డుకున్నారని, చంద్రబాబు ముఖ్యమంత్రి అయ్యాక న్యాయపరమైన సమస్యలను పరిష్కరించి ఎడ్ల పోటీలను తిరిగి నిర్వహించేలా చేయడం జరిగిందన్నారు. తాను వ్యవసాయశాఖ మంత్రిగా ఉన్నప్పుడు ఎడ్లబలప్రదర్శనపై ప్రత్యేక దృష్టి పెట్టి రైతులను ప్రోత్సాహించడం జరిగిందన్నారు. వ్యవసాయ పనులలో తీరికలేకుండా గడిపే రైతాంగానికి ఎడ్ల బలప్రదర్శన మంచి ఆనందాన్ని ఇస్తుందన్నారు. రైతుగా, ఆరక దున్నిన వ్యక్తిగా, రైతుల కష్టనష్టాలు తనకు బాగా తెలుసునని ప్రత్తిపాటి అన్నారు. జాతీయస్థాయి ఒంగోలు జాతి ఎడ్ల ప్రదర్శన పోటీల నిర్వాహణ ఆలోచన చేసిన మాజీమంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్‌ను అభినందిస్తున్నా అన్నారు. ఆలపాటి మాదిరిగా ఎడ్ల బలప్రదర్శన పోటీలు తిరిగి ప్రారంభించాలనే ఆలోచన, ఆసక్తితోనే వచ్చాయని ప్రత్తిపాటి తెలిపారు. ఒంగోలు జాతి ఎడ్ల మనుగడను కాపాడుకోవాల్సిన భాధ్యత తెలుగు ప్రజలందరిపై ఉందన్నారు. ఒంగోలు ఎద్దుల పోషించేవారిని ప్రోత్సహించేందుకు ఇలాంటి పోటీలు ఉత్సాహం కలిగి స్తాయన్నారు. అన్ని నియోజకవర్గాల్లోనూ ఈ విధమైన పోటీలు నిర్వహిస్తే, ఎద్దుల పోషించేవారికి ఉపయోగకరంగా ఉంటుందన్నారు. అనంతరం ఎడ్ల బలప్రదర్శన పోటీలలో విజేతలకు ప్రత్తిపాటి బహుమతులను అందించారు. ఎమ్మెల్సీ రాజేంద్రప్రసాద్‌కు సభావేదికపైనుంచే ప్రత్తిపాటి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమం ప్రారంభంలో ఎన్టీఆర్ చిత్రపటానికి, ఆలపాటి శివరామయ్య చిత్రపటానికి ఎమ్మెల్యే ప్రత్తిపాటి, ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్ర ప్రసాద్,మంత్రి సవితమ్మ, నక్కా ఆనందబాబు, శాసనసభ్యులు యరపతినేని శ్రీనివాసరావులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, కూటమి పార్టీ నాయకులు, కార్యకర్తలు, రైతులు పాల్గొన్నారు.

# కార్మిక సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కృషి

**-ఏపీ ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ, మాజీ ఎమ్మెల్యే మక్కెన**



**వినుకొండ,ఏప్రిల్3,ప్రభాతవార్త:** ఆర్టీసి కార్మికుల సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఏపీ ప్రభుత్వ చీఫ్‌విప్ జీ.వీ ఆంజనేయులు అన్నారు. స్థానిక ఆర్టిసి బస్టాండ్ వద్ద కార్మిక పరిషత్ నూతన కార్యాలయాన్ని జీ.వీ ఆంజనేయులు గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా జీ.వీ మాట్లాడుతూ కార్మికుల సంక్షేమం పట్ల కూటమి ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ వహిస్తుందన్నారు. వైకాపా పాలనలో ఆర్టిసి కార్మికులకు తీవ్రంగా అన్యాయం జరిగిందన్నారు. ఆర్టిసి ఆస్తులు దోచుకునే ప్రయత్నాలు జగన్ చేశారని, కార్మికులకు జీతాలు పెంచకుండా ప్రశ్నించిన వారిపై అక్రమ కేసులు బనాయించారని విమర్శించారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, కూటమి ప్రభుత్వ కార్మిక పక్షపాతిగా పని చేస్తున్నారని వినుకొండలో కార్మిక పరిషత్ కార్యాలయం ఏర్పాటు కావడం మంచి విషయం అండగా ఉంటామని తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు, జనసేన నాయకులు నాగశ్రీనురాయల్, బీజేపీ నాయకులు లెనిన్, కార్మిక పరిషత్ నాయకులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## అనాధ శవానికి అంత్యక్రియలు


**వినుకొండ,ఏప్రిల్3,ప్రభాతవార్త:** మానవ సేవే మాధవ సేవగా భావించిన మానవ సేవాసమితి,



హెల్పింగ్‌హార్ట్ స్వచ్ఛంద సంస్థలకు చెందిన సభ్యులు వినుకొండ ప్రభుత్వ ఆసుపత్రి నందు అనాధ శవానికి అంత్యక్రియలు చేసి మానవత్వం చాటారు. కార్యక్రమంలో మానవ సేవా సమితి అధ్యక్షులు పి.వి సురేష్‌బాబు, హెల్పింగ్ హార్ట్ సంస్థ సభ్యులు పువ్వాడ కృష్ణ, ఎస్.కె సర్దార్, నాగూర్, ఎస్‌డి జాకీర్, పట్టిబోటి ప్రసాద్, ఎస్.కె యూసఫ్ తదితరులు పాల్గొని శవానికి తలకొరివి పెట్టారు.

## ఎండోస్కోపీ ద్వారా అరుదైన చికిత్స

**చిలకలూరిపేట,ఏప్రిల్3,ప్రభాతవార్త:** పట్టణం లోని జానకి నర్సింగ్‌హోంలో డాక్టర్ బలరామకృష్ణ లివర్ అండ్ గ్యాస్ట్రో సెంటర్‌లో అరుదైన చికిత్స గురువారం జరిగింది. కడుపునొప్పితో వచ్చిన పురుషోత్తమపట్నం గ్రామానికి చెందిన మహిళ ఆసుపత్రికి రాగా గ్యాస్ట్రో ఎంటరాలజిస్ట్ డాక్టర్ ముప్పాళ్ల బలరామకృష్ణ తేజస్వ పరీక్ష నిర్వహించి పిత్తాశయంలో రాళ్లు, చీము ఉన్నట్లు గుర్తించారు. అప్పటికే ఆమెకు గుండె, ఊపిరితిత్తుల సమస్య ఉన్నట్లు గుర్తించారు. కాగా డాక్టర్ బలరామ



కృష్ణ తేజస్వ ఎండో స్కోపి విధానం ద్వారా పిత్తాశయంలో ఉన్న రాళ్లు, చీము తొలగించి, పరిపూర్ణ శుభ్రం చేసి స్టెంట్ వేశారు. ఇలాంటి కేసులు చేయడానికి అను భవం కలిగిన డాక్టర్లు కూడా సంకోచిస్తారు. కానీ డాక్టర్ తేజస్వ ఈ శస్త్ర చికిత్స చేసి ఆమె ప్రాణాలు కాపాడారు. ప్రస్తుతం ఆ మహిళ మామూలు స్థితిలో ఉన్నారు. ఇలాంటి రిస్క్ చికిత్స చేసిన డాక్టర్ తేజస్వినీ ఇండియన్ మెడికల్ అసోసియేషన్ వైద్యులు అభినందనలు తెలియజేశారు.

## జీఎంసి ఆధ్వర్యంలో త్వరలో మెగా జాబ్ మేళా

**గుంటూరు కార్పొరేషన్,ఏప్రిల్3,ప్రభాతవార్త :** స్మార్ట్ టెక్స్, జీఎంసి ఆధ్వర్యంలో త్వరలో గుంటూరు మెగా జాబ్ మేళా నిర్వహించనున్నామని, అందులో భాగంగా ఈ నెల 9న స్థానిక శ్రీ వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో మాక్ ఇంటర్వ్యూ, రిజిస్ట్రేషన్ జరుగుతుందని, నగరపాలక సంస్థ పరిధిలోని 10వ తరగతి నుండి పిజి, ఐటిఐ, డిప్లొమా చదివిన, ఇంజినీరింగ్, ఫార్మసీ, నర్సింగ్ పూర్తి చేసిన విద్యార్థులు రిజిస్ట్రేషన్ చేసుకొని సద్వినియోగం చేసుకోవాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు



ఐఏఎస్ కోరారు. గురువారం స్మార్ట్ టెక్స్ డైర్ వర్షన్ దివ్య తో కలిసి జాబ్ మేళా పోస్టర్ ని నగరపాలక సంస్థ కమిషనర్ చాంబర్ లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లా డుతూ స్మార్ట్ టెక్స్, జీఎంసి ఆధ్వర్యంలో నగరంలో 10వ తరగతి పైన చదివిన నిరుద్యోగ యువతకు వారి అర్హతకు తగిన విధంగా ఉండేలా షుమారు 50 కంపెనీల నుండి ఉద్యోగాలు అందించేలా గుంటూరు మెగా జాబ్ మేళా నిర్వహించనున్నా మన్నారు. ఐటి, నాన్ ఐటి, బ్యాంకింగ్, ఫార్మసీ, నర్సింగ్ రంగాల్లోని వివిధ కంపెనీలు నిర్వహించే ఉద్యోగాల కల్పనకు, ఈ నెల 9న విజ్ఞాన మందిరంలో రిజిస్ట్రేషన్ జరుగుతుందన్నారు. నగరంలో అసక్తి కల్గిన నిరుద్యోగ యువత 9వ తేదీ రిజిస్ట్రేషన్ చేసుకోవాలని కోరారు.

## పారాలీగల్ వాలంటీర్లు కోర్టుకు,ప్రజలకు అనుసంధానంగా పనిచేయాలి : జూనియర్ సివిల్ జడ్జి కె నరేంద్రరెడ్డి

**చిలకలూరిపేట,ఏప్రిల్3,ప్రభాతవార్త:** పారాలీగల్ వాలంటీర్లు కోర్టుకు, ప్రజలకు అనుసంధానంగా వారధిగా పనిచేయాలని ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కె నరేంద్రరెడ్డి తెలియచేశారు. జిల్లా న్యాయసేవాధికార సంస్థ గుంటూరు వారి ఆదేశాల మేరకు పట్టణంలోని ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ఆవరణలో గురువారం పారా లీగల్ వాలంటీర్లకు శిక్షణ శిబిరం నిర్వహించారు.



ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా జూనియర్ సివిల్ జడ్జి కె నరేంద్రరెడ్డి పాల్గొని వాలంటీర్లకు పలు సూచనలు చేశారు. ఈ శిక్షణ శిబిరంలో రిసోర్స్ పర్సన్‌గా పి వెంకటేశ్వరరావు,న్యాయవాదులు జివిహెచ్ఎస్ ప్రసాద్, పి రామారావు, యం భానుప్రసాద్, వై శ్రీనివాసరావులు పాల్గొని వివిధ చట్టాల గురించి తెలియచేశారు.

# కస్తూరిబా గాంధీ స్కూలోను ఆకస్మిక తనిఖీ చేసిన ఎమ్మెల్యే

**వెల్దుర్తి, ఏప్రిల్ 3 ప్రభాతవార్త:** వెల్దుర్తి మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాన్ని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి గురువారం ఆకస్మిక తనిఖీ చేశారు. పాఠశాలకు సంబంధించిన వంటశాలలో ఉన్న సరకులు, కూరగాయలను పరిశీలించారు. తరగతి గదులను సందర్శించారు. వసతి, విద్యార్థినులకు అందిస్తున్న ఆహార నాణ్యత, విద్యాబోధన వంటి విషయాలను నేరుగా విద్యార్థినులను అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలో విద్యార్థినులకు ఎలాంటి అసౌకర్యాలు కలుగకుండా చూసుకోవాలని సిబ్బందిని ఆదేశించారు. పాఠశాలలో చేయాల్సిన కొన్ని మార్పులు గుర్తించి, మళ్లీ వచ్చేసరికి చెప్పిన మార్పులు సరిచేయాలని పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు గంగాభవానిబాయికి



ఎమ్మెల్యే సూచించారు. పాఠశాలలో ఇంకేమైనా మౌలిక వసతులు, సౌకర్యాలు వంటివి ఏ అవసరం ఉన్నా తన దృష్టికి తీసుకురావాలని కోరారు. ఈ సందర్భంగా పాఠశాలలో అదనపు తరగతి గదులు అవసరమని హెచ్ఎం ఎమ్మెల్యే జూలకంటికి వినతిపత్రం అందించారు. సాధ్యమైనంత త్వరగా నిధులు కేటాయించి, నిర్మిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వెల్దుర్తి మండల తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ప్రయాణికులకు ఇబ్బంది లేకుండా నూతన బస్సు సర్వీసులు

**-శాసనసభ్యుడు యరపతినేని శ్రీనివాసరావు**

పిడుగురాళ్ల, ఏప్రిల్ 3 ప్రభాతవార్తః ప్రయాణికులకు ఇబ్బంది లేకుండా నూతన ఆర్టీసీ బస్సులు ఏర్పాటు చేసినట్లు గురజాల శాసనసభ్యుడు యరపతినేని శ్రీనివాసరావు అన్నారు. పట్టణంలోని ఏపీఎస్ఆర్టీసీ డిపోలో




నూతన బస్సులను గురువారం ఎమ్మెల్యే యరపతినేని జెండా ఊపి ప్రారంభించారు. పిడుగురాళ్ల నుంచి విజయవాడకు ఎక్స్‌ప్రెస్ సర్వీసు, పిడుగురాళ్ల నుంచి పిన్నెల్లికి పల్లెవెలుగు బస్సు సర్వీసులను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు పాండురంగ శ్రీనివాసరావు, రాష్ట్ర వాణిజ్య విభాగం కార్యదర్శి కనిగిరి శ్రీనివాసరావు, సీనియర్ నేతలు డాక్టర్ ఉన్నం నాగమల్లికార్జునరావు, వడవల్లి సర్వేశ్వరరావు, చెన్నారావు తదితరులు పాల్గొన్నారు.

# నరసరావుపేటలో అమరా ఇంజనీరింగ్ కళాశాల ఆస్తుల వివాదం

**నరసరావుపేట, ఏప్రిల్ 3 ప్రభాతవార్త :** నరసరావుపేటలో అమరా ఇంజనీరింగ్ కళాశాల ఆస్తుల వివాదం కొనసాగుతుంది. తమను బెదిరించి అక్రమంగా నిర్భంధించి ఇబ్బంది పెడుతున్నారని కళాశాల ఛైర్మన్ వెంకటేశ్వర్లు



సతీమణి సుధారాణి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో బాధితులు మీడియా సమావేశాన్ని గురువారం నిర్వహించారు. అమరా కళాశాల యాజమాని వెంకటేశ్వర్లు నుండి తమకు రూ.8 కోట్లు రావాల్సి ఉందన్నారు. వెంకటేశ్వర్లు అకాలమరణంతో వారి ఆస్తులు ఆయన భార్య సుధారాణి పేరుపై వచ్చాయన్నారు. ఆమె తమకు అప్పులు చెల్లిస్తానని చెప్తూ వచ్చిందన్నారు. అయితే ఇటీవల ఆమె వైఖరిలో మార్పు వచ్చిందన్నారు. నరసరావుపేటలో ఐపీల సంస్కృతి పెరగడంతో ఉద్దేశపూర్వకంగానే సుధారాణి అడ్డం తిరిగిందన్నారు. డబ్బులు ఇవ్వమని అడిగితే కేసులు పెట్టడం ఏమిటని బాధితులు ప్రశ్నించారు.

# రాజ్యాంగ విరుద్ధంగా వక్ఫ్‌బోర్డు చట్ట సవరణ : మాజీ ఎమ్మెల్యే గోపిరెడ్డి

**నరసరావుపేట, ఏప్రిల్ 3 ప్రభాతవార్త :** రాజ్యాంగ విరుద్ధంగా వక్ఫ్‌బోర్డు చట్ట సవరణ జరిగిందని మాజీ ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి అన్నారు. గురువారం స్థానిక పార్టీ కార్యాలయంలో జరిగిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. మైనార్టీ నాయకులు షేక్.ఖాజావలి, ఖాదర్‌బాషా, కరిముల్లా, ఎంఐఎం



నాయకులు మౌలాలి పాల్గొని మాట్లాడారు. పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన ఆర్టికల్ - 14, 25,26కు వ్యతిరేకం అన్నారు. వక్ఫ్‌బోర్డులో ముస్లింయేతరులకు స్థానం కల్పించడం ద్వారా అందుకు సంబంధించిన తొమ్మిది లక్షల ఎకరాల ఆస్తులు అన్యాక్రాంతం అయ్యే ప్రమాదం ఉందన్నారు. సెంట్రల్ డేటా బేస్‌లో నమోదు కాని ఆస్తులు కోర్టులో చెల్లవని చెప్పడం ద్వారా మరింత నష్టం జరుగుతుందన్నారు. రాజ్యాంగ విరుద్ధమైన బిల్లుకు టిడిపి, జనసేన, బిజెపి మద్దతు ప్రకటించడం శోచనీయమన్నారు. ఆల్ ఇండియా ముస్లిం లా బోర్డు, జామాయితుల్లా ఇస్లాం వంటి సంస్థలను చట్టసవరణ ముందు చర్చలకు ఎందుకు పిలవలేదని ప్రశ్నించారు. ఇఫ్తార్ విందును రాష్ట్రంలో ముస్లింలు ప్రభుత్వం ఆహ్వానించినా వెళ్ళలేదన్నారు. వైకాపా పార్టీ ఈ బిల్లును పూర్తిగా వ్యతిరేకిస్తుందన్నారు. నరసరావుపేటలో మాజీమంత్రి వర్ల రామయ్య వై.ఎస్.జగన్‌పై చేసిన వ్యాఖ్యలను తప్పు బట్టి ఖండించారు. అదే విధంగా వక్ఫ్‌బోర్డు బిల్లు సవరణ పై టిడిపి వైఖరిని బహిరంగంగా చర్చించాలని మాజీ ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి సవాల్ విసిరారు.

# నల్లపాడు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల్లో పాలిసెట్‌కు ఉచిత శిక్షణ

**గుంటూరు విద్య,ఏప్రిల్ 3,ప్రభాతవార్త :** ఎంబిటిఎస్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల నల్లపాడులో బుధవారం నుంచి పాలిసెట్‌కు దరఖాస్తు చేసిన విద్యార్థిని విద్యార్థులకు ఉచిత కోచింగ్ ఇస్తున్నట్లు ప్రిన్సిపాల్ తాళ్ళూరి శేఖర్ గురువారం తెలిపారు.కోచింగ్ ప్రతిరోజు ఉదయం 9.30 నుంచి 12.30గంటల వరకు జరుగుతుందన్నారు.కోచింగ్ తీసుకునే విద్యార్థిని విద్యార్థులకు ఉచితంగా మెటీరియల్ ఇస్తామన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మావద్ద చదువుతున్న ఫైనల్ ఇయర్ విద్యార్థులు 262మందికి గాను 252మంది వివిధ కంపెనీల్లో ఉద్యోగాలు సాధించారన్నారు.పాలిటెక్నిక్ కంప్లీట్ అయ్యేలోపు జాబ్ గ్యారంటీ అని పాలిటెక్నిక్ విద్య యొక్క గొప్పతనాన్ని తెలియజేశారు.పాలిసెట్ కోచింగ్ గురించి ఎంబిటిఎస్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలను సందర్శించాల్సిందిగా కోరారు.

## నేడి నుండి ప్రారంభం కానున్న పుచ్చలపల్లి సుందరయ్య

# జాతీయ స్థాయి నాటికలు

యడ్లపాడు, ఏప్రిల్ 3, ప్రభాతవార్త : నాటకం అనేది ఒక శ్రవణ సహిత దృశ్యరూపకం. జానపద కళలు విలసిల్లుతున్న రోజులలో రాజుల



పరిపాలనా కాలంలో ప్రజల వినోదం కోసం అత్యధికంగా అదరింపబడిన కళ నాటకం. నాటకం సంగీతం, పాటలు, నృత్యాలతో కూడకొన్న ప్రక్రియ. ఇందులోని పాత్రలన్నీ తమను తామే పరిచయం చేసుకొంటూ రంగప్రవేశం చేస్తాయి. "నాటకాంతం హి సాహిత్యం" అన్నాడు మహాకవి కాళిదాసు. అంటే అన్ని సాహిత్య ప్రక్రియలలోను చివరిగా స్పర్శించవలసిన అంకం నాటకమని అర్థం. కవిత్వం, వ్యాసం, కథ, ఇలా అన్ని సాహిత్య ప్రక్రియలను స్పృశించిన తరువాత మాత్రమే నాటకాన్ని రచించాలని అయన తెలిపాడు. అప్పుడు మాత్రమే నాటక రచనకు నిండుదనం చేకూరుతుందని అయన భావన. వివిధ కలలకు మూలం రంగస్థలం దీనిని విస మ్రరించకుండా నేటివరకు వడిదుడుకులను అధికమించుతూ మారుతున్న కాలానికి అనుగుణంగా మార్పులు చెందుతూ తమదైన శైలిలో అహుత్యాహిక కళాకారులను ప్రోత్సహిం చుతూ ఎన్నో కొత్తవిషయాలను తెలిపేందుకు ఎందరో వివిధ రంగాలలో అనుభవం కలిగిన వారి అహ్వానాలతో వారి ఇచ్చేసందేశాలను తెలుపుతూ ముందుకు సాగుతూ నేటి తరానికి నాటి పోరాట యోదుడు పుచ్చలపల్లి సుందరయ్య పేరును గుర్తుచేస్తూ అయన పేరుమీదనే నాటకోత్సవాలు నిర్వహించుతున్నారు యడ్లపాడు గ్రామస్థులు. నేటి నుండి ప్రారంభం కానున్న పుచ్చలపల్లి సుందరయ్య జాతీయ స్థాయి నాటికల పోటీలు రంగం సిద్ధం అయ్యింది. మూడు రోజుల పాటు సాగే ఈ నాటకోత్సవాలకు వివిధ రంగాలలో నైపుణ్యం కలిగిన మేధావులు, కళాకారులు విచ్చేయటం జరుగుతుంది. ఈ నాటకోత్సవాలకు సంబంధించిన అన్ని ఏర్పాట్లు పూర్తి అవుతున్నాయని, ఇందులో భాగంగానే గ్రామంలోను ఇతర గ్రామాల వారికి నాటకోత్సవాల అహ్వానాలు అందజేస్తున్నట్లు తెలుపుతున్నారు.

# కోటేశ్వరరావును పరామర్శించిన ప్రత్తిపాటి

**యడ్లపాడు, ఏప్రిల్ 3, ప్రభాతవార్త :** యడ్లపాడు గ్రామంలోని ఎస్సీ కాలనీకు చెందిన గుడిపూడి కోటేశ్వరరావు అనారోగ్య నిమిత్తం విశ్రాంతి తీసుకుంటున్న విషయం తెల్సుకొని శాసన సభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు వారి ఇంటికి వెళ్లి వారిని పరామర్శించారు. వారి అరోగ్య



సంబంధించిన విషయాలను అడిగి తెల్సుకుని త్వరలోనే కొలుకోవాలని అకాక్షించారు. అయనతోపాటు జనసేన పార్టీ నియోజకవర్గ కన్వీనర్ తోట రాజా రమేష్, టిడిపి నాయకులు జువ్వాజి మదన్, కామినేని సాయిబాబు, పోపూరి రాఘవయ్య, కందుల రమణ, గంగా శ్రీనివాసరావు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# యురేకా సైన్స్ ఎక్స్ పో పోటీలో విజయం సాదించిన విద్యార్థులు


**యడ్లపాడు, ఏప్రిల్ 3, ప్రభాతవార్త :** ఇటీవల జనవిజ్ఞాన వేదిక సైన్స్ డే సందర్భంగా రాష్ట్ర స్థాయిలో యురేకా సైన్స్ ఎక్స్‌పో పోటీలో జిల్లా స్థాయిలో యడ్లపాడు నారాయణ స్కూల్ విద్యార్థులు సైన్స్ అండ్ టెక్నాలజీలో మొదటి బహుమతి, అలాగే యడ్లపాడు జడ్పీ హైస్కూల్ విద్యార్థునులు



పర్యావరణ విభాగంలో మొదటి బహుమతి సాదించారు. ఈ సందర్భంగా నారాయణ స్కూల్‌లో జరిగిన కార్యక్రమంలో యంఇవో నాగరత్నం చేతుల మీదగా బహుమతి ప్రదానం జరిగింది. కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా ధూళిపాళ వెంక ట్రావు, జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ దార్ల బుజ్జిబాబు, చిలకలూరిపేట డివిజన్ అధ్యక్షులు చెరుకూరి సృజన, జిల్లా ఉపాధ్యక్షులు డాక్టర్ చుక్క విన్సెంట్ పాల్, సలహాదారులు డాక్టర్ పీవి సుబ్బారావు, స్కూల్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# రుణ అర్హత మేళాలో లబ్ధిదారుల ఎంపిక

**కారంపూడి, ఏప్రిల్ 3 ప్రభాతవార్త:** మండల కేంద్రమైన కారంపూడిలోని స్థానిక ఎంపీడీఓ



కార్యాలయంలో 2024-25 సంవత్సరం బీసీ, ఈబీసీ కాపు, జనరిక్ ఫార్మసీ లబ్ధిదారుల రుణ అర్హత మేళా గురువారం జరిగింది. మండలంలో 685 మంది లబ్ధిదారులు దరఖాస్తు చేసుకోగా 369 మంది లబ్ధిదారులు పాల్గొన్నారు. లబ్ధిదారులను ఎస్‌బీఐ, యూనియన్ బ్యాంకు, చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంకులు కారంపూడి, ఒప్పిచర్ల, పెద్దకొదమగుండ్ల శాఖల బ్యాంకు సిబ్బంది ఇంటర్వ్యూలు నిర్వహించారు. అర్హత కలిగిన లబ్ధిదారులను ఎంపిక చేసి వారికి యూనిట్లు అందజేయనున్నట్లు ఎంపీడీఓ ఘంటా శ్రీనివాసరెడ్డి తెలిపారు.

# బీఎల్‌వోలకు శిక్షణ

**గురజాల, ఏప్రిల్ 3 ప్రభాతవార్తః** పట్టణంలోని రెవెన్యూ డివిజన్ కార్యాలయంలో గురువారం ఆర్డీవో మురళీకృష్ణ ఆధ్వర్యాన నియోజకవర్గ పరిధిలోని బీఎల్‌వోలకు, సూపర్‌వైజర్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఎన్నికల విధులకు సంబంధించిన ఫారాలు, ఓటర్ల జాబితా స్వచ్ఛీకరణపై పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో



తహసీల్దార్ నగేష్, కమిషనర్ శివన్నారాయణ, నియోజకవర్గ పరిధిలోని బీఎల్‌వోలు పాల్గొన్నారు.

# పోస్టాఫీస్ ఎదుట పెన్షనర్స్ ఆందోళన

**నరసరావుపేట, ఏప్రిల్ 3 ప్రభాతవార్త :** పట్టణంలోని పెద్ద పోస్టాఫీస్ ఎదుట పెన్షనర్స్




అసోసియేషన్ గురువారం నిరసన తెలిపింది. ఆల్ ఇండియా పోస్టల్ అండ్ ఆర్ఎంఎస్ పెన్షనర్స్ ఎన్‌సిసిపిఏ పిలుపు మేరకు ఆందోళనను నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు మాట్లాడుతూ పెన్షనర్స్ సిసిఎస్ రూల్స్ - 1972 సవరణ మార్పులను రద్దు చేయాలన్నారు. రాబోయే పెన్షనర్లకు, ప్రస్తుత పెన్షనర్లకు వెత్యాసం ఉండకూడదన్నారు. పాత పెన్షన్ విధానం కొనసాగించాలన్నారు. పెన్షనర్లకు కోవిడ్ కాలంలో ఆపిన డిఏలు చెల్లించాలన్నారు. హాస ్పటల్ లేని ప్రాంతాలలో మెడికల్ అలవెన్స్ ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో నాయకులు సయ్యద్ మూసా, పేరారెడ్డి, మైఖెల్, సత్యనారాయణ, వేణుగోపాల్‌రావు, డిసిహెచ్‌వి రెడ్డి, బాబురావు, లక్ష్మయ్య, గఫార్ పాల్గొన్నారు.

# యోగానంద లక్ష్మి నరసింహస్వామి దేవాలయానికి దాతలు విరాళం

**నరసరావుపేట టౌన్, ఏప్రిల్ 3 ప్రభాతవార్త :** పట్టణంలోని కోట సెంటర్ పులుపులవారి వీధిలో వేంచేసియున్న వీరాంజనేయ సహిత యోగానంద లక్ష్మినరసింహస్వామి దేవాలయ రాతి నిర్మాణానికి నరసరావుపేటకు చెందిన కె.వి.నాగేశ్వరరావు - సుజాత దంపతులు రూ.1,00,116లను అందజేశారు. దాతల కుమారులు సాయిరామ్, తేజ్‌రామ్ కార్యక్రమంలో పాల్గొన్నారు.



కమిటీ సభ్యులు మాట్లాడుతూ స్వామివారి ఆశీస్సులు దాతలకు ఎప్పుడూ ఉంటాయని తెలియజేశారు.

# స్టేట్ లెవల్ ఇంగ్లీష్ ఎండేవర్ అవార్డుకు నలుగురు విద్యార్థులు ఎంపిక

**రొంపిచర్ల, ఏప్రిల్ 3 ప్రభాతవార్త :** స్థానిక బిసి కాలనీలోని సెయింట్ ఫిలోమినాస్ పబ్లిక్ స్కూల్ విద్యార్థులు స్టేట్ లెవల్ ఇంగ్లీష్ ఎండేవర్ అవార్డుకు ఎంపికయ్యారు. గురువారం పాఠశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ కె.పి.జైన్, డైరెక్టర్ కె.పి.లిస్సి జోష్ వివరాలను తెలియజేశారు. ఇటీవల ఈ అవార్డుకు సంబంధించి నిర్వహించిన పరీక్షలలో తమ విద్యార్థి జె.ప్రణవి రాష్ట్ర 5వ ర్యాంక్‌ను, 2వ తరగతి విద్యార్థి షేక్.నూసీన 3 ర్యాంక్‌ను, టి.కె.అన్విత 2వ ర్యాంక్‌ను, 5వ తరగతి విద్యార్థి వై.యజ్విత 4వ ర్యాంక్‌ను సాధించారన్నారు. మండల విద్యావనరుల కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో ఎంఈవో బ్రహ్మేశ్వరరావు విద్యార్థులను అభినందించారు.

# ప్రతి మహిళ పారిశ్రామికవేత్తగా ఎదగాలి : డిఆర్‌డిఏ పిడి ఝాన్సీరాణి

**రొంపిచర్ల, ఏప్రిల్ 3 ప్రభాతవార్త :** ప్రతి మహిళ పారి శ్రామికవేత్తగా ఎదగాలని డిఆర్‌డిఏ పి.డి. ఝాన్సీరాణి అన్నారు. మండల సమాఖ్య కార్యాలయంలో గురువారం ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పి.డి. మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ప్రతి మహిళను పారిశ్రామికవేత్తగా ఎదిగేందుకు ప్రభుత్వం తరపున చేయూతనిస్తున్నట్లు తెలిపారు. స్వయం సహాయక సంఘాలకు అవసరమైన శిక్షణ ఇస్తామన్నారు. యానిమేటర్లు వార్షిక ప్రణాళికలు తయారు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డిపిఎం హనుమానాయక్, ఏపిఎం సోమశేఖర్, సి.సి.లు మల్లేశ్వరరావు, సత్యనారాయణ పాల్గొన్నారు.

# ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలి : బాపట్లజిల్లా కలెక్టరు

**బాపట్ల,ఏప్రిల్3,ప్రభాతవార్త:** వేసవి కాలంలో ప్రజలు త్రాగునీటికి ఇబ్బంది పడకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి అధికారులను ఆదేశించారు. గురువారం స్థానిక కలెక్టరేట్లో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏప్రిల్ మాసం నుండి జూన్ మాసం వరకు ఎండ తీవ్రత ఎక్కువగా ఉంటుందని, వడగాల్పులు ఎక్కువగా ఉంటాయన్నారు. ప్రజలు, పాదచారుల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాలు ఏర్పాటు చేయాలన్నారు. చలివేంద్రా లలో ఓఆర్ఎస్ ప్యాకెట్లను అందుబాటులో ఉంచాలని అన్నారు. ఉపాధి హామీ పనులు జరిగే చోట పనులను ఎండ రాకముందు, ఎండ తీవ్ర తగ్గిన తర్వాత మొదలు పెట్టాలన్నారు. ఉదయం 11 గంటల నుండి మధ్యాహ్నం 3 గంటల వరకు పనులకు విరామం ఇవ్వాలన్నారు. అత్యవసరమైన పరిస్థితిలో పనిచేయవలసి వస్తే అక్కడ వారిని మంచి నీళ్లు, ఎలక్ట్రో నీళ్లు, పండ్ల రసాలు తీసుకోవాలన్నారు. వడదెబ్బ తగిలినప్పుడు వారిని వేడి ప్రదేశం నుండి చల్లని ప్రదేశానికి తీసుకు వెళ్లాలన్నారు. ఒళ్ళు వెచ్చబడినట్లైతే చల్లని తడి గుడ్డతో ఒళ్ళు తుడవాలన్నారు. చల్లని నీటిని తీసుకోవాలని తెలిపారు. వెచ్చదనం తగ్గని పరిస్థితుల్లో వారిని వెంటనే 108,104 లో ఆసుపత్రికి తరలించాలని అన్నారు. వడదెబ్బ కారణంగా



మరణాలు జరగకుండా చూసుకోవాలని, ఎండాకాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి పత్రికలు, కరపత్రాలు, దేవాలయాలు, మసీదులు, చర్చిలలో ఉండే మైకుల ద్వారా ప్రజలకు అవగాహన కలిగే విధంగా ప్రచారం చేయాలని వైద్య శాఖ అధికారులకు తెలిపారు. ఆశా వర్కర్లు ఒంటరి వృద్ధ మహిళల ఆరోగ్య పరిస్థితులను ప్రతిరోజు పర్యవేక్షించే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆయన ఆదేశించారు. డయేరియా వ్యాధి సోకకుండా అన్ని జాగ్రత్త తీసుకోవాలని ఆయన అన్నారు. సచివాలయ పరిధిలో త్రాగునీటిని అన్ని రకాల పరీక్షలు చేయ డానికి సచివాలయ సిబ్బందికి శిక్షణ ఇవ్వడమైనదని తెలిపారు. దోమల ద్వారా మలేరియా వ్యాధి సోకకుండా నీళ్లు నిల్వ ఉన్న ప్రదేశాలను గమనించి నీళ్లు నిలువ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన అన్నారు. గ్రామాలలో, పట్టణాలలో ప్రజలు ప్రతి గురువారం రాత్రికి డ్రమ్ములలోని నీటిని తీసివేయాలని, శుక్రవారం ఉదయం వాటిని ఎండబెట్టి సాయంత్రం నీళ్లు నింపుకునే విధంగా చర్యలు తీసుకోవాలని ఆయన అధికారులను ఆదేశించారు. ప్రజలకు కుక్కల బెడద లేకుండా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. 70 సంవత్సరాల పైబడిన వారికి ఆయుష్మాన్ భారత్ కింద కార్డు జారీ చేయుటకు చర్యలు తీసుకోవాలని, అందుకు ఈకేవైసీ చేయించాలని జిల్లా వైద్యాధికారులను ఆయన ఆదేశించారు . దీని ద్వారా వారికి ఐదు లక్షల వరకు వైద్య సేవలు వర్తిస్తాయని తెలిపారు. త్రాగునీటి సమస్య రాకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. మంచినీరు వృధా కాకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఆరు సంవత్సరంలోపు పిల్లల యొక్క ఆధార్ ఎన్రోల్మెంట్ ను అంగన్వాడి మరియు ఏఎన్ఎంల సహకారంతో ఈనెల 10వ తేదీలోపు పూర్తి చేయాలని ఎంపీడీవోలను ఆయన ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంయుక్త కలెక్టర్ ప్రఖర్ జైన్, జిల్లా రెవెన్యూ అధికారి డి గంగాధర్ గౌడ్, జిల్లా వైద్యాధికారి డాక్టర్ విజయమ్మ, జిల్లా పంచాయతీ అధికారి ప్రభాకర్, ఆర్డబ్ల్యూఎస్ ఎస్ ఇ అనంతరాజు, బాపట్ల మున్సిపల్ కమీషనర్ రఘునాథ్ రెడ్డి,బాపట్ల డిఎల్ డివో విజయలక్ష్మీ, వీక్షణ సమావేశం ద్వారా మున్సిపల్ కమిషనర్లు, అన్ని మండలాల ఎంపీడీవోలు మరియు తదితరులు పాల్గొన్నారు.

# పారా లీగల్ వాలంటీర్ల శిక్షణ

**సత్తెనపల్లి, ఏప్రిల్ 3 ప్రభాతవార్త :** పారా లీగల్ వాలంటీర్ల శిక్షణా తరగతులను గురువారం



నిర్వహించారు. మండల న్యాయ సేవాధికార కమిటీ ఛైర్మన్, సత్తెనపల్లి సివిల్ జడ్జి విజయ్కుమార్రెడ్డి ఆధ్వర్యంలో వాలంటీర్లకు శిక్షణ ఇచ్చారు. న్యాయమూర్తి మాట్లాడుతూ బాధ్యతాయుతమైన విధులు నిర్వహించాలన్నారు. ప్రజలకు న్యాయం అనే నినాదంతో పని చేయాలన్నారు. వీరికి పదవీ కాలం ఏడాది పాటు ఉంటుందన్నారు. న్యాయవాది దివ్వెల శ్రీనివాసరావు మాట్లాడుతూ 1987 చట్టం గురించి తెలియజేశారు. న్యాయవాది వెంకట శివ మాట్లాడుతూ గృహ హింస చట్టం, భరణం చట్టం గురించి తెలియజేశారు. న్యాయవాది కోటేశ్వరరావు మాట్లాడుతూ సివిల్ వివాదాలు, చట్టాల గురించి తెలియజేశారు.

# పేదలకు వరం సిఎం సహాయ నిధి

**బాపట్ల,ఏప్రిల్03,ప్రభాతవార్త:** నిరుపేదలకు వైద్య ఖర్చుల సహాయార్థం సిఎం సహాయ నిధి వరంలాంటిదని బాపట్ల శాసన సభ్యులు వేగేశన నరేంద్ర వర్మ అన్నారు.గురువారం స్థానిక ఎమ్మెల్యే



నివాసంలో 6గురు లబ్ధిదారులకు సిఎంఆర్ఎఫ్ చెక్కలను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులైన 6 మంది లబ్ధిదారులకు వైద్య ఖర్చుల సహాయార్థం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సంక్షేమ నిది నుండి ఇవ్వటం జరిగిందన్నారు.బాపట్ల పట్టణం ప్యాట్సన్ పేటకి చెందిన మల్లెల సునీతకి రూ. 2,00,804లు,బాపట్ల పట్టణం ప్యాట్సన్ పేట కి చెందిన చెట్టుపల్లి వందనంకి రూ.89, 022లు,బాపట్ల పట్టణం దగ్గుమళ్ళవారి పాలెంకి చెందిన షేక్ కరీమునిసాకి రూ.70,001లు,బాపట్ల పట్టణం ఉప్పరపాలెంకి చెందిన రాజు రాంబాబు రెడ్డికి రూ.62,983లు,బాపట్ల పట్టణం ఇమ్మడిశెట్టి వారి పాలెంకి చెందిన చాపల వెంకయ్యమ్మకి రూ.51,311లు,బాపట్ల పట్టణం ఇమ్మడిశెట్టివారి పాలెం కి చెందిన కాట్రగడ్డ సూర్యకి రూ.40,000లు అందజేయటం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ పట్టణ అధ్యక్షులు గొలపల శ్రీనివాసరావు, దారా అశోక్,ప్రసాద్,తెలుగుదేశం పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## రైతులకు గిట్టు బాటు ధర కల్పించడంలో అధికారులు వైఫల్యం

**కర్లపాలెం,ఏప్రిల్3,ప్రభాతవార్త:** ధాన్యం కొనుగోలు విషయంలోను,పచ్చిమిర్చి రైతులకు గిట్టుబాటు ధర కల్పించడంలోను అధికారులు వైఫల్యం చెందారని నల్లమోతువారిపాలెం ఎంపీటీసీ సభ్యులు తాంద్ర సాంబశివరావు అన్నారు. కర్లపాలెం మండలం పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ యారం వనజ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సాంబశివరావు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ లో కొన్ని ప్రాంతాలలో ధాన్యం కొనుగోలు సక్రమంగా



జరుగుతున్నప్పటికీ బాపట్ల ప్రాంతంలో ధాన్యం కొనుగోలు విషయంలో అధికారులు వైఫల్యం చెందటనడంలో అతిశయోక్తి లేదన్నారు.మనకు ఇచ్చిన టార్గెట్ పూర్తి అయినది ఇక మేము ధాన్యం తీసుకొము అనడం రైతులను ఇబ్బందులకు గురి చేయడమేనన్నారు.గ్రామాలలో పొలం పిలుస్తోంది కార్యక్రమాలు అధికారులు ఫోటోలకే పరిమితం అవుతున్నట్లు సాంబశివరావు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ అద్దిరి శ్రీనివాసరావు, ఉపాధ్యక్షులు పండరబోయిన సుబ్బారావు, జడ్పీటీసీ పిట్ల వేణుగోపాల్ రెడ్డి,సర్పంచ్ లు ,ఎంపీటీసీ లు,మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు

# రాష్ట్రస్థాయి ఒలంపియాడ్‌లో స్టేట్ ఫస్ట్ ర్యాంకు సాధించిన విఐటి విద్యార్థి కె హరిణ్‌సాయి

**చిలకలూరిపేట,ఏప్రిల్3,ప్రభాతవార్త:** ఆంధ్ర ప్రదేశ్ ప్రవైట్ మరియు అన్‌ఎయిడెడ్ పాఠశాలల మేనేజ్‌మెంట్ అసోసియేషన్, ఈ అభ్యాస్



అకాడమీ సంయుక్తంగా నిర్వహించిన శాట్ ఎగ్జామ్‌కు రాష్ట్రవ్యాప్తంగా 500 పాఠశాలలనుంచి షుమారు 60వేలమంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈ పరీక్షలలో పట్టణానికి చెందిన విఐటి స్కూల్ విద్యార్థి కె హరిణ్‌సాయి (7వ తరగతి) రాష్ట్ర స్థాయిలో మొదటి ర్యాంకు సాధించారు. హరిణ్‌సాయితో పాటుసంచిత్‌జైన్ 10వ ర్యాంక్‌ను, సిహెచ్ నవ్య 13వ ర్యాంకును, ఎన్ కళ్యాణ్‌రామ్ 15వ ర్యాంక్‌ను, ఎ భవ్యశ్రీ 16వ ర్యాంకును, టి హసినిసాయి లక్ష్మీ 17వ ర్యాంకు, డి హర్ష 20వ ర్యాంక్, డి హర్షిత్ 20వ ర్యాంక్, కె కార్తికేయ 24వ ర్యాంకు, సిహెచ్ దీక్షిత్ 24వ ర్యాంకు, సిహెచ్ చరణ్ 24వ ర్యాంకు, ఎ నాగేంద్ర 25వ ర్యాంకు, సిహెచ్ సరిత 29వ ర్యాంకు సాధించారు. ఏకంగా 18మంది విద్యార్థులు మొదటి 30 ర్యాంకులలోవిఐటి విద్యార్థులు నిలిచారని స్కూల్ డైరక్టర్ దండా పవన్‌కుమార్ తెలిపారు. కాగా గురువారం సాయంత్రం పాఠశాలలో ఏర్పాటుచేసిన అభినందన సభలో మొదటి ర్యాంకుతో పాటు, మిగిలిన ర్యాంకులు సాధించిన విద్యార్థులందరిని పాఠశాల డైరక్టర్లు దండా పవన్‌కుమార్, దండా రోజశ్రీ, ప్రిన్సిపల్ కల్పన, పాఠశాల అధ్యాపకులు అభినందనలు తెలియచేశారు. రాష్ట్రస్థాయి ఐఐటి ఫౌండేషన్‌లో విఐటి స్కూల్ అగ్రగామిగా నిలిచిందని డైరక్టర్ పవన్ ఈ సందర్భంగా తెలియచేశారు.

# నియోజకవర్గంలో 10 వేల మందికి ఉద్యోగాలు కల్పిస్తా : ఎమ్మెల్యే

## - జేబీఆర్ మెగా జాబ్‌మేళాలో 380 మందికి ఉద్యోగాలు

**మాచర్ల, ఏప్రిల్ 3 ప్రభాతవార్త:** మాచర్ల నియోజకవర్గంలోని యువత కోసం ప్రాథమికంగా 10 వేల ఉద్యోగాల కల్పనకు కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి అన్నారు. గురువారం మాచర్ల పట్టణంలోని ఎస్‌కేబీఆర్ డిగ్రీ



కళాశాలలో పారిశ్రామిక దిగ్గజం అమర రాజా సంస్థ ఆధ్వర్యంలో జరిగిన జేబీఆర్ మెగా జాబ్‌మేళాను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఎన్డీయే ప్రభుత్వంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నాయకత్వంలో రాజకీయాలకు అతీతంగా 20 లక్షల ఉపాధి అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని విద్యార్థులనుద్దేశించి ప్రసంగించారు. యువత భావదారిద్ర్యం నుంచి బయటపడి, కష్టపడి చదివించిన తల్లిదండ్రులకు బాసటగా నిలవాలని కోరారు. యువత ఉపాధే లక్ష్యంగా సేవా దృక్పథంతో మాజీ ఎంపీ గల్లా జయదేవ్ అమర రాజా సంస్థను స్థాపించి, వేలాది మందికి ఉపాధినిచ్చి ఆదుకుంటున్నారని వివరించారు. రాజకీయాల్లో సేవే ప్రధానం అని చాటి చెప్పిన గల్లా జయదేవ్ అందరికీ స్ఫూర్తి అని కొనియాడారు. పల్నాడు ప్రాంతం పారిశ్రామికంగా పురోగమించేందుకు నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవ రాయలు ఎంతో కృషి చేస్తున్నారని, ఆయనతో కలిసి ఎన్నో పరిశ్రమల స్థాపనకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని ఎమ్మెల్యే జూలకంటి వెల్లడించారు. గురువారం జరిగిన మెగాజాబ్ మేళాలో 600 మంది నిరుద్యోగ యువత రిజిస్ట్రేషన్ చేసుకోగా 380 మందికి ఉద్యోగ ఎంపిక ధ్రువపత్రాలను ఎమ్మెల్యే అందజేశారు.

# హోరాహోరీగా క్రికెట్ టోర్నమెంట్ పోటీలు

**కర్లపాలెం,ఏప్రిల్03,ప్రభాతవార్త:** కర్లపాలెం మండలం నల్లవారిపాలెం గ్రామంలో జరుగుతున్న కోన ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నమెంట్‌లో మ్యాచ్‌లు హోరాహోరీగా జరుగు తున్నాయి.గురువారం జరిగిన రెండు మ్యాచ్లు ఎంతో ఆసక్తికరంగా జరిగాయి. మొదటి మ్యాచ్ చినపులుగు వారి పాలెం చింతయపాలెం జట్ల మధ్య జరగగా చినపులుగువారి పాలెం జట్టు విజయం సాధించింది. అనంతరం సాయంత్రం జరిగిన రెండో మ్యాచ్ పెద్ద పులుగువారిపాలెం ఎం.వి. రాజుపాలెం జట్ల మధ్య అత్యంత ఆసక్తికర మ్యాచ్ జరిగింది. ఈ మ్యాచ్లో ఎంవి రాజుపాలెం జట్టు డిపెండింగ్ ఛాంపియన్ పెద్దపులుగువారి పాలెం జట్టుపై ఎంవి రాజుపాలెం పాలెం విజయం సాధించింది. ఉత్తమ ప్రతిభ కనబరిచిన ఆటగాళ్లకు తుమ్మలపల్లి గ్రామానికి చెందిన మరక సాంబయ్య బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో కమిటీ చైర్మన్ నర్ర మణికంఠ దబ్బుకూటి పృథ్వీరాజ్ అక్కల వెంకయ్య స్వామి రెడ్డి ఎల్లావుల అంకమ్మ పిన్ని అశోక్ ఎల్లావుల భరత్ మణికంఠ వంశి, వేణు నంగు రామకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## తెదేపా నాయకుడు శేషగిరిరావు నూతన గృహ కార్యక్రమంలో పాల్గొని అభినందించిన ప్రత్తిపాటి

చిలకలూరిపేటరూరల్,ఏప్రిల్3,ప్రభాతవార్త: మండలంలోని బొప్పూడి గ్రామానికి చెందిన టిడిపి నాయకుడు దొడ్డా శేషగిరిరావు నూతన గృహ ప్రవేశ కార్యక్రమంలో స్థానిక శాసనసభ్యుడు ప్రత్తిపాటి పుల్లారావు పాల్గొని శుభాకాంక్షలు తెలియచేశారు. ఆయనతో పాటు జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి తోట రాజారమేష్, టిడిపి నాయకులు జవ్వాజి మదన్‌మోహన్, కామినేని సాయిబాబు, అంబటి సోంబాబు, కందుల రమణ, గుంటు కోటేశ్వరరావు, మండల పార్టీ నాయకులు పాల్గొని అభినందనలు తెలియచేశారు.

# కోలగుట్లలో కమ్యూనిటీ హాలును ప్రారంభించిన ఎమ్మెల్యే

**మాచర్ల, ఏప్రిల్ 3 ప్రభాతవార్త:** దుర్గి మండలం కోలగుట్ల గ్రామంలో దాదాపు కోటి రూపాయలతో నూతనంగా నిర్మించిన శ్రీ యండపల్లి చంద్రమౌళి శ్రీమతి అరుంధతి కమ్యూనిటీ హాలును మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతిఒక్కరూ పురిటిగడ్డ రుణం తీసుకోవాలని సూచించారు. పూర్వీకులు గ్రామ



కరణాలుగా, ప్రజాప్రతినిధులుగా పనిచేసిన పెద్దరికాన్ని మరవకుండా స్వగ్రామానికి ఏదో ఒకటి చేయాలని వారి పిల్లలు ఆలోచించి, రుణం తీర్చుకోవడం ఆదర్శనీయమన్నారు. గ్రామాభివృద్ధిలో భాగస్వాములుగా మారిన యండపల్లి కుటుంబాన్ని ఈ సందర్భంగా ఆయన అభినందించి సన్మానించారు. అలానే కమ్యూనిటీ హాలు పక్కనే నూతనంగా నిర్మిస్తున్న వెంకటేశ్వర స్వామి ఆలయానికి తితిదేతో మాట్లాడి తనవంతు సాయం అందిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో యండపల్లి కుటుంబ సభ్యులు, గ్రామపెద్దలు, ప్రజలు కూటమి పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# దేవాలయాలు ఆధ్యాత్మిక చింతనకు నిలయాలు

## -వైకాపా సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ

పొన్నూరు, ఏప్రిల్ 3,ప్రభాతవార్త: దేవాలయాలు ఆధ్యాత్మిక చింతనకు నిలయాలని, ప్రతి ఒక్కరూ కొంత సమయాన్ని ఆధ్యాత్మికంగా గడపాల్సిన అవసరం ఎంతైనా ఉందని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ అన్నారు. స్థానిక తెలగపాలెం శ్రీ కోదండ రామాలయం మహాకుంభాభిషేక మహోత్సవం సందర్భంగా బుధవారం ఆయన స్వామివారికి దర్శించుకొని ఆశీస్సులు అందుకున్నారు. తొలుత పలువురు నాయకులు, దేవాలయం



ధర్మకర్తల మండలి సభ్యులు అంబటికి ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా అంబటి మురళీకృష్ణ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మికతతోపాటు సేవా భావాన్ని కూడా అలవరచుకోవాలన్నారు. మానవ సేవే మాధవ సేవ అన్న ఆర్యోక్తిని కూడా పాటించేవిధంగా ఆలోచన చేయాలన్నారు. దేవాలయాలకు మహకుంభాభిషేకాలు నిర్వహించడం ద్వారా ఆలయానికి పవర్స్ పెరుగుతాయన్నారు. తద్వారా భక్తుల యొక్క ఆలోచనల్లో కూడా మార్పు వస్తుందన్నారు. తెలగపాలెం కోదండ రామాలయంలో మహాకుంభాభిషేకం నిర్వహించుకోవడం అభినందనీయమన్నారు. యాజ్ఞీకస్వామి శ్రీనివాసుల శ్రీనివాస దీక్షిత అయ్యంగార్, దేవాలయం అర్చకస్వామి చిలకపాటి లక్ష్మణ్‌రామాచార్యులు అంబటికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శాశ్విత ధర్మకర్త ఆకుల వెంకటేశ్వరరావు, దేవాలయం ఛైర్మన్ అల్లం సాంబశివరావు, నాయకులు అమిరినేని సాంబశివరావు, పల్లికల శ్యామ్‌ప్రసాద్ తదితరులున్నారు.

# వక్ఫ్ సవరణ చట్టం భారతదేశ లౌకిక వ్యవస్థకు గొడ్డలిపెట్టు

## -కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త యం రాధాకృష్ణ



**చిలకలూరిపేటటౌన్,ఏప్రిల్3,ప్రభాతవార్త:** భిన్నత్వంలో ఏకత్వం సిద్ధాంతం ద్వారా లౌకిక వాదానికి మాతృకగా నిలిచిన భారతదేశంలో వక్ఫ్ చట్టానికి సవరణలు తీసుకురావటానికి ప్రయత్నించడం ద్వారా బిజెపి నేతృత్వంలోని ఎన్‌డిఎ కూటమి లౌకక వాదానికి గొడ్డలిపెట్టుగా వ్యవహరిస్తుందని నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త యం రాధాకృష్ణ విమర్శించారు. భారతదేశంలో ప్రభుత్వాలకు, పాలకులకు మతాలు, ప్రార్ధనా మందిరాలు, ఏ మతానికి సంబవందించినవి అయినప్పటికి మతపరమైన ఆస్థులకు సంబందించి ఏ విధమైన వివాదం ఏర్పడితే తప్ప జోక్యం చేసుకోవలసిన అవసరం ఏమొచ్చిందని ప్రశ్నించారు. ఇస్లాం మత వ్యతిరేకమైన వక్ఫ్ చట్టసవరణ నిర్ణయాలకు మద్దతు ప్రకటించడం ఎన్నికలకు ముందు వారి మద్దతు తీసుకొని గెలిచి ఇప్పుడు అవసరం తీరాక వారికి వ్యతిరేకంగా నిర్ణయాలు తీసుకోవడం నమ్మించి ద్రోహం చేసినట్లు కాదా అని ప్రశ్నించారు దేశంలో లౌకిక వాదాన్ని కాపాడాలన్నా, అణగారిన వర్గాల వారికి అండగా నిలవాలన్నా, మైనారిటి వర్గాలైన ముస్లింలు, క్రైస్తవులు, బౌద్దులు, జైనులు, సిక్కులు, జొరాస్ట్రియన్లకు హిందు మతంలో అణచివేతకు గురవతున్న వర్గాల వారికి అండగా నిలవాలన్నా, భిన్నత్వంలో ఏకత్వం అనే మన దేశ మూలసిద్ధాంతాన్ని పరిరక్షించాలన్నా రాహుల్ గాంధి నాయకత్వమే శరణ్యమని రాధాకృష్ణ తెలిపారు.

# సమస్యలను పరిష్కరించాలంటూ ఆర్టీసీ యూనియన్ నాయకుల నిరసన

**మాచర్ల, ఏప్రిల్ 3 ప్రభాతవార్త:** పెండింగ్‌లో ఉన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ గురువారం మాచర్ల ఆర్టీసీ బస్టాండ్ వద్ద నేషనల్ మజ్దూర్ యూనియన్ ఆధ్వర్యంలో ఎర్రబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. సస్పెన్షన్‌ల తొలగింపు లేకుండా 1/2019 సర్క్యులర్ అమలు చేయాలని, వెంటనే పదోన్నతులు చేపట్టాల న్నారు. ఎలక్ట్రికల్ బస్సులు సంస్థ ద్వారా కొనుగోలు చేయాలన్నారు. నైటవుట్ అలవెన్సులు రూ.150 నుంచి రూ.400కు పెంచాలని డిమాండ్ చేశారు.




# పాడి రైతుల సంక్షేమమే సంగం ధ్యేయం

**పొన్నూరు, ఏప్రిల్ 3,ప్రభాతవార్త:** సంగం డెయిరీకి పాలు పోస్తున్న పాడి రైతుల సంక్షేమమే ధ్యేయంగా సంగం డెయిరీ ముందుకు సాగుతుందని డెయిరీ డైరెక్టర్ బొర్రు రామారావు అన్నారు. మండల పరిధిలోని వల్లభరావుపాలెం గ్రామానికి చెందిన తాడిపత్రి నాగరాజుకు సంబంధించిన పాడి పశువు అనారోగ్యంతో అకాల మృతి చెందింది. సంగం డెయిరీ పశువుల



సంక్షేమానికి అమలు చేస్తున్న బీమా పథకం ద్వారా వచ్చే నగదును లబ్దిదారునికి అందజేశారు. పశువులకు సంబంధించిన సంక్షేమ పథకం ద్వారా రూ.60వేల చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో బాపట్ల జోనల్ మేనేజర్ టి.వీరేంద్రకుమార్, సూపర్‌వైజర్ గంగాధర్, సొసైటీ అధ్యక్షుడు మదమంచి సత్యనారాయణ, టిడిపి నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా ప్రతి ఒక్కరూ పనిచేయాలి : డిపిఓ భాస్కరరెడ్డి

**నాదెండ్ల,ఏప్రిల్3,ప్రభాతవార్త:** ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా ప్రతి ఒక్కరూ పనిచేయాలని డిపిఓ భాస్కరరెడ్డి పంచాయితీ కార్యదర్శులకు సూచించారు. మండలంలో



గురువారం ఆయన పలు గ్రామాలలో పర్యటించారు. తొలుతగా బుక్కాపురం గ్రామంలో చెత్తసేకరణ, పారిశుధ్య నిర్వహణపై ఆరా తీసారు. గ్రామస్థులు ఆయన దృష్టికి పలు సమస్యలు తీసుకురాగా పంచాయితీ కార్యదర్శిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. రోడ్ల వెంట చెత్తకుప్పలు ఉండటాన్ని గమనించిన డిపిఓ గ్రామ పంచాయితీ కార్యదర్శికి మెమో జారీచేశారు. ఇకనైనా గ్రామంలో పరిస్థితిని చక్కదిద్దాలని పంచాయితీ కార్యదర్శిని ఆదేశించారు. అనంతరం ఎండుగుంపాలెం గ్రామానికి చేరుకొని ఘనవ్యర్థాల నిర్వహణా కేంద్రాన్ని సందర్శించి నిర్వహణా లోపంపై తన అసంతృప్తిని వ్యక్త పరిచారు. ఆ గ్రామ పంచాయితీ కార్యదర్శికి కూడా మెమో జారిచేశారు. ఆ తరువాత జంగాలపల్లి గ్రామాన్ని సందర్శించిన అక్కడ పారిశుధ్య నిర్వహణను సందర్శించారు. అక్కడ సమిత్వ చివరిదశకు చేరుకోవడంతో అక్కడ కార్యదర్శికి పలు సూచనలు చేశారు. చివరిగా మండల కేంద్రమైన నాదెండ్ల యంపిడిఓ కార్యాలయంలోమండల పరిధిలోని పంచాయితీ కార్యదర్శులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని గ్రామాలలో చెత్తసేకరణ ప్రక్రియను సమర వంతంగా నిర్వహించాలని, పారిశుధ్య నిర్వహణపై ఐవిఆర్ఎస్ ఫోన్ కాల్స్ వస్తున్నందును ప్రజల నుండి మంచి స్పందన లభించేలా అందరూ కృషి చేయాలని కోరారు. ఇంటి పన్నులు సకాలంలో వసూలు చేసి నూటికి నూరు శాతం సాధించాలని అన్నారు. అన్ని గ్రామాలలో 22 అడుగుల వెడల్పు రోడ్డు ఉండేలా ప్రణాళికలు రూపొందించుకోవాలని సూచించారు. ఈ పర్యటనలో ఆయనతో పాటు ఈఓపిఆర్‌డి నిర్మలా లక్ష్మీకుమారి, పంచాయితీ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

# ఉచిత శిక్షణ తరగతులు సద్వినియోగం చేసుకోవాలి

**మాచర్ల, ఏప్రిల్ 3 ప్రభాతవార్త:** పదో తరగతి పరీక్షలు రాసిన అనంతరం ఏపీఆర్‌జేసీ, పాలిటెక్నిక్ తదితర ఎంట్రన్స్ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు ఉచిత కోచింగ్, స్పోకెన్ ఇంగ్లీషు తరగతులను సద్వినియోగం చేసుకోవాలని తెదేపా యువ నాయకులు జూలకంటి గౌతమ్‌రెడ్డి, జూలకంటి అక్కిరెడ్డిలు అన్నారు. గురువారం మాచర్ల పట్టణంలోని రామకృష్ణ సేవా సమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత శిక్షణ తరగతులను ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ సామాజిక సేవా కార్యక్రమాలకు పూర్తిగా సహకరిస్తామని, నియోజకవర్గ అభివృద్ధి, సంక్షేమమే ఎమ్మెల్యే జూలకంటి ప్రధాన లక్ష్యమని వారు వెల్లడించారు. పదో తరగతి పూర్తయిన విద్యార్థులందరూ పాలిటెక్నిక్, ఏపీఆర్‌జేసీ, స్పోకెన్ ఇంగ్లీషులకు సంబంధించిన ఉచిత శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. విద్యార్థుల కోసం అనేక సేవా కార్యక్రమాలు చేస్తున్న శ్రీరామకృష్ణ సేవా సమితికి ఈ సందర్భంగా ఆర్థిక సహాయం ప్రకటించారు. అనంతరం గౌతమ్‌రెడ్డి, అక్కిరెడ్డిలను సేవాసమితి అధ్యక్షులు మెట్టు గోవిందరెడ్డి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో వివేకానంద ఆశ్రమ సిబ్బంది, తెలుగుదేశం పార్టీ మాచర్ల పట్టణ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# వైద్యరంగంలో విప్లవాత్మక మార్పులు : ప్రొఫెసర్ ఆసింబికాస్ దాస్

పొన్నూరు, ఏప్రిల్ 3,ప్రభాతవార్త: ఎఐ, నెట్‌వర్క్ బయోలజీ ప్రెసిషన్ థెరపీలు వైద్య రంగంలో విప్లవాత్మక మార్పులను తీసుకురావడంలో కీలక పాత్ర పోషిస్తాయని ఎన్ఐటీ వరంగల్ డిపార్టుమెంట్ ఆఫ్ బయోటెక్నాలజీ అసోసియేట్ ప్రొఫెసర్ ఆసిం బికాస్ దాస్ అన్నారు. చేబ్రోలు మండలం, వడ్లమూడి విజ్ఞాన్స్ యూనివర్సిటీలో స్కూల్ ఆఫ్ బయోటెక్నాలజీ అండ్ ఫార్మాస్యూటికల్ సైన్సెస్ విభాగంలోని బయోటెక్నాలజీ, బయో ఇన్ఫర్మేటిక్స్, స్కూల్ ఆఫ్ కంప్యూటింగ్, ఇన్ఫర్మేటిక్స్ విభాగంలోని సీఎస్ఈ, ఏసీఎస్ఈల సంయుక్త ఆధ్వర్యంలో రీసెంట్ కంప్యూటింగ్ ట్రెండ్స్ ఫర్ బయోఇన్ఫర్మేటిక్స్, బయోటెక్నాలజీ అనే అంశంపై మూడు రోజులపాటు నిర్వహించనున్న నేషనల్ కాన్ఫరెన్స్, వర్క్‌షాప్‌ను గురువారం ఘనంగా ప్రారంభించారు. కార్యక్రమంలో ముందుగా జ్యోతి ప్రజ్వలన నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ప్రొఫెసర్ ఆసిం బికాస్ దాస్ మాట్లాడుతూ క్యాన్సర్ అనేది ప్రపంచ వ్యాప్తంగా పెద్ద సవాలుగా మిగిలిపోయిన ఒక ముఖ్యమైన ఆరోగ్య సమస్య అని, ఈ రోజుల్లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ), నెట్‌వర్క్ బయోలజీ వంటి ఆధునిక సాంకేతికతలు క్యాన్సర్ చికిత్సలో విప్లవాత్మక మార్పులను తీసుకురావడంలో కీలక



పాత్ర పోషిస్తున్నాయన్నారు.ఏఐ సాంకేతికతలు, ముఖ్యంగా డీప్ లెర్నింగ్, మెషీన్ లెర్నింగ్ విధానాలు క్యాన్సర్ నిర్ధారణలో మరింత ఖచ్చితత్వాన్ని అందించడం, అలాగే మరింత వేగంగా చికిత్సా ప్రణాళికలను తయారు చేయడంలో సహాయపడుతున్నా యన్నారు. డాక్టర్ నందకుమార్ యెల్లపు మాట్లాడుతూ కంప్యూటేషనల్ వైద్య విజ్ఞానం సమ్మిళితంగా, వ్యక్తిగత వైద్య శాస్త్రాన్ని మరింత అభివృద్ధిచేస్తూ ప్రతి రోగికి అనుకూలమైన చికిత్సను అందించే దిశగా నడుస్తోందన్నారు. మరో అతిథి సీనియర్ సైంటిస్ట్ డాక్టర్ ఆదిత్య నారాయణ్ సరంగి మాట్లాడుతూ కంప్యూటేషనల్ వర్క్‌ఫ్లో మరింత స్వయంచాలకంగా మారుతూ, వేగవంతమైన, ఖచ్చితమైన వ్యాధి నిర్ధారణను అందించే విధంగా అభివృద్ధి చెందుతోందన్నారు. కార్యక్రమంలో విజ్ఞాన్స్ వీసి పి.నాగభూషణ్, ఆయా విభాగాల డీన్లు, అధిపతులు, అధ్యాపక సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

# మునిసిపల్ కార్యాలయంలో బీఎల్ఓలకు శిక్షణ

**మాచర్ల, ఏప్రిల్ 3 ప్రభాతవార్త:** మాచర్ల మున్సిపల్ కార్యాలయంలో నియోజకవర్గంలోని బూత్ లెవల్ అధికారుల (బీఎల్ఓ)కు ఒక్కరోజు శిక్షణ సమావేశం గురువారం జరిగింది. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కలెక్టర్ గాయత్రీదేవి మాట్లాడుతూ బీఎల్ఓలు ఓటర్ల జాబితాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఓటర్ల జాబితాలో బీఎల్ఓల పనితీరును మాచర్ల తహశీల్దారు, మున్సిపల్ కమిషనర్ ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని ఆదేశించారు. మార్పులు, చేర్పులు, తొలగింపులపై నిబంధనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మాచర్ల తహశీల్దారు



బి.కిరణ్‌కుమార్, మాచర్ల మున్సిపల్ కమిషనర్ డి.వేణుబాబు, వెల్దుర్తి తహశీల్దారు షేక్ బాషాలు పాల్గొన్నారు.

# ప్రభుదాసు కుటుంబానికి ఆర్థిక సాయం


**విజయపురిసౌత్, ఏప్రిల్ 3 ప్రభాతవార్త:** విజయపుసౌత్‌కు చెందిన జక్కి ప్రభుదాసు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందడంతో, ప్రభుదాసు కుటుంబానికి స్థానిక మాల సంఘం ఆధ్వర్యంలో గురువారం ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా స్థానిక మాల సంఘం నాయకులు బొబ్బిలి చంద్రశేఖర్ కట్టా రాజు రూ.14,000 నగదును మృతుని కుటుంబానికి అందజేశారు.



అనంతరం బొబ్బిలి చంద్రశేఖర్ మాట్లాడుతూ జక్కి ప్రభుదాసు అనారోగ్యంతో మృతి చెందడం బాధాకరమన్నారు. ఆయన కుటుంబానికి అండగా ఉంటామని తెలిపారు.

# వైకాపా సానుభూతిపరునిపై టిడిపి వర్గీయులు దాడి

**సత్తెనపల్లి, ఏప్రిల్ 3 ప్రభాతవార్త :** నియోజకవర్గంలోని ముప్పాళ్ళ మండలం లంకెలకూరపాడు గ్రామంలో వైకాపా సానుభూతిపరునిపై టిడిపి వర్గీయులు గురువారం దాడికి పాల్పడ్డారు. గ్రామానికి చెందిన మల్లిరెడ్డి శ్రీనివాసరెడ్డి పై టిడిపి వర్గీయులు విచక్షణారహితంగా దాడి చేశారు. దాడిలో శ్రీనివాసరెడ్డి గాయపడ్డాడు. శ్రీనివాసరెడ్డి సత్తెనపల్లి ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతూ స్పృహ కోల్పోయారు.




## బూత్‌లెవల్ అధికారులకు శిక్షణ



పెదకూరపాడు, ఏప్రిల్ 3 ప్రభాతవార్త : బూత్‌లెవల్ అధికారులకు శిక్షణా కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఐసిడిఎస్ పి.డి. ఉమాదేవి కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. నియోజకవర్గ పరిధిలోని బూత్‌లెవల్ అధికారులకు సంబంధించి షాదీఖానాలో తరగతులను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఐదు మండలాల తహశీల్దార్లు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. అధికారులకు వివిధ అంశాలపై వక్తలు అవగాహన కల్పించారు.

# ఘనంగా చత్రపతి శివాజీ వర్ధంతి

**సత్తెనపల్లి, ఏప్రిల్ 3 ప్రభాతవార్త :** స్థానిక మహారాష్ట్ర వీధిలో చత్రపతి శివాజీ వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రభుత్వ ఆసుపత్రి మాజీ డైరెక్టర్ కొత్త రామకృష్ణ, ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు అన్నం బాలసుబ్రహ్మణ్యం లు



ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ముందుగా వారు చత్రపతి శివాజీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కొత్త రామకృష్ణ మాట్లాడుతూ హిందూ తత్వాన్ని పెంపొందించే విధంగా చత్రపతి శివాజీ తన జీవితాన్ని అర్పించారని, అలాంటి గొప్ప వారి జయంతి, వర్ధంతి జరుపుకోవడం హిందువులుగా మన బాధ్యత అన్నారు. అన్నం బాలసుబ్రహ్మణ్యం మాట్లాడుతూ చత్రపతి శివాజీ విగ్రహాన్ని ప్రతిష్ఠించి మహారాష్ట్ర వీధి వారు ఎంతో గొప్ప పని చేశారని కొనియాడారు. మహారాష్ట్ర వీధి ఆంజనేయస్వామి గుడి అధ్యక్షులు ఫీరోజి మాట్లాడుతూ పిలవగానే ఈ కార్యక్రమానికి విచ్చేసిన రామకృష్ణ, బాలసుబ్రహ్మణ్యంలకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో చెక్క రవికుమార్, దేవరశెట్టి రఘుకిషోర్, ఫిరోజి, శివాజీ, మాజీ వార్డు కౌన్సిలర్ పులహరీ భానుజీ, అశోక్, పవన్, వెంకటేశ్వర్లు, ప్రసాద్, సరోసోజి, గోవిందరావు తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి రోగికి ప్రభుత్వ సౌకర్యాలు అందిస్తున్నాం

## -నిడుబ్రోలు ప్రభుత్వాసుపత్రి సూపరింటెండెంట్ ఫిరోజ్‌ఖాన్

**పొన్నూరు, ఏప్రిల్ 3,ప్రభాతవార్త:** వైద్యశాలకు వచ్చే ప్రతి రోగికి క్రమం తప్పకుండా ప్రభుత్వ సదుపాయాలన్నీ కల్పిస్తున్నామని నిడుబ్రోలు



ప్రభుత్వాసుపత్రి వైద్యాధికారి డాక్టర్ ఫిరోజ్‌ఖాన్ చెప్పారు. నిడుబ్రోలు ప్రభుత్వాసుత్రిలో ఇన్ పేషెంట్లుగా చేరే ప్రతి ఒక్కరిరి గురువారం నుంచి ఆహారం అందించే సౌకర్యాన్ని ప్రారంభించినట్లు డాక్టర్ ఫిరోజ్‌ఖాన్ తెలిపారు. టిడిపి నాయకుడు చెన్నుపాటి భాస్కర్ మాట్లాడుతూ ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్రకుమార్ ఇటీవల ప్రభుత్వాసుపత్రిని సందర్శించినప్పుడు రోగులకు అందించే సౌకర్యాల గురించి అడిగి తెలుసుకొన్నారు. ఆ సమయంలో ఇన్ పేషెంట్లకు భోజనాన్ని అందించాలని ఆదేశించడంతో, ఈ సదుపాయం అమలు లోకి వచ్చింది. ఇన్‌పేషెంట్లుగా ఉండేవారికి ఉదయం టిఫిన్, మధ్యాహ్నం భోజనం, రాత్రికి మళ్ళీ భోజనం ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. పలువురు రోగులు ముఖ్యమంత్రి, ఉపముఖ్యమంతి, ఎమ్మెల్యే నారా చంద్రబాబునాయుడు, పవన్ కళ్యాణ్, నరేంద్ర కుమార్‌కు కృతజ్ఞతలు తెలియజేస్తు న్నారు. ఈ కార్యక్రమంలో పఠాన్ అహ్మద్‌ఖాన్ తదితరులున్నారు.

# పార్టీ సభ్యత్వ నమోదు కార్డులు పంపిణీ

**పొన్నూరు, ఏప్రిల్ 3,ప్రభాతవార్త:** పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో తెలుగుదేశం పార్టీ సభ్యత్వ నమోదు కార్డులను గురువారం కార్యకర్తలకు, నాయకులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ముఖ్య అతిథులుగుగా పాల్గొన్న మాదల వెంకటేశ్వరరావు, బొర్రు రామారావు



మాట్లాడుతూ పార్టీ సభ్య నమోదులో నాయకులు, కార్యకర్తలు ఎంతో ఉత్సాహాన్ని ప్రదర్శించి పెద్ద ఎత్తున సభ్యత్వ నమోదు చేయించారన్నారు. సభ్యత్వం పొందిన ప్రతి ఒక్కరికీ కార్డులను అందజేస్తున్నట్లు చెప్పారు. సభ్యత్వం పొందిన ప్రతి ఒక్కరూ కార్డులను పొందాలని కోరారు. ఈ కార్యక్రమంలో బండ్లమూడి బాబూరావు, గరిగంటి సాయిబాబు, బుడ్డా బీరయ్య తదితరులు పాల్గొన్నారు.

# సకల గుణాభిరాముడు శ్రీరాముడు

## -యాజ్ఞీకస్వామి శ్రీనివాసుల శ్రీనివాస దీక్షిత్ అయ్యంగార్

**పొన్నూరు, ఏప్రిల్ 3,ప్రభాతవార్త:** సకల గుణాభిరాముడు శ్రీరాముడని, ఆయనలోని సుగుణాలు ప్రతి ఒక్కరూ ఆచరించదగినవేనని యాజ్ఞీకస్వామి శ్రీనివాసుల శ్రీనివాస దీక్షిత్ అయ్యంగార్ అన్నారు. స్థానిక తెలగాపాలెం శ్రీ



కోదండ రామాలయం శ్రీ మహాకుంభాభిషేక మహోత్సవం సందర్భంగా స్వామివారికి రాజదర్బార్ నిర్వహించారు. దేవాలయంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వేదికపైకి స్వామి, అమ్మవార్లను వేంచేపచేసి రాజదర్బార్ నిర్వహిచారు. ఈ సందర్భంగా శ్రీనివాసుల దీక్షిత్ అయ్యంగార్ మాట్లాడుతూ శ్రీరాముని యొక్క జీవితం ప్రతి ఒక్కరికి ఆచరణీయం, అనుసరణీయ మన్నారు. శ్రీరామునికి చరిత్రకు సంబంధించిన రామాయణాన్ని ప్రతి ఒక్కరూ చదువుకొని జీవితాలను చక్కదిద్దుకునేవిధంగా చేయాలన్నారు. కొన్ని వందల సంవత్సరాలపాటు సువరిపాలన అందించిన ఘనత శ్రీరాముడికే దక్కుతుందన్నారు. రామాయణంలోని ప్రతి ఘట్టము మన నిత్య జీవితంతో పెనవేసుకొని ఉంటాయన్నారు. కుంభాభిషేకంలో భాగంగా ఉత్సవమూర్తులకు విశేష పంచామృత స్నపనం, వసంతోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దేవాలయం శాశ్వత ధర్మకర్త ఆకుల వెంకటేశ్వరరావు దంపతులు, పేర్లు నమోదు చేసుకొన్న కలపాల శ్రీనివాసరావు, యరసాని నాగభూషణరావు దంపతులు ఉభయ దాతలుగా పాల్గొని పూజాది కార్యక్రమాలను నిర్వహించారు. భక్తులకు తీర్థప్రసాద వినియోగం జరిగింది. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగ కుండా దేవాలయం ఛైర్మన్ అల్లం సాంబశివరావు, ఉపాధ్యక్షుడు అప్పికట్ల వెంకటేశ్వరరావు, కార్యదర్శి శింగంశెట్టి శివశంకర్, వల్లంశెట్టి శ్రీధర్,పలువురు సభ్యులు ఏర్పాట్లు చేశారు.

# కెఎల్‌యులో రక్తదాన శిబిరం

**తాడేపల్లి,ఏప్రిల్ 3,ప్రభాతవార్త :** అత్యవసర పరిస్థితుల్లోఉన్న వారికి రక్తం అవసరమని అందుకు స్వచ్ఛంద రక్తదానాన్ని ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా చూడాలని,ఈ చిన్నసాయం ఎంతో మంది ప్రాణాలను కాపాడతోపాటు మానవత్వనిని,పరోపకారానికి గొప్ప ఉదాహరణగా నిలుస్తుందని,రక్తదానం చేద్దాం,ప్రాణ్ని హిద్మానిని కెఎల్ యూనివర్సిటీ విద్యార్థి సంక్షేమ విభాగం ఇన్చార్జి డీన్ డాక్టర్ కెఆర్ఎస్ ప్రసాద్ విద్యార్థులకు సూచించారు.గురువారం కెఎల్ యూనివర్సిటీ ఎన్ఎస్ఎస్,వైఆర్సి,జేసిఐఎ స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన



స్వచ్ఛంద రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు.18-60ఏళ్ళ మధ్య వయస్సు ఉండి, 50కిలోల బరువు ఉన్న ఆరోగ్యవంతులు ఎవరైనా 3నెలలకోసారి రక్తదానం చేయవచ్చని,రక్తదానం చేయడం వలన శరీరం బలహీనపడటం,నీరసించి పనులు చేసుకోలేకపోవడం వంటి అపోహలను తొలగించుకోవాలని,డీన్ స్టూడెంట్ అఫైర్స్ సహదారులు డాక్టర్ హబీబుల్లాఖాన్ శిబిరానికి వచ్చిన రక్తదాతలకు అవగాహన కల్పించారు.జిజిహెచ్ విజయవాడ,రెడ్‌క్రాస్ గుంటూరు బ్లడ్ బ్యాంక్ వారికి రక్తదానం చేసినట్లు ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ పి.శ్రీకాంత్‌రెడ్డి,వైఆర్సి కోఆర్డినేటర్ డాక్టర్ ఆర్.సుప్రియ తెలిపారు.శిబిరానికి సమన్వయకర్తగా వ్యవహరించిన పి.సురేష్,రక్తదాతలను వర్సిటీ వీసి డాక్టర్ జి.పార్థసారధివర్మ,ప్రొ వీసిలు డాక్టర్ ఏవిఎస్ ప్రసాద్,డాక్టర్ కె.రాజశేఖరరావు,డాక్టర్ ఎన్.వెంకట్రామ్,విద్యార్థి సంక్షేమ విభాగం ఇన్చార్జి డీన్ డాక్టర్ కెఆర్ఎస్ ప్రసాద్,ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ పి.శ్రీకాంత్‌రెడ్డి,యూత్ రెడ్‌క్రాస్ ఇన్చార్జ్ డాక్టర్ ఆర్.సుప్రియ,జేసిఐ జోన్ డైరెక్టర్ రవీంద్రారెడ్డి తదితరులు అభినందించి సర్టిఫికెట్లు అందజేశారు.

# ముఖ్యపోషకాలతో కాలిఫోర్నియా బాదం

**విజయవాడ, ఏప్రిల్ 3, ప్రభాతవార్త :** ఈనెల 7న ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా 15 ముఖ్యపోషకాలనందించే కాలిఫోర్నియా బాదంతో మెరుగైన, ఆరోగ్యకరమైన జీవితం లభిస్తుందని సంస్థ ప్రతినిధులు తెలిపారు. ప్రోటీన్, డైటరీ ఫైబర్, ఆరోగ్యకర కొవ్వు, మెగ్నీషియం, జింక్, విటమిన్ఇ తదితర పోషకాలు జీవనశైలికి తెలివైన జోడింపు అన్నారు.

# లాక్మే ఫ్యాషన్ వీక్‌లో మ్యాక్స్‌ఫ్యాషన్ అరంగ్రేటం

**విజయవాడ, ఏప్రిల్ 3, ప్రభాతవార్త :** లాక్మేఫ్యాషన్ వీక్ ఎఫ్ డిసిఐ యొక్క 25వ ఎడిషన్‌లో మ్యాక్స్ ఫ్యాషన్ అరంగేట్రం చేయడం ద్వారా హైస్ట్రీట్ స్టైల్‌ను మ్యాక్స్ ఫ్యాషన్ కొత్తగా లిఖించినట్లు"మ్యాక్స్ మార్కెటింగ్ హెడ్ పల్లవి పాండే, మ్యాక్స్ హెడ్ సుమిత్ చంద్నా లు ప్రకటించారు. సిలిరియస్ సమ్మర్ అవార్డ్ ఎస్వైప్ కలెక్షన్లను ప్రారంభించడంతో అందరూ మెచ్చే ఫ్యాషన్ లక్షణాన్ని తీసుకువచ్చామని తెల్పారు. 210 నగరాల్లో, 520 పైగా దుకాణాలతో పాటు ఆన్‌లైన్ ద్వారా భారతీయ ఫ్యాషన్ నియమాలను తిరిగి వ్రాస్తోందన్నారు.

# దరఖాస్తుల పరిశీలన క్యాంపుకు 1521 మంది దరఖాస్తు దారులు హాజరు : కమిషనరు

**గుంటూరుకార్పొరేషన్,ఏప్రిల్3, ప్రభాతవారత :** గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో ప్రభుత్వ స్వయం ఉపాధి పథకాలకు తూర్పు నియోజక




వర్గంలో దరఖాస్తు చేసుకున్న 3141 మందిలో గురువారం బ్రహ్మానందరెడ్డి స్టేడియంలో దరఖాస్తుల పరిశీలన క్యాంప్ కి 1521 మంది హాజరయ్యారని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఐఏఎస్ తెలిపారు. కమిషనర్ ఆదేశాల మేరకు డిప్యూటీ కమిషనర్ డి.శ్రీనివాసరావు, ఉపా సెల్ పిఒ రామారావులు గురువారం బిఆర్ స్టేడియంలో తూర్పు నియోజకవర్గ రుణమేళా క్యాంప్ నిర్వహించారు. ఈ సందర్భంగా డిప్యూటీ కమిషనర్ మాట్లాడుతూ ఓబిఎంఎంఎస్ ద్వారా ప్రభుత్వ స్వయం ఉపాధి పథకాలైన బిసి కార్పొరేషన్, కాపు కార్పొరేషన్, ఈబిసి కార్పొరేషన్, ఏపి వైశ్య కమ్యూనిటి కార్పొరేషన్, బ్రాహ్మణ కమ్యూనిటి కార్పొరేషన్, కమ్మ కమ్యూనిటి కార్పొరేషన్, క్షత్రియ కమ్యూనిటి కార్పొరేషన్, రెడ్డి కమ్యూనిటి కార్పొరేషన్లకు సంబందించి తూర్పు నియోజకవర్గంలో లబ్దిదారులను ఎంపిక చేయడానికి ప్రత్యేక క్యాంప్ నిర్వహించామన్నారు. క్యాంప్ కి హాజరైన వారి దరఖాస్తులను ఆయా శాఖల అధికారులు పరిశీలించారన్నారు.కార్యక్రమంలో లీడ్ బ్యాంక్ మేనేజర్ రత్న మహిపాల్ రెడ్డి, బిసి కార్పొరేషన్ ఈడి మయూరి, కార్పొరేటర్ మీరావలి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# క్యాన్సర్ రోగుల వైద్యసేవలకై ఒప్పందం

**గుంటూరు తూర్పు, ఏప్రియల్ 3 ప్రభాతవార్త :** గుంటూరులోని ప్రభుత్వ సాధారణ ఆసుపత్రిలో నవ్య కేర్ నెట్‌వర్క్, నేషనల్ క్యాన్సర్ గ్రిడ్ (ఆంధ్రప్రదేశ్ చాప్టర్) తో కలిసి క్యాన్సర్ రోగులకు




వ్యక్తిగతీకరించిన చికిత్సా ప్రణాళికలను అందించడానికి భాగస్వామ్యం కుదుర్చుకుంది. ఈ కార్యక్రమం జి.ఇ. హెల్త్‌కేర్ ద్వారా ప్రారంభించబడింది. అలాగే టిఎంసి ఎన్‌సిజి నవ్య ద్వారా ప్రభుత్వ అసుపత్రులలో క్లినికల్ సామర్థ్యాలను మెరుగుపరచడం, ఆధారిత చికిత్సా ప్రణాళికలు, వర్చువల్ మల్టీడిసిప్లినరీ ట్యూమర్ బోర్డ్‌ను ఏర్పాటు చేయడం జరుగుతుంది. ఆంధ్రప్రదేశ్‌లో పెరుగుతున్న క్యాన్సర్ కేసులను దృష్టిలో ఉంచుకొని, పరిమిత సంరక్షణ సౌకర్యాలు, నిపుణుల కొరతను అధిగమించడానికి ఈ ప్రయత్నం ఉపయోగపడుతుంది. టిఎంసి ఎన్‌సిజి నవ్య యొక్క సాంకేతిక పరిష్కారం నిపుణుల అందుబాటును పెంచడం ద్వారా క్యాన్సర్ సంరక్షణలో ఉన్న అంతరాలను తగ్గిస్తుంది. గుంటూరులోని జిజిహెచ్‌లో టిఎంసి ఎన్‌సిజి నవ్య క్లినికల్ వనరులను ఏర్పాటు చేస్తుంది. రోగుల నివేదికలను విశ్లేషిస్తుంది, చికిత్స చేస్తున్న వైద్యులకు తక్షణమే సిఫార్సులు అందిస్తుంది. ఇది మెరుగైన ఫలితాలను అందించడానికి రోగుల ఆందోళనను తగ్గించడానికి సహాయపడుతుంది. టి.కృష్ణబాబు హెల్త్ మెడికల్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్‌చే వర్చువల్‌గా ఈ ప్రాజెక్ట్ లాంచ్ చేయడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ ప్రాజెక్ట్ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం టాటా మెమోరియల్ సెంటర్, హోమీ భాభా క్యాన్సర్ హాస్పిటల్ అండ్ రీసెర్చ్ సెంటర్, విశాఖపట్నం మధ్య ఏర్పడిన భాగస్వామ్యంలో ఒక భాగం. నేషనల్ క్యాన్సర్ గ్రిడ్ (ఎన్‌సిజి-ఏపి) రాష్ట్రంలో క్యాన్సర్ సంరక్షణను మెరుగుపరచడానికి ఒక సమర్థవంతమైన నెట్‌వర్క్‌ను సృష్టించడం లక్ష్యంగా పెట్టుకుంది. ఈ కార్యక్రమంలో జిఎంసి జిజిహెచ్ అధ్యాపక బృందం, హెచ్ఓడిలు, సిబ్బంది, నవ్య గ్రూపు సభ్యులు పాల్గొన్నారు.

# ఘనంగా అమ్మాజాన్ గంధ మహోత్సవం

**ఎ కొండూరు, ఏప్రిల్ 3, ప్రభాతవార్త :** ఎ కొండూరు మండలం చీమలపాడు ఎఎంటికె దర్బార్ బాబె ఎ బాగ్దాద్ దర్బార్ అండ్ దర్గాలో హజరత్ అతావుల్లా బాబా వారి ధర్మపత్ని మహోన్నత సూఫీ మహనీయ జనని ఖ్రమున్నీసా బేగం (ర.అ) వారి ఉర్స్ సందర్భంగా గురువారం ఖురాన్ పఠనంతో పాటు సూఫీ సుగంధ సందల్ ఊరేగింపు కార్యక్రమాన్ని అతావుల్లా బాబా దివ్య సమాధి నుండి ఘనంగా పుష్పాంజలిలో కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పీఠాధిపతి అతావుల్లా బాబా ఆధ్యాత్మిక వారసుడు ముహమ్మద్ బాబా మొహియుద్దీన్ షాతాజ్ ఖాదరీ అమ్మజాన్ సమాధి వద్ద ప్రత్యేక దువా జరిపి అమ్మాజాన్ పవిత్రాత్మకు శాంతి చేకూరాలని వేడుకోలు నిర్వహించారు. ఈ సందర్భంగా భారతదేశం నలుమూలల నుండి తరలివచ్చిన వేలాది మంది కులమతాలకతీతంగా బాబా వారి బక్తులకు మహాదివ్య అన్న సమారాధన దిగ్విజయంగా జరిపారు. ఈ కార్యక్రమంలో ఎండి జాఫర్ సాదిక్, తాజ్ ఖాదర్ బాబు, బొగ్దాది తదితరులు పాల్గొన్నారు.

# బెజవాడ బార్ అసోసియేషన్ ఈసి మెంబర్ల ప్రమాణ స్వీకారం

**విజయవాడ, ఏప్రిల్ 3, ప్రభాతవార్త :** బెజవాడ బార్ అసోసియేషన్లో నూతనంగా ఎన్నికైన 25మంది ఈసి మెంబర్లు, కార్యవర్గ సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. వీరిలో సీనియర్ న్యాయవాదుల కేటగిరిలో పడవల ఏడుకొండలు, దిగువ కేటగిరికి చెందిన కాళహస్తి పద్మజ, జయ లక్ష్మి, స్వామి, జెవి కార్తీక్‌బాబు, జంగా జయలక్ష్మి తదితరులు న్నారు. ఇక బార్ అధ్యక్ష, కార్య దర్శులుగా ఎకె భాషా, జనరల్ సెక్రటరీ కెవి రంగారావు, ఉపాధ్యక్షుడు




పిళ్ళా శ్రీనివాసరావు, జాయింట్ సెక్రటరీ జివి లక్ష్మి, ట్రెజరర్ ఎం సత్యనారాయణ, లైబ్రేరియన్ సెక్రటరీ కె త్రినాథ్, స్పోర్ట్స్ సెక్రటరీ రవిబాబు, మహిళా సెక్రటరీ కె అనురాధ పాల్గొన్నారు. ఈ ప్రమాణ స్వీకారానికి ముఖ్య అతిథులుగా హైకోర్టు బార్ ప్రెసిడెంట్ చిదంబరం, అసిస్టెంట్ అడ్వకేట్ జనరల్ సాయిప్రతాప్, బార్ కౌన్సిల్ సభ్యులు చలసాని అజయ్ కుమార్, సుంకర రాజేంద్రప్రసాద్, మాజీ బార్ అధ్యక్షులు వి గుర్నాథం, సంపర శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

# కోడూరు గ్రామాభివృద్ధే లక్ష్యం : సర్పంచి సురేష్

**ఎ కొండూరు, ఏప్రిల్ 3, ప్రభాతవార్త :** ఎన్‌టిఆర్ జిల్లా ఎ కొండూరు మండలం కోడూరు గ్రామ పంచాయతీ సర్పంచ్‌గా ఎన్నికైన తేళ్లూరి సురేష్ ఈ నెల 3న 4 సంవత్సరాలు దిగ్విజయంగా పూర్తి చేసుకుని ఐదో సంవత్సరంలో అడుగుపెడుతున్న సందర్భంలో గురువారం సర్పంచ్ సురేష్ గ్రామంలో ఈ 4 సంవత్సరాల్లో చేసిన అభివృద్ధి కార్యక్రమాల పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. కోడూరు సర్పంచ్ సురేష్ తిరువూరు నియోజకవర్గ సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడిగా కూడా



పనిచేస్తూ పల్లెసీమల అభివృద్ధికి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల నిధులతో సిసి రోడ్లు, తాగునీరు, పారిశుధ్యం, తదితర అభివృద్ధి కార్యక్రమాలకు ప్రాధాన్యతనిస్తూ స్థానిక అధికారులు ప్రజా ప్రతినిధుల సాకారంతో రాజకీయాలకతీతంగా అభివృద్ధికి శాయశక్తుల తన వంతు కృషి చేస్తున్నట్లు సర్పంచ్ సురేష్ తెలిపారు. రాబోయే మిగిలిన ఏడాది కాలం కూడా గ్రామాభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని ప్రజాసాకారం అధికారుల ప్రోత్సాహంతో ప్రజా సంక్షేమం కోడూరు గ్రామాభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తానని, అలాగే నియోజకవర్గ సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడిగా నియోజకవర్గంలోని తిరువూరు గంపలగూడెం విసన్నపేట ఎ కొండూరు మండలాల్లో పర్యటిస్తూ సర్పంచ్‌ల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకువెళుతున్నట్లు సురేష్ తెలిపారు.

# విద్యార్థులకు సౌకర్యవంతంగా ఐక్యూజెడ్

**విజయవాడ, ఏప్రిల్ 3, ప్రభాతవార్త :** హై ఫెర్ఫార్మెన్స్ స్మార్ట్‌ఫోన్ ఐక్యూజెడ్ 10 సిరీస్ ఈనెల 11న భారత్‌లో ఆవిష్కరిస్తామని సంస్థ ప్రతినిధులు ప్రకటించారు. రెండు రోజులుండేలా 7300 ఎంఏహెచ్ బ్యాటరీ యువనిపుణులు, విద్యార్థులకు మరింత సౌకర్యవంతంగా వుంటుందన్నారు.

# వేసవికి అమేజాన్ పే నుండి ప్రత్యేక డీల్స్

**విజయవాడ, ఏప్రిల్ 3, ప్రభాతవార్త :** ఏప్రిల్ 7 నుండి విమానాలు, హోటళ్లు, మూవీటికెట్స్, మరెన్నో వాటిపై ప్రత్యేక ప్రయోజనాలతో వేసవి ప్రణాళికను సులభం చేశామని అమేజాన్‌పే ప్రతినిధులు ప్రకటించారు. ప్రయాణం, బస్ అప్‌గ్రేడ్, సీజన్‌షాపింగ్ ఇలా ఎన్నిటికో వేసవి గమ్యస్థానాన్ని అన్వేషించేవారికి అమేజాన్‌పే సిద్ధంగా వుందన్నారు.

# సిల్వర్‌జుబ్లీ జరుపుకుంటున్న స్కోడా ఆటో

**విజయవాడ, ఏప్రిల్ 3, ప్రభాతవార్త :** భారతదేశంలో అడుగిడిన 25 సంవత్సరాల చరిత్రలో నెలవారీ అమ్మకాల రికార్డును సాధించడం ద్వారా సిల్వర్ జుబ్లి వేడుకలు నిర్వహిస్తున్నట్లు స్కోడా ఆటో ఇండియా ప్రతినిధులు తెలిపారు. మార్చి 2025లో 7,422 యూనిట్ల అమ్మకాలు సాధించామన్నారు. కొత్త కైలాక్ ఎస్‌యువి ప్రవేశపెట్టిన వెంటనే రణవీర్‌సింగ్ బ్రాండ్ మొదటి సూపర్స్టార్‌గా అవతరించి ఈ అద్భుత విజయం సాధించేలా సహకరించారన్నారు.

# పిల్లల ఎత్తులు బరువులు పరిశీలన

**కొల్లూరు, ఏప్రియల్ 3 (ప్రభాతవార్త) :** అంగన్‌వాడీ కేంద్రాల్లోని పిల్లల ఎత్తులను బరువులను ఖచ్చితంగా ఉండే విధంగా చర్యలు తీసుకుంటున్నట్లు అమృతలూరు ప్రాజెక్టు ఐసిడిఎస్ అధికారిణి గన్నవరపు విజయలక్ష్మీ తెలిపారు. గురువారం విజయలక్ష్మీ మాట్లాడుతూ జిల్లా ప్రాజెక్టు అధికారి ఆదేశాల మేరకు ప్రాజెక్టు జిల్లా ప్రాజెక్టు అధికారి ఆదేశాల మేరకు ప్రాజెక్టు పరిధిలోని ఐదు మండలాల అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లల ఎత్తులను, బరువులను పరిశీలన చేస్తున్నామన్నారు. వయస్సుకు తగ్గ ఎత్తు బరువు లేకపోయినట్లయితే తల్లులకు వెంటనే సమాచారం అందించి పౌష్టికాహారాన్ని అందజేయాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లల ఎత్తులు బరువులు ఖచ్చితంగా రికార్డులలో నమోదయ్యే విధంగా కార్యకర్తలు చూడాలన్నారు. రికార్డులలో నమోదు అయిన ప్రతి పిల్లవాడి ఎత్తు బరువులను పరిశీలన చేయించాలని ఆదేశాలు ఇచ్చారు. వేసవి కాలం దృష్ట్యా ఉదయం పది గంటల లోపు పిల్లలు ఎత్తులను బరువులను చూసుకోవాలని అన్నారు. సకాలంలో పౌష్టికాహారాన్ని అందజేయాలన్నారు.



అంగన్‌వాడీ కేంద్రాల్లోనే పిల్లలకు వాటర్‌ను అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్లు విజయలక్ష్మీ, ఫజరున్నీసా, కార్యకర్తలు పాల్గొన్నారు.

# పాంచాళవరం, పెదపూడి గ్రామాల్లో నేడు రీ సర్వేపై రైతులకు అవగాహన

**అమృతలూరు, ఏప్రిల్ 3, ప్రభాతవార్త:** మండల పరిధిలోని పాంచాళవరం, పెదపూడి గ్రామాల్లో రీ సర్వే నిర్వహించడం జరుగుతుందని తహశీల్దార్




కె.నెహ్రూబాబు తెలిపారు. గురువారం ఈ రెండు గ్రామాల్లోని వీధుల్లో రెవిన్యూ సిబ్బంది, గ్రామ రైతులతో తహశీల్దార్ నెహ్రూబాబు రీ సర్వే ప్రారంభోత్సవ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ నెహ్రూబాబు మాట్లాడుతూ మొదటి ఫేజ్‌లో కోరుతాడిపర్రు గ్రామంలో రీ సర్వే నిర్వహించడం జరిగిందని తెలిపారు. రెండవ ఫేజ్‌లో పాంచాళవరం, పెదపూడి గ్రామాల్లో రీ సర్వే నిర్వహించడం జరుగుతుందని చెప్పారు. రీ సర్వే జరిగేటప్పుడు రైతులు ఏమైనా సమస్యలు ఉంటే రెవిన్యూ సిబ్బంది దృష్టికి తీసుకురావాలని తెలిపారు. పాంచాళవరం, పెదపూడి గ్రామాల్లో ఏప్రిల్ 4వ తేది 4గంటలకు రీ సర్వేపై రైతులకు అవగాహన కల్పించేందుకు గ్రామ సభలు నిర్వహిస్తున్నామని, ఆయా గ్రామాల్లో రైతులందరు పాల్గొనాలని తహశీల్దార్ నెహ్రూబాబు కోరారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచ్‌లు పావులూరి హేమచంద్, పెదపూడి ఆనందబాబు తదితరులు పాల్గొన్నారు.

# నెలలు తరబడి వేతనాలు రాకపోతే ఎలా?

**పెదకూరపాడు, ఏప్రిల్ 3 ప్రభాతవార్త :** నెలలు తరబడి తమకు వేతనాలు అందకపోతే ఇళ్ళు ఎలా గడుస్తుందని వ్యవసాయ కార్మిక సంఘానికి ఉపాధి కూలీలు మొరపెట్టుకున్నారు. బైక్ యాత్ర బృందం సభ్యులకు తమ సమస్యలను గురువారం తెలియజేశారు. బలుసుపాడు, పరస, 75 తాళ్ళూరు, పెదకూరపాడు, లగడపాడు గ్రామాలలో యాత్ర సాగింది.



ఉపాధిహామీ కూలీలను పలకరించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి రవిబాబు మాట్లాడుతూ కూలీలకు సంబంధించి ఆరు ఏడు వారాలు గడిచినా వేతనాలు అందడం లేదన్నారు. ఉపాధిహామీ కూలీలకు వెంటనే వేతనాలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు భగత్, ఏపూరి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

# ప్రమాదాలకు నిలయంగా మారిన రాజస్థాన్ టీ స్టాల్

**సత్తెనపల్లి, ఏప్రిల్ 3 ప్రభాతవార్త :** సత్తెనపల్లి పట్టణంలో గుంటూరు రోడ్డులో గల గజ్జల హాస్పటల్ ఎదురుగా ఉన్న రాజస్థాన్ టీ స్టాల్ ప్రమాదాలకు నిలయంగా మారింది. వివరాల్లోకి వెళితే హైవే ఆనుకొని రాజస్థాన్‌కు చెందిన కొందరు వ్యక్తులు ఇక్కడ టీ స్టాల్ పెట్టారు. ఈ టీ స్టాల్ వద్ద టీ తాగేందుకు గుంటూరు వైపు నుండి, మాచర్ల వైపు నుండి వచ్చే కార్లు, లారీలు, ఆటోలు, ప్రైవేట్




బస్సులు హైవే పై నిలిచి ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తున్నారు. గతంలో పలుమార్లు ఈ టీ స్టాల్ వద్ద రోడ్డు ప్రమాదాలు జరిగిన సంఘటనలు అనేకం ఉన్నాయి. టీ స్టాల్ నిర్వాహకులు తారు రోడ్డు వరకు కుర్చీలను వేసి విద్యుత్ దీపాలను ఏర్పాటు చేసి రాత్రింబవళ్ళు అమ్మకాలు సాగిస్తున్నారు. వాహనాల రాకపోకలకు చాలా ఇబ్బందిగా మారింది. కేంద్ర ప్రభుత్వం ఇటీవల ఈ హైవే మార్గాన్ని జాతీయ రహదారిగా గుర్తించారు. గుంటూరు నుండి హైదరాబాద్‌కు వెళ్ళే ఈ రహదారి మార్గంలో నిత్యం వాహనాల రద్దీ చాలా ఎక్కువగా ఉంటుంది. కాగా వాహనాల రాకపోకలకు, రోడ్డు ప్రమాదాలకు కారకులవుతున్న రాజస్థాన్ టీ స్టాల్ నిర్వాహకులపై స్థానిక పోలీసులు, పురపాలక సంఘం వారు చట్టపరంగా తగు చర్యలు తీసుకొని ప్రజల ప్రాణాలు కాపాడాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

# డి.ఫార్మసి విద్యార్థులు ఈసెట్ ప్రవేశ పరీక్ష ఉత్తీర్ణులై

## ఉన్నత విద్య అభ్యసించాలి

**గుంటూరు విద్య,ఏప్రిల్ 3,ప్రభాతవార్త :** స్థానిక అమరావతిరోడ్డులోని హిందూ ఫార్మసీ కళాశాల్లోని డి.ఫార్మసీ రెండో ఏడాది విద్యార్థులకు తమ జూనియర్ విద్యార్థులు బుధవారం ఘనంగా వీడ్కోలు సభ ఏర్పాటుచేసినట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.వి.నాగభూషణం తెలిపారు. సమావేశానికి కళాశాల చైర్మన్ జూపూడి రంగరాజు అధ్యక్షత వహించి మాట్లాడుతూ డి.ఫార్మసీ విద్యార్థులు ఇ-సెట్ ప్రవేశపరీక్ష రాసి




బి.ఫార్మసి / ఎం.ఫార్మసీ లాంటి ఉన్నత విద్యను అభ్యసించాలని కోరారు.అనంతరం సాంస్కృతిక కార్యక్రమాల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతి ప్రదానం చేశారు.కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.ప్రత్యూష,కార్యదర్శి డాక్టర్ ఎస్.మధుసూదనరావు,ఫార్మా-డి డైరెక్టర్ డాక్టర్ పి.సీతారామయ్య,డి.ఫార్మసీ అధ్యాపకులు వి.సుధారాణి,ఎన్ మేఘన సంధ్య,టి.మేరీ తదితర అధ్యాపకులు,విద్యార్థులు పాల్గొన్నారు.

# రాజ్యాంగ లక్ష్యాలకు కట్టుబడి నిజాయితీ,నిబద్ధతతో కృషి

**గుంటూరు కల్చరల్,ఏప్రిల్ 3,ప్రభాతవార్త :** గత 14ఏళ్ళుగా పిడిఎఫ్ ఎమ్మెల్సీ గా రాజ్యాంగ లక్ష్యాలకు కట్టుబడి నిజాయితీ నిబద్ధతతో పనిచేశానని అన్ని రంగాల ప్రజల అభ్యున్నతికి వారి సమస్యల పరిష్కారానికి అలుపెరగక కృషి చేశానని అవగాహన సంస్థ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ కె.ఎస్.లక్ష్మణరావు



అన్నారు.సంస్థ కార్యాలయంలో ఎమ్మెల్సీగా పదవీ విరమణ చేసిన సందర్భాన్ని పురస్కరించుకొని ఆయనతో ఇష్టాగోష్టి జరిగింది.కార్యక్రమానికి రాజ్యాంగ చర్చావేదిక కార్యదర్శి అవధానుల హరి అధ్యక్షత వహించారు.చర్చలో లక్ష్మణరావు మాట్లాడుతూ ఎమ్మెల్సీ గా పనిచేసిన ఈ సుదీర్ఘకాలం చాలా సంతృప్తి నిచ్చిందని ఇంతకాలంగా తనకు సహకరించిన అనేక సంఘాలకు,వివిధ రంగాల ప్రముఖులకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నానన్నారు.లక్ష్మణరావు సేవలను,వారి అంకితభావం గురించి వివిధ రంగాల ప్రముఖులు డాక్టర్ సిహెచ్ సుశీల,హనుమంతరెడ్డి,ప్రొఫెసర్ వేణుగోపాలరావు,ఆర్.వి.సింగరయ్య,జొన్నలగడ్డ రామారావు,తాండవకృష్ణ తదితరులు వివరంగా మాట్లాడారు.

04-4Pg5.qxd:04-4Pg5.qxd 01/01/01 8:38 AM Page 1



# బెంగాల్‌లో 25 వేల టీచర్ల నియామకాలు రద్దు

## మమతాబెనర్జీ ప్రభుత్వానికి సుప్రీంకోర్టు షాక్



**న్యూఢిల్లీ, ఏప్రిల్ 3:** పశ్చిమ బెంగాల్ రాజకీయాలను కుదిపేసిన ఉపాధ్యాయ నియామక కుంభకోణం వ్యవహారంలో మమతా బెనర్జీ ప్రభుత్వానికి సుప్రీంకోర్టులో భారీ ఎదురుదెబ్బ తగిలింది. ఈ కేసులో దాఖలైన పిటిషన్లపై దర్యాప్తు చేపట్టిన అత్యున్నత న్యాయస్థానం గురువారం కీలక తీర్పు వెలువరించింది. అవకతవకల ఆరోపణలు ఎదుర్కొంటున్న ఆ 25 వేల టీచర్ల నియామకాలు చెల్లవని సుప్రీంకోర్టు తేల్చి చెప్పింది. ఆ నియామకాలను రద్దు చేస్తూ గతంలో కోల్‌కతా హైకోర్టు ఇచ్చిన తీర్పును సిజెఐ జస్టిస్ సంజీవ్‌ఖన్నా ధర్మాసనం సమర్థించింది. ఈ కుంభకోణంపై గతేడాది ఏప్రిల్‌లో కోల్‌కతా హైకోర్టు సంచలన తీర్పు వెలువరించిన సంగతి తెలిసిందే. 2016 నాటి స్టేట్ లెవల్ సెలక్షన్ టెస్ట్ (ఎస్ఎల్ఎస్‌టి) టీచింగ్, నాన్ టీచింగ్ సిబ్బంది నియామక ప్రక్రియ చెల్లదని స్పష్టం చేసింది. ఆ పరీక్షతో జరిపిన నియామకాలను తక్షణమే రద్దు చేయాలని ఆదేశించింది. అంతేగాక, దీనికింద ఉద్యోగాలు సాధించిన టీచర్లు తమ వేతనాన్ని తిరిగి ఇచ్చేయాలని వెల్లడించింది. ఈ తీర్పుపై సుప్రీంకోర్టులో పలు పిటిషన్లు దాఖలయ్యాయి.

దీనిపై విచారణ జరిపిన సిజెఐ ధర్మాసనం ఫిబ్రవరి 10న తీర్పును రిజర్వులో పెట్టింది. తాజాగా తీర్పును వెలువరించింది. ఆ నియామక ప్రక్రియను కలుషితమైనది, కళంకమైనదిగా అభివర్ణించింది. హైకోర్టు తీర్పుపై జోక్యం చేసుకునేందుకు సరైన కారణాలు లేవని పేర్కొంది. ఆ నియామకాలు చెల్లవని స్పష్టం చేసింది. అయితే, ప్రభావిత ఉపాధ్యాయులకు కాస్త ఊరట కల్పించింది. ఈ నియామక ప్రక్రియ కింద ఉద్యోగాలు సాధించిన టీచర్లు అప్పటివరకు అందుకున్న వేతనాలు, ఇతర భత్యాలను తిరిగి ఇవ్వాల్సిన అవసరం లేదని వెల్లడించింది.

ఇక, మూడు నెలల్లో కొత్తగా టీచర్ల నియామకాలు పూర్తి చేయాలని సుప్రీంకోర్టు బెంగాల్ ప్రభుత్వాన్ని ఆదేశించింది. అయితే, దివ్యాంగ ఉపాధ్యాయులకు మానవతా కోణంలో ఊరట కల్పించింది. వారి విధుల్లో కొనసాగొచ్చని స్పష్టం చేసింది.

ఇక, ఈ కుంభకోణం వ్యవహారంపై మరింత సమగ్ర దర్యాప్తు జరపాలని గతంలో హైకోర్టు సిబిఐని ఆదేశించింది. దీన్ని సవాల్ చేస్తూ దీదీ సర్కారు దాఖలు చేసిన పిటిషన్‌పై ఏప్రిల్ 4న విచారణ జరుపుతామని ధర్మాసనం పేర్కొంది. ప్రభుత్వ ప్రయోజిత, ఎయిడెడ్ పాఠ శాలల్లో 9 నుంచి 12 తరగతులకు ఉపాధ్యాయు లతో పాటు గ్రూప్ సి, గ్రూప్ డి స్టాఫ్ సిబ్బంది నియామకాల కోసం 2016లో బెంగాల్ సర్కారు రాష్ట్ర స్థాయి సెలక్షన్ పరీక్ష నిర్వహించింది. 24,650 ఖాళీల భర్తీకోసం చేపట్టిన ఈ రిక్రూట్ మెంట్ పరీక్షకు 23లక్షల మందికిపైగా హాజరయ్యారు. తర్వాత ఇందులో ఎంపిక ప్రక్రియ చేపట్టి 25,753 మందికి అపాయింట్‌మెంట్ లెటర్లు అందజేశారు.

ఈ నియామక ప్రక్రియలో అవకతవకలు జరిగాయని ఆరోపణలు వచ్చాయి. దీనిపై దర్యాప్తు చేపట్టాలని న్యాయస్థానాల్లో పిటి షన్లు దాఖలయ్యాయి. కుంభకోణానికి సంబం ధించిన కేసులో మాజీ విద్యాశాఖ మంత్రి, తృణ మూల్ కాంగ్రెస్ సీనియర్ నేత పార్థా ఛటర్జీని ఇడి అరెస్టు చేసిన సంగతి తెలిసిందే.



# ట్రంప్ సుంకాలపై కేంద్ర సర్కారు స్పందనేమిటి?

## లోక్‌సభలో విపక్ష నేత రాహుల్‌గాంధీ

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 3:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ భారత్ దిగుమతులపై సుంకాలు విధించిన సంగతి తెలిసిందే. ఈ టారిఫ్‌లపై కేంద్ర సర్కారు స్పందన తెలియజేయాలని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ డిమాండ్ చేశారు. గురువారం లోక్‌సభలో మాట్లాడిన రాహుల్ కీలక వ్యాఖ్యలు చేశారు. అమెరికా విధించిన సుంకాలు మన ఆర్థిక వ్యవస్థను పూర్తిగా నాశనం చేస్తాయన్నారు. దీనిపై కేంద్రప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకుంటుందో చెప్పాలని డిమాండ్ చేశారు.

ఈసందర్భంగా భారత్-చైనా వివాదాన్ని ఆయన ప్రస్తావిస్తూ కేంద్రంపై విమర్శలు గుప్పించారు. 'చైనా భారత్‌కు చెందిన 4 వేల కి.మీ.పైగా భూ భాగాన్ని ఆక్రమించింది. దీనిపై ప్రధాని మోడీ, రాష్ట్రపతి ద్రౌపదిముర్ము బీజింగ్ ప్రభుత్వానికి లేఖ రాసినట్లు తెలిసింది. అక్కడి రాయబారి ద్వారా ఈ విషయం బయటపడింది. దాన్ని తిరిగి తీసుకోవాలి' అని రాహుల్ పేర్కొన్నారు.

ఇక, రాహుల్ వ్యాఖ్యలకు బిజెపి ఎంపి అనురాగ్ ఠాకూర్ గట్టిగా బదులిచ్చారు. ఎవరి హయాంలో చైనా ఈ ప్రాంతాన్ని అధీనంలోకి తీసుకుందో అందరికీ తెలుసన్నారు. ఢోక్లాపై ప్రతిష్ఠంభన జరుగుతున్న సమయంలో బీజింగ్ అధికారులతో కలిసి సూప్ ఎవరుతాగారో తెలుసని రాహుల్‌పై విమర్శలు చేశారు. ఇలాంటి అంశంపై రాజకీయాలు చేయడంవల్ల ఏఫలితం ఉండద న్నారు. గతంలో జరిగిన తప్పిదాలకు వారి (కాంగ్రెస్‌ను ఉద్దేశిస్తూ) సమాధానం చెప్పా లన్నారు.

అమెరికా ఉత్పత్తులపై ఇతర దేశాలు విధిస్తున్న టారిఫ్‌లతో పోలిస్తే.. తాము సగం మేర మాత్రమే వసూలు చేయనున్నట్లు ట్రంప్ తెలిపారు. ఈ క్రమంలో భారత్ తమకు వాణిజ్య భాగస్వామి అని చెబుతూనే.. ట్రంప్ సుంకాల బాంబు వేశారు. భారత్ తమ ఉత్పత్తులపై సగటున 52 శాతం సుంకం విధిస్తున్నందున, తాము 27 శాతం సుంకం విధిస్తున్నట్లు ట్రంప్ వెల్లడించారు.



# తుర్కియేలో చిక్కుకున్న విమానం

## 200 మంది మిలిటరీబేస్ ఎయిర్‌పోర్టులోనే..

**ముంబయి, ఏప్రిల్ 3:** లండన్‌నుంచి ముంబయికి రావాల్సిన విమానం తుర్కియేలో అత్యవసరంగా ల్యాండ్ అయింది. దానితో అక్కడి మారుమూల విమానాశ్రయంలో బుధవారం రాత్రి నుంచి 200మంది భారత ప్రయాణీకులు చిక్కుకు పోయారు. లండన్‌నుంచి వర్జిన్ అట్లాంటిక్ విమానం ముంబయికి బయలుదేరింది. మెడికల్ ఎమర్జెన్సీ కారణంగా తుర్కియేలోని మారుమూల ప్రాంతంలోని దియార్‌బకిర్ ఎయిర్‌పోర్టులో ల్యాండ్ అయింది. అయితే ల్యాండ్ అయ్యే సమయంలో సాంకేతిక సమస్య తలెత్తిందని ప్రయాణీకులు చెప్పారు. దాంతో సుమారు 20 గంటలుగా ప్రయాణీకులు అక్కడే చిక్కుకుపోయారు. వారిలో 200 మందికిపైగా భారతీయులున్నారని మీడియా కథనాలు తెలిపాయి. అయితే తిరిగి వారు ఎప్పుడు గమ్యస్థానం చేరతారనే దానిపై స్పష్టతలేదు. ప్రత్యామ్నాయ ఏర్పాట్లగురించి విమానయాన సంస్థనుంచి ఎలాంటిప్రకటన రాలేదు. అయితే ప్రస్తుతం ఎదురైన సమస్యను పరిష్కరించేందుకు కావాల్సిన సౌకర్యాలు ఆ విమానాశ్రయంలో లేవని ఒక ప్రయాణీకుడు వాపోయాడు. సాధ్యమైనంత సత్వరమే రవాణా ఏర్పాటుచేయాలని సంబంధిత అధికారులను కోరారు. తమకు విమానాశ్రయంలో తగిన సౌకర్యాలు లేవని అది మిలిటరీ బేస్‌కావడంతో అక్కడినుంచి బయటకు వెళ్లడానికికూడా వీలు లేదని ఆయన వాపోయారు.

# థాయ్ ప్రజల జీవితంలో రామాయణం ఒకభాగం



## బ్యాంకాక్‌లో ప్రధాని మోడీ

**బ్యాంకాక్, ఏప్రిల్ 2:** థాయిలాండ్‌ప్రజల జీవితాల్లో రామాయణ ఇతిహాసంలోని గాథలు ఒక భాగమని ప్రధాని నరేంద్రమోడీ అన్నారు. బిమ్స్‌టెక్‌సదస్సులో పాల్గొనేందుకు ప్రధానిమోడీ థాయిలాండ్‌లో పర్యటిస్తున్న సంగతి తెలిసిందే. ఈ సందర్భంగా మాట్లాడుతూ థాయిలాండ్ ప్రజలతో భారత్ సంబంధాలు చిరకాలంగా పెనవేసుకుని ఉన్నాయన్నారు. దక్షిణాసియా ఆగ్నేయాసియా ప్రాంతాలకు చెందిన ఏడుదేశాల కూటమి అయిన బంగాళాఖాతప్రాంత బహుళరంగ, సాంకేతియ, ఆర్థిక సహకార కూటమి (బిమ్‌స్టెక్) సదస్సుకోసం రెండురోజులపాటు ప్రధానిమోడీ థాయిలాండ్‌కు వచ్చేసారు. థాయిలాండ్ ప్రధాని పేటోంగ్టార్న్ షినవత్రతో భేటీ అనంతరం మోడీ మాట్లాడుతూ భారత్ థాయిలాండ్ మధ్య శతాబ్దాలుగా సంబంధాలు కొనసాగుతున్నాయి. సాంస్కృతిక, ఆధ్యాత్మిక సంబంధాలతో బలమైన బంధం ఏర్పడింది. బౌద్ధమతం వ్యాప్తి మన ప్రజలను అనుసంధానించింది. అయుతయనుంచి నలందావరకూ మేధావుల రాకపోకలు సాగించారని రామాయణ గాథలు థాయ్‌ప్రజల జీవితాల్లో ఒక భాగం అయ్యాయన్నారు. సంస్కృతి, పాళీ, భాషల ప్రభావం నేటికీ ఇరువురి సాంప్రదాయాల్లో ప్రతిబింబిస్తుందని నా పర్యటన సందర్భంగా 18వ శతాబ్దపు రామాయణ కుడ్యచిత్రాల ఆధారంగా ఒక స్మారక స్టాంపును విడుదలచేసిన థాయిలాండ్ ప్రభుత్వానికి మనసారా కృతజ్ఞతలు చెపుతున్నట్లు మోడీ పేర్కొన్నారు.

భారత్ యాక్ట్ ఈస్ట్ పాలసీ ఇండో పసిఫిక్ విజన్‌లో థాయిలాండ్‌ది కీలక పాత్ర అని మోడీ అన్నారు. తమ రెండుదేశాలు అభివృద్ధి వాదాన్ని సమర్థిస్తాయని విస్తరణ వాదాన్ని కాదని చైనానుద్దేశించి పరోక్ష వ్యాఖ్యలుచేసారు. ప్రస్తుత సంబంధాలను వ్యూహాత్మక భాగస్వామ్య స్థాయికి పెంచాలని నిర్ణయించుకున్నామని చెప్పారు. ఇటీవల సంభవించిన భూకంపంలో మృతిచెందిన వారికి భారత్ తరపున సంతాపం తెలిపారు. ఈసదస్సుకు హాజరయిన దేశాల్లో థాయిలాండ్, బంగ్లాదేశ్, శ్రీలంక, నేపాల్; మయన్మార్, భూటాన్ దేశాల అధినేతలు కూడా వచ్చారు. బ్యాంకాక్‌పర్యటనలో భాగంగా మోడీ పదవ రామగా కూడా ప్రసిద్ధుడైన థాయ్‌రాజు మహా వజిరలాంగ్‌కోమ్‌ను కూడా కలుసుకున్నారు.

# జనంలేని దీవులపైనా ట్రంప్ ప్రతీకార సుంకాలు

## రష్యా, ఉత్తరకొరియా, బెలారస్‌లకు మినహాయింపులు

**వాషింగ్టన్, ఏప్రిల్ 3:** అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రపంచదేశాలపై తమ సుంకాలనుప్రకటించిన సంగతి తెలిసిందే. ఈక్రమంలో అంటార్కిటికా దీవులపైనా ఆయన ట్యారిఫ్‌లు ప్రకటించారు. జనసంచారంలేని దీవులపైనా ఆయన సుంకాలు విధించడం ప్రస్తుతం చర్చనీయాంశంగా ఉంది. ఆస్ట్రేలియా నియంత్రణలోని హియర్డ్, మెక్ డొనాల్డ్ ఐలాండ్‌లపై ట్రంప్ 10శాతం సుంకాలు విదిస్తున్నట్లుప్రకటించారు. ఈ చర్యపై ఆదేశ ప్రధాని ఆంతోని అల్బనీస్ తీవ్రంగ ఆస్పందించారు. ట్రంప్ ట్యారిఫ్‌లనుంచి భూమిపై ఎక్కడా రక్షణలేదని, ఇది స్నేహితుడు చేసే చర్యకాదన్నారు. యుఎస్ దిగుమతులపై తాము పరస్పర సుంకాలు విధించబోమన్నారు. ఈ దీవులు ఆస్ట్రేలియన్ భూభాగంలోనివిగా ఉండటమే ట్యారిఫ్ విధింపునకు కారణమని వైట్‌హౌస్ అధికారి అన్నారు. ఆస్ట్రేలియానుంచి ఈ దీవులకు చేరుకునేందుకు రెండు వారాల సమయం పడుతోంది. అగ్నిపర్వతాల క్రియాశీలక ప్రాంతాలైన ఇక్కడ ఎక్కువగా సీల్స్, పెంగ్విన్‌లు ఇతర పక్షులు ఆవాసం ఉంటాయి. శాశ్వత జనావాసం ఉండదు. ఇదిలా ఉంటే ఆర్కిటిక్ మహాసముద్రంలోని అగ్నిపర్వత ద్వీప్‌జాన్‌మాయెన్‌పైకూడా ట్రంప్ పదిశాతంసుంకం విధించారు. ఇది నార్వేలోని ట్రోమ్సోకు ఉత్తరాన 580మైళ్ల దూరంలో ఉంటుంది. ధృవపు ఎలుగుబంట్లు కూడా ఉంటాయి. పర్యాటకులకు మాత్రమే ఇక్కడ అనుమతి. నార్వే దిగుమతులపైనా ట్రంప్ 15 శాతం సుంకం విధించడం గమనార్హం. ఇప్పటికే చైనాపై 20శాతం అమలుచేస్తుంటే అదనంగా సుంకాల విధింపుతో మొత్తం చైనా దిగుమతులపై 54శాతం సుంకం విధించారు.

అదేవిధంగా రష్యాకు మాత్రం మినహాయింపు ఇచ్చారు. ఈ దేశానికి అదనపు సుంకాలుప్రతీకార సుంకాలు లేవు. అదేమంటే ఇప్పటికే ఆంక్షలు అమలులో ఉన్నాయని చెపుతున్నారు. అదే విధంగా స్పెయిన్, మెక్సికో, కెనడాలపైనా సుంకాలు ముందునుంచి చెప్పినట్లుగానే విధించారు.

# వాల్‌స్ట్రీట్‌కు సుంకాల ఎఫెక్ట్

**వాషింగ్టన్, ఏప్రిల్ 3:** ప్రపంచదేశాలపై అమెరికా అధ్యక్షుడు ట్రంప్ విధించిన సుంకాల జాబితాతో స్టాక్ మార్కెట్లు కుదేలయ్యాయి. అమెరికా వాల్‌స్ట్రీట్ మొత్తం బ్లడ్‌బాత్‌మాదిరిగా తయారయింది. ప్రతీకార సుంకాలమూలంగా వాణిజ్యయుద్ధానికి తెరతీసినట్లుగానే కాకుండా అగ్రరాజ్యం ఆర్థిక మాంద్యంలోకి వెళుతుందన్న భయాలునెలకొన్నాయి. ఇది అక్కడి మార్కెట్ సెంటిమెంట్‌ను దెబ్బతీసింది. దీనితోప్రధానసూచీలు భారీగా పతనం అయ్యాయి. స్థానిక కాలమానం ప్రకారం ఉదయం 10గంటలకు డౌజోన్స్ 1500 పాయింట్లకుపైగా నష్టంతో 40,665 వద్దట్రేడ్‌అయింది. నాస్‌డాక్ సుమారు ఐదుశాతంమేర క్షీణిస్తే ఎస్‌అండ్‌పి 500 నాలుగుశాతం కుదేలయింది. ప్రధానమైన షేర్లలో అమ్మకాలు వెల్లువెత్తుతున్నాయి. నైకీ 12శాతంమేర పతనం అయితే యాపిల్‌షేర్లు 9శాతం నష్టపోయాయి. ఐఫోన్లకు ప్రధాన సరఫరాదారుగా ఉన్నచైనాపై 54శాతం అమెరికా భారీ సుంకాలు విధించడంతో సప్లయిచెన్‌కు అవరోధంఏర్పడుతుందన్న ఆందోళనలతో ఆ కంపెనీలు షేర్లు భారీగా కుంగిపోయాయి. మరోవైపు చిప్‌తయారీ కంపెనీ ఎన్విఇడియా విషయంలోనూ ఇదే తరహా భయాలు నెలకొనడంతో ఆకంపెనీషేర్లుకూడా పతనం అవుతున్నాయి.

# లోక్‌సభలో బుల్‌డోజ్ చేసి వక్ఫ్ సవరణ బిల్లు ఆమోదించారు

## - సోనియా గాంధీ ధ్వజం

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 3:** వక్ఫ్ సవరణల బిల్లును లోక్‌సభలో బుల్‌డోజ్‌చేసారని కాంగ్రెస్ అగ్రనేత్రి సోనియా గాంధీ ఆరోపించారు. వివాదాస్పద పరిస్థితులు, ఉద్రిక్త వాతావరణం మధ్య లోక్‌సభలో వక్ఫ్‌సవరణ బిల్లు 2024 ఆమోదం పొందిందని అన్నారు. వక్ఫ్ బిల్లు విషయంలో తమ పార్టీ వైఖరి స్పష్టంగా ఉందని సోనియా తెలిపారు. ఈ బిల్లును రాజ్యాంగంపై దారుణమైన దాడిగా ఆమె అభివర్ణింఇంచారు. దేశ రాజకీయాల్లో తీవ్ర వివాదానికి కారణమైన వక్ఫ్ సవరణ బిల్లుకు లోక్‌సభలో ఆమోదం లభించిన విషయం తెలిసిందే. నేడు ఈ బిల్లు రాజ్యసభ ముందుకు వచ్చింది ఈ నేపథ్యంలో ఎగువ సభలో అనుసరించాల్సిన వ్యూహాలపై చర్చించడానికి కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ సమావేశం అయింది. గురువారం ఉదయం పార్లమెంటు సెంట్రల్ హాలులోజరిగిన సమావేశంలోసోనియా మాట్లాడుతూ లోక్‌సభ ప్రొసీడింగ్స్ మొత్తం బుల్‌డోజ్‌చేసారని ఆరోపించారు. 12 గంటలపాటు చర్చించినప్పటికీ ప్రతిపక్ష సభ్యులక ఎక్కువ అవకాశం ఇవ్వలేదని విమర్శించారు. ఈ బిల్లు దేశప్రయోజనాలు, ప్రజాస్వామ్యానికి మాయని మచ్చగా మారుతుందంటూ ఆందోళన వ్యక్తంచేసారు. ఈ బిల్లు ఎగువసభకు వెళ్లిందని, అక్కడ వ్యూహాత్మకంగా వ్యవహరించాల్సిన అవసరం ఉందని పార్టీ ఎంపిలకు సూచించారు. ప్రతిపక్ష పార్టీల సమన్వయంతో ఈ బిల్లును తిప్పికొట్టాలన్నారు. రాజ్యాంగాన్ని కేవలం కాగితానికి పరిమితంచేస్తూ మోడీప్రభుత్వం దేశాన్ని అగాథంలోకి నెడుతోందనిరాజ్యాంగాన్ని ధ్వంసం చేయడమే బిజెపి ప్రధాన ఉద్దేశ్యమని సోనియా గాంధీ అన్నారు. కాగా వక్ఫ్‌సవరణ బిల్లుకు లోక్‌సభలో ఆమోదం లభించిన విషయం తెలిసిందే. మధ్యాహ్నం 12 గంటలకు ఈ బిల్లును కేంద్ర న్యాయ మంత్రి కిరణ్ రిజిజు లోక్‌సభలో ప్రవేశపెట్టారు. 12 గంటలపాటు చర్చలుజరిపి అర్ధరాత్రి 12 వరకూ కొనసాగించారు.

# ఆస్తులు వెల్లడించడానికి సుప్రీంకోర్టు జడ్జిలు ఓకే

## ఫుల్ కోర్టు సమావేశంలో ఏకగ్రీవ నిర్ణయం



**న్యూఢిల్లీ, ఏప్రిల్ 3:** న్యాయమూర్తుల ఆస్తులకు సంబంధించిన సర్వోన్నత న్యాయస్థానం కీలక చర్యలు చేపట్టింది. సుప్రీంకోర్టు న్యాయమూర్తులు తమ ఆస్తులను బహిర్గతం చేసేలా నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు ఇటీవల జరిగిన ఫుల్ కోర్టు సమావేశంలో ఈ ప్రతిపాదనకు న్యాయమూర్తులంతా ఏకగ్రీవంగా అంగీకరించారు. ఇటీవల న్యాయమూర్తి జస్టిస్ యశ్వంత్ వర్మ నివాసంలో నోట్లకట్టల వివాదం నేపథ్యంలో తాజా పరిణామాలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి.

ఏప్రిల్ 1న సుప్రీంకోర్టు న్యాయమూర్తులంతా సమావేశమయ్యారు. అందులో తమ ఆస్తులకు సంబంధించిన వివరాలను కోర్టు వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేసేందుకు వారంతా సుముఖత వ్యక్తం చేశారు. ఇప్పటికే ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సంజీవ్ ఖన్నా సహా 30 మంది జడ్జీలు తమ ఆస్తులకు సంబంధించి డిక్లరేషన్లను సమర్పించారు. వీటిని త్వరలోనే సుప్రీంకోర్టు వెబ్‌సైట్‌లో పొందపర్చనున్నారు. అయితే ఇదంతా స్వచ్ఛందంగా జరుగుతున్న ప్రక్రియేనని సుప్రీంకోర్టు వెబ్‌సైట్ వెల్లడించింది.

ప్రస్తుతం ఉన్న నిబంధనల ప్రకారం.. సుప్రీంకోర్టు జడ్జీలు ప్రమాణస్వీకారం చేయగానే తమ ఆస్తుల వివరాలను ప్రధాన న్యాయమూర్తికి సమర్పించాలని ఉంటుంది. అయితే, వాటిని బహిర్గతం చేయాలన్న తప్పనిసరి నిబంధనేదీ లేదు. సుప్రీం వెబ్‌సైట్‌లో న్యాయమూర్తుల ఆస్తుల డిక్లరేషన్ల కోసం ఇప్పటికే ఓ సెక్షన్ ఉంది. కానీ, గత కొన్నేళ్లుగా అందులో ఎలాంటి అప్‌డేట్స్ లేవు. తాజా నిర్ణయంతోనే త్వరలోనే సుప్రీం న్యాయమూర్తుల ఆస్తుల వివరాలు బహిర్గం కానున్నాయి. ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తిగా పని చేసిన జస్టిస్ యశ్వంత్‌వర్మ అధికారిక నివాసంలో భారీఎత్తున నోట్ల కట్టలు బయటపడినట్లు వచ్చిన వార్తలు సంచలనం సృష్టించాయి. న్యాయమూర్తి అధికారిక నివాసంలో అగ్ని ప్రమాదం జరగడంతో.. ఆర్పేందుకు వెళ్లిన సిబ్బందికి అనుకోకుండా అక్కడ భారీగా నోట్ల కట్టలు దర్శనమిచ్చాయి. ఇది వివాదాస్పదం కావడంతో కేంద్రం కీలక నిర్ణయం తీసుకుంది. జస్టిస్‌వర్మను అలహాబాద్ హైకోర్టుకు బదలీచేస్తూ కేంద్ర న్యాయ శాఖ నోటిఫికేషన్ జారీ చేసింది. మరోవైపు.. ఈ వ్యవహారంపై విచారణకు సుప్రీంకోర్టు కమిటీ ఏర్పాటు చేసింది.

# కర్ణాటకలో ఓలా, ఊబర్, ర్యాపిడోలపై నిషేధం

**బెంగళూరు, ఏప్రిల్ 3:** రాష్ట్రంలో ఒలా, ఊబర్, ర్యాపిడోలకు చెందిన బైక్ ట్యాక్సీ సేవలను నిలిపివేయాలని, ఆరువారాల్లోపు రాష్ట్రప్రభుత్వం ఇందుకు సంబంధించిన కార్యాచరణ అమలుచేయాలని కర్ణాటక హైకోర్టు ఆదేశించింది. ఉబెర్ ఇండియా సిస్టమ్స్, ఎఎన్ఐ టెక్నాలజీస్ (ఒలా), ర్యాపిడో వంటివి రాష్ట్ర ప్రభుత్వానికి దరఖాస్తులు చేసుకున్నాయి. వారి దరఖాస్తులు 2022లోనే దాఖలుచేసాయి. టూవీలర్లను ట్రాన్స్‌పోర్టు వాహనాలుగా పరిగణించాలని దరఖాస్తుచేసాయి. హైకోర్టు జస్టిస్ శ్యామ్‌ప్రసాద్ ఈ దరఖాస్తులన్నింటినీ పరిశీలించి వాటిని డిస్మిస్‌చేసారు. ఒలా, ఉబెర్; రాపిడోలు వారివారి బైక్‌ట్యాక్సీలను తక్షణమే నిలిపివేయాలని ఆదేశించారు. రాష్ట్రప్రభుత్వం కూడా వీటికి ఎలాంటి అనుమతులు ఇవ్వకూడదని ఆదేశించింది. ఈ సంస్థలు దాఖలుచేసిన పిటిషన్ల విచారణలో తాత్కాలిక ఉత్తర్వులను పరిగణనలోనికి తీసుకుని రాష్ట్రప్రభుత్వాన్ని ఆదేశించాలని కోరాయి. ఈ ఉత్తర్వుల ప్రకారం ఆరువారాలపాటు మాత్రమే అనుమతి ఉంది. ఆ తర్వాత వాటిని రాష్ట్రంలో పూర్తిగా నిషేధించాలిస ఉంటుంది. 1988 మోటారు వాహణచట్టం సెక్షన్ 93 కింద రాష్ట్రప్రభుత్వం స్పష్టమైన మార్గదర్శకాలు జారీచేసేంతవరకూ ఎలాంటి ఉత్తర్వులు ఇవ్వకూడదని హైకోర్టు ఆదేశించింది. బైక్‌ట్యాక్సీలు అక్రమమని వాణిజ్య వాహనాలుగా ఎంతమాత్రం తిరగడానికి వీలులేదని వాదించింది. ప్రభుత్వ వాదనతో ఏకీభవించిన హైకోర్టు ఆరువారాల్లోపు వీటినినిషేధించాలని ఆదేశాలు జారీచేసింది.

# బొలీవియాపై నిత్యానంద నజర్!

## భూ ఆక్రమణలకు పాల్పడటంతో సర్కారు అప్రమత్తం

**లాపాజ్(బొలీవియా), ఏప్రిల్ 3:** లైంగిక వేధింపులు, చిన్నారుల కిడ్నాప్ వంటి కేసులు ఎదుర్కొంటూ దేశం నుంచి పారిపోయిన నిత్యానంద స్వామి అజ్ఞాతంలోనే కొనసాగుతున్న సంగతి తెలిసిందే. దక్షిణ అమెరికా దేశం బొలీవియాపై ఇపుడు ఆయన కన్నుపడినట్లు తెలిసింది. అక్కడ భూఆక్రమణకు యత్నిం చిన నితానయనంద సన్నిహితులు స్థానిక తెగలతో భూమి లీజుకు సంబంధించి ఒప్పందాలుచేసుకున్నట్లు తేలింది. ఈ విషయం బహిర్గతం కావడంతో కైలాసతో సంబంధంఉన్న 20మందిని అరెస్టుచేసిన అక్కడి అధికారులు వారి సొంత దేశాలకు పంపించారు. కైలాసతో సంబంధం ఉన్న కొందరు వ్యక్తులు ఇటీవల బొలీవియాలో పర్యటించారు. ఈ క్రమంలో కార్చిచ్చును ఎదుర్కొనడంతో స్థానిక ప్రజలకు సాయపడిన వీరు ఏకంగా అక్కడి భూమిపై కన్నేసారు. వాటి లీజుకోసం స్థానిక తెగలతో ఒప్పందాలుకూడాచేసుకున్నారు. అధనయక్షుడు లూయిస్ ఆర్స్‌తోనూ కైలాస ప్రతి నిధులు ఫోటోలు దిగారు. చివరకు రెండు లక్షల డాలర్లు చెల్లిస్తే ఓప్రాంతాన్ని 25 ఏళ్లపాటు లీజుకు ఇచ్చేందుకు స్థానికతెగ ప్రతినిధి అంగీకరించారు. అయితే కైలాస ప్రతినిదులు మాత్రం వెయ్యిసంవత్సరాల లీజుతోపాటు అక్కడ గగన తల వినియోగం సహజవనరుల తవ్వకం వంటి అంశాలనుప్రతిపాదించారు. వీటిపై బొలీవియా పత్రిక ఒకటి ప్రముఖంగా కథనం ప్రచురించింది.



అప్రమత్తం అయిన ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టింది.కైలాసతో సంబంధం ఉన్న 20 మందిని అరెస్టుచేసింది. ఒప్పందాలను రద్దు చేసింది. ఈ వ్యక్తులను భారత్;చైనా, అమెరికాలకు పంపించివేసింది. వీరు పర్యాటకులుగా అనేకసార్లు బొలీవియాలోకి ప్రవేశించారని, ఈ క్రమంలోనే స్థానికులతో ఒప్పందాలుచేసుకున్నారన్నారు. గతఏడాది నవంబరునుంచికొంత మంది అక్కడే ఉండిపోయారని గుర్తించామన్నారు. బొలీవియా విదేశీ వ్యవహారాల మంత్రి మాట్లాడుతూ వివాదాస్పద యునైటెడ్ స్టేట్స్ ఆఫ్‌కైలాసతో ఎలాంటిదౌత్యసంబంధాలు కొనాస గించడం లేదన్నారు. నిత్యానంద కైలాస అనే ప్రాంతంలో ఆశ్రమం స్థాపించినట్లు వార్తలువచ్చాయి. ఈక్వెడార్ సమీపంలో ఒక చిన్నదీవిని కొనుగోలుచేసి దానికి కైలాసం అని పేరుపెట్టి నట్లు నిత్యానందవెల్లడించారు. ఒకకేసుకు సంబంధించి తమిళనాడు ప్రభుత్వం కూడా నిత్యానంద ఈక్వెడార్‌లో ఉన్నట్లు హైకోర్టుకు తెలిపింది.

# రన్యారావుకు బులియన్ మర్చంట్ సకారియా జైన్ సాయం!

## గోల్డ్‌స్మగ్లింగ్‌లో వెలుగులోకి వస్తున్న మరికొన్ని నిజాలు

**బెంగళూరు, ఏప్రిల్ 3:** కన్నడ నటి రన్యారావు బంగారం అక్రమరవాణా కేసులో డిఆర్ఐ తన రిమాండ్ రిపోర్టులో మరికొన్ని ఆసక్తికర అంశాలు వెల్లడించింది. ఆభరణాల వ్యాపారి సాహిల్ సకరియా జైన్ కీలకపాత్ర పోషించారు. బంగారం అక్రమ లావాదేవీల విషయంలో ఆమెకు సహకరించడమే కాకుండా హవాలా నగదు బదలీలకూ సాయం చేసినట్లు తెలిపింది. రూ.40 కోట్ల విలువైన 49.6 కిలోల బంగారం అక్రమ లావాదేవీల్లో రన్యారావుకు సహకరించడంలో సాహిల్ కీలకపాత్ర పోషించాడని తెలిపింది.

దుబాయ్‌కు సుమారు 38 కోట్లు, బెంగళూరులోని రన్యాకు రూ.1.73 కోట్ల హవాలా సొమ్మును బదలీచేయడంలో సాయంచేసినట్లు అంగీకరించాడు. మార్చి 4న రన్యా నివాసంలో పట్టుబడిన రూ.2.67 కోట్లనగదును దుబాయ్‌లో బంగారం కొని బెంగళూరులో విక్రయించడం ద్వారా ఆమెకు లాభంగా వచ్చిన హవాలా సొమ్ముగా తెలిపింది. ప్రతి లావాదేవీకి రూ.55వేల కమిషన్ తీసుకున్నట్లు సాహిల్ అంగీకరించాడని డిఆర్ఐ తన రిపోర్టులో తెలిపింది. ఈ ఏడాదిజనవరిలో రూ.11.56 కోట్లు



విలువైన 14.56 కిలోల బంగారాన్ని అమ్మేందుకు హవాలా ద్వారా రూ.11 కోట్లు దుబాయ్‌కు బదలీ చేసేందుకు రన్యాకు సహకరించాడు. ఆమెకూ రూ.55లక్షలు బదలీ చేసాడు. ఫిబ్రవరిలో రూ.11.81 కోట్లు విలువైన 13.43 కిలోల బంగారాన్ని విక్రయించేందుకు సాయంచేసాడు. అదేనెలలో రూ.11.25 కోట్ల హవాలా నిధులనుదుబాయ్‌కి రూ.55.81 లక్షలను బెంగళూరులోని రన్యారావుకు బదలీచేసాడని డిఆర్ఐ వెల్లడించింది. సాహిల్‌కు చెందిన రెండు ఫోన్లు, లాప్‌టాప్‌నుంచి సేకరించిన ఆధారాలు ఈ వ్యవహారంలో ఆతడి పాత్రను తేటతెల్లంచేస్తున్నాయనిచెప్పింది.

# ప్రశాంతంగా ఉన్న గ్రామాల్లో కక్షలు రేపేందుకే వైఎస్.జగన్ వస్తున్నారా?

## - కారు బాంబు..టివి బాంబులపై సమాధానం చెప్పి జిల్లాలోకి అడుగు పెట్టాలి : పరిటాల సునీత



అనంతపురంలో విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత

**అనంతపురం, ఏప్రిల్ 3 ప్రభాతవార్త బ్యూరో** ప్రశాంతంగా ఉన్న అనంతపురం జిల్లాలో కక్షలు రేపేందుకే వైసిపి అధినేత వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి జిల్లాకు వస్తున్నారా..? కారుబాంబు, సూట్‌కేసు బాంబులు, ఆయన తండ్రి హయాంలో జరిగిన మరో 40 హత్యలకు సంబంధించి సమాధానం చెప్పిన తర్వాతే జిల్లాలోకి అడుగు పెట్టాలని మాజీ మంత్రి, రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత డిమాండ్ చేశారు. దివంగత నేత పరిటాల రవీంద్ర హత్యలో కూడా వైఎస్.జగన్‌కు సంబంధం ఉందని, ఈ విషయంలో సిబిఐ కూడా విచారణ చేసిందని ఆమె ఆరోపించారు. ఈ నెల 8వ తేదిన రామగిరి మండలం పాపిరెడ్డిపల్లిలో వైసిపి కార్యకర్త లింగమయ్య కుటుంబాన్ని పరామర్శించేందుకు వైఎస్ జగన్‌రానున్న నేపథ్యంలో టిడిపి నేత రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత గురువారం అనంతపురంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ..వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి సూట్‌కేసు బాంబు గురించి బాగా తెలుసని ఆయన అప్పట్లో పరిటాల రవిని హత్య చేసేందుకు ప్రయత్నించారన్నారు. కారుబాంబు సంఘటనలో 24 మందిని పొట్టన పెట్టుకున్నారని ఇందులో జర్నలిస్టులు కూడా ఉన్నారని ఆమె గుర్తు చేశారు. తోపుదుర్తి సోదరులు ఎప్పుడు మాట్లాడినా టివి బాంబు గురించి ప్రస్తావిస్తుంటారని, కారుబాంబు, సూట్‌కేసు బాంబుల గురించి మాట్లాడరా అని ఆమె ప్రశ్నించారు. కారుబాంబు సంఘటనలో తోపుదుర్తి సోదరులు జైలుకు కూడా వెళ్లి వచ్చారని ఆమె వెల్లడించారు. వైఎస్.జగన్ జిల్లాకు వచ్చేటప్పుడు ఈ ప్రశ్నలకు సమాధానం చెప్పి జిల్లాలోకి రావాలన్నారు. ప్రశాంతంగా ఉన్న గ్రామాల్లో కక్షలు రేపేందుకే జగన్ వస్తున్నారని ఆయనప్రశ్నించారు. మా ప్రాంతం ప్రశాంతంగా ఉందని ఆమె వెల్లడించారు. శ్రీ సత్యసాయి జిల్లా రామగిరి మండలం పాపిరెడ్డి పల్లి గ్రామంలో వాస్తవంగా ఏం జరిగింది, అని తెలుసుకోకుండా ప్రకాష్‌రెడ్డి చెప్పిన మాటలు విని వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి జిల్లాకు వస్తున్నారని ఆమె ఆరోపించారు. లింగమయ్యతోపాటు మీరు పరామర్శించాల్సిన వారు చాలా మంది ఉన్నారని, ఆయన వచ్చే టప్పుడు సూట్‌కేసులో కొన్ని జతల దుస్తులు ఎక్కువ పెట్టుకుని రావాలని ఎమ్మెల్యే పరిటాల సునీత ప్రత్యేకంగా వైఎస్.జగన్‌కు విజ్ఞప్తి చేశారు. రాప్తాడు నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో మాజీ ఎమ్మెల్యే వల్ల నష్టపోయిన వైసిపి నాయకులు చాలా మంది ఉ న్నారని వారిని కూడా పరామర్శిస్తే మంచిదన్నారు. తోపుదుర్తి గ్రామానికి చెందిన మహేశ్వర్‌రెడ్డి అనే యువకున్ని రైలు పట్టాలపై పడుకోబెట్టి చంపారని, ఆ కుటుంబంతోపాటు జి.కొత్తపల్లి మాజీ సర్పంచు మోహన్‌రెడ్డిపై హత్య యత్నం చేశారని, సిద్ధం సభలో ఫోటోగ్రాఫర్ కిష్ణపై నిర్దాక్షిణ్యంగా దాడి చేశారని, ఆ కుటుంబాన్ని కూడా పరామర్శించాలని డిమాండ్ చేశారు. రియల్ ఎస్టేట్ విషయంలో ఎంతో మందిని మోసం చేసి తోపుదుర్తి సోదరులు భూములు లాక్కున్నారని వారందరినీ కూడా పరామర్శించాలన్నారు. ఎంపిపి ఎన్నికల్లో సుధాకర్ యాదవ్ నిజాయితీగా వ్యవహరిస్తే ఆయనపై ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతారా అని ప్రశ్నించారు.



# ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలకు పరికరాలు పంపిణీ

**వెదురుకుప్పం, ఏప్రిల్ 3 ప్రభాతవార్త:** ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలకు అవసరమైన పరికరాలను ఎస్ఎస్ఎ ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. పచ్చికపల్లంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఎస్ఎస్ఎ వారు అందించిన ఎయిడ్స్ అండ్ అప్లైన్స్ (వీల్ చైర్, హియరింగ్ కిట్టు, రోలేటర్‌సిపి చైర్) ను గురువారం ఎంఈఓ-2 డి.దామోదరం చిన్నారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అందించింది.

# వివేకా హత్య కేసులో సాక్షులకు రక్షణ కల్పించాలి : వైఎస్ షర్మిల

**విజయవాడ ఏప్రిల్ 3 ప్రభాతవార్త ప్రతినిధి:** మాజీ మంత్రి వివేకానందరెడ్డి హత్య కేసు పై ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ కేసులో నిందితుడిగా ఉన్న ఎంపీ అవినాష్‌రెడ్డి బెయిల్‌పై ఉంటూ సాక్షులను బెదిరిస్తున్నారని ఆరోపించారు. వివేకా హత్య కేసులోని సాక్షులు ఒక్కొక్కరిగా ప్రాణాలు కోల్పోతున్నారని చెప్పారు. గురువారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ వివేకా కుమార్తె సునీతకు ఇద్దరు పిల్లలున్నారు. ఆమె ప్రాణాలకు రక్షణ లేదు. ఈ కేసులో నిందితులుగా ఉన్నవారు సునీతను ఏమైనా చేస్తారనే భయం ఉంది. ఇటీవల నాకు తెలిసిన విషయాలు నన్ను ఆలోచింపజేస్తున్నాయి. అవినాష్ బెయిల్ రద్దు పిటిషన్‌పై ప్రభుత్వ అఫిడవిట్‌లో పలు అంశాలు ఉన్నాయి. విచారణ అదికారులను ఆయన పిలిపించుకొని బెదిరించారని అఫిడవిట్‌లో ఉంది. తప్పుడు రిపోర్టుపై అధికారులతో అవినాష్ సంతకాలు చేయించినట్లుగా ఉంది. అవినాష్ బెయిల్‌పై ఉన్నందునే సునీతకు న్యాయం జరగడం లేదు. సాక్షులను బెదిరించి ఒత్తిడి తెస్తున్నా. బెయిల్ రద్దు చేయట్లేదు. వివేకాను సునీత, ఆమె భర్త చంపించారని తప్పుడు రిపోర్టు ఇచ్చారు. హత్య జరిగిన సమయంలో ఘటనాస్థలిలో ఉన్నది అవినాష్ రెడ్డే అని వైఎస్ షర్మిల అన్నారు.

## గొల్లపూడి వద్ద శాటిలైట్ రైల్వేస్టేషన్ నిర్మించాలి: దగ్గుబాటి పురందేశ్వరి

**విజయవాడ ఏప్రిల్ 03 ప్రభాతవార్త ప్రతినిధి:** విజయవాడ రైల్వేస్టేషన్‌లో రద్దీ తగ్గించడానికి అక్కడికి సమీపంలోని గొల్లపూడి వద్ద శాటిలైట్ రైల్వేస్టేషన్ నిర్మించాలని ఏపీ భారతీయజనతాపార్టీఅధ్యక్షురాలు, రాజమహేంద్రవరం ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి కేంద్ర రైల్వేమంత్రి అశ్వినీవైష్ణవ్‌కు విజ్ఞప్తి చేశారు. ఆమె దిల్లీలో కేంద్రమంత్రిని కలిసి ఈ మేరకు కేంద్రమంత్రికి వినతిపత్రం సమర్పించారు. ఉత్తర-దక్షిణ భారత దేశాలను కలిపే విజయవాడ రైల్వేస్టేషన్‌లో రాజధాని అమరావతి కారణంగా భవిష్యత్తులో ట్రాఫిక్ పెరిగే అవకాశం ఉంది. అమరావతి అవసరాలు తీర్చేందుకు గొల్లపూడి వద్ద శాటిలైట్ రైల్వేస్టేషన్ నిర్మించే అంశాన్ని పరిగణలోనికి తీసుకోవాలి అని ఆమె కోరారు.

# జిల్లాల వారీగా మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్ సమీక్ష

## కరీంనగర్, ఆదిలాబాద్ జిల్లాల నేతలతో చర్చ



పార్టీ ముఖ్య నేతలకు దిశానిర్దేశం చేస్తున్న మాజీ సిఎం కెసిఆర్

**మర్కుక్, ఏప్రిల్ 3, ప్రభాతవార్త:** ఈనెల 27న వరంగల్‌లో నిర్వహించనున్న బహిరంగ సభ, పార్టీ రజతోత్సవ కార్యక్రమాల నిర్వహణపై మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్, ఉమ్మడి కరీంనగర్, ఆదిలాబాద్ జిల్లాల పార్టీ ముఖ్యనేతలతో గురువారం మండల పరిధి ఎర్రవల్లిలోనితన వ్యవసాయ క్షేత్రంలో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా పలు అంశాలపై బిఆర్ఎస్ అధినేత కెసిఆర్ రెండు జిల్లాల ముఖ్య నాయకులకు దిశ నిర్దేశం చేశారు. భవిష్యత్ కార్యాచరణ క్షేత్ర స్థాయిలో పార్టీ బలోపేతం, పలు అంశాలపై చర్చించారు. రజతోత్సవ బహిరంగ సభకు పెద్దఎత్తున కార్యకర్తలను సమీకరించేందుకు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని సూచించారు. వరంగల్ సభ నుండే కాంగ్రెస్ ప్రభుత్వానికి పతనం ప్రారంభమవుతుందని, ఆ దిశగా ముందుకు సాగుదామని పేర్కొన్నారు. ఈ సమావేశంలో వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్, మాజీ మంత్రులు గంగుల కమలాకర్, కొప్పుల ఈశ్వర్, జోగు రామన్న, మాజీ ఎంపిలు బోయినపల్లి వినోద్‌కుమార్, జోగినపల్లి సంతోష్‌కుమార్, ముఖ్య నేతలు ఆర్ఎస్.ప్రవీణ్‌కుమార్, ఎల్.రమణ, కల్వకుంట్ల సంజయ్, పాడి కౌశిక్‌రెడ్డి, అనిల్ జాదవ్, కోవా లక్ష్మి, జివి.రామకృష్ణారావు, తోట ఆగయ్య, బాల్క సుమన్, సతీష్‌కుమార్, రసమయి బాలకిషన్, సుంకే రవిశంకర్, దాసరి మనోహర్‌రెడ్డి, కోరుకంటి చందర్, పుట్ట మధు, కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు, నడిపెల్లి దివాకర్‌రావు, దుర్గం చిన్నయ్య, పార్టీ రాష్ట్ర నాయకులు కల్వకుంట్ల వంశీధర్‌రావు, దావా వసంత, చెల్మెడ లక్ష్మి, నరసింహారావు, జాన్సన్‌నాయక్, రామకృష్ణారెడ్డి, రమాదేవి, కిరణ్ కొమ్మెర, విలాస్, శ్యామ్‌సుందర్ తదితరులు పాల్గొన్నారు.

# నేటితో ముగియనున్న ఎస్ఎస్‌సి పరీక్షలు

## 13వ తేదీతో ముగియనున్న మూల్యాంకనం

**హైదరాబాద్, ఏప్రిల్ 3, ప్రభాతవార్త:** రాష్ట్రవ్యాప్తంగా మార్చి 21 నుంచి ప్రారం భమైన ఎస్ఎస్‌సి పరీక్షలు ప్రశాంతంగా కొనసాగుతున్నాయి. నేటి(శుక్ర వారం)తో 10వ తరగతి వార్షిక పరీక్షలు ముగియనున్నాయి. ఈ నెల 2తో ప్రధాన పరీక్షలు ముగియగా.. ఒకేషనల్, ఓఎస్ఎస్‌సి పరీక్షలతో కలిపి నేటితో మొత్తం పరీక్షలు ముగియనున్నాయి. గురువరం జరిగిన ఒకేషనల్, ఓఎస్ఎస్‌సి పేపర్-1 పరీఓలకు 98.67 శాతం మంది విద్యార్థులు హాజర య్యారు. రాష్ట్రంలో ఎస్ఎస్‌సి పరీక్షల నిర్వహణ కోసం రాష్ట్ర వ్యాప్తంగా 2650 పరీక్షా కేంద్రాలనను ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. పరీక్షలను ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు నిర్వహిస్తున్నారు. ఈ నెల 2న జరిగిన సోషల్ స్టడిస్ పరీక్షతో 10వ తరగతికి చెందిన ప్రధాన పరీక్షలు ముగియగా.. ఈ నెల 3, 4 తేదిల్లో ఓఎస్ఎస్‌సి లాంగ్వేజెస్ పరీక్షలు జరగనున్నాయి. నేటితో మొత్తంగా ఎస్ఎస్‌సి పరీక్షలు ముగుస్తాయి.



ల్యారెస్ ల్యాబ్స్ ప్రతినిధితో సీఎం చంద్రబాబు

# రాంబిల్లి ఫేజ్2లో లారెస్ ల్యాబ్స్ సంస్థ బల్క్‌డ్రగ్స్ పరిశ్రమల ఏర్పాటు

**విజయవాడ ఏప్రిల్ 3.ప్రభాతవార్తప్రతినిధి:** అనకాపల్లి జిల్లా గోరపూడి గ్రామంలోని ఏపీ రాంబిల్లి ఫేజ్2లో లారెస్ ల్యాబ్స్ సంస్థ బల్క్ డ్రగ్స్ పరిశ్రమల ఏర్పాటుకు ముందుకు వచ్చింది. లారెస్ ల్యాబ్స్ దాదాపు రూ. 5,000 కోట్లు ఇక్కడ పెట్టుబడిగా పెట్టనుంది. దీని ద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా 7,500 మందికి ఉద్యోగ ఉపాధి అవకాశాలు కలుగనున్నాయి. ల్యారెస్ ల్యాబ్స్ ఇప్పటికే విశాఖ పరిసర ప్రాంతాల్లో 2007 నుంచి పెట్టుబడులు పెడుతూ వస్తోంది. ఇప్పటివరకు రూ.6,500 కోట్లతో తయారీ యూనిట్లు నెలకొల్పగా, 10 వేల మందికి ఉద్యోగాలు దక్కాయి. లారెస్ ల్యాబ్స్ సంస్థకు బెంగళూర్, హైదరాబాద్‌లో కూడా యూనిట్లు ఉన్నాయి. సంస్థ విస్తరణలో భాగంగా రాంబిల్లిలో పరిశ్రమలు పెడుతోంది. ఫర్మంటేషన్, క్రాప్ సైన్స్ కెమికల్స్, గ్రీన్ కెమిస్ట్రీ వంటి స్పెషాలిటీ కెమికల్స్ ఉత్పత్తి చేయనుంది. ఏపీలో సంస్థ విస్తరణపై కొద్ది రోజులుగా రాష్ట్ర ప్రభుత్వంతో లారస్ ల్యాబ్స్ సంప్రదింపులు జరుపుతోంది. లారస్ ల్యాబ్స్ సీఈవో చావా సత్యనారాయణ, ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ చావా నరసింహారావు ఈ రోజు సిఎం చంద్రబాబును సచివాలయంలో కలిశారు. భూకేటాయింపులు జరిపినందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు సంస్థ తరుపున కృతజ్ఞతలు తెలిపారు. ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించే విషయంలో స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ తమ విధానమని చెప్పిన ముఖ్యమంత్రి... భూ కేటాయింపులతో పాటు ప్రభుత్వం అన్ని విధాలుగా సహకారం అందిస్తుందని... సాధ్యమైనంత త్వరగా క్షేత్ర స్థాయిలో పనులు ప్రారంభించాలని కోరారు. ఈ పరిశ్రమ ఏర్పాటు ద్వారా పెద్దఎత్తున యువతకు ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు.

# హెల్మెట్ల వాడకం విషయంలో పోలీసు చర్యలు ఫలిస్తున్నాయి: హైకోర్టు

**విజయవాడ ఏప్రిల్ 03 ప్రభాతవార్త ప్రతినిధి:** ద్విచక్ర వాహనదారులు హెల్మెట్లు వినియోగించేలా చూసే విషయంలో పోలీసులు తీసుకుంటున్న చర్యలు ఫలితాలను ఇస్తున్నాయని హైకోర్టు వ్యాఖ్యానించింది. హెల్మెట్ల వాడకంలో కొంత పురోగతి కనిపిస్తోందని పేర్కొంది. హెల్మెట్లపై అవగాహన కల్పించడం, ధరించని వారికి జరిమానాలు వేయడంలో కొన్ని జిల్లాల్లో ఆశించిన స్థాయిలో ఫలితాలు కనిపించడం లేదని అభిప్రాయపడింది. ఆ జిల్లాల ఎస్పీలకు తగిన సూచనలు చేయాలని డీజీపీని ఆదేశించింది.పోలీసులు అవగాహన కార్యక్రమాలు, తనిఖీలను కొనసాగించాలని స్పష్టం చేసింది. పత్రికల్లో ప్రకటనలు, ప్రసార మాధ్యమాల ద్వారా అవగాహన కార్యక్రమాలు నిర్వహించేందుకు ప్రత్యేకంగా నిధులు కేటాయించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ని ఆదేశించింది. శాంతి భద్రతలు ట్రాఫిక్ విభాగం ఒకే వింగ్‌లో ఉండటం ఆశ్చర్యానికి గురిచేస్తోందని వ్యాఖ్యానించింది. ట్రాఫిక్ విభాగం ప్రత్యేకంగా ఉంటే మంచి ఫలితాలు వస్తాయని అభిప్రాయపడింది. ఈ ఏడాది జనవరి నుంచి మార్చి వరకు హెల్మెట్ ధరించకపోవడం వల్లఎంత మంది చనిపోయారన్న వివరాలను ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరింది. హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకుర్, జస్టిస్ చీమలపాటి రవితో కూడిన ధర్మాసనం బుధవారం ఈ మేరకు ఉత్తర్వులిచ్చింది. హెల్మెట్లు దరించకపోవడం వల్ల ద్విచక్ర వాహనదారులు మృతి చెందుతున్నారని, మోటారు వాహన చట్టాన్ని అమలు చేసేలా పోలీసులను ఆదేశించాలంటూ న్యాయవాది తాండవ యోగేష్ హైకోర్టులో పిల్ వేశారు. బుధవారం జరిగిన విచారణలో యోగేష్ వాదనలు వినిపించారు. ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాది ఎస్.ప్రణతి వాదనలు వినిపిస్తూ రాష్ట్ర వ్యాప్తంగా పోలీసులు తనిఖీలు చేసి ఉల్లంఘనలకు పాల్పడినవారికి చలానాలు విధిస్తున్నారన్నారు. వాహనదారుల నుంచి ఈ చలానాల సొమ్ము 72% వసూలు చేసి ప్రకాశం జిల్లా మొదటి స్థానంలో ఉందన్నారు. విజయనగరం, తూర్పుగోదావరి శ్రీకాకుళం జిల్లాలు 4 శాతం చొప్పున మాత్రమే వసూలు చేశాయన్నారు. పోలీసులు రహదారులపైకి వచ్చి తనిఖీలు చేయకపోతే మోటారు వాహన చట్టాలను ఉల్లంఘించేవారిని ప్రోత్సహించినట్లవుతుందని పేర్కొంది.

# ఎయిడ్స్ నియంత్రణలో ఎపి భేష్: న్యాకో తాజా నివేదికలో 7వ స్థానానికి చేరిన రాష్ట్రం

**విజయవాడ,ఏప్రిల్3,ప్రభాతవార్తప్రతినిధి:** దేశంలో ఎయిడ్స్ నియంత్రణలో పనితీరు బాగా మెరుగుపర్చుకుని 7వ స్థానానికి చేరుకున్నట్లు ఏపీశాక్స్ వెల్లడించింది. జాతీయ ఎయిడ్స్ నియంత్రణా సంస్థగతేడాది ఏప్రిల్- డిసెంబర్ మధ్య మెరుగైన పనితీరును కనబర్చడం ద్వారా 17వ ర్యాంక్ నుండి పైకి ఎగబాకిన ఏపీశాక్స్ ఈ కాలంలో ఎయిడ్స్ ను నియంత్రించడంలో ఏపీ కృషిని న్యాకోప్రశంసించింది. వివిధ ప్రమాణాల విషయంలో ఎపిశాక్స్ సాధించిన ఫలితాల్ని న్యాకోవెల్లడించింది. గతేడాది ఏప్రిల్, డిసెంబర్ మధ్యకాలంలో ఎపి శాక్స్ 90 శాతం నిధులను ఉపయోగించుకుంది ఖైదీల స్క్రీనింగ్‌ను మెరుగుపరచడంపై ఎపి శాక్స్ ఇప్పుడు దృష్టి సారించింది. 2004 నుండి ఏపీలో దాదాపు 2,25,000 మంది ఎయిడ్స్ బాధితుల్ని గుర్తించారుఎయిడ్స్ వ్యాధి నియంత్రణ కోసం 202425 సంవత్సరానికి

గాను ఎపి శాక్స్ కు న్యాకో రూ.127 కోట్లు ఇచ్చింది ఎయిడ్స్ వ్యాధిని నియంత్రించడంలో మంచి పని తీరును కనబర్చినందుకు ఎపి శాక్స్ పీడీ డాక్టర్ ఎ.సిరిని, సిబ్బందిని వైద్య, ఆరోగ్య శాఖా మంత్రి సత్య కుమార్ అభినందించారు.

# ఎయిర్ ట్యాక్సీ తయారుచేసిన అభిరామ్‌కు సిఎం చంద్రబాబు అభినందన

**విజయవాడ, ఏప్రిల్ 3,ప్రభాతవార్త ప్రతినిధి:**ఎయిర్ ట్యాక్సీ తయారుచేసిన అభిరామ్‌కు సీఎం చంద్రబాబు అభినంద అమరావతి, ఏప్రిల్ 03 : ముఖ్యమంత్రి చంద్రబాబును గుంటూరుకు చెందిన మ్యాగ్నమ్ వింగ్స్ సీఈఓ అభిరామ్ చావా కలిశారు. ఇటీవల తాను తయారుచేసిన ఎయిర్ ట్యాక్సీ గురించి సచివాలయంలో సీఎంను కలిసి వివరించారు. ఈ సందర్భంగా అభిరామ్‌ను సీఎం అభినందించారు. ఎయిర్ ట్యాక్సీ వివరాలు, సెక్యూరిటీ ఫీచర్స్, తయారీకి అయిన ఖర్చు వంటి వివరాలను సీఎం అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం రెండుసీట్ల సామర్థంతో ఈ ఎయిర్ ట్యాక్సీని తయారు చేశానని అభిరామ్ అన్నారు. ఈ ప్రాజెక్టుకు సివిల్ ఏవియేషన్ అనుమతుల కొనసాగిస్తామన్ని అన్నారు.



తెల్లజిల్లేడు, మారేడు, తులసీదళాలతో పుష్పార్చనలందుకుంటున్న దుర్గమ్మ

# వైభవంగా దుర్గమ్మకు పుష్పార్చన

**ఇంద్రకీలాద్రి, ఏప్రిల్ 3, ప్రభాత'వార్త'** అలంకార ప్రియురాలయిన దుర్గమ్మవారికి గురువారం తెల్లజిల్లేడు, మారేడు, తులసీదళాలతో ప్రత్యేక పుష్పార్చన నిర్వహించారు. వసంత నవరాత్రోత్సవాల్లో భాగంగా ఇఒ కె రామచంద్ర మోహన్ పండితులతో కలిసి దుర్గమ్మవారికి నిర్వహించే పుష్పార్చనకు సంబంధించిన పుష్పాలను నూతనంగా నిర్మించిన పూజామండపంకు మేళతాళాలు, మంగళవాయిద్యాలు, మంత్రపఠనోచ్చారణల నడుమ తీసుకొచ్చారు. అక్కడ దుర్గమ్మ వారు పుష్పార్చనలందుకుని భక్తులను అనుగ్రహించారు. వేదపండితులు వేదాశీర్వచనాలు పలికారు.

- వేదోక్తంగా శ్రీ సుబ్రహ్మణ్య కళ్యాణం: దుర్గమ్మవారి ఆలయంలో చైత్రమాసం శుద్ధ షష్ఠి సందర్భంగా శ్రీ వల్లీ దేవసేనా సమేత సుబ్రహ్మణ్య స్వామివార్ల కళ్యాణోత్సవం వేదోక్తంగా నిర్వహించారు. దేవతలకు సర్వసైన్యాధిపతి అయిన సుబ్రహ్మణ్య స్వామి వారి కళ్యాణాన్ని భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని వీక్షించారు. కళ్యాణ క్రతువు పూర్తయిన తరువాత ధూప, దీప, నైవేద్యాలు సమర్పించి భక్తులకు తీర్థ, ప్రసాద వితరణ చేశారు. దుర్గమ్మకు భక్తులు హుండీల ద్వారా సమర్పించిన కానుకలను గురువారం లెక్కించగా రు.2,18,00,698లు లభించినట్లు ఇఒ కె రామచంద్ర మోహన్ తెలిపారు. 355గ్రాముల బంగారం, 6కెజిల 374 గ్రాముల వెండి కూడా భక్తులు కానుకలుగా దుర్గమ్మకు సమర్పించారన్నారు. ఇఒ తో పాటు డిప్యూటి ఇఒ ఎం రత్నరాజు, దేవదాయ శాఖాధికారులు, పోలీసులు, ఎస్‌పిఎఫ్, ఆలయాధికారులు ఈ లెక్కింపుల కార్యక్రమంలో పాల్గొన్నారు.

# నేటితో ముగియనున్న ఎస్ఎస్‌సి పరీక్షలు

## 13వ తేదీతో ముగియనున్న మూల్యాంకనం

**హైదరాబాద్, ఏప్రిల్ 3, ప్రభాతవార్త:** రాష్ట్రవ్యాప్తంగా మార్చి 21 నుంచి ప్రారం భమైన ఎస్ఎస్‌సి పరీక్షలు ప్రశాంతంగా కొనసాగుతున్నాయి. నేటి(శుక్ర వారం)తో 10వ తరగతి వార్షిక పరీక్షలు ముగియనున్నాయి. ఈ నెల 2తో ప్రధాన పరీక్షలు ముగియగా.. ఒకేషనల్, ఓఎస్ఎస్‌సి పరీక్షలతో కలిపి నేటితో మొత్తం పరీక్షలు ముగియనున్నాయి. గురువరం జరిగిన ఒకేషనల్, ఓఎస్ఎస్‌సి పేపర్-1 పరీఓలకు 98.67 శాతం మంది విద్యార్థులు హాజర య్యారు. రాష్ట్రంలో ఎస్ఎస్‌సి పరీక్షల నిర్వహణ కోసం రాష్ట్ర వ్యాప్తంగా 2650 పరీక్షా కేంద్రాలనను ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. పరీక్షలను ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు నిర్వహిస్తున్నారు. ఈ నెల 2న జరిగిన సోషల్ స్టడిస్ పరీక్షతో 10వ తరగతికి చెందిన ప్రధాన పరీక్షలు ముగియగా.. ఈ నెల 3, 4 తేదిల్లో ఓఎస్ఎస్‌సి లాంగ్వేజెస్ పరీక్షలు జరగనున్నాయి. నేటితో మొత్తంగా ఎస్ఎస్‌సి పరీక్షలు ముగుస్తాయి. రాష్ట్రంలో మార్చి 21 నుంచి ప్రారం భమైన 10వ తరగత వార్షిక పరీక్షల జవాబు పత్రాల మూల్యాంకనం మార్చి 26 నుంచి ప్రారంభమైంది. ప్రతి ఏడాది మాదిరిగానే ఈ ఏడాది కూడా లాంగ్వేజెస్ పరీక్షలు ముగియగానే జవాబు పత్రాల మూల్యాంకనాన్ని మార్చి 26నే ప్రారంభించారు. రాష్ట్రంలోని 19 సెంటర్లలో స్పాట్ వాల్యు యేషన్ కొనసాగుతోంది. రాష్ట్రవ్యాప్తంగా 10వ తరగతి పరీక్షలకు 5.05 లక్షల మంది విద్యార్థులు హాజరుకానున్నారు. ఎస్ఎస్‌సి మూల్యాంకనాన్ని ఏప్రిల్ 13 వరకు ముగించాలని అధికారులు భావిస్తున్నారు. మూల్యాం కనం పూర్తయిన తరువాత.. ఏప్రిల్ నెలాఖరులోగానీ.. మే మొదటి వారంలోగానీ ఎస్ఎస్‌సి ఫలితాలను విడుదల చేయడానికి పాఠశాల విద్య శాఖ అధికారులు కసరత్తు చేస్తున్నట్టు తెలుస్తోంది.

# ఫ్లాట్‌లు కొనుగోలు చేసిన వారికి రిజిస్ట్రేషన్ చేసి ఇవ్వాల్సిందే

## సుప్రీంకోర్టు ఆదేశాలు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఏప్రిల్ 3:** హైదరాబాద్ నగరంలోని ఇందూ, రాంకీ, మంజీరా ప్రాజెక్టుల్లో ఫ్లాట్‌లు కొనుగోలు చేసినవారికి 4 వారాల్లో రిజిస్ట్రేషన్ చేసి ఇవ్వాల్సిందేనని తెలంగాణ హౌసింగ్ బోర్డుకు సుప్రీంకోర్టు ఆదేశాలు జారీ చేసింది. గతంలో వై.ఎస్.కు సన్నిహితులైన వారి కంపెనీలతో హౌసింగ్ బోర్డు ఒప్పందాలను చేసుకుని విలువైన భూములను అప్పగించింది. ఒప్పందం ప్రకారం ప్రాజెక్టును పూర్తి చేసినటువంటి కంపెనీలు బోర్డుకు రావాల్సిన వాటా సొమ్ము చెల్లించకపోవడం వల్ల ఫ్లాట్ కొనుగోలుదారులకు రిజిస్ట్రేషన్ చేయడానికి హౌసింగ్ బోర్డు నిరాకరించింది. ఫ్లాట్లు కొనుగోలు చేసినవారు 2 దశాబ్దాలుగా చేస్తున్న న్యాయపోరాటానికి అత్యున్నత న్యాయస్థానం తెరదించింది. ఇందూ ఈస్టర్న్ ప్రావిన్స్ ప్రాజెక్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్‌లో కొనుగోలు చేసిన ఫ్లాట్‌ను రిజిస్ట్రేషన్ చేసివ్వకపోవడాన్ని సవాలు చేస్తూ ఆర్.వేణుగోపాల్‌రెడ్డి అనే వ్యక్తితో పాటు మరొకరు గతంలో హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై విచారించిన హైకోర్టు డెవలపర్ అయిన ఇందూ ప్రాజెక్ట్స్‌తో ఉన్న వివాదంతో అమాయకులైన కొనుగోలుదారులకు ఇబ్బందులు సృష్టించరాదని, వారికి ఫ్లాట్‌లను రిజిస్ట్రేషన్ చేయాలని, రూ.10 వేలు జరిమానా చెల్లించాలంటూ తీర్పు వెలువరించింది.

# దేశరాజధానిలో కాంగ్రెస్ బిసి నేతలు బిజీబిజీ

## కేంద్ర సామాజిక న్యాయశాఖ మంత్రి వీరేంద్రతో భేటీ

## పార్లమెంట్‌హాల్‌లో సోనియాతో సమావేశం

## రాహుల్‌కు జంతర్‌మంతర్ దీక్ష గురించి వివరించిన బిసి నేతలు

**హైదరాబాద్, ఏప్రిల్ 3, ప్రభాతవార్త:** తెలంగాణలో బిసి రిజర్వేషన్ 42శాతం పెంచే అంశాన్ని రాజ్యాంగంలోని 9వ షెడ్యూల్‌లో పొందుపరిచేందుకు కాంగ్రెస్ బిసి ప్రజా ప్రతినిధులు న్యూఢిల్లీలో తీవ్రకసరత్తుచేస్తూ గురువారం బిజీబిజీగా గడిపారు. పిసిసి ఆధ్వర్యంలో జంతర్‌మంతర్ వద్ద బుధవారం ఢిల్లీలో చేపట్టిన బిసి సంఘాల మహాధర్నాకు ఎఐసిసి అగ్రనేత రాహుల్‌గాంధీ హాజరు కాకపోయినా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, డిప్యూటీ ముఖ్యమంత్రి భట్టివిక్రమార్కతోపాటు బిసి మంత్రులు, ఎంపిలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ఇండియా కూటమికి చెందిన కనిమొళి వంటి పొరుగు రాష్ట్రాల నేతలు హాజరుకావడంతో మహాధర్నాకు ఆశించిన దానికంటే ఎక్కువ రాజకీయ మైలేజి వచ్చింది. తెలంగాణ బిసి కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు మహాధర్నా సక్సెస్ ఉత్సాహంతో పిసిసి చీఫ్ మహేష్‌కుమార్ నేతృత్వంలో కేంద్ర సామాజిక న్యాయం సాధికారత మంత్రి డా.వీరేంద్రకుమార్‌ను గురువారం ఉదయం కలిసి రాష్ట్రంలో శాస్త్రీయంగా కులగణన సర్వేచేపట్టిన తీరును, దానికి అనుగుణంగా 42శాతం బిసిలకు రిజర్వేషన్ పెంచుతున్నామని వివరించారు. తెలంగాణ శాసనసభలో బిజెపి ఎమ్మెల్యేలు కూడా బిసి రిజర్వేషన్‌కు మద్దతు ఇవ్వడంతో ఏకగ్రీవంగా ఆమోదం పొందిందని కేంద్ర మంత్రికి టిపిసిసి అధ్యక్షుడు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ తెలిపారు. సమావేశంలో పాల్గొన్న తెలంగాణ మంత్రులు పొన్నం ప్రభాకర్‌గౌడ్, కొండసురేఖ,విప్‌లు ఆదిశ్రీనివాస్,బీర్ల ఐలయ్యలు ఎంపి మల్లురవి కేంద్ర మంత్రితో మాట్లాడుతూ జాతీయపార్టీకి చెందిన బిజెపి ఎమ్మెల్యేలు శాసనసభలో బిల్లుకు మద్దతు తెలిపిన క్రమంలో పార్లమెంట్‌లో కూడా జాతీయ పార్టీ బిజెపి సహకరించి తొందరగా బిల్లు పాస్ చేస్తుందనే విశ్వాసంతో ఉన్నా మని దానిని ఆచరణలో పెట్టాలని కోరారు. కేంద్ర ప్రభుత్వంకు శాసనసభలో ఆమోదించిన బిల్లును పంపామని వారు తెలిపారు. కేంద్రమంత్రి సానుకూలంగా స్పందించారని టిపిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ సంతోషం వ్యక్తంచేశారు. పార్లమెంట్ హాల్‌లో కాంగ్రెస్ అగ్రనేత సోనియాగాంధీతో మంత్రులు పొన్నంప్రభాకర్, కొండసురేఖ, ఎంపిలు,ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు కలిసి బిసిడిక్లరేషన్ అమలుకు తెలంగాణలో చేస్తున్న కృషిని వివరించారు. తెలంగాణలో గత పదిహేను నెలలుగా ప్రజాస్వామిక పాలన కొనసాగిస్తూ గత ప్రభుత్వం చేసిన తప్పులు ప్రజలు ఎండగడుతూ ముందుకు పోతున్నామని వివరించారు. లోక్‌సభలో ప్రతిపక్షనేత, ఎఐసిసి అగ్ర నేత రాహుల్‌గాంధీ వద్దకు చేరుకొని బిసి రిజర్వేషన్ 42 శాతానికి పెంచి తొమ్మిదవ షెడ్యూల్‌లో పొందు పరిచేలా చర్యలు తీసుకోవాలని టిపిసిసి చీఫ్ మహేష్‌కుమార్‌గౌడ్ కోరారు. పిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్‌గౌడ్ నేతృత్వంలో లోక్‌సభ ప్రతిపక్షనేత ఏఐసీసీ అగ్ర నాయకులు రాహుల్‌గాంధీతో భేటీ అయిన తెలంగాణ బిసి మంత్రులు పొన్నం ప్రభాకర్, కొండ సురేఖ, ఎంపి అనిల్‌యాదవ్, విప్‌లు అది శ్రీనివాస్, బీర్ల ఐలయ్య, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు నాయకులు వివరిం చారు. తెలంగాణ కుల గణన చేపట్టి అసెంబ్లీలో బిల్లు పెట్టి ఏకగ్రీవంగా ఆమో దం తెలిపిన విషయాలు తెలిపారు. ఢిల్లీ జంతర్‌మంతర్ వద్ద బిసి సంఘాల దీక్ష తదితర అంశాలను పిసిసి అధ్య క్షుడు మహేష్‌కుమార్‌గౌడ్, మంత్రులు పొన్నం, కొండా సురేఖ తదితరులు వివరించగా ఆయన విన్నారు.

4-4P□g7exHMNWJQE.qxd:4-4P□g7exHMNWJQE.qxd 01/01/01 9:35 AM Page 1



## హెచ్‌సియు భూములపై సుప్రీంకోర్టు స్టేను స్వాగతిస్తున్నాం

### భూములను కార్పొరేట్ శక్తులకు అప్పగించొద్దు

### సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ

**హైదరాబాద్, ఏప్రిల్ 3, ప్రభాతవార్త :** హైదరాబాదు సెంట్రల్ యూనివర్సిటీకి చెం దిన 400 ఎకరాల భూమి వ్యవహారంపై సుప్రీంకోర్టు స్టే ఇవ్వడాన్ని స్వాగతిస్తున్నట్టు సిపిఎం తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ తెలిపారు. హెచ్‌సి యూకు చెందిన 400 ఎకరాల భూమిని రాష్ట్ర ప్రభుత్వం వేలం వేసి కార్పొరేట్ సంస్థలకు కట్టబెట్టాలనే ప్రయత్నంలో భాగంగా బుల్డోజర్లతో అక్కడి చెట్లను తొలగించి, భూమిని చదునుచేసి, జంతువులకు తీవ్ర ఇబ్బంది కల్గించే చర్యలకు పాల్పడుతుందని మండిపడ్డారు. భూములను కారొపరేట్ సంస్థలకు ఇవ్వడాన్ని వ్యతిరేకించిన విద్యార్థులపై లాఠీఛార్జీ, అరెస్టులు, అక్రమ కేసులు పెట్టి, జైలుకు పంపిందన్నారు. ఈ నేపథ్యంలో హెచ్‌సి యూ భూమిలో చెట్ల తొలగింపు, చదును చేయడం వెంటనే నిలిపి వేయాలని సుప్రీంకోర్టు స్టే విధించడాన్ని తమ పార్టీ స్వాగతిస్తుం దన్నారు. సుప్రీం కోర్టు స్టేను దృష్టిలో పెట్టుకుని ఈ భూములను వేలం వేసే ప్రక్రియను రాష్ట్ర ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని, విద్యార్థులపై పెట్టిన అక్రమ కేసులు ఎత్తివేయాలని జాన్‌వెస్లీ డిమాండ్ చేశారు. భవిష్యత్‌లో ఇటువంటి చర్యలకు పూనుకుంటే రాష్ట్ర ప్రభుత్వంపై విద్యార్థులు, మేధావులు, ప్రజా సంఘాలు, ప్రజలు తీవ్రఆగ్రహాన్ని వ్యక్తం చేస్తారని జాన్‌వెస్లీ హెచ్చరించారు.

## టిజి సెట్-2025లో 36,334 మందికి సీట్ల కేటాయింపు

### మరో 13,130 సీట్ల రిజల్ట్స్ దశలవారీగా విడుదల

### ఫలితాలను విడుదల చేసిన సెట్ కన్వీనర్

**హైదరాబాద్, ఏప్రిల్ 3, ప్రభాతవార్త :** రాష్ట్రంలోని వివిధ గురుకులాల్లో 5వ తరగతిలో ప్రవేశాల కోసం నిర్వహించిన టిజి సెట్-2025లో 36,334 మందికి సీట్ల కేటాయింపు చేశారు. మరో 13,130 సీట్ల ఫలితాలను దశల వారీగా విడుదల చేయనున్నారు. టిసి సెట్-2025 ఫలితాలను సెట్ కన్వీనర్ విఎస్ అలుగు వర్షిణి గురువారం విడుదల చేశారు. రాష్ట్రంలోని ఎస్సీ, ఎస్టీ, బిసి, జనరల్ రెసిడెన్షియల్ స్కూల్స్‌లో 5వ తరగతిలో ప్రవేశాల కోసం ప్రతి ఏడాది టిజి సెట్‌ను నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే. అందులో భాగంగా 5వ తరగతిలో ఫిబ్రవరి 23న రాష్ట్ర వ్యాప్తంగా ప్రవేశ పరీక్ష నిర్వహించిన విషయం తెలిసిందే. ప్రవేశ పరీక్షలో అర్హత సాధించిన వారి ఫలితాలను టిజి సెట్-2025 చీఫ్ కన్వీనర్ డాక్టర్ విఎస్ అలుగు వర్షిణి విడుదల చేశారు. ప్రవేశ పరీక్ష రాసిన వారిలో 36,334 మంది ఎస్సి, ఎస్టీ, బిసి, ఓసి కేటగిరికి చెందిన విద్యార్థులు సీట్లు పొందినట్టు తెలిపారు. 5వ తరగతి ప్రవేశాలకు 89,246 మంది దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. వారిలో 84,672 మంది పరీక్షకు హాజరైనట్టు తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని గురుకులాల్లో కలిపి 5వ తరగతిలో 51,406 సీట్లు అందుబాటులో ఉన్నట్టు తెలిపారు. వాటిలో ఇప్పటికే ప్రత్యేక కేటగిరికి చెందిన 1944 మంది విద్యార్థుల ఫలితాలను వెల్లడించిన సంగతి తెలిసిందే. మిగిలిన కేటగిరీలకు చెందిన 13,130 సీట్ల ఫలితాలను దశల వారీగా విడుదల చేయనున్నట్టు అలుగు వర్షిణి ప్రకటనలో తెలిపారు.

## కొత్త బార్ల లైసెన్స్‌లకు దరఖాస్తులు ఆహ్వానం

### 26వ తేదీ ఆఖరి గడువు

**హైదరాబాద్, ఏప్రిల్ 3, ప్రభాతవార్త :** తెలంగాణలో గతంలో అనుమతి ఇచ్చినటువంటి 40 బార్లకు వివిధ కారణాలతో మూసివేయడంతో వీటి లైసెన్సులను కూడా ప్రభుత్వం రద్దు చేసింది. రద్దు చేసిన 40 బార్లను కు పునరుద్ధరించాలని ప్రభుత్వం ఆదేశించింది. ఈ మేరకు ఎక్సైజ్ శాఖ కమిషనర్ చేవూరి హరికిరణ్ నోటిఫికేషన్ బార్ల పునరుద్ధరణ నోటిఫికేషన్లు విడుదల చేశారు. తెలంగాణలో ఆదిలాబాద్‌లో 5, కరీంనగరలో ఒకటి, వరంగల్‌లో 4, ఖమ్మంలో 2, నల్గొండలో 1, మహాబూబ్‌నగర్‌లో 5, మెదక్‌లో1, నిజామాబాద్‌లో 4, రంగారెడ్డి జిల్లాలో రెండు బార్లను పునరుద్దరించాలని అధికారులు నిర్ణయం తీసుకున్నారు. అయితే జిహెచ్‌ఎంసి పరిధిలో స్థానిక సంస్థల ఏమ్మెల్సీ ఎన్నికలు ఉండటంతో 15 దరఖాస్తులను తీసుకోవడం లేదు. తెలంగాణ రూరల్ జిల్లాల్లో 25 బార్లకు నోటిఫికేషన్లు ఇచ్చారు. మీర్‌పేట మున్సిపాల్టీలో పాత బార్ స్థానంలో కొత్త బారుకు నోటిఫికేషన్ విడుదల చేసి దరఖాస్తులు కోరుతున్నామని సరూర్‌నగర్ ఎక్సైజ్ సూపరిండెంట్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దరఖాస్తుకు రూ. 1 లక్ష కాగా, బార్ లైసెన్స్ ఫీజు రూ.42 లక్షల ఉంటుందన్నారు. రంగారెడ్డి డివిజన్‌లో వికారబాద్ ఎక్సైజ్ సూపరిండెంట్ పరిధిలో సిఎం రేవంత్ రెడ్డి సొంత నియోజక వర్గం కొడంగల్ మున్సిపాల్టీలో ఉన్నటువంటి పాత బార్ స్థానంలో కొత్త బార్‌కు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎక్సైజ్ డిప్యూటి కమిషనర్ దశరథ్ తెలిపారు. దరఖాస్తు ధర రూ.1 లక్ష ఉంగా, సంవత్సరం ఫీజు రూ.30 లక్షలు ఉంటుందని పేర్కొన్నారు.

# వచ్చే ఖరీఫ్ సీజన్‌కు లిఫ్టులు సిద్ధం చేయాలి



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

### రహదారుల వెడల్పుపై రాజీ ప్రసక్తేలేదు

### అగ్రికల్చరల్ వర్సిటీకి వంద ఎకరాలు స్థలాన్ని సేకరించాలని ఆదేశం

### నాణ్యతా ప్రమాణాలతో చెక్‌డ్యామ్‌లను నిర్మించాలి

### ఉన్నతాధికారులతో సమీక్షలో మంత్రి ఉత్తమ్

**హుజూర్‌నగర్ (గరిడేపల్లి), ఏప్రిల్ 3, ప్రభాతవార్త :** ప్రజలకు ఉపయోగపడే శాశ్వత పనులను చేపడితే చరిత్రలో నిలిచిపోతామని రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి నలమాద ఉత్తంకుమార్ రెడ్డి పేర్కొ న్నారు. హైదరాబాదులోని జల సౌధ లో హుజూర్‌నగర్ కోదాడ నియోజ కవర్గాల్లోని జరుగుతున్న అభివృద్ధి పనులపై గురువారం ఉన్నతాధికా రులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహిం చారు. ఈ సంద ర్భంగా ఇరిగేషన్, ఆర్ అండ్ బి, ఆర్టీసీ, పంచాయతీరాజ్, ఆర్డబ్ల్యూఎస్, విద్యుత్ శాఖ హౌసింగ్ తదితర శాఖల ఉన్నతాధికారులతో మున్సిపాలిటీ అభివృద్ధి పనులు జరుగుతున్న తీరుపై ఆయన సుదీర్ఘం గా చర్చించారు. అభివృద్ధి పనులలో అధికారులు అలసత్వం ప్రదర్శిస్తే కఠిన చర్యలు తీసుకుంటానని హెచ్చరిం చారు. పనుల పట్ల అశ్రద్ధ వహించే అధికారులు ఉంటే వారిని వెంటనే బదిలీ చేయాలని ఉన్నత అధికారులను ఆదేశించారు. హుజూర్నగర్ నియోజక వర్గంలోని కోదాడ నియోజకవర్గాల పరిధిలోని 8 ఎత్తిపోతల పథకాల పనులు పూర్తిచేసి ఈ ఏడాది ఖరీఫ్ సీజన్ నాటికి అందించాలని మంత్రి అధికారులను ఆదేశించారు. హుజూర్‌నగర్ నియోజ కవర్గంలోని ముక్త్యాల్ కెనాల్ బ్రాంచ్, జవహార్ జాన్ పహాడ్, బెట్టతండా,,నక్కగూడెం లిఫ్టపై కోదాడ నియోజకవర్గం లోని రాజీవ్ గాంధీ రెడ్లకుంట, ఉత్తమ్ పద్మావతి తో పాటు ఆర్9 లిఫ్ట్ ఇరిగేషన్ పనులు జరుగుతున్న తీరును అధికారులతో చర్చించారు. లిఫ్ట్ ఇరిగేషన్ పనులు చేపట్టాలంటే ఈ మూడు నెలలే సరైన సమయమని అన్నారు. రైతులంతా పంటలన్నీ కోయడంతో భూములన్ని ఖాళీ ఉన్నాయని ఇప్పుడు పనులు చేయటానికి ఎలాంటి ఆటంకాలు ఉండవని అధికారులకు ఆయన సూచించారు. లిఫ్ట్ నిర్మాణం పనులు ఇప్పటికే చాలా ఆలస్యమైందని భూ సేకరణ పూర్తి కాకపోవడం వలన పనులు ఆలస్యమైతున్నాయని కాంట్రాక్టర్లు మంత్రి ఉత్తమ్ దృష్టికి తీసుకువచ్చారు. లిఫ్ట్ లకు సంబంధించిన పైపులు వెళ్లే భూములలో ఎప్పుడో భూసేకరణ చేశామని కేవలం రైతులకు నష్టపరిహారం చెల్లించడమే ఉందని రైతులు మాత్రం పైప్ లైన్ వేసుకునేందుకు అనుమతిచ్చారని హుజూర్నగర్, కోదాడు ఆర్డీవోలు మంత్రికి వివరించారు పైప్ లైన్ వేసుకునేందుకు వారు ఎలాంటి అడ్డంకులు చెప్పరని పనులు ప్రారంభించవచ్చునని వారు తెలిపారు. శాశ్వతంగా నిలిచిపోయేలా లిఫ్ట్ చెక్ డ్యాం నిర్మాణాలు చేపట్టాలనీ.. గతంలో కట్టిన చెక్ డ్యాం లు కొట్టుకుపోయాయని అలా కాకుండా పటిష్టంగా చెక్ డ్యాములను ఏర్పాటు చేయాలని అధికారులు ఆదేశించారు. అలాగే కొన్ని ఎన్ఎస్పి కాలువ బ్రిడ్జ్ లు కూలిపోయే దశలో ఉన్నాయని వాటిని వెంటనే అవసరమైన ప్రతిపాదనలను తనకు అందిస్తే అనుమతులు మంజూరు చేస్తామన్నారు. పంచాయతీరాజ్ ఆర్!!బి రోడ్లన్నీ ఇరుకుగా ఉన్నాయని తెలిపారు . రోడ్ల వెంట ఉన్న రైతులు ఆక్రమించారని, రోడ్డు విస్తీర్ణం ఎంతవరకు ఉందో అంతవరకు రోడ్డు వేయాలని, రోడ్ల నిర్మాణాల విషయంలో రాజీ ప్రసక్తి లేదని అధికారులకు తేల్చి చెప్పారు. కోదాడ, హుజూర్‌నగర్ నియోజకవర్గాలలో చెరువులను ఆక్రమించారని వాటిని వెంటనే గుర్తించి స్వాధీనం చేసుకోవాలని కలెక్టర్ ను ఆదేశించారు. మేళ్లచెరువు ఎన్ఎస్పీ కాలు పై ఉన్న మూడు బ్రిడ్జిలు కూలిపోయే ప్రమాదం ఉందని వెంటనే వాటికి ఎస్టిమేషన్ వేసి పంపించాలని ఇరిగేషన్ ఈఈ ను మంత్రి ఆదేశించారు.

## రెండో ఏఎన్‌ఎంల పిఆర్‌సి బకాయిలను విడుదల చేయాలి

### నోటిఫికేషన్ 22023 పరీక్ష ఫలితాలను విడుదల చేయాలి

### డిహెచ్ కార్యాలయం ముందు 2వ ఎఎన్‌ఎంల ధర్నా

**హైదరాబాద్, ఏప్రిల్ 3, ప్రభాతవార్త :** రాష్ట్రంలో 2వ ఏఎన్‌ఎంలకు ఇవ్వవలసిన 7 నెలల పిఆర్‌సి ఎరియర్స్‌ను వెంటనే విడుదల చేయాలని, పోస్టుల సంఖ్యను పెంచి ఫలితాలను విడుదల చేయాలని తెలంగాణ రాష్ట్ర సెకండ్ ఏఎన్‌ఎమ్స్ యూనియన్ (ఏఐటీయూసీ) డిమాండ్ చేసింది. గతంలో 2వ ఏఎన్‌ఎంలకు ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ గురువారం కోఠిలోని డైరెక్టర్ హెల్త్ కార్యాలయం ముందు 2వ ఏఎన్ఎం యూనియన్ ధర్నా చేపట్టింది. ఈ కార్యక్రమంలో రాష్ట్ర రెండవ ఏఎన్‌ఎంల సంఘం గౌరవ అధ్యక్షులు తోట రామాంజనేయులు, సంఘం అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు జక్కుల పద్మ, బోయిని శ్యామల, రాష్ట్ర కార్యదర్శులు తస్వీర్ సుల్తానా, పి జయమ్మ, ఎస్ సంధ్యా రాణి, ఉపాధ్యక్షులు కే. పద్మ, కృష్ణవేణి, పార్వతి, భారతి, కోశాధికారి రాజేశ్వరి రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏఐటియూసి తెలంగాణ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి నరసింహా మాట్లాడుతూ నేషనల్ హెల్త్ మిషన్ నందు పనిచేస్తున్న రెండవ ఏఎన్‌ఎంలకు ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చే వరకు పోరాటం ఆగబోదని వెల్లడించారు. రెండవ ఏఎన్‌ఎంలు.. ఏఐటియుసి ఆధ్వర్యంలో చేసిన సమ్మె సమయంలో, ఆ తరువాత జరిగిన పోరాటాల సమయంలో వయసు రీత్యా పరీక్షకు అర్హత లేని వారిని 100 శాతం గ్రాస్ శాలరీతోపాటు 7 నెలల పిఆర్సి వేతన బకాయిలు చెల్లిస్తామని ప్రభుత్వం అంగీకరించిందని గుర్తు చేశారు. అలాగే రూ.10 లక్షల హెల్త్ ఇన్సూరెన్స్, రూ.10 లక్షల లైఫ్ ఇన్సూరెన్స్, సబ్ సెంటర్ అదెబకాయిలు, ఏవిడి వ్యాక్సిన్ బకాయిలు చెల్లిస్తామని హామీ ఇచ్చినట్లు గుర్తు చేశారు. ఫిబ్రవరి 17న జరిగిన చర్చల్లో భాగంగా .. మార్చి 31వ తేదీ లోపు 7 నెలల పిఆర్‌సి బకాయిలు చెల్లిస్తామని కమిషనర్ హామీ ఇచ్చినట్లు నరసింహ గుర్తు చేశారు. 2020లో పిఆర్‌సి ప్రకటన చేస్తే .. 11 జూన్ 2021న పిఆర్‌సి అమల్లోకి వచ్చిందన్నారు. పిఆర్‌సి అమల్లోకి వచ్చిన 7 నెలల తర్వాత జీతాలు పెరిగాయని ఆయన గుర్తు చేశారు. ఆ తర్వాత జరిగిన పోరాటాల్లో పిఆర్‌సి బకాయిలను చెల్లిస్తామని చాలాసార్లు హామీ ఇచ్చి నెరవేర్చలేదన్నారు. 2వ ఏఎన్‌ఎంలతోపాటే పని చేస్తున్న ఈసీ ఏఎన్‌ఎంలకు 2023 సంవత్సరంలోనే పిఆర్‌సి బకాయిలు చెల్లించారని తెలిపారు. కానీ రెండవ ఏఎన్‌ఎంలకు ఇంతవరకు చెల్లించకపోవడం దారుణమన్నారు. ఎంఎస్‌ఆర్‌బి వారు విడుదల చేసిన నోటిఫికేషన్ 2/2023 పరీక్ష ఫలితాలను వెంటనే విడుదల చేయాలని నరసింహ డిమాండ్ చేశారు. ఏఐటీయూసీ పోరాట ఫలితంగా 52 సంవత్సరాలు దాటిన వారికి కూడా పరీక్ష రాయటానికి అర్హత వచ్చిందని.. ఇప్పుడు ఫలితాలు వెలువడితే వారు ఐదు, ఆరు సంవత్సరాలు పాటు రెగ్యులర్ ఏఎన్‌ఎంలుగా విధులు నిర్వర్తించే అవకాశం ఉంటుందన్నారు. కానీ ఫలితాలు విడుదల చేయకుండా ఆలస్యం చేస్తే తీవ్ర ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉందన్నారు. కావున అధికారులు సత్వరమే స్పందించి పరీక్ష ఫలితాలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. తాము శాంతియుతంగా ధర్నా చేయడానికి వస్తుంటే .. ధర్నాకు రాకుండా పోలీసులు రాష్ట్ర వ్యాప్తంగా జిల్లాల్లో వందలాది మందిని అడ్డుకున్నారని మండిపడ్డారు. ప్రజా ప్రభుత్వంలో ఇటువంటి అరెస్టులు జరగవద్దని.. హక్కులు తెలియజెప్పడానికి పోరాటాలు చేయక తప్పదనే విషయాన్ని పోలీసులు గుర్తించాలన్నారు.

## స్పీడ్ పోస్టులో ఇంటి వద్దకే రాములోరి కల్యాణ తలంబ్రాలు, అక్షింతలు

**హైదరాబాద్, ఏపిల్ర్ 3, ప్రభాతవార్త :** దక్షిణ అయోధ్యగా పేరు పొందిన భద్రాద్రిలో ఈ నెల 6న శ్రీరామనవి సందర్భంగా జరగనున్న కళ్యోత్సవ ఏర్పాట్లు ఘనంగా జరుగుతున్నాయి. సుదూర ప్రాంతాల నుంచి ఈ ఉత్సవాలను కన్నులార వీక్షించేందుకు, కళ్యానికి ఉపయోగించిన అక్షింతలను, తలంబ్రాలను భక్తులు తీసుకునేందుకు రాలేని భక్తుల కోసం దేవాదాయశాఖ సహాకారంతో పోస్టల్ శాఖ ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. ఇందులో భాగంగా కళ్యాణోతనసవంలో ఉపయోగించే అక్షింతలను, తలంబ్రాలను భక్తులు పొందేందుకు పోస్టల్ డిపార్టు మెంట్ ఒక ప్రత్యేక సౌకర్యాన్ని కల్పిస్తోంది. అర్చన తలంబ్రాలు, అక్షింతలను సేవ ఆర్డర్‌లు బుక్ చేసుకునేందుకు అవకాశాన్ని తెలంగాణ పోస్టల్ శాఖ కల్పిస్తోంది. ఈ సేవలను పొందాలనుకునే భక్తులు సమీపంలోని పోస్టల్ శాఖను సంప్రదించాలని కోరింది. భక్తులకు భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్ర స్వామి దేవస్థానం నుంచి ప్రసాదం, ముత్యాలు కళ్యాణ తలంబ్రాలను భక్తుల చిరునామాకు స్పీడ్ పోస్టు ద్వారా పంపిణీ చేస్తారు. అయితే భక్తులు ముత్యాల కళ్యాణ తలంబ్రాల కోసం రూ.150లను చెల్లించాల్సి ఉంటుందని, ఈ సదుపాయాన్ని ఉపయోగించుకునే భక్తులకు ఇంటి వద్దకే ముత్యాల తలంబ్రాలు, అక్షింతలు పోందవచ్చని పోస్టల్ శాఖ తెలిపింది.

## ప్రభుత్వం రూ.279 కోట్లు చెల్లించకపోవడంతో జాప్యం

### గుట్టకు ఎంఎంటిఎస్ రైలుపై

### ఎంపి చామల కిరణ్ ప్రశ్నకు కేంద్రం జవాబు

**హైదరాబాద్, ఏప్రిల్ 3, ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్రప్రభుత్వం ఘట్కేసర్ నుంచి యాదగిరిగుట్టకు ఎంఎంటిఎస్ రైతు మార్గం నిర్మాణానికి తనవంతు వాటా నిధులు రూ.279 కోట్లు చెల్లించకపోవడంలోనే జాప్యం జరుగుతోందని రైల్వేమంత్రి అశ్విన్ వైష్ణవ్ సమాధానం ఇచ్చారు. లోకసభలో హైదరాబాద్ నుంచి యాదగిరి గుట్టకు ఎంఎంటిఎస్ ప్రాజెక్టు ఎప్పటిలోగా పూర్తిచేస్తారని ఎంపి కిరణ్‌కుమార్ రెడ్డి అడిగిన ప్రశ్నకు మంత్రి అశ్విన్ వైష్ణవి సమాధానం చెప్పారు. 2016లోనే ఎంఎంటిఎస్‌పై తెలంగాణ ప్రభుత్వంతో కేంద్ర రైల్వేకు ఒప్పొందం జరిగిందని 1:2నిష్పత్తిలో పనులు చేపట్టాలని నిర్ణయించి అదే యేడు నిధులు కూడా మంజూరు చేశామని తెలిపారు. చామలకిరణ్ కుమార్‌రెడ్డి మాట్లాడుతూ కేంద్రమే తన నిధులతో ఎంఎంటిఎస్ ఘట్కేసర్ నుంచి యాదగిరిగుట్టకు ప్రాజెక్టును పూర్తిచేయాలని సూచించారు.

## గ్యాప్-1 రాక్ఫిల్ డ్యామ్ పనులకు శ్రీకారం

**హైదరాబాద్, ఏప్రిల్ 3, ప్రభాతవార్త:** పోలవరం ప్రాజెక్ట్ లో కీలకమైన గ్యాప్ 1 రాక్ఫిల్ డ్యామ్ పనులకు గురువారం శ్రీకారం చుట్టారు. జలవనరుల శాఖ, పోలవరం ప్రాజెక్ట్ అథారిటీ (పీపీఏ), మేఘా ఇంజనీరింగ్ అండ్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్ (ఎంఈఐఎల్) అధికారులు ప్రాజెక్ట్ నిర్మాణ ప్రాంతంలో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. గ్యాప్ 1 రాక్ఫిల్ డ్యామ్ ను సుమారు 25 మీటర్ల ఎత్తుతో 540 మీటర్ల పొడవున నిర్మిస్తారు. ఈ సందర్భంగా జల వనరుల శాఖ, పీపీఏ అధికారులు, ఎంఏఐఅల్ ప్రతినిధులు మాట్లా డుతూ నిర్ణీత గడువులోగా ప్రాజెక్టు నిర్మాణాన్ని పూర్తి చేసేందుకు ప్రణాళికా బద్ధంగా పనులు చేస్తున్నట్లు తెలిపారు. అన్ని విభాగాలు సమన్వయం చేసుకుంటూ పనులు వేగవంతం చేసి ప్రాజెక్టును గడువులోగా పూర్తి చేయా లని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. పూజా కార్యక్రమంలో పోలవరం ప్రాజెక్టు సీఈ కే నరసింహమూర్తి, ఎస్ఈ రెడ్డి రామచంద్రరావు, ఈఈ కే బాలకృష్ణ, పీపీఏసీఈ రమేష్ కుమార్, ఎంఈఐఎల్ జాయింట్ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ సతీష్ బాబు అంగర, జీఎం గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

## కలకలం రేపుతున్న బంగారం వ్యవహారం

### సౌదీ నుండి ఇండియాకు కిలో బంగారం అక్రమ రవాణా

### నిందితుల కోసం పోలీసుల గాలింపు



**చందుర్తి, ఏప్రిల్ 3, ప్రభాతవార్త:** సౌదీ అరేబియా నుండి ఏ లాంటి అనుమతులు లేకుండా కిలో బంగారాన్ని అక్రమంగా నిజామాబాద్ జిల్లాకు చెందిన ఓ వ్యక్తి రాజన్న సిరిసిల్ల జిల్లా చందుర్తి మండలం జోగాపూర్ గ్రామానికి చెందిన ఇద్దరు వ్యక్తుల ద్వారా ఇండియాకు వారం రోజుల క్రితం పంపియగా బంగారం తీసుకొచ్చిన వ్యక్తుల సెల్ ఫోన్ లు కలవకపోవడంతో అట్టి వ్యక్తుల ఆచూకీ లభ్యం కాకపోవడంతో నిజామాబాద్ జిల్లాకు చెందిన వ్యక్తి వేములవాడ పట్టణ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయడంతో పోలీసులు ఈ ఘటనపై పూర్తిస్థాయిలో విచారణ చేపడుతూ బంగారం తీసుకొచ్చిన వ్యక్తుల కోసం గాలింపు చర్యలు చేపడుతున్నారు, విదేశాల నుండి సుంకం లేకుండా అక్రమంగా బంగారాన్ని తీసుకువచ్చి ఇక్కడ విక్రయించేందుకు ప్రణాళిక సిద్ధం చేశారు, జోగాపూర్ గ్రామానికి చెందిన బీరయ్య, అనిల్ అనే ఇద్దరు వ్యక్తులు ఈ బంగారాన్ని తీసుకువచ్చి ఎన్గల్ గ్రామానికి చెందిన ఓ వ్యక్తి ద్వారా బంగారాన్ని మాయం చేసినట్లు చందుర్తి మండలం లో ప్రచారం జరుగుతుంది, సౌదీ నుండి బంగారం పంపిన వ్యక్తి ఇండియాలో బంగారాన్ని అప్పగించకపోవడం ఈ వ్యవహారం బయటపడింది, వేములవాడ పోలీస్ స్టేషన్ లో ఈ సంఘటన కేసు నమోదు కాగా నిందితుల కోసం గాలింపు చర్యలు చేపట్టగా వారి ఆచూకీ లభ్య కాకపోవడంతో వారి బంధువులను ఆరా తీస్తున్నారు, బంగారం వ్యవహారం కేసుకు సంబంధించి చందుర్తి మండలానికి చెందిన కొంతమంది మాజీ ప్రజాప్రతినిదులు రాజీ కుదిరిచ్చేందుకు బెరసాలు కొనసాగిస్తున్నట్లు తెలిసింది, సౌదీ నుండి అక్రమ బంగారం ఎయిర్ పోర్టు నుండి ఎలా బయటకు వచ్చింది అనే కోణం నుండి విచారణ కొనసాగుతుంది, ఈ విషయమైన పోలీసులను వివరణ కోరగా సౌదీ నుండి అనధికారికంగా బంగారం వచ్చింది వాస్తవమేనని ఈ సంఘటనపై కేసు నమోదు చేసే దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## జూన్ 2 నుంచి జూనియర్ కాలేజీలు ప్రారంభం

### దసరాకు 9 రోజులు, సంక్రాంతికి 8 రోజులు సెలవులు

### నవంబర్‌లో అర్ధవార్షిక పరీక్షలు.. జనవరిలో ప్రీఫైనల్

### 2025-26 అకడమక్ క్యాలెండర్‌ను ప్రకటించిన ఇంటర్ బోర్డు

**హైదరాబాద్, ఏప్రిల్ 3, ప్రభాతవార్త:** రాష్ట్రంలో జూన్ 2 నుంచి జూనియర్ కాలేజీలు ప్రారంభం కానున్నాయి. జూన్ 2 నుంచి 2025-26 విద్యా సంవత్సరాన్ని ప్రారంభించనున్నట్టు ఇంటర్ బోర్డు కార్యదర్శి కృష్ణ ఆదిత్య తెలిపారు. 2025-26 విద్యా సంవత్సరంలో 226 పనిదినాలతో కొనసాగనున్నట్టు అకడమిక్ క్యాలెండర్‌ను ప్రకటించారు. జూన్ 2 నుంచే ఇంటర్ మొదటి, ద్వితీయ సంవత్సరం క్లాసులను ప్రారంభిం చనున్నట్టు అకడమిక్ క్యాలెండర్‌లో ప్రకటించారు. దసరా సెలవులను సెప్టెంబర్ 28 నుంచి అక్టోబర్ 5 వరకు 9 రోజులు, సంక్రాంతి సెలవులను జనవరి 11 నుంచి 18 వరకు 8 రోజులపాటు ఇవ్వనున్నారు. నవంబర్ 10 నుంచి 15 వరకు అర్ధవార్షిక పరీక్షలను నిర్వహిం చనున్నట్టు తెలిపారు. ప్రీఫైనల్ పరీక్షలను జనవరి 19 నుంచి 24 వరకు నిర్వహించనున్నారు. ప్రాక్టికల్ పరీక్షలను ఫిబ్రవరి మొదటి వారంలో ప్రారంభించాలని.. వార్షిక పరీక్షలను మార్చి మొదటి వారంలో ప్రారంభించాలని నిర్ణయించినట్టు అకడమిక్ క్యాలెండర్‌లో ప్రకటించారు. 2026, మార్చి 31 2025-26 విద్యా సంవత్సరపు చివరి పనిదినంగా ప్రకటించారు. ఏప్రిల్ 1, 2026 నుంచి మే 31, 2026 వరకు వచ్చే ఏడాది వేసవి సెలవులుగా ప్రకటించారు. మొత్తంగా 226 పనిదినాలతో 2025-26 విద్యా సంవత్సరాన్ని అమలు చేయనున్నట్టు అకడమిక్ క్యాలెండర్‌లో పేర్కొన్నారు. జూన్‌లో 23, జులై 25, ఆగస్టు 22, సెప్టెంబర్ 22, అక్టోబర్ 21, నవంబర్ 23, డిసెంబర్ 24, జనవరి 19, ఫిబ్రవరి 24, మార్చి 23 రోజులు పనిదినాలతో మొత్తం 226 పనిదినాలు కొనసాగుతాయని ప్రకటించారు.



## జోయలుక్కాస్ ఆధ్వర్యంలో బ్రిలియన్స్ డైమండ్ జ్యుయెలరీ ప్రదర్శన

**హైదరాబాద్, ఏప్రిల్ 3, ప్రభాతవార్త :** జోయలుకాస్ ఆధ్వర్యంలో డైమండ్ జ్యూయల్లరీ ప్రదర్శన నిర్వహించనున్నట్లు జోయ్ అలుకాస్ ఎండి, ఛైర్మన్ జోయ్ అలుక్కాస్ అన్నారు. గురువారం ఆయన పంజాగుట్టలోని జోయలుకాస్ షోరూంలో ఈ ప్రదర్శనను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ప్రదర్శన ఈ నెల 20 వరకు ఉంటుందని తెలిపారు. పంజాగుట్టలోని షోరూంలో నిర్వహించనున్న ఈ ప్రదర్శనలో అనేక రకాల డైమండ్ జ్యూయల్లరీలను ప్రదర్శించనన్నట్లు పేర్కొన్నారు. ముఖ్యంగా అన్ కట్ డైమండ్స్, ప్రెషస్ జ్యూవలరీ యొక్క ప్రత్యేకమైన కలక్షన్‌ను ప్రదర్శిస్తామన్నారు. ఈ డైమండ్ జ్యూయల్లరీ ప్రదర్శనలో ప్రతి ఆభరణం ప్రత్యేకంగా రూపొందించినట్లు తెలిపారు. బ్రిలియెన్స్ డైమండ్ జ్యూవలరీ షోలో కలక్షన్ ప్రత్యేకంగా లభించేలా చేసినట్లు తెలిపారు. ఈ ప్రదర్శనను మొదటిగా వీక్షించి, ఈ కళాఖండాలను సొంతం చేసుకోవడానికి ఇది ఒక గొప్ప అవకాశమన్నారు. ఉత్తమమైన జ్యూయల్లరిని గొప్పగా ప్రకాశించే విధంగా నగరంలో ఈ ప్రదర్శన ఏర్పాటు చేసినట్లు చెప్పారు. డైమండ్ జ్యూవలరీ పై సాటిలేని ఆఫర్లు అందిస్తున్నామన్నారు. రూ. 1 లక్ష మరియు అంతకంటే ఎక్కువ విలువైన డైమండ్ జ్యూవలరీని కొనుగోలు చేసిన కస్టమర్లు 1గ్రామ్ గోల్డ్ కాయిన్ ను ఉచితంగా పొందవచ్చని తెలిపారు. ఈ ఎగ్జిబిషన్ లో ప్రతి ఒక్కరి కోసం ఏదో ఒకటి ప్రత్యేకమైనది లభిస్తుందన్న ఆయన డైమండ్, ప్రెషస్ జ్యూయల్లరిలో ఉత్తమమైన వాటిని కనుగోనే ఈ సాటి లేని అవకాశాన్ని కోల్పోవద్దని విజ్ఞప్తి చేశారు.

## ప్రైవేటు జూ.కాలేజీల గుర్తింపునకు రేపటి నుంచి దరఖాస్తుల స్వీకరణ

### మే 4 వరకు అపరాధ రుసుం లేకుండా స్వీకరణ

### అపరాధ రుసుంతో జూన్ 6 వరకు..

### ఇంటర్ బోర్డు కార్యదర్శి కృష్ణఆదిత్య నోటిఫికేషన్ జారీ

**హైదరాబాద్, ఏప్రిల్ 3, ప్రభాతవార్త:** రాష్ట్రంలో 2025-26 విద్యా సంవత్సరానికిగానూ ప్రైవేటు, కార్పొరేట్ జూనియర్ కాలేజీలకి తాత్కాలిక గుర్తింపు ఇవ్వడానికి రేపటి(శనివారం) నుంచి దరఖాస్తులను స్వీకరించనున్నారు. అపరాధ రుసుం లేకుండా మే 4 వరకు దరఖాస్తులను స్వీకరించనున్నారు. ఇందుకు సంబంధించిన నోటిఫికేషన్‌ను ఇంటర్ బోర్డు కార్యదర్శి కృష్ణ ఆదిత్య గురువారం జారీ చేశారు. రాష్ట్రంలో కొనసాగుతున్న సుమారు 1500 వరకు ప్రైవేటు, కార్పొరేట్ కాలేజీలు ప్రతి ఏడాది ఇంటర్ బోర్డు ద్వారా అనుబంధ గుర్తింపును పొందాల్సి ఉంటుంది. అందులో భాగంగా ప్రతిఏడాది ప్రైవేటు జూనియర్ కాలేజీల నుంచి దరఖాస్తులను ఆన్‌లైన్‌లో స్వీకరించి ఆయా కాలేజీలకు అనుబంధ గుర్తింపును ఇంటర్ బోర్డు ఇస్తుంది. ఈ నేపథ్యంలోనే 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించిన నోటిఫికేషన్‌ను గురువారం జారీ చేసింది. కాలేజీలకు ఇంటర్ బోర్డు అనుబంధం గుర్తింపుతోపాటు అదనపు సెక్షన్ల కోసం అనుమతి పొందాల్సి ఉంటుంది. ప్రతి కాలేజీలో గరిష్టంగా నాలుగు సెక్షన్లకు అనుమతి ఉంటుంది.. అదనంగా మరో 5 సెక్షన్లకు అనుమతి ఇచ్చే అవకాశం ఉంటుంది. కాలేజీలకు ఇంటర్ బోర్డు అనుబంధ గుర్తింపు ఇవ్వడానికి పలు సర్టిఫికెట్లను కాలేజీల యాజమాన్యాలు సమర్పించాల్సి ఉంటుంది. వాటిలో ప్రధానంగా భవన లీజు డీడ్, ఆట స్థలం(ప్లేగ్రౌండ్), అగ్నిమాపక భద్రతా ధృవీకరణ పత్రం(ఫైర్ ఎన్‌వోసీ), శానిటరీ సర్టిఫికేట్, స్ట్రక్చరల్ సౌండ్‌నెస్ సర్టిఫికేట్‌లను సమర్పించాల్సి ఉంటుంది. దరఖాస్తు ప్రక్రియలో భాగంగా కళాశాల యాజమాన్యం బోధనా సిబ్బంది అర్హతలు, వారి వివరాలను కూడా అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. జనరల్, ఒకేషనల్ జూనియర్ కాలేజీలకు అనుబంధం గుర్తింపు రుసుంతోపాటు తనిఖీ రుసుములను కూడా కాలేజీలు చెల్లించాల్సి ఉంటుంది. ఈ ఏడాది అనుబంధం గుర్తింపు, అదనపు సెక్షన్ల అనుమతి కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవడానికి రేపటి(శనివారం, ఏప్రిల్ 5) అవకాశం కల్పించింది.

ఇంటర్ బోర్డు అధికారిక వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేయాల్సి ఉంటుంది. మే 4 వరకు అపరాధ రుసుం లేకుండా దరఖాస్తులను స్వీకరించనున్నారు. అపరాధ రుసుంతో జూన్ 8 వరకు దరఖాస్తులను స్వీకరించనున్నట్టు నోటిఫికేషన్‌లో స్పష్టం చేశారు. అపరాధం రుసుం రూ. 1000తో మే 11 రూ. 5000తో మే 18 వరకు, రూ. 10వేలతో మే 25 వరకు, రూ. 15వేలతో జూన్ 1 వరకు.. అపరాధ రుసుం రూ. 20వేలతో జూన్ 8 వరకు దరఖాస్తులను స్వీకరించనున్నారు. కేవలం ఆన్‌లైన్‌లోనే దరఖాస్తులను స్వీకరిస్తారని.. నేరుగా దరఖాస్తులను స్వీకరించరని నోటిఫికేషన్‌లో స్పష్టం చేశారు. జూనియర్ కళాశాల ప్రాంగణాన్ని ఒకే ప్రాంతంలోకి మార్చడం, సొసైటీ లేదా కళాశాల పేరులో మార్పులు.. (ఉదా., బాలికల నుండి కోఎడ్యుకేషన్‌కు) కోసం ప్రతిపాదనలతో దరఖాస్తు సమర్పించాలి. జూన్ 8 తర్వాత వచ్చిన అభ్యర్థనలను తిరస్కరించనున్నట్టు తెలిపారు. మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో తనిఖీలకు రూ. 65వేలు, అప్లియేషన్ ఫీజు రూ. 16000 కాగా మున్సిపాలిటీ పరిధిలో రూ. 50వేలు తనిఖీలకు, రూ. 14వేలు అప్లియేషన్‌కి, ఇక గ్రామీణ ప్రాంతాల్లో తనిఖీలకు రూ. 20వేలు, అప్లియేషన్లకు రూ. 5వేలు చెల్లించాల్సి ఉంటుంది. 4 కాలేజీల కంటే ఎక్కువ ఉన్న వారు, అదనపు సెక్షన్లు ఉన్నవారు అదనంగా చెల్లించాల్సి ఉంటుంది. అలాగే ఒకేషనల్ కాలేజీలకు మున్సిపల్ కార్పొరేషన్‌ల పరిధిలో తనిఖీలకు రూ. 60వేలు, అప్లియేషన్‌కి రూ. 5వేలు, మున్సిపాలిటీ పరిధిలో రూ. 36వేలు తనిఖీలకు, రూ. 5వేలు అప్లియేషన్‌కి, గ్రామపంచాయతీల్లో తనిఖీలకు రూ. 16వేలుగానూ, అప్లియేషన్‌కి రూ. 5వేలుగా నిర్ణయించారు.

4-4pg10.qxd:4-4pg10.qxd 01/01/01 8:41 AM Page 1



ఆట

## వరల్డ్ బాక్సింగ్ కప్‌లో..
# సెమీస్‌కు జదుమణి



**న్యూఢిల్లీ:** భారత యువ బాక్సర్ జదుమణి సింగ్ ప్రపంచ బాక్సింగ్ కప్‌లో సెమీఫైనల్ చేరాడు. ప్రపంచ బాక్సింగ్ కప్-2025లో భాగంగా బ్రెజిల్‌లోని ఇగాకులో జరుగుతున్న టోర్నీలో భాగంగా పురుషుల 50 కిలోల విభాగంలో బరిలోకి దిగిన జదుమణి క్వార్టర్స్‌లో 3-2తో ఎల్లిస్ ట్రోబ్రిడ్జ్ (బ్రిటన్)ను చిత్తుచేశాడు. జదుమణి సెమీస్ చేరినా మరో ముగ్గురు భారత బాక్సర్లు ఆరంభ బౌట్‌లోనే వెనుదిరిగారు. నరేందర్ (90 కిలోలు), నిఖిల్ దూబే (75 కిలోలు), జుగ్నో (85 కిలోలు) నిరాశపరిచారు. 2024 ప్రపంచ బాక్సింగ్ కప్ ఫైనల్స్ రజత పతక విజేత ట్రోబ్రిడ్జ్ తన సాధారణ దూకుడు శైలిలోనే బౌట్‌ను ప్రారంభించాడు, కానీ భారత ఆటగాడు ఆ ఒత్తిడిని తట్టుకుని తన పంచ్‌లతో అదరగొట్టాడు. ఫైనల్‌లో స్థానం కోసం జదుమణి ఇప్పుడు మాజీ ఆసియా యు-22 ఛాంపియన్ అసిల్‌బెక్ జలిలోవ్‌తో తలపడనున్నాడు. కాగా భారత్‌కు చెందిన మరో ముగ్గురు బాక్సర్లు తమ తమ పోటీల్లో ఓడిపోవడంతో 75 కిలోలు, 85 కిలోలు మరియు 90+ కిలోల విభాగాలలో పరాజయం పాలయ్యారు. స్థానిక ఫేవరెట్ కౌ బెలిని చేతిలో భారత్‌కు చెందిన నిఖిల్ దూబే 75 కిలోల బౌట్‌లో 0-5 తేడాతో ఓడిపోయాడు, మంరో భారత్ బాక్సర్ జుగ్నో 85 కిలోల బౌట్‌లో ఫ్రాన్స్‌కు చెందిన అబ్దులయే ట్రోర్‌తో జరిగిన పోరులో 1-4 తేడాతోను, నరేందర్ (భారత్) కజకిస్తాన్‌కు చెందిన డానియల్ సపర్‌బేను ఓడించడానికి దగ్గరగా వచ్చినా కానీ 3-2 స్ప్లిట్ నిర్ణయంతో 90+ కిలోల బౌట్‌లో ఓడిపోయాడు.

## ఆర్సీబి ఓటమితో
# మారిన లెక్కలు
### టాప్‌లోకి దూసుకొచ్చిన పంజాబ్ కింగ్స్



**న్యూఢిల్లీ:** ఇండియన్ ప్రీమియర్ లీగ్ సీజన్ 18లో 15 మ్యాచ్‌లు పూర్తయ్యాయి. చాలాటీమ్స్ మూడేసి మ్యాచ్‌లుఆడితే,ఓ రెండు టీమ్స్ రెండేసి మ్యాచ్‌లు పూర్తి చేసుకున్నాయి. అయితే గుజరాత్ టైటాన్స్ చేతిలో ఆర్సీబీ ఓటమితో పాయింట్ల పట్టికలో మార్పులు చోటు చేసుకున్నాయి. శ్రేయాస్ అయ్యర్ నేతృత్వంలోని పంజాబ్ కింగ్స్ ఆడిన రెండుమ్యాచ్‌ల్లోనూ విజయంసాధించింది. దీంతో పంజాబ్ కింగ్స్ 1.485 నికర రన్‌రేట్‌తో 4 పాయింట్లతో పాయింట్ల పట్టికలో అగ్రస్థానంలో నిలిచింది. అక్షర్ పటేల్ నాయకత్వంలో, ఢిల్లీ క్యాపిటల్స్ జట్టు మొదటి రెండు మ్యాచ్‌ల్లో అద్భుతంగా రాణించింది. ఈ ప్రదర్శనతో, దీది జట్టు 1.320 నికర రన్ రేట్‌తో మొత్తం 4 పాయింట్లతో రెండవ స్థానాన్ని దక్కించుకుంది. రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు మొదటి రెండు మ్యాచ్‌ల్లో గెలిచింది, కానీ మూడవ మ్యాచ్‌లో ఓడిపోయింది. దీనితో, వారు 1.149 నికర రన్ రేట్‌తో మొత్తం 4 పాయింట్లతో మూడవ స్థానానికి పడిపోయారు. ఇక తర్వాత స్థానాల్లో వరుసగా గుజరాత్, ముంబై, లక్నో, చెన్నై, హైదరాబాద్, రాజస్థాన్, కోల్‌కతా జట్లు ఉన్నాయి.

## మెనోర్కా ఓపెన్ ఎటిపి ఛాలెంజర్‌లో..
# భారత్ శుభారంభం

**న్యూఢిల్లీ:** మెనోర్కా ఓపెన్ ఏటీపీ ఛాలెంజర్-100 టెన్నిస్ టోర్నమెంట్‌లో భారత్ ద్వయం శుభారంభం చేసింది. స్పెయిన్‌లో జరుగుతున్న ఈ టోర్నీలో భాగంగా పురుషుల డబుల్స్ విభాగంలో భారత్ డేవిజ్ కప్ జట్టు సభ్యుడు మైనేని సాకేత్, తమిళనాడుకు చెందిన రామ్‌కుమార్ రామనాథన్‌తో కలిసి బరిలోకి దిగాడు. తొలి రౌండ్ మ్యాచ్‌లో సాకేత్-రామ్‌కుమార్ ద్వయం 6-1, 6-2తో అర్జెంటీనాకు చెందిన పెడ్రో కాచిన్-స్పెయిన్‌కు చెందిన ఇజాన్ కొరెత్యా జోడీపై విజయం సాధించి క్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లింది. 48 నిముషాల్లోనే ముగిసిన ఈ మ్యాచ్‌లో సాకేత్-రామ్‌కుమార్ నాలుగు ఏఎస్‌లు సంధించి, ఒక డబుల్ ఫాల్ట్ చేశారు. తమ సర్వీస్‌లను నిలబెట్టుకుని, ప్రత్యర్థి సర్వీస్‌ను నాలుగుసార్లు బ్రేక్ చేశారు. కాగా ఇదే టోర్నమెంట్‌లో బరిలోకి దిగిన హైదరాబాద్‌కు చెందిన అనిరుధ్ చంద్రశేఖర్ మాత్రం తొలి రౌండ్‌ను దాటలేకపోయాడు. గత వారం డేవిడ్



స్పెయిన్‌కు చెందిన వెగా హెర్నాండెజ్‌తో కలిసి జిరోనా ఓపెన్ ఏటీపీ ఛాలెంజర్‌స టోర్నీలో డబుల్స్ టైటిల్ నెగ్గిన అనిరుధ్ అదే ఫలితాన్ని పునరావృతం చేయలేకపోయాడు. తొలి రౌండ్‌లో అనిరుధ్ (భారత్)-హెర్నాండెజ్ ద్వయం 6-7 (4/7), 7-5, 5-10తో సూపర్ టైబ్రేక్‌లో మూడో సీడ్, డానియల్ కుకెర్మన్ (ఇజ్రాయెల్)-జోషువా పారిస్ (బ్రిటన్) జంట చేతిలో పోరాడి పరాజయం పాలైంది. రెండు గంటల పాటు జరిగిన ఈ మ్యాచ్‌లో అనిరుధ్ జంట తమ సర్వీస్‌ను మూడుసార్లు కోల్పోయి, ప్రత్యర్థి సర్వీస్‌ను నాలుగుసార్లు బ్రేక్ చేసింది. అయితే నిర్ణాయక సూపర్ టైబ్రేక్‌లో మాత్రం అనిరుధ్ ద్వయం తడబడింది. ఇక భారత్‌కే చెందిన టాప్ సీడ్ జోడీ విజయ్ సుందర్ ప్రశాంత్, జీవన్ నెడుంజెళియన్ జోడీ 2-6, 0-6తో మాటియో-అంద్రియా (ఇటలీ) జంట చేతిలో ఓటమి పాలైంది. మరో తొలి రౌండ్ మ్యాచ్‌లో నిక్కీ పునాచా (భారత్)-గోర్నెస్ (స్పెయిన్) ద్యం 6-3, 6-3తో వరోనా-టబెర్నర్ (స్పెయిన్) జంటపై గెలిచి క్వార్టర్ ఫైనల్‌కు చేరుకుంది.



## ఐపిఎల్‌లో ఆర్సీబి, జిటి మ్యాచ్‌తో..
# మారిన పర్పుల్ క్యాప్ లిస్ట్
### టాప్‌లో 9 వికెట్లతో నూర్ అహ్మద్

**న్యూఢిల్లీ:** ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్)-2025, సీజన్ 18 అత్యంత ఉత్కంఠ భరితంగా కొనసాగుతోంది. వివిధ ఫ్రాంచైజీలకు చెందిన జట్లు పోటా పోటీగా తలపడుతూ ఆధిక్యాన్ని చూపించే ప్రయత్నం చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఆయా టీమ్‌ల్లోని ప్లేయర్లు తమ శక్తి వంచన లేకుండా కదం తొక్కుతున్నారు. బౌలర్లు ప్రత్యర్థి వికెట్లను పడగొట్టడంపైనే దృష్టిసారిస్తున్నారు. ఫలితంగా ప్రస్తుత ఐపీఎల్-2025లో పలువురు బౌలర్లు ధనాధన్ అంటూ ప్రత్యర్థి జట్ల వికెట్లను దక్కించుకుంటున్నారు. బెంగుళూరులోని చిన్నస్వామి స్టేడియంలో బెంగళూరు వర్సెస్ గుజరాత్ టైటాన్స్ మధ్య జరిగిన మ్యాచ్ తర్వాత ఆర్ సాయి కిషోర్ ఐపీఎల్ 2025 పర్పుల్ క్యాప్ స్టాండింగ్స్‌లో నాల్గవ స్థానానికి చేరుకున్నాడు. ఈ మ్యాచ్‌లో ఎడమచేతి వాటం స్పిన్నర్ సాయి కిషోర్ రెండు వికెట్లు పడగొట్టి ఖలీల్ అహ్మద్, శార్దూల్ ఠాకూర్‌లను అధిగమించాడు. ఆర్సీబీకి చెందిన జోష్ హాజిల్‌వుడ్ గుజరాత్ ఓపెనర్ సాయి సుదర్శన్ వికెట్ తీసి మూడో స్థానానికి చేరుకున్నాడు. అలాగే గౌహతిలో రాజస్థాన్ రాయల్స్‌తో జరిగిన మ్యాచ్ తర్వాత చెన్నై సూపర్ కింగ్స్ బౌలర్ నూర్ అహ్మద్ అగ్రస్థానానికి చేరుకున్నాడు. నూర్ తన నాలుగు ఓవర్లలో రెండు వికెట్లు పడగొట్టి ఢిల్లీ క్యాపిటల్స్‌కు చెందిన మిచెల్ స్టార్క్‌ను వెనక్కి నెట్టి జాబితాలో ఫస్ట్ ప్లేస్‌కు చేరుకున్నాడు. ఈ విధంగా ప్రస్తుత ఐపీఎల్‌లో ఇప్పటి వరకూ జరిగిన మ్యాచ్‌ల్లో అత్యధిక వికెట్లు దక్కించుకున్న టాప్ 5 బౌలర్ల జాబితాలో అగ్ర స్థానంలో చెన్నై సూపర్ కింగ్స్ (సిఎస్కె) ప్లేయర్ నూర్ అహ్మద్ ఉన్నాడు. అతడు 3 మ్యాచ్‌ల్లో 9 వికెట్లు పడగొట్టి 6.83 ఎకానమీ రేటుతో సగటు 9.11గా ఉన్నాడు. అలాగే ఢిల్లీ క్యాపిటల్స్‌కు చెందిన మిచెల్ స్టార్క్ 2 మ్యాచ్‌ల్లో 8 వికెట్లు,10.04 ఎకానమి, 9.62సగటుతో రెండోస్థానంలోను, రాయల్ ఛాలెంజర్స్ బెంగుళూరు తరపున ఆడిన జోష్ హాజిల్‌వుడ్ 3 మ్యాచ్‌ల్లో 6వికెట్లు తీసి 6.00 ఎకానమి, 11 సగటుతో మూడో స్థానంలోనూ, గుజరాత్ టైటాన్స్ జట్టు ప్లేయర్ ఆర్ సాయి కిషోర్ 3 మ్యాచ్‌ల్లో 6 వికెట్లు పడగొట్టి 7.41 ఎకానమీ, 14.83 సగటుతో నాల్గవ స్థానంలోను, చెన్నై సూపర్ కింగ్ జట్టు నుండి ఖలీల్ అహ్మద్ 3 మ్యాచ్‌లు ఆడగా, వాటిల్లో 6 వికెట్లు పడగొట్టి 7.91 ఎకానమి, 15.83 సగటుతో ఐదవ స్థానంలో ఉన్నాడు.


# వెస్టిండీస్, దక్షిణాఫ్రికాతో పోరు
### స్వదేశంలో టీమిండియా రెండు సిరీస్‌లు ఖరారు



**ఢిల్లీ:** భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) 2025 సంవత్సరానికి సంబంధించి స్వదేశంలో టీమిండియా షెడ్యూల్‌ను ప్రకటించింది. ఈ ఏడాది భారత జట్టు స్వదేశంలో రెండు సిరీస్‌లు ఆడనుంది. ఇందులో వెస్టిండీస్, దక్షి ణాఫ్రికాతో తలపడనుంది. ఈ రెండు భారత సిరీస్‌లు అక్టోబర్, డిసెంబర్ మధ్య జరుగుతాయి. ఇందులో టెస్ట్, వన్డే, టీ 20 ఫార్మాట్లలో మొత్తం 12 మ్యాచ్‌లు జరుగుతాయి. అక్టోబర్‌లో వెస్టిండీస్‌తో టీం ఇండియా మొదట రెండు టెస్టులు ఆడుతుందని బీసీసీఐ తెలిపింది. ఆ తర్వాత, నవంబర్, డిసెంబర్‌లో దక్షి ణాఫ్రికాతో రెండు టెస్టులు, మూడు వన్డేలు, ఐదు టీ20 మ్యాచ్‌లు ఉంటాయి. అక్టోబర్ 2 నుంచి వెస్టిండీస్‌తో అహ్మదాబాద్‌లో టెస్ట్ సిరీస్ మొదటి మ్యాచ్ జరుగుతుంది. సిరీస్‌లోని రెండవ, చివరి టెస్ట్ అక్టోబర్ 10 నుంచి కోల్‌కతాలో జరగనుంది. వెస్టిండీస్ సిరీస్ తర్వాత టీమిండియా దక్షి ణాఫ్రికాను స్వదేశంలో ఎదుర్కోవలసి ఉంటుంది. ప్రోటీస్ జట్టు భారత పర్యటన నవంబర్ 14 నుంచి ప్రారంభమవుతుంది. ముందుగా రెండు టెస్టుల సిరీస్ ఉంటుంది. మొదటి మ్యాచ్ నవంబర్ 14 నుంచి ఢిల్లీలో జరుగుతుంది. రెండవ, చివరి టెస్ట్ నవంబర్ 22న గౌహతిలో ప్రారంభమవుతుంది. గౌహతి తొలిసారిగా టెస్ట్‌కు ఆతిథ్యం ఇవ్వనుంది. భారత్, దక్షి ణాఫ్రికా మధ్య వన్డే సిరీస్‌లో మూడు మ్యాచ్‌లు ఉంటాయి. ఈ సిరీస్ నవంబర్ 30న రాంచీలో ప్రారంభమవుతుంది. ఆ తర్వాత డిసెంబర్ 3న రాయ్‌పూర్‌లో రెండో వన్డే, డిసెంబర్ 6న వైజాగ్‌లో మూడో వన్డే జరుగుతాయి. ఐదు మ్యాచ్‌ల భారత్-దక్షి ణాఫ్రికా టీ20 సిరీస్ డిసెంబర్ 9న కటక్‌లో ప్రారంభమవుతుంది. ఆ తర్వాత డిసెంబర్ 11న న్యూ చండీగఢ్‌లో రెండో టీ20, డిసెంబర్ 14న ధర్మశాలలో మూడో టీ20, డిసెంబర్ 17న లక్నోలో నాలుగో టీ20, డిసెంబర్ 19న అహ్మదాబాద్‌లో ఐదవ, చివరి

# ట్రంప్ టారిఫ్‌తో భారత్‌లో ఈ రంగాలపై ఎఫెక్ట్

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 3:** అంచనాలను మించి భారత్‌పై టారిఫ్‌ల బాంబు వేశారు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్. న్యూఢిల్లీ తమకు వాణిజ్య భాగస్వామి అని చెబుతూనే సుంకాల మోత మోగించారు. అమెరికా ఉత్పత్తులపై ఇతర దేశాలు విధిస్తున్న టారిఫ్‌లతో పోలిస్తే, తాము సగం మేర మాత్రమే వసూలు చేయనున్నట్లు తెలిపారు. భారత్ తమ ఉత్పత్తులపై సగటున 52శాతం సుంకం విధిస్తున్నందున, తాము 26శాతం సుంకం విధిస్తున్నట్లు వెల్లడించారు. అయితే, ట్రంప్ నిర్ణయంతో మన దేశంలోకి కొన్ని రంగాలపై కీలక ప్రభావం పడనుందని విశ్లేషకులు భావిస్తున్నారు. గ్లోబల్ ట్రేడ్ రీసెర్చ్ ఇనిషియేటివ్ విశ్లేషణ ప్రకారం, ట్రంప్ టారిఫ్‌ల వల్ల వ్యవసాయ రంగ సంబంధిత ఎగుమ తులపై అత్యధిక ప్రభావం ఉండనున్న ట్లు తెలుస్తోంది. భారత రొయ్యలు, ఇతర సీఫుడ్ ఉత్పత్తులకు యూఎస్ ప్రధాన దిగుమతిదారుగా ఉంది. 2024లో అమెరికాకు చేపలు, ఇతర ప్రాసెస్డ్ సీఫుడ్ ఎగుమతుల విలువ 2.58 బిలియన్ డాలర్లుగా ఉంది. ఇప్పుడు తాజా సుంకాల వల్ల అగ్రరాజ్య మార్కెట్లో వీటి ధరలు పెరుగుతాయి. దీంతో గిరాకీ ఆశించిన మేర ఉండకపోవచ్చని నిపుణుల అభిప్రాయం. రంగాల వారీగా ఉత్పత్తులపై సుంకాలు భిన్నంగా ఉంటాయి. ట్రంప్ తాజా నిర్ణయంతో మన డెయిరీ



ఉత్పత్తులపై టారిఫ్‌లు 38.23 శాతానికి చేరనున్నాయి. దీంతో అగ్రరాజ్యంలో మన వెన్న, నెయ్యి, పాలపొడి ధరలు కూడా పెరుగుతాయి. భారత్ నుంచి అమెరికాకు 181.49 మిలియన్ డాలర్ల డెయిరీ ఎగుమతులు జరుగుతున్నాయి. దీంతో పాటు ప్రాసెస్డ్ ఫుడ్, చక్కెర, కోకో ఎగుమతులపై ప్రభావం పడనుంది. భారత్ నుంచి ఏటా 11.88 బిలియన్ డాలర్ల విలువైన బంగారం, వెండి, వజ్రాభరణాలు అగ్రరాజ్యానికి ఎగుమతి అవుతున్నాయి. తాజా పెంపుతో వీటిపై సుంకం 13.32శాతానికి చేరనుంది. దీంతో అమెరికాలో ఆభరణాల ధరలు పెరగనున్నాయి. ఇక, జౌళి పరిశ్రమ పైనా అధిక ప్రభావమే పడనుంది. 2023-24 ఆర్థిక సంవత్సరంలో మన దేశం నుంచి 9.6 బిలియన్ డాలర్ల విలువైన దుస్తులు, ఇతర టెక్స్‌టైల్ ఫ్యాబ్రిక్స్ ఎగుమతి అవుతున్నాయి. పాదరక్షల పరిశ్రమ పైనా సుంకాల ప్రభావం ఉండనుంది. మన దేశం నుంచి 457.66 మిలియన్ డాలర్ల విలువైన ఫుట్‌వేర్ ఉత్పత్తులు యూఎస్‌కు ఎగమతి అవుతున్నాయి. వీటిపై అమెరికా-భారత్ మధ్య సుంకాల వ్యత్యాసం 15.56 శాతంగా ఉంది. దీంతో అగ్రరాజ్య మార్కెట్లో మన చెప్పుల ధరలు మరింత ప్రియం కానున్నాయి. ఎలక్ట్రానిక్స్, టెలికాం రంగాన్ని చూస్తే.. 2024లో 14.39 బిలియన్ డాలర్ల విలువైన ఉత్పత్తులు మన దేశం నుంచి అమెరికాకు ఎగుమతి అయ్యాయి. ఇప్పుడు సుంకాల పెంపుతో యూఎస్ మార్కెట్‌లో భారత ఎలక్ట్రానిక్ ఉత్పత్తుల ధరలు పెరగనున్నాయి.

# ఔషధాలపై టారిఫ్ మినహాయింపు

**ముంబై, ఏప్రిల్ 3:** భారత్ సహా ప్రపంచవ్యాప్తంగా పలు దేశాలపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సుంకాలు ప్రకటించారు. అయితే వీటిలో ఔషధ ఉత్పత్తులకు మినహాయింపు లభించింది. ఔషధాలపై పరస్పర సుంకాలను యూఎస్ మినహాయించిందని ఇండియన్ ఫార్మాస్యూటికల్ అలయన్స్ (ఐపిఎ) సెక్రటరీ సుదర్శన్ జైన్ తెలిపారు. దీంతో దేశీయ ఔషధ రంగ సంస్థలకు కాస్త ఉపశమనం లభించింది. ఫలితంగా ఆయా రంగ షేర్లు గురువారం రాణిస్తున్నాయి. అమెరికాకు దిగుమతి చేసే అన్ని ఔషధాలపై పరస్పర సుంకాల నుంచి మినహాయింపు లభించింది. ఇలా పరస్పర సుంకాలకు లోబడి ఉండని వాటి జాబితాలో రాగి, ఔషధాలు, సెమీకండక్టర్లు, కలప వస్తువులు ఉన్నాయి. భారత్ అమెరికాకు చేసే ఔషధ ఎగుమతులు ఎక్కువగా జనరిక్ మందులే ఉన్నాయని నిపుణులు పేర్కొన్నారు. ఒకవేళ సుంకాలు పెంచితే యూఎస్ పౌరులపైనే ఈ భారం పడనుంది. అందుచేతనే వీటినుంచి మినహాయింపు లభించినట్లు తెలుస్తోంది. జనరిక్ ఔషధాలపై



టారిఫ్‌లు విధిస్తారనే భయాలతో గత ఆరు నెలల్లో ఫార్మా ఇండెక్స్ దాదాపు 10 శాతం కుంగింది. పన్ను మినహాయింపు ప్రకటనతో నిఫ్టీ ఫార్మా ఇండెక్స్ ఏకంగా 4.4 శాతం పెరిగింది. ప్రధాన ఫార్మా షేర్లు రాణిస్తున్నాయి. గ్లాండ్ ఫార్మా షేర్లు 4 శాతం, అరబిందో ఫార్మా 2.79 శాతం, డాక్టర్ రెడ్డీస్ షేర్లు 2.11 శాతం లాభంతో ట్రేడవుతున్నాయి. ప్రపంచవ్యాప్తంగా విధించిన అమెరికన్ ఉత్పత్తులపై అధిక సుంకా లను ఎదుర్కోవడానికి ట్రంప్ సుమారు 60 దేశాలపై పరస్పర సుంకాలను ప్రకటించారు. అమెరికా వస్తువులపై అధిక దిగుమతి సుంకాలను విధిస్తుందని చెబుతూ భారత్‌పై 26 శాతం పరస్పర సుంకాలు ప్రకటించిన విషయం తెలిసిందే.

# పిపిఎఫ్‌లో నామినీ మార్పునకు ఛార్జీలుండవ్: ఆర్థిక మంత్రి



**ముంబై, ఏప్రిల్ 3:** చిన్న మొత్తాల పొదుపు పథకం పబ్లిక్ ప్రావిడెంట్ ఫండ్ ఖాతాలకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం తాజాగా ఓ నోటిఫికేషన్ ఇచ్చింది. పిపిఎఫ్‌లో నామినీ మార్పునకు ఇకపై ఛార్జీలుండవని అందులో పేర్కొంది. పిపిఎఫ్ ఖాతాలకు సంబంధించి నామినీ వివరాలను మార్చుకోవడానికి ఆర్థిక సంస్థలు రుసుము వసూలు చేస్తున్నట్లు మా దృష్టికి వచ్చింది. ఆ ఛార్జీలను తొలగించేందుకు జీవో తీసుకువచ్చాం. ఇటీవల ఆమోదం పొందిన బ్యాంకింగ్ సవరణ బిల్లు ప్రకారం, నలుగురు నామినీలను చేర్చుకునేందుకు వీలు ఉంది అని ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ పోస్ట్ పెట్టారు.

# ఇకపై ఇపిఎఫ్ విత్‌డ్రా సులువు..


**ముంబై, ఏప్రిల్ 3:** ఉద్యోగ భవిష్య నిధి సంస్థ (ఇపిఎఫ్ఒ) ఆన్‌లైన్‌లో నగదు ఉపసంహరణను మరింత సులభతరం చేసింది. ఇకపై ఆన్‌లైన్‌లో డబ్బును విత్‌డ్రా చేసుకోవాలంటే క్యాన్సిల్ చేసిన చెక్కు అప్‌లోడ్ చేసే అవసరాన్ని తప్పించింది. దీంతో పాటు బ్యాంక్ ఖాతాను యజమానులు ధ్రువీకరించాల్సిన అవసరం లేదని పేర్కొంది. ఈ ఫాస్ట్ ట్రాక్ క్లెయిమ్ సెటిల్‌మెంట్ ప్రక్రియతో దాదాపు ఎనిమిది కోట్ల మందికి ప్రయోజనం చేకూరనుంది. ఈ మేరకు కార్మిక మంత్రిత్వ శాఖ గురువారం ఓ ప్రకటన విడుదల చేసింది. ప్రస్తుతం ఉద్యోగులు తమ పీఎఫ్ ఖాతాలో నిధులు ఉపసంహరణ కోసం



ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేయాలంటే యూఏఎన్, పీఎఫ్ నంబర్‌తో లింక్ చేసిన బ్యాంక్ పాస్ బుక్‌కు సంబంధించిన చెక్కు ఫోటోను అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. ఆ తర్వాత దరఖాస్తుదారుని బ్యాంక్‌ఖాతా వివరాలు కూడా యజమానులు ఆమోదించాల్సి ఉంటుంది. అంటే ఈ రెండంచెల వెరిఫికేషన్ పూర్తయిన తర్వాతే నగదు చేతికందేది. ఈ అవసరాన్ని ఈపీఎఫ్‌వో పూర్తిగా తొలగించినట్లు కార్మిక మంత్రిత్వ శాఖ తెలిపింది. క్లెయిమ్ సెటిల్‌మెంట్ ప్రక్రియ వేగవంతం చేయడంతో పాటు క్లెయిమ్ తిరస్కరణల్ని తగ్గించేందుకు ఈ చర్యలు సాయపడతాయని పేర్కొంది. వాస్తవానికి కేవైసీ అప్‌డేట్ చేసిన సభ్యులకు ఈ నిబంధనను పైలట్ ప్రాజెక్టులో భాగంగా ఇది వరకే తొలగించారు. 2024 మే 28న పైలట్ విధానాన్ని లాంచ్ చేశారు. దీనివల్ల సుమారు 1.7 కోట్ల చందాదారులు లబ్ధి పొందారని కార్మిక శాఖ తెలిపింది. ఇది విజయవంతం కావడంతో సభ్యులందరికీ ఈ సదుపాయం కల్పిస్తున్నట్లు పేర్కొంది. యూఏఎన్‌తో బ్యాంక్ అకౌంట్‌ను అనుసంధానం చేసే క్రమంలో వెరిఫికేషన్ ప్రక్రియ జరుగుతుంది కాబట్టి, ఈపీఎఫ్‌వో ఈ అదనపు భారాన్ని తొలగించింది. కొన్నిసార్లు క్వాలిటీ లేని ఇమేజులు అప్‌లోడ్ అవ్వడం వల్ల క్లెయిమ్‌లు రిజెక్ట్ అవుతున్న ఉదంతాలూ దృష్టికి రావడంతో ఈ నిర్ణయం తీసుకున్నారు. దీంతోపాటు యూఏఎన్‌తో అనుసంధానం అయిన బ్యాంక్ ఖాతాను మార్చుకోవాలన్నా ఖాతా నంబర్, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ ఎంటర్ చేసి ఆధార్ ఓటీపీతో సులువుగా అథంటికేషన్ పూర్తి చేయొచ్చని కార్మిక మంత్రిత్వ శాఖ తెలిపింది.

# ఎఐని అందిపుచ్చుకోవడంలో ప్రపంచాన్ని దాటేస్తోన్న భారత్ : ఓపెన్ ఎఐ సిఇఒ

**వాషింగ్టన్, ఏప్రిల్ 3:** ఓపెన్‌ఎఐకి చెందిన ఏఐ చాట్‌బాట్ చాట్‌జీపీటీ యూజర్ల సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. కొత్త మోడళ్లు, అద్భుతమైన ఫీచర్లతో ముందుకొస్తుండంతో పెద్దఎత్తున వినియోగదారులు ఈ సేవల్ని పొందుతున్నారు. కృత్రిమ మేధ (ఎఐ) సాంకేతికతను భారత్ వేగంగా అందిపుచ్చుకోవడంపై కంపెనీ సీఈఓ శామ్ ఆల్ట్‌మన్ ఆశ్చర్యం వ్యక్తం చేశారు. భారత్ పురోగతిని ప్రశంసిస్తూ 'ఎక్స్' వేదికగా పోస్ట్ పెట్టారు. సృజనాత్మకత, ఎఐ సాంకేతికతను అందిపుచ్చుకోవడంలో ప్రపంచంతో పోలిస్తే భారత్ అత్యధిక వేగం కనబరుస్తోందని ఆల్ట్‌మన్ వ్యాఖ్యానించారు. ఎఐని అందిపుచ్చుకోవడంలో భారత్ ప్రపంచాన్ని దాటేస్తోందన్నారు. ఇది చూడటానికి చాలా అద్భుతంగా ఉందని పేర్కొన్నారు. చాట్‌జీపీటీ ఇమేజ్ జనరేషన్ టూల్ జీబ్లీకి ఆదరణ పెరిగిన నేపథ్యంలో ఆల్ట్‌మన్ నుంచి ఈ వ్యాఖ్యలు వచ్చాయి.




26 నెలల క్రితం తాను చాట్‌జీపీటీ ప్రారంభించినప్పుడు అద్భుతమైన స్పందన వచ్చిందని ఆల్ట్‌మన్ తాజాగా పేర్కొన్నారు. ఐదు రోజుల్లోనే ఒక మిలియన్ మంది యూజర్లు చేరినట్లు గుర్తు చేశారు. అయితే, తాజాగా జీబ్లీ ఫిల్టర్ అందుబాటులోకి వచ్చిన తర్వాత కేవలం ఒక గంట వ్యవధిలోనే 10 లక్షల మంది కొత్త యూజర్లు చాట్‌జీపీటీకి యాడ్ అయినట్లు ఆయన వెల్లడించారు.

# వాణిజ్యం

## నష్టాల్లో ముగిసిన స్టాక్ మార్కెట్లు

**ముంబై, ఏప్రిల్ 3:** ట్రంప్ టారిఫ్ భయాలతో ఇన్నాళ్లూ చిగురుటాకులా వణికిన సూచీలు, అధికారిక ప్రకటన తర్వాత మోస్తరు నష్టాలతో బయటపడ్డాయి. చైనా, జపాన్ మార్కెట్లు భారీ నష్టాల్లో ముగియగా, దేశీయ సూచీలపై ఆ స్థాయిలో ప్రభావం పడలేదు. ఐటి, ఆటో స్టాక్స్‌లో అమ్మకాలు ఒత్తిడి కనిపించింది. ప్రతీకార సుంకాల నుంచి ఫార్మా ఉత్పత్తులను మినహాయించడంతో ఆ రంగం స్టాక్స్ రాణించాయి. ట్రంప్ సుంకాల ప్రకటన అనంతరం అంతర్జాతీయ మార్కెట్ల నుంచి ప్రతికూల సంకేతాలతో గురువారం ఉదయం సూచీలు నష్టాల్లో ప్రారంభమయ్యాయి. సెన్సెక్స్ 75,811.86 పాయింట్ల వద్ద



ప్రారంభమై, ఆరంభంలోనే 75,807.55 పాయింట్ల వద్ద కనిష్టానికి చేరింది. ఆ తర్వాత మోస్తరు నష్టాల్లోనే చలించింది. చివరికి 322 పాయింట్ల నష్టంతో 76,295.36 పాయింట్ల వద్ద ముగిసింది. నిఫ్టీ కూడా 82.25 పాయింట్ల నష్టంతో 23,250.10 పాయింట్ల వద్ద నిలిచింది. డాలరుతో మారకంలో రూపాయి విలువ 22 పైసలు పెరిగి రూ.85.30గా ఉంది. టిసిఎస్, టెక్ మహీంద్రా, హెచ్‌సిఎల్ టెక్నాలజీస్, టాటా మోటార్స్ వంటి షేర్లు నష్టాల్లో ముగిసాయి. పవర్‌గ్రిడ్ కార్పొరేషన్, సన్‌ఫార్మా, అల్ట్రాటెక్ సిమెంట్, ఎన్‌టిపిసి, ఏసియన్ పెయింట్స్ వంటి షేర్లు పుంజుకున్నాయి. అంతర్జాతీయ మార్కెట్లో బ్రెంట్ క్రూడాయిల్ బ్యారెల్ ధర 71.69 డాలర్ల వద్ద ట్రేడవగా, బంగారం ఔన్సు 3135 డాలర్ల వద్ద ట్రేడయింది.

Printed and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., and printed at Sy No.658/A , NH-5, Ankireddy Palem, Guntur Dist-522005. Ph:2355939, 2512322(0863), 9848812526. RNI No : APTEL / 2004 / 13725, Editor : *Damerla Sai Baba, Postal Licence/AP/Vj/GTR/57/08-10 *Responsible for selection of News under the PRBAct. Regd.: No.H/SD/337/12-14